
ఎమెస్కో

మా వేములవాడ కథలు

రాజేందర్ 'జింబో'



Blank Page

ఫిబ్రవరి
2011

మా వేములవాడ కథలు

రాజేందర్ 'జింబో'

ఎమెస్కో

మా వేములవాడ కథలు

రాజేందర్ 'జింబో'

ముద్రణ :

ఏప్రియల్, 2009

మూల్యం : **60/-**

అక్షరాలంకరణ

పల్లవి గ్రాఫిక్స్

హైదరాబాదు.

శ్రీ కావ్య ఆఫ్‌సెట్ ప్రింటర్స్

అరండల్‌పేట, విజయవాడ.

ఫోన్ : 6461429

ప్రచురణకర్తలు

ఎమెస్కో బుక్స్

29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,

సూర్యారావుపేట, విజయవాడ - 2

ఫోన్ : 0866 - 2436643, 9849992890

www.emescobooks.com

email : emescobooks@yahoo.com

ఈ కథలు

మా వేములవాడ రాజరాజేశ్వరునికి

అమ్మవారికి

వారి నీడన బతికిన

మా అమ్మ సత్తెమ్మకి

మా బాపు డా॥ సుబ్రహ్మణ్యంకి

ఆయన వైద్యంతో బతికిన మనుషులకి

మా వేములవాడలో పుట్టినవాళ్ళకి

రాజేశ్వరుని నీడన బతుకుతున్న వాళ్ళకి

ఈ కథల్లోని వ్యక్తులకి

భక్తితో

ప్రేమతో ఈ పుస్తకం అంకితం.

– రాజేందర్ 'జింబో'

క్రమం

ముఖమంటపం	...	5
కృతజ్ఞతలు	...	10
మిడిల్ మానేర్ డ్యాం	...	11
అన్నపూజ	...	15
పాతాళ గరిగె	...	18
పెట్టెలర్ర	...	21
తాతర్ర	...	24
గ్రామఫోనూ - కంప్యూటరూ...	...	28
చెరువు	...	33
గడ్డాలూ - మీసాలూ	...	38
కోడి పిల్లలు	...	44
భీమేశ్వర సభామండపం	...	49
అగ్రహారం - ఆంజనేయస్వామి	...	54
ఇ మెయిలూ - ఉత్తరం	...	59
సర్కస్ మోహన్	...	64
నాంపల్లి గుట్ట	...	71
తమ్మల సొన్నాయి	...	76
తెప్పోత్సవం	...	82
ఆర్.ఎమ్.టి. సర్వీస్ స్టాండ్	...	87
రెడ్డి హోటల్	...	93
గాజుల ఎల్లయ్య	...	98
స్వప్నం	...	104
సమాధానం	...	108
దసరా	...	114
సుబ్రహ్మణ్యం దవాఖానా	...	120
వేములవాడ కథలతో మళ్ళీ బాల్యంలోకి	...	126

ముఖమంటపం

సుప్రసిద్ధ శాస్త్రవేత్త యలవర్తి నాయుడమ్మ చాలామందిని పరిశీలనగా చూశాక ఒకమాట అన్నారు "ఒక గ్రామీణ యువకుణ్ణి గ్రామంలోంచి బయటకు తీసుకురాగలం కాని, అతనిలోంచి గ్రామాన్ని తీసివేయడం మాత్రం అసాధ్యం". ఇది అనుభవంతో చెప్పినమాట. బాల్యాన్ని గురించి ముఖ్యంగా గ్రామీణ నేపథ్యంలో వచ్చిన ఏ కథ చదివినా నాయుడమ్మ చెప్పిన మాటలు నన్ను వేటాడతాయి. ఇప్పుడు రాజేందర్ జింబో నవ్య వీక్లీలో ధారావాహికంగా అందించిన "మా వేములవాడ కథలు" చదువుతున్నప్పుడు చిరుగాలికి అలలు అలలుగా వరిచేను కదిలిన అనుభూతి కలిగింది. ఆ నేల, ఆ గాలి వదిలేసి వచ్చేశాం కదా, వూహల్లో వున్నా తిరిగి సొంతపల్లెకు వెళ్లడం జరగదని తెలుసు. కాలవలకు కొత్తనీరు తగిలినప్పుడు ప్రవాహానికి అడ్డంగా వెదురుపుల్లలతో అల్లిన "చేపలమావు" పెడతారు. దానికి చిత్రమైన ద్వారాలు వుంటాయి. అందులోంచి చేప లోపలకు అవలీలగా వెళ్లగలదు, కానీ చచ్చినా తిరిగి బయటకు రాలేదు. బతుకు తెరువు, జీవనశైలి యిలాంటి అనేకానేక కారణాల వల్ల బస్తీమావులో జొరబడతాం. ఇక అంతే! గత దశాబ్దంగా యిది యింకా మారింది. "అమెరికా మావు" యిప్పుడు పిల్ల చేపలను విపరీతంగా లోపలకు లాగుతోంది. యీ విదేశీమావుకి మెరిసే బంగారు ద్వారాలు వుండడం వల్ల చేపలు మరింత వుత్సాహంగా పడిపోతున్నాయి. ఆపడం ఎవరివల్లా కాదు.

కాలేజీ రోజుల్లో "ది డిజర్టెడ్ విలేజ్" పాఠం చదువుకున్నాం. అంటే, మనదేశంలోనే కాదు, చాలా పెద్ద దేశాలలో నగరీకరణ ప్రారంభమై కనీసం వంద సంవత్సరాలు అయివుంటుందని అర్థమవు తుంది. దేవులపల్లి కృష్ణశాస్త్రి మా వూరు పోయింది, కోవెలకొలను లాంటి వాక్‌చిత్రాలు చదివినప్పుడు గుండెలో గుబులు, దిగులు పుడుతుంది. అవి కూడా అరవైఏళ్ల క్రిందట రాసినవే. రాజేందర్ జింబో కథకుడు, కవి మాత్రమే కాదు, చక్కని విశ్లేషణాప్రజ్ఞ, విచక్షణాజ్ఞానం కలిగిన న్యాయమూర్తి. యీ

కథలు నవ్యలో వస్తున్నప్పుడు, వొక యిష్టాగోష్ఠిలో "వేములవాడంటే నాకిష్టం. మా వూరిని కవిత్వీకరిద్దామనుకున్నా. మా వూరిని అప్పుడు యిప్పుడు అని పోలుస్తూ 'మావూరు తప్పిపోయింది' అని 50 కవితలు రాద్దామనుకున్నా. ఒకటీ అరా తప్ప రాయలేకపోయాను. అక్కడి ప్రతి వస్తువునీ కథారూపంలో చూడాలన్న చాపల్యమే యీ కథలకు ప్రేరణ. గతాన్ని జ్ఞాపకం చేసుకోవడం ఒక అనుభూతి. అంతే. మార్పుల్ని మనం ఆపలేం. స్వర్గాలంటూ వుండవు. మనం కోల్పోయినవే స్వర్గాలు" అని వివరించారు. ఈ మాటల్లో స్వచ్ఛమైన కథకుని అంతరంగం వుంది. "మా వేములవాడ కథలు" అని పేరుపెట్టి యీ కథలు రాశారు. "మా" చేర్చడంలో ఆ నేలపై రచయితకుగల ఆప్యాయత, అభిమానం, చనువు, హక్కు ధ్వనిస్తున్నాయి. అన్నింటి కలయికతో వచ్చిన అనుభవాల పచ్చతోరణాలు యీ కథలు.

పాఠకులు మెచ్చుకున్నారు. యిక ఆ ప్రాంతపు పాఠకులు రాజేందర్ అనుభవాలలో మమేకమై మరింత ఆనందించారు. అలాంటివారు ప్రతి కథకూ మరి పది కథలను జ్ఞప్తి చేసుకుని మురిసిపోయారు. దిగులు చెందారు. ఒక్కొక్కసారి కొన్ని జ్ఞాపకాలు బొత్తిగా నామరూపాలు లేకుండా పోతాయి. అది నిజంగా బాధాకరం. నాగార్జునసాగరం ముంచెత్తిన వూళ్లు యిందుకు వుదాహరణ. అభివృద్ధి పథకమే కావచ్చు, కాని అక్కడి ఆవాసాలన్నీ జలసమాధి కావడం, చిరునామా శాశ్వతంగా కోల్పోవడం కొన్ని తరాలవరకు చేదు అనుభవమే. ఇలాంటి విశ్వమానవ సమస్యలను ప్రస్తుతానికి పక్కన పెట్టి, మళ్లీ మా వేములవాడ కథలలోకి వస్తాను.

రచయిత తండ్రి సేవాభావంతో ఆ వూరికి వైద్యంచేసే ఆదర్శవ్యక్తి. దాదాపు అన్ని కథల్లోనూ ఆయన ప్రస్తావన వస్తూనే వుంటుంది. గ్రామాలు వలసపోడానికి బ్రతుకు తెరువు కొందరికి కారణమైతే, వైద్యం విద్య మరికొందరికి కారణమైంది. అంతర్లీనంగా అర్ధశతాబ్ది క్రితం పల్లెపట్టులు, వాటి అంతరంగాలు ఎలా వున్నాయో యీ కథలు చెబుతాయి. "ఆర్ ఎమ్ టి సర్వీస్ స్టాండ్" కథలో గంగాధరరావు పాత్ర సజీవమైంది. కృష్ణాజిల్లా వణుకూరు నుంచి వచ్చి, వేములవాడలో ప్రైవేట్‌బస్సులు నడుపుతూ వుంటాడు. ఆ సర్వీసులలో ఎవరికి దక్కవలసిన గౌరవం వారికి దక్కేది. తర్వాత బస్‌రూట్లని జాతీయం చేశారు. ఎర్రబస్సులు రోడ్డుమీదకు వచ్చాయి. జీవితమంతా రైట్‌రైట్ అంటూ సాగిన

గంగాధరరావు ఆర్ఎమ్‌టికి బ్రేక్ పడుతుంది. తర్వాత ఆయన సిటీకి వచ్చెయ్యడం, మారిన జీవనశైలి యివన్నీ కథలో వస్తాయి. ఎనభైదాటినా మనుషులపట్ల గంగాధరరావుకు గల మమకారం, ఆప్యాయత పాఠకులను కదిలిస్తుంది. ఇప్పుడు యిలాంటి వారిని మచ్చుకి వొకరినైనా చూడగలమా అనిపిస్తుంది. వున్నా వారిని పిచ్చివాళ్ళుగా ముద్ర వేస్తారనిపిస్తుంది. రచయిత వేములవాడ కథలను అక్కడే ముగించకుండా, మరెక్కడికో నడిపించి ఆ వాడను విస్తృతపరిచారు. రెడ్డి హోటల్, గాజుల ఎల్లయ్య మరికొన్ని మధురస్మృతులు. కథలు అన్నాం కదా, గొప్ప కొసమెరుపుతో ముగించాలని కృతకంగా ఆలోచించకుండా, అతి సహజంగా కేవలం జ్ఞాపకాలను యథాతథంగా అక్షరాలలోకి దించారు. తను కవి కాబట్టి, అక్కడక్కడ పొయెటిక్ టచ్ యిద్దామని అస్సలు వుబలాట పడలేదు. ప్రతి కథలోనూ తను జొరబడిపోయి, తననితాను గ్లోరిఫై చేసుకోవాలని ఎక్కడా ప్రయత్నించలేదు. ఇవన్నీ రాజేందర్ కథలు వ్యక్తిగతంగా నాకు నచ్చడానికి కారణాలలో కొన్ని.

"స్వప్నం" కథలో యువతరానికి చక్కని సందేశం వుంది. మనిషి ప్రతివాడూ కలలు కనాలి. వాటిని సాకారం చేసుకోవాలి. అందుకు పరిశ్రమించాలి. కలలు కని, వాటిని జీవితంలో సాధించుకున్న సాదాసీదా మనుషుల గురించి అంత సాదాసీదాగా రాశారు. అతిశయోక్తులు, వుపన్యాసాలు లేవు.

రచయిత చిన్నతనంలో అణాబిళ్ల మింగుతాడు. దాన్ని మింగలేక, కక్కలేక వాళ్ళ వూరి దేవుడిలాగా గరళకంఠుడిలా కాసుకంఠుడు అవుతాడు. తల్లి మొక్కని మొక్కులేదు. బస్తీకి తీసుకువెళ్లి చాలా రూపాయల ఖర్చుతో అణాకాసును బయటకు తీయిస్తారు. ఇప్పటికీ ఆ అణానాణెం పదిలంగా వుందన్నారు – జ్ఞాపకాలలోనే కాదు నిజంగా కూడా. వూరంతా అణాకాసు మింగిన అబ్బాయిగా పాప్యులర్ అవడం దీనికి వుపాఖ్యానం. అగ్రహారం ఆంజనేయస్వామి యిందులో వచ్చే దేవుడు. యీ అణాగండం నుంచి బయటపడితే, బెల్లంతో తూచి నైవేద్యం పెడతామని మొక్కుకుంటారు. అక్కడివారికి స్వామిమీద ఎంత గురి వుందో చెబుతారు కథలో. శివకేశవులకు భేదం లేదని చెబుతుంది "నాంపల్లిగుట్ట". తెప్పోత్సవం తిరునాళ్ల వాతావరణాన్ని పదే పదే తలపిస్తుంది. వేములవాడ భీమన్న గుడిలో ఏ వుత్సవం వచ్చినా "తమ్మల సొన్నాయి" మేళం ఆనవాయితీ.

కొన్నాల్టికి యిది వినమరుగై కొత్తమేళాలు వినిపించడం మొదలైంది. మా దేవుడికి తమ్మలసొన్నాయే వుండాలంటారు రచయిత. పైగా ఎక్సిక్యూటివ్ ఆఫీసర్‌తో మాట్లాడాలని కూడా కథలో నిర్ణయించు కున్నారు. మరి, భీమేశ్వరస్వామి వారి మనసుల్లో జొరబడి మళ్లీ ఆ మేళాన్ని పునరుద్ధరిస్తారేమో!

కాలక్రమేపీ వుత్తరాల సంప్రదాయం ఎలా క్షీణించిపోతోందో "ఇ-మెయిలూ - ఉత్తరం" కథలో రాశారు. పోస్టాఫీస్‌తో గ్రామీణులకు వుండే సంబంధం అంతా యింతా కాదు. బయటి ప్రపంచాన్ని వారు పోస్టాఫీస్ నుంచే చూస్తారు. కట్టు-కడ మోర్స్‌కోడ్‌లో టెలిగ్రాంలు వచ్చినా, మిలట్రీలో పనిచేసే కొడుకు దగ్గర్నించి మనియార్డర్ వచ్చినా, అత్తవారింట నుంచి అమ్మాయి రాసిన క్షేమ సమాచారం జాబు వచ్చినా, ఆ రోజులలో డైలీ న్యూస్ పేపర్ వచ్చినా పోస్టాఫీసే టోల్‌గేట్. ఒక రచయితగా పోస్టాఫీస్‌తో తనకుగల అనుబంధాన్ని సున్నితంగా చెప్పారు. తిలక్ పోస్ట్‌మాన్ కవితను జ్ఞాపకం చేశారు. ఆ రోజుల్లో పోస్టాఫీసుల్లో మలేరియా వ్యాధికి వాడే క్వినైన్ మాత్రలు కూడా అమ్మేవారు. రెవిన్యూ స్టాంపులను కొంచెం రహస్యంగా కొనుక్కువెళ్లేవారు. అంటే ఎక్కడో అప్పు తీసుకుంటు న్నట్లు పదిమందికీ తెలియడం అంత యిష్టం వుండేది కాదేమో. ఇవ్వాళ అప్పు స్టేటస్ సింబల్ అయింది. ఎన్ని క్రెడిట్ కార్డులుంటే అంత గొప్ప! వుత్తరాలు చదివి పెట్టేవాళ్ళు వుండేవారు. ఆరునెలల కబుర్లు, చిన్న కార్డు మీదకు ఎక్కించాల్సి వచ్చేది. ఇవ్వాళ ఎక్కడ చూసినా ఆశుసంప్రదాయమే గాని లిఖిత సంప్రదాయం లేదు.

రాజేందర్ జింబోలో వూరిమీది మమకారం వట్టిమాటలకే పరిమితం కాలేదు. యీ కథలు రాసేటప్పుడు చెరువు, బడి, గుడి, వూరి వారు నాలో ప్రవేశించి నాచేత రాయించారంటారు. "మా ఇల్లంటే నాకు మమకారం. నా వాటా కింద ఆ యింటిని తీసుకున్నాను. ప్రతి సంవత్సరం దసరా పండుగలకు అక్కడ కలుసు కోవడం, బాల్యస్మృతులను ముచ్చటించుకోవడం నాకు యిష్టం. మా పెరటి బాదం చెట్టు కింద భోంచేయడం వొక గొప్ప జ్ఞాపకం" అంటారాయన. నవ్యలో యీ కథలు రాశాక, చిన్న విరామం తరువాత దీపావళి ప్రత్యేక సంచికకు యీ క్రమంలో వొక కథ రాయమని కోరితే "సుబ్రహ్మణ్యం దవాఖానా" రాశారు. అది వారి తండ్రిగారి గురించి రాసింది. ఇవ్వాళ విద్య వైద్యం యివి రెండూ

కార్పొరేట్ అయిపోయాయి. అవి వైద్యోనారాయణో హరిః అనీ, గురుబ్రహ్మ, గురువిష్ణు అని స్తుతించే రోజులు. గొప్ప సంస్కారం వున్న దైవక్షేత్రం నుంచి, సహృదయతగల కుదురు నుంచి వచ్చిన రాజేందర్ జింబో కథల్లో మానవీయత కాక మరేమి కనిపిస్తుంది. మా వేములవాడ కథలను ప్రప్రథమంగా మా నవ్య వీక్లీలో ప్రచురించినందుకు, యిప్పుడు ఆ కథాగుచ్ఛానికి వొక నూలుపోగుగా నాలుగు మాటలు రాసినందుకూ ఎంతో ఆనందపడుతున్నాను. వేములవాడ భీమన్న రాజేందర్ జింబో కుటుంబ సభ్యులకు, హితులకు, సన్నిహితులకు సకలశుభాలూ చేకూర్చాలని త్రికరణశుద్ధిగా కోరుకుంటున్నాను.

– శ్రీరమణ

హైదరాబాద్
20-5-2007

కృతజ్ఞలు

ఈ కథల్ని ప్రచురించి
ముఖమంటపంతో
ముందుమాట రాసిన
'నవ్య' వారపత్రిక
సంపాదకులు శ్రీ రమణగారికి

బొమ్మలు వేసిన చిదంబరంకి
జి.ఆర్.మహర్షికి

ఈ పుస్తకాన్ని ప్రచురిస్తున్న
ఎమెస్కో విజయకుమార్‌కి

నా కథలని పంచుకున్న
వఝుల శివకుమార్‌కి

'పెట్టెలర్ర'తో బాటు
నాతో ప్రయాణిస్తూ
అన్ని కథలకి ప్రత్యక్షసాక్షి అయిన
హిమజ అనబడే శైలూకి

కథలు చదివి ఫోన్లు చేసి
ఉత్తరాలు రాసిన
అనేకమంది మిత్రులకి, రచయితలకి

అందరికీ
ఎన్ని కృతజ్ఞతలు చెప్పినా సరిపోవు

-రాజేందర్ 'జింబో'

మా వేములవాడ కథలు

మిడిల్ మానేర్ డ్యాం

మావూరు వేములవాడ. రాజరాజేశ్వరుని ఊరు. మా వూర్లో నిత్యం జాతర జరుగుతున్నట్టే వుంటుంది. మా వూరికి దగ్గర్లో నాంపల్లిగుట్ట, దాని పక్కనే అనుపురం. ఆ వూర్లో మా భూములు వున్నాయి. మా అమ్మచెల్లెళ్లు, తాత అందరూ వ్యవసాయదారులే. మా చిన్నమ్మల పిల్లలూ వ్యవసాయదారులే. మా బాపు డాక్టర్ కావడంవల్ల మాకు వ్యవసాయ పనులతో సంబంధం లేకుండా పోయింది. మా అమ్మకి చిన్నప్పుడే వివాహం జరగడం వల్ల వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన ఆమెకు వ్యవసాయం తెలియదు.

ఇంటికి వచ్చిన వడ్లబస్తాలని, మక్కలని, పప్పుదినుసులని లెక్క చూసుకోవడం, వచ్చిన వడ్లని సరిచేయించి గిర్నీకి పంపడం తెలుసు. ఆ తరువాత దంపుకం వాళ్ళతో బియ్యాన్ని సరిచేయించి, మా అందరిని సవరించడం ఆమెకు తెలిసిన విద్య. కషాయం పెట్టించడం, నూరిన మందులని గోలీలుగా మార్చడం కూడా ఆమె చేయించేది.

మా అమ్మకి ఇద్దరు చెల్లెళ్లు. వాళ్ళకి వ్యవసాయపు పనులు తెలుసు. చిన్నప్పటినుంచి వ్యవసాయంతోనే వాళ్ళ అనుబంధం. వాళ్ళిద్దరి వివాహం వ్యవసాయదారులతోనే జరిగింది. అందుకని వాళ్ళ వ్యవసాయమే వాళ్ళ జీవనం. పొలం నుంచి వచ్చే రాబడికన్నా కరెంటు బిల్లులు, మోటర్ రిపేర్‌కి అయ్యే ఖర్చులే ఎక్కువగా వుండేవి. ఈ పొలాలెందుకు దండుగ అంటున్న మాటలు కూడా విన్పించేవి. రాబడి అంతంత మాత్రమే వున్నా పొలాలని తీసివెయ్యడం మా బాపుకి ఇష్టం వుండేది కాదు. పొలం వ్యవహారాలన్నీ మా బాపే చూసుకునేవాడు. సెలవుల్లో పొలం దగ్గరికి వెళ్ళమని మా బాపు చెప్పేవాడు. మక్కపెరండ్లు వున్నప్పుడు, సీతాఫలాలు వచ్చే రోజుల్లో అనుపురం వెళ్ళడానికి ఇష్టపడేవాడ్ని. ఎందుకంటే ఆ లేత కంకులని తినడం నాకు బాగా ఇష్టం. ఆ కంకులని చాలా గమ్మత్తుగా కాల్చేవాడు

మా అన్న. లక్ష్మీరాజం అతనికి సహాయం చేసేవాడు. పెరడునుంచి అప్పుడే తెంపిన మక్క కంకుల బూరుని మొత్తం తీయకుండా మంటలో కాల్చేవాళ్ళు. మక్కబూరు కాలిన తరువాత, ఆ బూరుని పూర్తిగా తీసివేసి ఆ మక్క కంకులని నిప్పుల మీద కాల్చేవాళ్ళు. మక్కలు మంటలో ఉడికేవి. ఆ తరువాత కాలేవి. ఆ మక్క కంకులు రుచి మహా గొప్పగా వుండేది. వేడివేడిగా అలా కాలిన మక్క కంకులని తినడం ఓ మధురానుభూతిగా వుండేది. మా వూర్లోకి వచ్చిన మక్క కంకులని తిన్నప్పుడు ఆ రుచి దొరికేది కాదు.

మక్క కంకులు లేని కాలంలో సీతాఫలాలు ఇచ్చేవాడు మాఅన్న. చాలావరకి చెట్టుమీద పండినవే. ఆ రుచే వేరు. ఒక్కోసారి లేత లేత దోసకాయలు ఇచ్చేవాడు. చిగురోలె వుండేవి. ఇవేవి లేకపోతే చింతచిగురు పెట్టేవాడు. అప్పుడప్పుడు సీతాఫల కాయలని కాల్చి ఇచ్చేవాడు. మా స్నేహితులు వాటిని ఇష్టంగా తినేవాళ్ళు. మోసుకు పోగలిగినన్ని సీతాఫలకాయలని కాని, మక్కకంకులనిగానీ, దోసకాయలని గానీ సంచిలో వేసి ఇచ్చేవాడు.

మా పొలంలో పెద్ద బావి వుండేది. దానికి ఎలాంటి గోడ వుండేది కాదు. మోటబావి. బావిలోకి దిగడానికి తగినట్టుగా మెట్లలాంటి గోడ అంచులు వుండేవి. ఈత వచ్చిన మిత్రులు అందులోకి దిగి ఈత కొట్టేవాళ్ళు. నన్ను దూరంగా వుంచేవాళ్ళు. దానికి ఓ కరెంటు మోటరు వుండేది. ఈతరాని నాలాంటి వాళ్ళకోసం మోటరు వేసేవాడు. ఆ నీటి ప్రెషర్ కింద స్నానం చేసేవాళ్ళం. ఆ బావిలో పూడిక తీసేటప్పుడు కూడా మా బాపు అనుపురం వెళ్ళమనేవాడు కాని నేను వెళ్ళకపోయేవాడిని. పొలం దగ్గర పెరడు దగ్గర పండ్లూ ఫలాలు, మక్క కంకులు తిన్న తరువాత మమ్మల్ని ఊళ్ళోకి తీసుకుని పొయ్యేవాడు. మా చిన్నమ్మ ఇల్లు చిన్న ఇల్లు. ఇంటి ముందు రెండు నులక మంచాలుండేవి. మేం వెళ్ళగానే వాటిని వాల్చేది మా చిన్నమ్మ. కాయకష్టం చేసే మనిషి కనుక మా చిన్నమ్మ చిక్కిపొయ్యి కన్పించేది. మా అమ్మ స్వంత చెల్లేనా అని అన్పించేది. మా చిన్నమ్మని చూడగానే గుండె కలుక్కుమనేది. మా చిన్నమ్మవాళ్ళు 'గట్క' తినేవాళ్ళు. గట్కలో గడ్డపెరుగు వేసుకుని మామిడికాయ ముక్క నంజుకుని తింటే చాలా బాగుంటుందని మా అన్న చెప్పేవాడు. మా స్నేహితులు ఇష్టంగా తినేవాళ్ళు. నా కోసం అన్నం వండేది మా చిన్నమ్మ. అందులో గడ్డపెరుగు వేసుకుని మామిడికాయ ముక్క పెట్టుకుని తినేవాడ్ని. మా చిన్నాయనకి కళ్ళుపోవడం వల్ల ఇంటిదగ్గరే వుండేవాడు.

కాలక్రమంలో అనుపురం వెళ్ళడం తగ్గిపోయింది. పై చదువులు, ఉద్యోగం ఇవేకాదు, మా చిన్నాయన చనిపోవడం, మా బాపూ చనిపోవడం మా వూరికి ఒకటి రెండు రోజుల కోసమే వెళ్ళడం, టైం లేకపోవడం, పిల్లల చదువులు ఇలా ఎన్నో కారణాలు. కాని మా ఊరికి వెళ్ళినప్పుడల్లా అనుపురం ప్రసక్తి వచ్చేది. 'మన పొలం గెట్లని మార్చినారట. కొంచెం వెళ్ళి చూసిరా. యం.సితో కొలిపించి గెట్లు పెట్టించు' అని అమ్మా, వదినా

అనేవాళ్ళు. కానీ కుదురకపొయ్యేది. మా చిన్నమ్మ మా అన్న మమ్మల్ని కలవడానికి మా వూరికి వచ్చేవాళ్ళు.

మా వూరినుంచి కరీంనగర్ పోతున్నప్పుడు నాంపల్లి గుట్టదగ్గరకి రాగానే కుడివైపు తల అనుకోకుండా తిరిగేది. అనుపురం రోడ్డు కన్పించేది. అనుపురానికి ఎన్నోసార్లు పోవాలనుకున్నా, పోలేకపోతున్నాను. ఈ మధ్య ఆ రోడ్డుమీద మక్కకంకులు కాలుస్తూ కొంతమంది కన్పిస్తున్నారు. మా అన్నా, లక్ష్మీరాజం కాలుస్తున్నట్టే వాళ్ళు కాలుస్తున్నారు. ఒక్కసారి మనసు బాల్యంలోకి వెళ్ళిపోయేది. అనుపురానికి గుర్తుగా వాళ్ళు అన్పించేవాళ్ళు. ఎదురుగా వస్తున్న ఏ వాహనమో ఆ జ్ఞాపకాల దొంతరని చెదిరిపొయ్యేలా చేసేది. సెలవులు లేవని, పిల్లల చదువులని ఏవో కారణాలు అనుకుంటూ అనుపురానికి వెళ్ళడాన్ని వాయిదా వేస్తూవస్తున్నాను.

ఓరోజు మా చిన్నన్న, మా అన్న ఇద్దరూ హైదరాబాద్‌కి నా దగ్గరకొచ్చారు. అనుకోకుండా ఇద్దరూ రావడంలో ఏదో ప్రత్యేకమైన కారణం వుంటుందని అన్పించింది. గోదావరి వరద నీళ్ళు, మానేరు నీళ్ళు పోకుండా మిడిల్ మ్యానేర్ డ్యాం కట్టబోతున్నారని, శాబష్‌పల్లి, రుద్రవరం, అనుపురం, కొడిముంజ వూర్లు అందులో మునిగిపోతున్నాయని, తహసీలోల్లు కొలుచుపోతున్నారని వాళ్ళ మాటల్లోని సారాంశం. "అనుపురం పోతుందని, పోతలేదని అంటున్నారు కొంచెం తెలుసుకో" అన్నాడు మా అన్న. పోకపోతే బాగుండునని ఆయన ఫీలింగ్. కరీంనగర్‌కి ఫోన్‌చేసి తెలుసుకున్నాను. నాంపల్లి దాకా మునుగుతుందని సమాచారం. వాళ్ళు చెప్పిన విషయాన్నే ధృవపరిచాను. ఇద్దరి మొహాలు మారిపోయాయి.

'మాపొలం, మీ పొలాలు, మా ఇల్లూ అనుపురం అన్నీ మునుగుతున్నాయా?' ప్రశ్నించాడు అన్న. "అవును. అన్నీ పోతున్నాయి. తహసీలోల్లు పైసలిస్తరు" అన్నాను సముదాయింపుగా.

'ఇస్తరు.. ఇస్తరు. ఇక ఇల్లుని వెతుక్కోవాలి. పొలాలని వెతుక్కోవాలి. స్నేహితుల్ని వెతుక్కోవాలి' తనలో తనే గొణుక్కున్నాడు. ఇద్దరి మొఖాలు వివర్ణమవుతున్నాయి.



అవును. వరదనీళ్ళు వృథాగా పోతున్నాయి. అవసరమైనప్పుడు నీళ్ళు దొరకడం లేదు. వాటిని కాపాడుకోవాలి. మా ప్రాంతమంతా సస్యశ్యామలం కావాలి. డబ్బులు వస్తయి. కాని ఎన్ని సంవత్సరాలు ప్రభుత్వం చుట్టూ కోర్టుల చుట్టూ తిరగాలి? అయినా అనుపురాన్ని నేను కొనుక్కోగలనా. నా బావిని, నా చెట్టుని, పుట్టని చూడగలనా? మా చిన్నమ్మా, ఆ ఇల్లు, ఆ నులకమంచం, ఆ మక్క పెరండ్లు, దోసకాయలు సీతాఫలాలు మళ్ళీ తెచ్చుకోగలనా? జ్ఞాపకాలని తిరిగి చూడగలనా? ఎన్ని కోల్పోవడంతో డబ్బులు. ఎంత గుంజాటన. ఎంత గుండెకోత. ఆ డ్యామును ఆమోదించలేను. తిరస్కరించలేను. ఎప్పుడో చదివిన కవిత గుర్తుకొచ్చింది.

"మా ఇంటికి పొలాలకి మా బావులకి ఖరీదు కడ్తావు
మాకు లాభం వస్తుందంటావు.
అవును నిజం
కానీ,
మా జ్ఞాపకాలకి ధరకట్టగలవా?
ఎన్ని దగాల మధ్య
ఎంత దోపిడీ మధ్య
మావూరుని పోగొట్టుకోవాలి
ఎన్నిరోజులు
ఎన్ని సంవత్సరాలు
మీ చుట్టూ గానుగెద్దులా తిరగాలి
అయినా
నా వూరిని నేను కొనుక్కోగలనా?
నా జ్ఞాపకాలని నేను తెచ్చుకోగలనా?
నా నులకమంచం, నా 'తాతర్ర'
నా తల్లిలాంటి బావి, నా తండ్రిలాంటి పొలం
నా బాల్యంతో చాపలా అల్లుకుపోయిన
నా వూరు నాకు తిరిగి రాగలదా?"

ఎవర్ని సముదాయించను. నన్ను నేనే సముదాయించుకోలేనప్పుడు ఏం చెయ్యగలను? సెలవు పెట్టుకుని అనుపురం ఒక్కసారి చూడగలగటం తప్ప.

★ ★ ★

అన్నపూజ

మా రాజేశ్వరుడు సామాన్యుల దేవుడు. మా జిల్లా చుట్టుపక్కల వున్న బీదాబిక్కి ఎంతో భక్తితో మా వేములవాడ రాజన్నకి పూజలు చేస్తారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తారు. ఎలాంటి గండాలు రాకుండా వుండటానికి గండాదీపంలో నూనె పోస్తారు. పశుసంపద బాగుండాలని దేవునికి కోడెని కట్టేస్తారు. తమ పంటలు బాగా పండాలని, అన్నానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా వుండటానికి రాజేశ్వరునికి అన్నపూజ చేస్తారు.

మా వూరి దేవుడ్ని ఎముడాల రాజన్న అంటారు. మా వూరి నిండా ఆయన పేర్లే. రాజన్న, రాజయ్య, రాజేందర్, రాజేశ్వర్. పేర్ల పక్కన శర్మ, రావు, శాస్త్రిలాంటివి వున్నా ఈ పేర్లతోనే ఎక్కువగా వుంటాయి. మా రాజేశ్వరున్ని దర్శించే చాలా కుటుంబాల్లో అవే పేర్లు. ఇంటి పేరుతో పిలుస్తేనే వాళ్ళకి గుర్తింపు.

మా రాజన్న గుడికి చాలా ప్రత్యేకతలున్నాయి. ఇది ప్రధానంగా శివక్షేత్రం. కానీ హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి. మా రాజన్నకి రెండు సేవలు. పెద్దసేవ. చిన్నసేవ. పెద్దసేవ అంటే అంబారీమీద ఉత్సవ మూర్తులని ఊరేగించడం. చిన్నసేవ అంటే పల్లకీలో ఉత్సవ మూర్తులని ఊరేగించడం. గుడిలో మంగళ వాయిద్యాలతో... వర్షం చినుకుపడితే సేవ ఉండదు. మా రాజేశ్వరుని సేవతోబాటు హరిసేవ కూడా వుంటుంది. ముందు రాజన్న, వెనక హరి. ఇది ఎప్పుడూ, ఎల్లప్పుడూ. ఇదీ మా రాజన్న ప్రత్యేకత. మా రాజన్న గుడిముందు రాయబోసు దర్గా వుంది. ఇక్కడికొచ్చే భక్తులు రాజన్నతోపాటు శ్రీరామున్ని, అనంతపద్మనాభ స్వామిని, బాలాత్రిపుర సుందరిని, దర్గాని కూడా దర్శిస్తారు. విఘ్నేశ్వరుడు, ఆంజనేయుడు సరేసరి.

మా రాజన్న దగ్గరికి మా జిల్లావాళ్ళు, మా చుట్టు పక్కల జిల్లావాళ్ళు, మహారాష్ట్ర నుంచి కర్నాటక నుంచి యాత్రికులు వస్తుంటారు. అదిలాబాద్ జిల్లా వాళ్ళకి మా వేములవాడ రాజన్న ఆరాధ్యదైవం. మా పెద్దక్కని గంగవతలకి ఇచ్చారు. గోదావరిని మా జిల్లాలో గంగ అంటారు. గంగివతల మేము. గంగవతల మా పెద్దక్క. కరీంనగర్, అదిలాబాద్ జిల్లాల మధ్య గోదావరి. మా పెద్దక్క వూరినుంచి రైతులు మా వేములవాడ రాజన్న దగ్గరికి బండ్లమీద వచ్చేవాళ్ళు. రెండు మూడు రోజుల ప్రయాణం వాళ్ళది. మా పెద్దక్క సమాచారం తెచ్చేవాళ్ళు. వెదురు బద్దలతో చేసిన గంపలూ, చాటలూ తెచ్చేవాళ్ళు. మా ఇంట్లో వుండి వండుకొని తినేవాళ్ళు. రాజన్నని దర్శించుకునేవాళ్ళు.

ఇప్పుడు సౌకర్యాలు పెరిగాయి. వేగమూ పెరిగింది. ఇప్పుడు బండ్లలో రావడం లేదు. ఉదయాన రావడం, సాయంత్రం పోవడం. ఇప్పుడు మా రాజన్న ఎక్కువమందికి తెలిసిపోయాడు. ప్రచారయుగంలో మా దేవునికి యాత్రికులు పెరిగారు.

మా వేములవాడ రాజన్నకి రైతులు ఇష్టపడి చేసే పూజ అన్నపూజ. రైతులే కాదు అందరూ ఇష్టపడి చేసే పూజ అన్నపూజ. మా అమ్మ సంవత్సరానికి రెండు సార్లైనా ఆ పూజ చేసేది. ఆరోజు మా ఇంట్లో పెద్ద హడావిడి. ఉదయాన్నే లేవడం. తలస్నానం చెయ్యడం. దేవుని కోసం మాత్రమే ఉపయోగించే గిన్నెలో అన్నం వండడం. దాన్ని ప్రత్యేకమైన డబ్బాలో పెట్టడం. ఆ తరువాత గుడికి బయల్దేరడం. మా నామాల మల్లయ్య మా వెంట వచ్చేవాడు. అతనూ తలస్నానం చేసి వచ్చేవాడు. అందరమూ కలిసి గుడికి బయల్దేరే వాళ్ళం. మేం కాసిన్ని పాలు తాగేవాళ్ళం కానీ మా అమ్మ ఏమీ తీసుకునేది కాదు. అట్లాగే మా బాపు కూడా. దారిలో మురళి దుకాణంలో రెండు మూడు కొబ్బరికాయలు తీసుకుని గుడికి బయల్దేరే వాళ్ళం. ఆ అన్నం పెట్టిన డబ్బాని జాగ్రత్తగా మా మల్లయ్య తీసుకొచ్చేవాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటల ప్రాంతంలో అన్నపూజ. అందరమూ అన్నం తినే సమయం. దేవునికి కూడా అదే సమయం. అందరం గర్భగుడిలోకి వెళ్ళేవాళ్ళం. తెచ్చిన అన్నాన్ని తన చెయ్యితో లింగంమీద పానవట్టం మీద మా అమ్మ పెట్టేది. అన్నం వేడిగా వున్నా చెంచాలని ఉపయోగించేది కాదు. ఏ దేవుడ్ని ఎక్కడా తాకే అవకాశం వుండదు. కానీ శివుడు ఉదారవాది. అందరినీ గర్భగుడిలోకి రానిస్తాడు. మా వేములవాడ రాజన్న మరీ ఉదారవాది. తనమీద అన్నం పెట్టనిస్తాడు. పాలు పొయ్యనిస్తాడు. నీళ్ళు పొయ్యనిస్తాడు.

దేవునిమీద అన్నం పెట్టిన తరువాత మా బుచ్చి కిష్టయ్య ఓ పది నిముషాలు మంత్రం చెప్పేవాడు. ఆ తరువాత బయటకు వచ్చేవాళ్ళం. కొద్దిసేపటి తరువాత దేవుని మీద పెట్టిన అన్నం అంతా తీసి డబ్బాల్లోకి ఎత్తేవాళ్ళు. అమ్మవారికి దండం పెట్టుకునేవాళ్లం. మా అమ్మ కుంకుమ పూజ చేసేది. దేవునికి కొట్టిన కొబ్బరి కాయలు గుళ్ళోనే ఖతం చేసేవాళ్ళం. దార్లో ఏమైనా కొనుక్కు తినేవాళ్ళం. ఇంటికొచ్చేసరికి రెండయ్యేది. ఆ తరువాత మాకు అన్నం పెట్టేది మా అమ్మ.

అప్పుడు అన్నపూజ చేసిన రోజు మా ఇంట్లో పెండ్లి చేసినంత హడావిడి వుండేది. కానీ, ఇప్పుడు అలాంటిదేమీ లేదు. చాలా సింపుల్. పది గంటలకి వెళ్ళి అన్నపూజ టికెట్ తెచ్చుకుంటే చాలు. పన్నెండు గంటలకి గుడికి వెళ్ళవచ్చు. ఎలాంటి హడావిడి లేదు. పండుగ వాతావరణం లేదు. అన్నీ మామూలుగానే. మల్లయ్య అవసరం కూడా లేదు. కొబ్బరికాయల్ని మోసుకెళ్ళాల్సిన పనిలేదు. అన్నం తీసుకెళ్ళాల్సిన పని అంతకంటే లేదు. దేవుని మీద అన్నం పెట్టాల్సిన అవసరం లేదు. అంతా దేవాలయమే. దేవుని సత్రంలో అన్నం వండుతారు. అది తెచ్చి దేవునిమీద పూజారులే పెడతారు. మనల్ని లోపలికి పిలిచి దేవుని మీద చేతులు పెట్టించి పూజ చేయించడం – రెండు నిమిషాల్లో నలుగురితో కలిపి.

ఎంత మార్పు, మా చిన్నతనానికి ఇప్పటికి. మార్పు సహజం. మారిన పరిస్థితుల ప్రకారం మనమూ మారాల్సిందే. అప్పుడు రోజుకి ఒకరిద్దరు అన్నపూజ చేసేవాళ్ళు. ఇప్పుడు వందల సంఖ్య దాటుతోంది. అందుకే దేవస్థానం అధికారులు ఇట్లా మార్చినారు. వాళ్ళైనా ఏం చేస్తారు? ఏం చెయ్యగలం ఎవరమైనా? దానికి అనుకూలంగా పూజ చెయ్యడం తప్ప.

మా ఇంటికి ఎవరైనా అతిథులు వచ్చినప్పుడు స్నేహితులు వచ్చినప్పుడు చాలా వంటలు చేసేది మా ఆవిడ మా అమ్మలాగే. అందరూ వెళ్ళిపోయిన తరువాత అలసిపొయ్యేది. చేతకాకుండా అయిపొయ్యేది. ఆ తరువాత ఎప్పుడూ అనుకునే వాళ్ళం. ఈ చాకిరీ అంతా ఎందుకు? హోటల్ నుంచి తెప్పించి పెడితే సరిపోతుంది కదాని, ఈ మాట అనేవాడ్ని మా బాపులాగే. అవునని మా ఆవిడ అనేది. కానీ మళ్ళీ ఎవరైనా వస్తే హోటల్ నుంచి తెప్పించకపొయ్యేది. తనే వండేది.

నేనూ వద్దని అనకపొయ్యేవాణ్ణి. తను వండి పెట్టకపోతే ఆవిడకు సంతృప్తి వుండక పొయ్యేది. అందుకని కష్టమైనా ఓపిక తెచ్చుకొని తనే వండిపెట్టేది. నాకూ అలాగే వుండేది. అదే మాకు తృప్తి. కానీ మా వేములవాడ రాజన్న విషయంలో ఈ తృప్తి లేకుండాపోయింది.

కాలమహిమ. ఎప్పుడైనా మా వేములవాడ రాజన్నకి అన్నం వండి అన్నపూజ చేసే అవకాశం దొరుకుతుందా? ఆ అదృష్టం మాకు వస్తుందా? ఎక్కడో చిన్న ఆశ. దాని వెన్నంటే అంతులేని బాధ. ఓ పెద్ద అసంతృప్తి. ఈ ప్రశ్నలకి సమాధానం ఎవరు చెబుతారు. మా రాజన్నా! అధికారులా!! కానేకాదు. కాలమే.

★ ★ ★



పాతాళ గరిగె

మా ఇంట్లో మూడు బావులు వుండేవి. రెండు చిన్నవి. ఒకటి పెద్దది. పెద్దబావిలో నీళ్ళు తియ్యగా వుండేవి. మా వాడకట్టులో వున్న బావుల్లో తియ్యటి నీళ్ళున్న బావి మాదే. అందుకని మా వాడకట్టోళ్ళందరూ మంచినీళ్ళకి మా ఇంటికి వచ్చేవాళ్ళు.

వర్షాకాలంలో మా వూర్లో చెరువు నిండినప్పుడు, మా వాడ ఆ కొసనుండి ఈ కొసదాకా పారినప్పుడు మా బావిలో నీళ్ళు పైదాకా వచ్చేవి. చేతికి అందేవి. పిల్లలందరమూ అక్కడికి పోయి బావిలోకి తొంగిచూసే వాళ్ళం. ఎక్కడినుంచి వచ్చేదో మా అమ్మ అందరినీ గదమాయించేది. అక్కడి నుండి దూరంగా పంపించేది. మాయచేసి మళ్ళీ బావి దగ్గరకు వచ్చేవాళ్ళం. అందులోకి తొంగిచూసేవాళ్ళం. నీళ్ళల్లో కదలాడే చేపలని చూసి పరవశించి పొయ్యేవాళ్ళం. ఊట చప్పుడుని గొప్ప సంగీతంలా వినేవాళ్ళం. మా మొఖాలని మా బావి నీళ్ళల్లో చూసుకునే వాళ్ళం. ఓ చిన్నరాయి వేసి మా ప్రతిబింబాలని చెదరగొట్టేవాళ్ళం. ప్రశాంతంగా ఉన్నప్పుడు మా బావి అద్దంలా కన్పించేది.

మా బావినుంచి నీళ్ళు చేదుకోవడానికి ఓ గిలక వుండేది. అది సులువుగా తిరిగేందుకు దాని మధ్యలో వున్న కడ్డీకి గ్రీసు పూసేవాళ్ళు. ఆ గ్రీసు పూసినప్పుడు నీళ్ళు చేదడం సులువుగా వుండేది. గ్రీసు అయిపోయినప్పుడు ఆ గిలక వింత శబ్దాలని చేసేది. అప్పుడప్పుడు తాడు సందెన పడేది. అంటే గిలక మీద నుంచి తాడు కడ్డీమీద పడడం. దాన్ని సవరించడానికి చాలా కష్టపడేవాళ్ళు. పిల్లలు బావి మీదకి ఎక్కి సందెన తియ్యడం చాలా సులువు. కానీ మమ్మల్ని చెయ్యనిచ్చేవాళ్ళు కాదు. వాళ్ళే కష్టపడి సరిచేసుకునేవాళ్ళు.


అప్పుడప్పుడూ మాటల్లో పడి బావిలో బొక్కెనని పడేసేవాళ్ళు. ఇక అప్పుడు చూడండి ఘోస. అందరి పనులూ ఆగిపొయ్యేవి. బొక్కెనని బావి నుంచి తియ్యడం వాళ్ళకు సాధ్యమయ్యేది కాదు. మా మల్లయ్య రావాల్సిందే ఆ బొక్కెనని తియ్యడానికి. అందుకోసం పాతాళ గరిగెని ఉపయోగించేవాడు.

మా ఇంట్లో పాతాళ గరిగె వుండేది. అది చూడ్డానికి చాలా గమ్మత్తుగా వుండేది. అది వంకులు వంకులు తిరిగి ముళ్ళలాంటి కొసలు కలిగి వుండేది. అవి చాలా కొచ్చగా వుండేవి. దాని ఒంటినిండా కొక్కేల్లాంటి కొసలు. మనిషి తల వెంట్రుకలు వంకులు తిరిగి

ముళ్ళలా మారినట్టుగా వుండేది. అది మా అరుగు మీద వుండేది. మా తాత చనిపోయిన తరువాత మా తాతర్రలోకి పోయింది.

మా పాతాళ గరిగెది ఒక పెద్ద కథ. మా వాడకట్టులో వున్న ఏకైక పాతాళ గరిగె అది. ఎవరింట్లో బొక్కెన బావిలో పడ్డా అది బయటకు తియ్యడానికి మా పాతాళ గరిగె అవసరం పడేది. కొంతమంది దాన్ని తీసుకునిపోయి తిరిగి ఇవ్వడంలో అశ్రద్ధ చేసేవాళ్ళు. అది ఎవరికి ఇచ్చారో ఒక్కోసారి మా అమ్మకి గుర్తుండేది కాదు. అందుకని ఓ పద్ధతిని కనిపెట్టింది మా అమ్మ. పాతాళ గరిగె కావాల్సిన వాళ్ళు, వాళ్ళు రోజూ ఉపయోగించుకునే మంచినీళ్ళ చెంబు మా తాతర్రలో పెట్టి అక్కడ నుంచి పాతాళ గరిగె తీసుకుపోవాలి. మంచినీళ్ళ చెంబు వాళ్ళకి అవసరం వుంటుంది కాబట్టి పాతాళ గరిగె తిరిగి ఇవ్వడంలో అశ్రద్ధ చెయ్యరని ఈ పద్ధతిని ప్రవేశపెట్టింది మా అమ్మ. ఈ పద్ధతి అమల్లోపెట్టిన తరువాత పాతాళగరిగె త్వరగానే మా ఇంటికి వచ్చేసేది.

పాతాళ గరిగె తలకి ఓ పెద్దతాడు కట్టి బావిలోకి వేసేవాడు మా మల్లయ్య. బొక్కిన బావిలో తరచూ పడాలని మేం కోరుకునేవాళ్ళం. ఎందుకంటే అది బావిలో వేసి బొక్కెన కోసం వెతకడం చాలా గమ్మత్తుగా వుండేది. అందుకని ఎవరూ లేనప్పుడు మేమే బొక్కెనని బావిలో పడేసేవాళ్ళం. పాతాళ గరిగెను బావిలో వేసి గట్టిగా తిప్పేవాడు మల్లయ్య. బొక్కెన అంత సులువుగా దొరికేది కాదు. కానీ ఏవో వస్తువులు వచ్చేవి. ఒక్కోసారి మేం ఆడుకునే రింగు దొరికేది. బంతి దొరికేది. ఆట వస్తువులు దొరికేవి. వాటి రూపురేఖలు మారిపోయి వుండేవి. చివరికి కొంత కష్టపడిన తరువాత బొక్కెన దొరికేది. తాడుతో పడినప్పుడు కొంత సులువుగానే దొరికేది. కాని బొక్కెన దగ్గర వున్న ముడి వూడిపోయి పడినప్పుడు దొరకడం అంత సులువుగా ఉండేది కాదు. ఇప్పుడూ అంతే. ఏదో కాగితం కోసం వెతుకుతూ కూర్చుంటామా ఎన్నో కాగితాలు దొరుకుతాయి. ఫోటోలు దొరుకుతాయి. ఉత్తరాలు దొరుకుతాయి. మనసు ఎక్కడికో



పోతుంది. వెదకబోయిన కాగితం ఎక్కడో మరుగున పడి, ఇల్లంతా కాగితాలమయం అవుతుంది. ఆలోచనలమయం అవుతుంది.

కానీ మా మల్లయ్య మాలా కాదు. తాళ్ళూ, బక్కెట్లు, కాగితాలు, బంతులు, రింగులూ వచ్చినా బొక్కెన తీసేవరకు వదిలి పెట్టేవాడు కాదు. బొక్కెన అంత త్వరగా దొరకద్దని మేం కోరుకునేవాళ్ళం. కానీ ఫలితం అంత వుండేది కాదు. మా మల్లయ్య మహా మాంత్రికుడు. బొక్కెనని తీసేవాడు. మేం నిరుత్సాహపడేవాళ్ళం.

కాలక్రమంలో మా రెండు బావులు బోర్లపడ్డాయి. మా వూరిలోకి నల్లాలొచ్చాయి. మంచినీళ్ళకోసం మా వాడకట్టు వాళ్ళు రావడంలేదు. మా ఇంట్లోనేకాదు - అందరి ఇండ్లల్లో బావుల అవసరాలు లేకుండా పోతున్నాయి. చాలమంది బావులని పూడ్చివేశారు. చాలామంది ఇండ్లల్లోకి బోర్లు వచ్చేశాయి. వంద రెండు వందల ఫీట్ల లోతుల దాకా బోర్లు వేస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా వానలు లేక నల్లాల్లో మంచినీళ్ళు రావడం తగ్గిపోయింది. బోర్లలో కూడా నీళ్ళు లేకుండా పోయినాయి. కొంతమంది ఏడువందల నుంచి ఎనిమిది వందల ఫీట్ల లోతుల దాకా వెళ్తున్నారు. నీళ్ళు ట్యాంకుల మీద తెచ్చి అమ్ముతున్నారు. బకెటు నీళ్ళకి ధర వచ్చేసింది. డబ్బున్న వాళ్ళకి వోవర్ హెడ్ ట్యాంకుల మీదకు తమతోపాటు తెచ్చుకున్న కరెంటు మోటర్లతో నీళ్ళు పైకి ఎక్కిస్తున్నారు.

మా పెద్దబావి అలాగే వుంది. ఒక్క నీటిచుక్క లేకుండా దుఃఖిస్తూనే వుంది. బావి మీద గిలక వుంది. తాడు వుంది. బొక్కెన వుంది. కానీ నీళ్ళు లేవు. దాన్ని చూస్తే మా కళ్ళల్లో నీళ్ళు. ఎంతమందికి నీళ్ళని ఇచ్చింది ఆ బావి. నీళ్ళు చేదుకుంటూ పాడిన ఎన్ని పాటలని విన్నది ఆ బావి. ఎన్ని కథలని విన్నది. కష్టాలని విన్నది. ఇది మా బావి సంగతి. అన్ని బావుల సంగతి. బావుల సంగతే ఇలా వుంటే మా పాతాళ గరిగె సంగతి ఎలా వుంటుంది? అది తాతర్రలో నిద్రిస్తూనే వుంది. కాలం కఠినత్వానికి బలైపోయింది. ఇప్పుడు బొక్కినలని తియ్యడానికి పాతాళ గరిగె అవసరం లేదు. కానీ మన మనస్సులోని జ్ఞాపకాలని, మంచినీళ్ళ లాంటి స్వచ్ఛమైన మంచితనాన్ని బయటకు తీయడానికి మాత్రం ఓ పాతాళ గరిగె అవసరం వుంది. బహుశా కాలం ఆ పాతాళ గరిగెని సృష్టిస్తుందను కుంటాను.

★ ★ ★

పెట్టెలర్ర

మా ఇల్లు నా చిన్నప్పుడు మా ఊరి చివర్లో ఉండేది. ఇప్పుడు ఊరి మధ్యలో అయిపోయింది. నాకన్నా ముందే పుట్టింది మా ఇల్లు. మా ఇల్లు చాలా పెద్దది. మా ఇంట్లో చాలా గదులు (అర్రలు) ఉన్నాయి. ఒక్కో గదికి ఒక్కో పేరుంది. దేవుని గదికి దేవునర్రని, మా దొంతులు వుండే గదిని దొంతులర్రని, మా తాత వుండే గదిని తాతర్రని, పెట్టెలుండే గదిని పెట్టెలర్రని అనేవాళ్ళం. ఇప్పటికీ వాటికి అవే పేర్లు. ఈ అర్రలే కాకుండా ఇంకా చాలా గదులున్నాయి. వాటి గురించి తరువాత చెబుతాను. ముందుగా మా పెట్టెలర్ర గురించి చెబుతాను.


మేము తొమ్మిదిమందిమి. నేను అందరికన్నా చిన్నవాణ్ణి. పెద్దన్న కూతురు నా కన్నా రెండేళ్ళు పెద్ద. నాకు బుద్ధి తెలిసేటప్పటికే ముగ్గురు అన్నలకి, నలుగురు అక్కలకి పెళ్ళిళ్ళు అయిపోయినవి. మా పెట్టెలర్రలో అందరి పెట్టెలుండేవి. ఆ పెట్టెల్లో బట్టలు, డబ్బులు, కాగితాలు, బంగారం లాంటివి వుండేవి. నాలుగు టేబిల్లమీద పెట్టెలు ఒకదాని మీద ఒకటి వుండేవి. ఆ అర్రకి ఎప్పుడూ తాళంవేసి వుండేది. తాళం వేసిన పెట్టెలర్ర రాత్రి కళ్ళు మూసుకున్న మా గుడి ద్వారంలా వుండేది.

ఎప్పుడన్నా మా అమ్మ పెట్టెలర్ర తాళం తీసినప్పుడు అదోరకమైన వాసన వచ్చేది. రూం మూసివుంచిన వాసన. డాంబరు గోళీల వాసన. అన్నీ కలగలిపిన అదోరకం వాసన. దాని కిటికీ తలుపులు కూడా ఎప్పుడూ మూసి వుండేవి. అంతా చీకటిగా వుండేది. తలుపు తీసి లైటు వేయగానే మేం ఎక్కడున్నా అక్కడికి పరుగెత్తుకుని వచ్చేవాళ్ళం. 'మీకిక్కడ ఏం పనని' మా అమ్మ గదమాయించేది. మా అవుసుల రామయ్య వచ్చినప్పుడు, మా అయ్యగారు బుచ్చికిష్టయ్య వచ్చినప్పుడు, మా నామాల మల్లయ్యకి డబ్బులు అవసరం వచ్చినప్పుడు మా పెట్టెలర్ర తలుపులు తెరుచుకునేవి.

మా అవుసుల రామయ్యకి బంగారం ఇవ్వడం, ఆయన తెచ్చిన కమ్మలని, బంగారు వస్తువులని లోపల పెట్టడంకోసం ఆ అర్ర తలుపులు తెరుచుకునేవి. ఆయన దగ్గర వుండే చిన్న త్రాసు, చిన్న డబ్బా. అందులో వుండే గురిజ గింజలు. తులం బొట్లు. మాకు అవుసుల రామయ్య అంటే ఎంత సరదా. బంగారం ఆయనకి ఇచ్చినప్పుడూ జోకించేవాడు. నగ చేసిన తరువాత జోకేవాడు. సరిగా జోకడం ఆ తరువాత వాటికి పెట్టాల్సిన రాళ్ళని పొదిగేవాడు. సరిగా జోకడం లేదని మేం గోలగోల చేసేవాళ్ళం. మా బుచ్చి కిష్టయ్య వస్తే

జన్మపత్రికలు చూసి మా అక్కలకి మట్టెలు ఎప్పుడు పెట్టాలో, ఒడిబియ్యం ఎప్పుడు పొయ్యాలో చెప్పేవాడు. వాళ్ళ పిల్లలకి ఎప్పుడు చెవులు కుట్టించాలో పుట్టి వెంట్రుకలు ఎప్పుడు తియ్యాలో తెలియజేసేవాడు. మా నామాల మల్లయ్యకి ఎప్పుడూ డబ్బులు అవసరం వుండేది. డబ్బులు తీసుకోవడమో ఇవ్వడమో చేసేవాడు. అందుకు ఏమీ వడ్డీ ఇచ్చేవాడు కాదు. కానీ మా బర్రెల బాగోగులు చూసేవాడు. రోజూ ఉదయం సాయంత్రం వాటికి మేత వేసేవాడు. పాలు పిండేవాడు. ఏవైనా పనులుంటే చేసేవాడు. వాటికి ఏదో డబ్బు కూడా ఇచ్చేవాడు మా బాపు.

మా అక్కలు వచ్చినప్పుడల్లా పెట్టెలర్ర తలుపు తీసి తమ పెట్టెలను తెచ్చుకునేవాళ్ళు. ఆ పెట్టెలను తెరిచి ఎక్కడికో వెళ్ళిపోయేవాళ్ళు. ఆ పెట్టెల నిండా వాళ్ళ బట్టలు, వాళ్ళ వస్తువులు, ఆభరణాలు, ఉత్తరాలు, చిన్నప్పటి వస్తువులు ఎన్నో. అవి చూస్తూ తమలోతాము మురిసిపొయ్యేవాళ్ళు. వాళ్ళు అలా మురిసిపోతున్నప్పుడు అందులోనుంచి ఏదో ఒక వస్తువుని మాయం చేయడం, వాళ్ళు ఆదుర్దాపడటం, ఆ తరువాత వాళ్ళకి అవి తిరిగి ఇచ్చేవాళ్ళం. పెళ్ళయిన మా అక్కలు అన్నలు మాత్రమే మా పెట్టెలర్రని తెరిచేవాళ్ళు. వాళ్ళకి ఆ తాళంచెవి మా అమ్మ ఇచ్చేది. మాకు మాత్రం ఇచ్చేదికాదు. నేను కాలేజీలో చదువుతున్న రోజుల్లో ఒకసారి మా పెట్టెలర్ర తాళం తీసి నా జన్మపత్రిక, మా అమ్మ పెట్టెలోనుంచి తీశాను. పదవ తరగతి చదువుతున్నప్పుడు నా పుట్టిన తేదీ మార్చారు. ఆ చదువుకి సరిపొయ్యే విధంగా మార్చారు. అంతకుముందు ఏ తేదీ వేశారో తెలియదు. అందరి జన్మపత్రికలూ వున్నాయి. నాది కూడా వుంది. పాత కాగితం. జాగ్రత్తగా తీసి చూశాను. గొలుసురాత, తెలుగు సంవత్సరాలు. తెలుగు అంకెలు, అర్థం కాలేదు. తెల్లవారి మా బుచ్చికిష్టయ్య వస్తే అది చదివిపించి ఆ పుట్టిన తేదీని వివరాలను తెలుసుకున్నాను. ఆ తరువాత నా జన్మపత్రిక మళ్ళీ పెట్టెలర్రలోని పెట్టెలోకి వెళ్ళిపోయింది.



మా చిన్నక్క పెళ్ళి, మా అన్నయ్య కూతురు పెళ్ళిళ్ళు కూడా జరిగాయి. వాళ్ళూ వెళ్ళిపొయ్యారు. వాళ్ళ పెట్టెలు కూడా మా పెట్టెలర్రలో చేరినాయి. కాలం పరుగు తీసింది. నా 'లా' చదువూ అయిపోయింది. మా బాపు తాను వుండగానే నా వివాహం చెయ్యాలని సంకల్పించారు. మా అన్నయ్య కూడా అందుకే ఓటేశాడు. చివరికి నా పెళ్ళి అయింది. ఇంటిముందు వున్న రెండు అర్రలు మా బాపు రోగులను చూడటానికి ఒకటి, అల్లుళ్లు వచ్చినప్పుడు వుండటానికి ఒకటి సరిపొయ్యేవి. నాకు ఓ రూం అవసరం ఏర్పడింది. అందరి దృష్టి పెట్టెలర్ర మీద పడింది. రెండు టేబిల్లు ఖాళీ చేసి వేరే రూంలోకి మార్చాం. కిటికీ తలుపులు తీసి వుంచడం, పెట్టెలర్ర తలుపు తీయడం జరిగిపోయింది. నేను, నా భార్య అందులో చేరిపొయ్యాం.

నేను న్యాయవాద వృత్తికోసం సిరిసిల్లలో మకాం పెట్టడం, ఇంటికి వచ్చినప్పుడు మా పెట్టెలర్రలో వుండటమూ జరిగేది. మా అక్క పిల్లల పెండ్లిండ్లు కూడా అవడం వల్ల వాళ్ళూ మా ఇంటికి రావడం కొంత తగ్గిపోయింది. కొంత కాలానికి వాళ్ళు తమ పెట్టెలను కూడా వాళ్ల ఇండ్లకి తరలించారు. అయినా దాని పేరు మారలేదు. అదే నామధేయం. మా అన్నయ్యకీ ట్రాన్స్‌ఫరొచ్చి కరీంనగర్ వెళ్ళిపోయాడు. నా పెళ్ళయిన కొంతకాలానికి మా బాపు చనిపోయాడు. ఇల్లు చిన్నబోయింది. ఆ తరువాత అక్కల, బావల రాకపోకలు తగ్గిపొయ్యాయి. ఏదైనా ఫంక్షన్ అయినప్పుడు, మా వేములవాడ రాజన్నని చూడ్డానికి వచ్చేవాళ్ళు. మా చిన్నక్క, బావ, మా అన్నయ్య కూతురు, ఆమె భర్త దసరాకి వచ్చేవాళ్లు.

కొంతకాలం తరువాత నాకు జ్యుడిషియరీలో ఉద్యోగం వచ్చింది. న్యాయవాద వృత్తిని వదిలిపెట్టి న్యాయమూర్తి పదవిలోకి మారిపొయ్యాను. సిరిసిల్ల వదలిపెట్టాను. దాంతో వేములవాడకి వెళ్ళడం తగ్గిపోయింది. దాంతో మా పెట్టెలర్ర ప్రాధాన్యత కూడా తగ్గిపోయింది. అమ్మ అన్నయ్యతోబాటు కరీంనగర్ వెళ్ళింది. చిన్నన్న ఒక్కడే వేములవాడలో. నా పెళ్ళితో చిన్నదైన ఇల్లు మా బాపు చనిపోవడంతో, అమ్మ కరీంనగర్ వెళ్ళిపోవడంతో ఒక్కసారిగా పెద్దదైపోయింది. ఇల్లుని సవరించడం కూడా కష్టమైపోయింది. మా పెట్టెలర్రని, ఇంకో రెండు అర్రలని తెలిసిన వాళ్ళకి కిరాయికి ఇవ్వడం జరిగింది. కొంత సందడి. కొంత ఆదాయం. కానీ మేమందరం అప్పుడప్పుడు వచ్చినప్పుడు ఇబ్బంది కలిగేది. మరికొంత కాలానికి ఆ పోర్షన్ని ఖాళీ చేయించాం. మా పెట్టెలర్ర అలాగే ఉండిపోయింది. కానీ బోసిగా. అందులో ఏ పెట్టెలూ లేవు. టేబిల్లు లేవు. పెట్టెలకి రెక్కలొచ్చి ఎగిరిపొయ్యాయి – మా అన్నతమ్ముల్లాగే. టేబిల్లకి రూపురేఖలు మారిపొయ్యాయి. ఇప్పుడు అవుసుల రామయ్య లేడు, మా బుచ్చి కిష్టయ్య లేడు. మా నామాల మల్లయ్య వున్నాడు గానీ మా బర్రెలు లేవు. ఆ కుటుంబ వ్యవస్థ లేదు. కానీ మేం వున్నాం అదే మనస్సుతో. పెట్టెలు లేవు. కానీ పెట్టెలర్ర వుంది. దాని స్మృతి మాలో అలాగే వుంది.

ఏవైనా అట్లాగే వుండాలనుకోవడం ఎంత అసహజమో పోయిందీ అని బాధపడటమూ అంత సహజమే!

★ ★ ★

తాతర్ర

మా అమ్మమ్మ చనిపోయిన తరువాత మా తాత మకాం మా ఇంటికే మారింది. ఆయనకి ముగ్గురూ కూతుర్లే. పెద్దకూతురు మా అమ్మ. మా బాపు ఆయుర్వేద డాక్టర్. కానీ కొంత అల్లోపతి వైద్యం కూడా చేసేవాడు. మా ప్రాంతంలో మొట్ట మొదటిసారి సూది వాడిన డాక్టర్ మా బాపే. ఓసారి జాగిర్దార్ వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చి అస్వస్థతకి గురై గుడిపైన రూంలో పడుకున్నాడు. మా బాపు గురించి, ఆయన హస్తవాసి గురించి అక్కడివాళ్ళు ఆయనకు వివరించారు. మా బాపుని పిలిపించారట. ఆయన జాగిర్దారుని పరీక్షించి రెండు పొట్లాలు ఇచ్చారట. వెంటనే ఆయన ఆరోగ్యం కుదుటపడింది. తెల్లవారే వేములవాడ రాజన్న గుడి మీద మా బాపుకి డాక్టర్‌గా ఉద్యోగం వచ్చింది. మా అమ్మ మా బాపుని పెళ్ళి చేసుకోవడం వల్ల ఆమెకి వ్యవసాయం పనులు తెలియవు. మిగతా ఇద్దరు చెల్లెళ్లు వ్యవసాయదారుల్నే చేసుకున్నారు. చిన్నకూతురుని, అల్లుడిని మా తాత ఇల్లుటం (ఇల్లరికం) తెచ్చుకున్నాడు. మా అమ్మ స్తోమత వాళ్ళిద్దరికన్నా బాగా వుండటం వల్ల ఎక్కువశాతం మా తాత మా ఇంట్లోనే వుండేవాడు. ఆయన పేరు గాలయ్య.

మా ఇంటి వెనుక కాస్త ఖాళీస్థలం తరువాత గూన పెంకులతో ఓ చిన్న ఇల్లు వుండేది. అందులో రెండు అర్రలు, పెద్ద అరుగు, వంటిల్లు వుండేది. వంటిల్లు అవతల రేకులతో ఓ పెద్ద సాయమాను వుండేది. అందులో మా బాపు దవాఖానకోసం కషాయం తయారయ్యేది. మా గూన పెంకులతో వున్న ఇంట్లోని రెండు అర్రల్లో ఒక అర్రలో మా తాత వుండేవాడు. ఆ అర్రకి తాతర్రని పేరు. ఇప్పటికీ అదే పేరుతో పిలుస్తాం. మా చిన్నక్క, మా పెద్దన్న కూతురుకి, కొడుక్కు, నాకు ఆ రూంతో చాలా అనుబంధం.

అప్పుడు మా తాతకి డెబ్భై అయిదు ఏళ్ళు దాటి వుంటాయనుకుంటాను. మాకు కథలు చెప్పడం, బొమ్మలు చేసివ్వడం, చుట్టలు చేసివ్వడమే ఆయనకున్న పని. ఆ రూం చాలా చిన్నది. చిన్నకిటికీ, ఆయనకి ఓ మంచం, ఆయన సామాన్లు పెట్టుకోవడానికి గోడలోనే వున్న చిన్న అల్మైరా. ఎన్నో కథలు చెప్పేవాడు. తను పొలం ఎలా దున్నేది, బర్రెల నుంచి పాలు ఎలా పిండేది ఇవన్నీ చేప్పేవాడు. తాను విన్న కథలు, తన అనుభవంలోకి వచ్చిన కథలు చెప్పేవాడు. ఆయన చుట్ట తాగడం వల్ల ఆయన దగ్గర కంపు వాసన వచ్చేది. కానీ కథలు వినాలి. ఆయన మాటలు వినాలి. కథల్లో పేదరాసి పెద్దమ్మని చూడాలి.

మాయల మరాఠి మంత్రాల్లో మాయమవ్వాలి. అందుకని ఆయన కంపు వాసనని భరించేవాడ్ని. అప్పుడప్పుడూ మమ్ములను గట్టిగా పట్టుకుని ముద్దుపెట్టుకునేవాడు. వాసనకి తోడు ఆయన మీసాలు గరిక పోచల్లా గుచ్చుకునేవి. అన్నీ భరించేవాళ్ళం. చుట్ట తాగిన తరువాత మూతి కడుక్కునేవాడు. అయినా ఆ వాసన పోకపొయ్యేది. మంగలివాడు ఇంటికి వచ్చినప్పుడు ఆ మూతి మీద మీసాలు తీయించమని అనేవాళ్ళం. దానికి ఆయన ఎప్పుడూ ఒప్పుకునేవాడు కాదు. ఇంకా ఎక్కువ మాట్లాడితే మీసాల గురించి ఎన్నో కథలు చెప్పేవాడు.

మా తాత చిన్నకూతురు దగ్గరకి వెళ్ళినప్పుడు మా తాతర్రకి గొళ్ళెం పెట్టేది మా అమ్మ. మాకు ఇల్లంతా చిన్నబోయినట్టుగా వుండేది. కథలు లేక, బొమ్మలు లేక కాలం కష్టంగా గడిచేది. చుట్టకంపు వున్నా పర్వాలేదు. ఆ మీసాలు గుచ్చుకున్నా ఫర్వాలేదు. మా తాత లేకపోవడం మాకు చాలా కష్టంగా వుండేది. ఏమీ తోచేది కాదు. మేం ఒకర్నొకరం కొట్టుకునేవాళ్ళం. మా తాత వున్నప్పుడు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదు. ఎందుకంటే ఆయన కథలతోనే మాకు కాలం సరిపొయ్యేది.

ఓరోజు మధ్యాహ్నం మా అమ్మ ఏడుస్తూ కూర్చుంది. మా బాపు కూడా దవాఖానా నుంచి వచ్చాడు. కొద్దిసేపటికి తెలిసింది, తాత చనిపోయాడని. చనిపోవడం అంటే ఏమిటో నాకు తెలియదు. మా పెద్దవదినను అడిగాను. తాత చనిపోయి ఆకాశంలో చుక్కగా మారిపోయినాడు అని చెప్పింది. చుక్కలన్నీ చనిపోయిన వాళ్ళేనని చెప్పింది. నాకేమీ అర్థం కాలేదు.


కాస్సేపటికి కచ్చురం తయారైంది. సిరిసిల్ల పోవడానికి అమ్మా బాపు తయారవుతున్నారు. నన్ను మా వదినతోపాటు వుండమని చెప్పారు. ఉండనని చెప్పాను. కాదూ కూడదూ అన్నారు. ఏడుపు లంకించుకున్నాను. చివరికి నన్ను కచ్చురంలో కూర్చుండబెట్టుకున్నారు. మా వేములవాడ నుంచి పన్నెండు కిలోమీటర్లు. ముప్పావు గంటలో సిరిసిల్లకి చేరుకున్నాం. మా అమ్మా, మా చిన్నమ్మలు ఒకటే ఏడుపు. వాళ్ళతో బాటు నేను ఏడ్చాను. మా తాతని కింద పడుకోబెట్టినారు. కళ్ళు మూసుకుని నిద్రపోతున్నట్టుగా అన్పించింది. వీళ్ళందరేమో చనిపోయినారాని ఏడుస్తున్నారు. మా వదినేమో ఆయన ఆకాశంలో చుక్కగా మారిపోయాడని చెప్పింది. నాకేమో ఆయన నిద్రపోతున్నట్టు అన్పించింది.

అరగంట తరువాత మా తాతని బయటికి తీసుకుని వచ్చారు. ఏదో కట్టెల పాడె మీద పడుకోబెట్టారు. మా నాంపల్లి చిన్నాయన, ఇంకా కొంతమంది మా తాతని మోసుకుని బయటకు వచ్చారు పాడెతోబాటు. డప్పుల చప్పుడు మొదలైంది. ఏదో బాధగా ధ్వనిస్తుంది. నలుగురు బంధువులు పాడెను మోస్తూ వుంటే డప్పుల చప్పుడు వెంట నడిచాను. మా

అమ్మా చిన్నమ్మలని ఎవరో పట్టుకుని నడుస్తున్నారు. నన్ను మా అమ్మ చిన్నమ్మ కొడుకు అంటే మా మామ పట్టుకున్నాడు.

వాగు దగ్గరికి వచ్చాం. అక్కడ కట్టెల మీద మా తాతని పడుకోబెట్టారు. అందరూ మనిషికొక కట్టె ఆయన మీద పేర్చారు. మా మామ నన్ను దూరంగా తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. కానీ నేను వినలేదు. అక్కడే వున్నాను. మా నాంపల్లి చిన్నాయన కాస్సేపటికి ఆ కట్టెలకి నిప్పు పెట్టాడు. మా తాత కాలిపోతున్నాడు. ఎందుకట్లా పడుకున్న తాతని కాలుస్తారని మా మామని అడిగాను. ఆయన పడుకోలేదు, చనిపోయాడు. చనిపోయిన వాళ్ళని కాలుస్తారు. నీకు అర్థం కాదులే అన్నాడు మా మామ. పెద్దగా మంటలు లేచాయి. మా బాపు నన్ను దగ్గరకు తీసుకుని చన్నీళ్ళతో తనతోపాటు స్నానం చేయించాడు. ఆ తరువాత మా తాత ఇంటికొచ్చాం. అది చిన్న ఇల్లు. నన్ను తనతోపాటు రమ్మని మా బాపు అన్నాడు. రానని చెప్పాను. నిద్రలోకి జారుకున్న తరువాత నన్ను తీసుకుని వేములవాడకి వచ్చాడు. లేచి చూసుకునేసరికి వేములవాడలో వున్నాను.

ఓ పదిరోజుల తరువాత మా అమ్మ మా ఇంటికి వచ్చేసింది. ఎవరితో మట్లాడకుండా కొంతకాలం మౌనంగా వుంది మా అమ్మ. ఆ తరువాత మామూలు ప్రపంచంలోకి వచ్చేసింది. మా తాతర్ర అలాగే వుంది. అంతకు ముందు మా తాత మళ్ళీ వస్తాడన్న ఆశతో వేచి చూస్తూ వుండేది. కాని ఆ అర్రకి మా తాత విషయం తెలిసిందో లేదో కానీ అది అంతకుముందు ఎదిరి చూస్తున్నట్టుగానే నాకన్పించేది. లోపలికి వెళ్ళి నాకు తెలిసిన విషయాలు మా తాతర్రకి చెప్పాలని అన్పించేది. కానీ దానికి ఎప్పుడూ గొళ్ళెం పెట్టి వుండేది. గొళ్ళెం పైకి వుండేది. నాకు అందకపొయ్యేది. మా అమ్మని తియ్యమని చెబితే వినలేదు. కోపంగా నావైపు చూసేది. అడగడం మానేశాను. ఎండాకాలం బంగ్ల మీద డాబాలో పడుకున్నప్పుడు ఆకాశంకేసి చూసేవాడ్ని. ఎన్నోవేల చుక్కలు. అందులో ఎక్కడని వెతికేది మా తాతని. మాకు



జ్వరం వచ్చినప్పుడు, దిష్టితాకినపుడు మా తాత మాకు మంత్రం వేసేవాడు. మా తాతకి మంత్రాలు వచ్చు గదా. ఎప్పుడన్నా వచ్చి నాతో మాడ్లాడతాడని చాలారోజులు ఎదురుచూశాను. కాని మా తాత రాలేదు. ఆయనకు వచ్చిన మంత్రాలు ఏమైనాయో నాకర్థం కాలేదు.

రెండు మూడు నెలలు తరువాత అప్పుడప్పుడు మా తాతర్ర తలుపులు తెరుచుకోవడం మొదలైంది. అందులో వున్న నులక మంచం బయటకు వచ్చేసింది. తాతర్రలో ఓ బెంచి వేశారు. దానిమీద ఇంట్లో అవసరం లేని సామాన్లు పెట్టడం మొదలుపెట్టారు. చివరికి అది సామాన్లు పెట్టుకునే అర్రగా మారింది. కానీ దానిపేరు మారలేదు. అదే పేరు తాతర్ర. మా తాత తరువాత ఆ అర్రని ఎప్పుడూ ఎవరూ ఉపయోగించుకోలేదు. ఆ అవసరమూ రాలేదు. ఇంట్లో వున్న అర్రలే ఖాళీగా వుంటున్నాయి.

జీవన పరిధి పెరిగిన కాలంలో తాతలు పెరుగుతున్నారు. తాతర్రలు లేకుండా పోతున్నాయి. ప్రతి ఊరి చివర, నగరం అంచుల్లో వస్తున్న వృద్ధాశ్రమాలే వాళ్ళ అర్రలుగా మారిపోతున్నాయి. ఈ వృద్ధాశ్రమాలని చూసినప్పుడల్లా మా తాతే గుర్తుకొస్తాడు. అప్పటికీ ఇప్పటికీ ఎన్ని మార్పులు. అప్పుడు మా తాతా నేనూ ఎన్నో కథలు. ఇప్పుడు పిల్లలూ కంప్యూటర్లు వృద్ధాశ్రమాలు.

ఎప్పుడన్నా మా ఇంటికి వెళ్ళినప్పుడు మా తాతర్ర ముందు కూర్చుని గాలి పీలుస్తాను. బహుశా ఆ గాలే కథలు రాయిస్తుందేమో.

★ ★ ★

గ్రామఫోనూ - కంప్యూటరూ...

నాచిన్నప్పుడు పాటలు వినాలంటే సినిమా టాకీసుకి పోవాల్సిందే. లేదంటే మా రాజన్న గుడికి పోవాల్సిందే. గుడికిపోతే భక్తిపాటలు. సినిమా టాకీసుకి వెళ్తే పాత హిందీ పాటలు. అంతేకానీ నాకిష్టమైన తెలుగు పాటలు వినే అవకాశం లేకపొయ్యేది. మా వూర్లో వున్నవి రెండే రెండు గ్రామఫోనులు. ఒకటి గుడిమీద. రెండవది సినిమా టాకీసులో.

గ్రామఫోన్‌ని చూడ్డం ఓ గొప్ప వింతగా అన్పించేది. ఆ రికార్డుల్లో పాటలు ఎట్లా నిక్షిప్తం అయి వుంటాయో నాకర్థం కాకపొయ్యేది. భూమి లాగా గ్రామఫోను తన చుట్టూ తాను తిరగడం, ఆ ముల్లు ఆ రికార్డ్ మీద తిరగడం నాకప్పుడు ప్రపంచవింతలా అన్పించేది. ఒకసారి దగ్గరగా వెళ్ళి గ్రామఫోనుని చూడాలని, ఆ రికార్డుని చేతితో ముట్టుకోవాలని, నేనే పాట పెట్టుకొని విన్పించాలనిపించేది. 'ప్రవేశం లేదు' అన్న బోర్డు కన్పించేది. ప్రవేశం వున్నా నన్ను ఆ గ్రామఫోన్‌ని ముట్టనిస్తారా?

మా ఇంట్లో రేడియో వుండేది. ఎప్పుడోకాని పాటలు వచ్చేవికాదు. మీరు కోరిన పాటల కార్యక్రమం వుండేది. మా వూరు నుంచి ప్రతాప వేణుగోపాల్, కరీంనగర్ నుంచి సిరికొండ వెంకటేశం తరచు రేడియోలోని మీరు కోరిన పాటల కార్యక్రమానికి ఉత్తరాలు రాసేవాళ్ళు. సిలోన్‌లో సాయంత్రం పాటలు వచ్చేవి. బుధవారం బుధవారం బినాకా గీత్ మాలా పాటలుండేవి. మా రాధక్క దగ్గరికి వెళ్ళినప్పుడు హిందీ పాటలు ఎక్కువ విన్పించేవి. ఫస్టు తేదీన 'ఆజ్ పహెలీ తారీఖ్ హై' అన్న పాట రేడియోలో వచ్చేది. అది తప్పక మా బావ పెట్టేవాడు. ఎనిమిదికి ముందు సైగల్ పాట వచ్చేది.

రేడియోలో పాటలు వస్తున్నా, నాకు గ్రామఫోన్ పెట్టుకుని పాటలు వినాలన్న కోరిక అట్లానే వుండిపోయింది. మా బాపు గ్రామఫోను ఎందుకు కొనలేదో నాకర్థం కాకపొయ్యేది. అప్పటికే మా అన్నయ్య హైదరాబాద్‌లో ఎంబిబిఎస్ చదువుతున్నాడు. ఆయనన్నా ఎందుకు తీసుకోలేదో నాకంతకంటే అర్థం కాకపొయ్యేది. ఒకటి రెండుసార్లు అడిగాను. కానీ ఆయన సరైన జవాబు చెప్పలేదు.

చాలారోజులకి గ్రామఫోనుని దగ్గరగా చూసే అవకాశం దొరికింది. అంతేకాదు పాట పెట్టుకుని ఆనందించే అవకాశం చిక్కింది. సిరిసిల్లలో మా పెద్దమ్మ వుంటుంది. ఆమెకి ఒక్కతే బిడ్డ. ఆమె కూతురుని మా అన్నయ్య పెళ్ళి చేసుకున్నాడు. నా పుట్టుకలో



వాళ్ళ పెళ్ళి జరిగింది. సెలవుల్లో మా పెద్దమ్మ వాళ్ళింటికి వెళ్ళేవాళ్ళం. వాళ్లింట్లో గ్రామఫోను వుంది. మా అక్కయ్య కొడుకులు ముగ్గురు హైదరాబాద్‌లో చదువుతున్నారు. ఇద్దరు డాక్టరీ చదువులు. ఇంకొకతను ఎం.ఎ. చదివేవాడు.

వాళ్ళు గ్రామఫోనుని కొని తెచ్చుకున్నారు. దాన్ని బంగ్ల మీద పెట్టారు. అందరూ కూచుని పాటలు పెట్టుకునేవాళ్ళు. అప్పుడు చూశాను గ్రామఫోన్‌ని దగ్గరగా. దాన్ని ఎట్లా పెడుతున్నారో అన్నీ గమనించాను. వాళ్ళు భోజనానికి కిందికి ఎప్పుడు వెళ్తారో నాకు తెలుసు. అప్పటికే నేను భోజనం చేసి వుండేవాణ్ణి. వాళ్ళు భోజనానికి కిందికి రాగానే నేను బంగ్లమీదికి వెళ్ళేవాణ్ణి.

అదే మొదటిసారి గ్రామఫోన్‌ని ముట్టుకోవడం. మెల్లిగా హ్యాండిల్‌తో తిప్పాను. రికార్డుని పట్టుకొని దానిమీద పిన్ను పెట్టాను. పాట మొదలైంది. ఎంత ఆనందమో చెప్పలేను. క్లాసులో అందరికన్నా ఎక్కువగా మొదటి మార్కులు వచ్చినంత గొప్పగా మనసు వూగిపోయింది. ఇట్లా అక్కడున్నన్ని రోజులూ చేశాను. మెట్లమీద చప్పుడు విన్పించగానే గ్రామఫోన్ ఆపేసేవాడ్ని. ఈ దొంగాటని మా అన్నయ్య పసిగట్టి హెచ్చరించాడు. రికార్డుని ఎట్లా పాటలు పాడించాలో ఆయనకు పెట్టి చూపించాను. ఆ తరువాత నన్ను ఏమీ అనలేదు. అట్లా గ్రామఫోనులో పాటలు వినే కోరిక తీరింది.

నేను టెన్త్‌లోకి వచ్చే సమయానికి మా ఇంట్లో టేప్ రికార్డర్ వచ్చింది. మా అన్నయ్యే కొన్నాడు. ఐదారు కేసెట్లు తెచ్చాడు. వాటినిండా తెలుగు పాటలు. అతనే పెట్టేవాడు. అన్నీ గమనించాను. పాటలు ఎట్లా పెట్టాలో పాటలని ఎట్లా రికార్డు చెయ్యాలో కూడా

నాకు తెలిసిపోయింది. అన్నయ్య ఇంట్లో వున్నప్పుడు అతనే పెట్టేవాడు. ఆయన లేనప్పుడు నేను పెట్టేవాడ్ని. మా వదినల మాటల్ని రికార్డు చేసేవాడ్ని. ఆ తరువాత వాళ్ళకి విన్పించేవాడ్ని.

వాళ్ళు సీరియస్‌గా మాట్లాడుకుంటున్నప్పుడు వాళ్ళకి తెలియకుండా వాళ్ళ మాటల్ని రికార్డుచేసి వాళ్ళకు విన్పించేవాడ్ని. గొప్ప సరదాగా వుండేది. మా వదినెలు టేప్‌రికార్డర్ పెట్టడానికి ప్రయత్నం చేసేవాళ్ళు గానీ 'ప్లే' చెయ్యాలని అనుకొని రివైండ్ బటన్ నొక్కేవాళ్ళు. లేదా రికార్డు బటన్ నొక్కేవాళ్ళు. పిల్లలందరూ వాళ్ళని చూసి నవ్వేవాళ్లు.

వాళ్ళకి చాలాసార్లు టేప్‌రికార్డర్‌ని ఎలా ఆపరేట్ చెయ్యాలో చెప్పాను. అయినా ఏదో తప్పు చేసేవాళ్ళు. ఇంకా ఎప్పుడు నేర్చుకుంటారని వాళ్ళని ఆటపట్టించేవాళ్ళం. ఒకరోజు మేం పిల్లలం మాటల్లో వుండగా మా మాటల్ని రికార్డు చేద్దామని ప్రయత్నించి మా వదిన ఓ మంచి పాటల కేసెట్టుని పాడుచేసింది. ఆ తరువాత మా అన్నయ్య ఏమంటాడోనని భయపడింది. అది కొత్త వస్తువు. అన్నయ్య తిడతాడని అందరికీ తెలుసు. మా వదిన లేనప్పుడు కేసెట్ నా చేతిలోనే పాడయ్యిందని మా అన్నయ్యకి చెప్పాను. ఆయనతో తిట్లు తిన్నాను. ఆ తరువాత చాలా రోజులు ఎవ్వరూ టేప్ రికార్డర్ జోలికి పోలేదు. మరికొంత కాలానికి అంతా మామూలై పోయింది. కానీ మా వదిన చాలారోజులు టేప్‌రికార్డర్ జోలికి వెళ్ళలేదు.

కాలక్రమంలో ఎన్నో మార్పులు వచ్చాయి. టేప్‌రికార్డర్ల స్థానంలో స్టీరియోలు, ఆ తరువాత స్పీకర్లతో స్టీరియోలు వచ్చాయి. మరికొంత కాలానికి వీసీడి ప్లేయర్లు, డీవిడి ప్లేయర్లు, హోమ్ థియేటర్లు వచ్చాయి. చాలా పెద్దగా వుండే స్పీకర్ల స్థానంలో అతిచిన్న స్పీకర్లు అంతకంటే ఎక్కువ శబ్దాలతో వచ్చేశాయి. కేసెట్ల స్థానంలో డీవీడీలు, సీడీలు వచ్చేశాయి. ఇవేవీ లేకుండా ఐపాడ్‌లు వచ్చాయి. వీటన్నిటితోపాటు నాకూ మధ్య వయసొచ్చేసింది.

చేతికో మొబైల్ ఫోన్ వచ్చింది. ఆ తరువాత కొద్దిరోజులకే నేను కొన్న ఫోన్ చాలా పాతదైపోయింది. పాటలు వచ్చే ఫోన్‌లు వచ్చాయి. నా మొబైల్ మార్చమని మా పిల్లలు ఒకటే గొడవ. ఇందులో వున్న సుఖాలూ సౌకర్యాలే నాకు తెలియదు. మరో కొత్తది ఎందుకని చెబుతూ పాత దానితోనే కొనసాగుతున్నాను. ఎస్ఎమ్ఎస్‌లు ఎట్లా పంపించాలో తెలిసేది కాదు. రింగ్‌టోన్‌లని ఎట్లా డౌన్‌లోడ్ చేసుకోవాలో తెలిసేది కాదు. మా మిత్రుడు శివకుమార్ అన్నట్టు **'ప్రపంచం నీ గుప్పిట్లో. మరి నువ్వెవరి గుప్పిట్లో'**. అర్థంకాని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో ఈ కొత్త మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్‌ని ఎట్లా ఆపరేట్ చెయ్యాలో ఆ సౌకర్యాలను ఎట్లా ఉపయోగించుకోవాలో తెలియక వాటితో రోజూ యుద్ధం చేయడం మొదలైంది. నన్ను నేనే తిట్టుకునే పరిస్థితి మొదలైంది.

తిట్టుకోవడం అంటే మరో విషయం గుర్తుకొస్తుంది. చిన్నప్పుడెప్పుడో తిట్లు తిన్నాను. ఓసారి పరీక్ష ఫెయిలైనప్పుడు తిట్లు తిన్నాను. టేప్ రికార్డర్ పాడైనప్పుడు తిట్లు తిన్నాను. ఆ తరువాత తిట్లు తినే పరిస్థితి రాలేదు. ఆ వయస్సూ దాటేశాను. నన్ను చూసి నవ్వే పరిస్థితి ఎవ్వరికీ ఇవ్వలేదు. కానీ ఈమధ్య ఆ పరిస్థితి తరచూ వస్తోంది ఇప్పుడు. కానీ నన్ను చూసి నవ్వుతున్నది, నన్ను తిడుతున్నది పెద్దవాళ్ళు కాదు. మీరనుకున్నట్టు మరెవరూ కాదు. నన్ను చూసి నవ్వుతున్నది మా కంప్యూటర్, బాంకులోని ఎటిఎమ్ సెంటర్. నా సెల్‌ఫోన్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ వీటన్నింటి మీద నా ఆధిపత్యం వుంది - నేను కొంటేనే కంప్యూటర్ ఇంట్లోకి వచ్చింది. మిగతా అన్ని వస్తువులూ అంతే! నేను బ్యాంకులో డబ్బులు వేస్తేనే నాకు ఎ.టి.ఎమ్. కార్డు ఇచ్చారు. అయినా అవి నన్ను పరిహరిస్తున్నాయి.

నాకు రోజూ రెండు మూడు ఉత్తరాలైనా వస్తాయి. చాలామంది స్నేహితులూ కవిమిత్రులు తమ పుస్తకాలని రోజూ పంపిస్తూ వుంటారు. ఇవే కాదు, పెళ్ళి పత్రికలు, గ్రీటింగ్స్ ఇట్లా ఎన్నో. అందరికీ ఉత్తరాలు చాలావరకు రాసేవాడ్ని. విదేశాల్లో వున్న కవులూ, మన దేశంలో వున్న కవులూ పుస్తకాల్లో 'ఈ-మెయిల్' అడ్రసు ఇచ్చేవాళ్ళు. వాళ్ళకి కూడా ఓపిగ్గా ఉత్తరాలు రాసేవాడ్ని. ఉత్తరాల్లో కన్పించే ఆత్మీయత మెయిల్లో వుండదని నా అభిప్రాయం. ఉత్తరాన్ని చదువుతూ రాసిన మనిషి గురించి అంచనా వేసుకోవచ్చు. ఆ వ్యక్తి ఆత్మీయతని అనుభవించవచ్చు. మళ్ళీ మళ్లీ చదువుకోవచ్చు. నా అభిప్రాయాలతో మా పిల్లలు విభేదించేవాళ్ళు. మెయిల్ పంపిస్తే డబ్బు ఖర్చు కూడా వుండదని ఆర్థిక సూత్రం కూడా చెప్పారు. ఇంట్లో కంప్యూటర్ వుండి ఈ విషయాలు నేర్చుకోలేదని అనేవాళ్ళు.

చివరికి నాతోనే కంప్యూటర్ ఆపరేట్ చేయించడం మొదలుపెట్టించారు. ఈ-మెయిల్ ఐ.డి. తయారుచేయించారు. నేను రాసే కథలకి, వ్యాసాలకి, కవితలకి ఈ-మెయిల్ అడ్రసు జోడించడం మొదలుపెట్టించారు. నా ప్రతి రచన కింద ఈ-మెయిల్ అడ్రసు వచ్చేసింది.

ఉదయాన గడ్డం తీసుకోవడంలాగా రాత్రి పడుకునే ముందు మెయిల్ చూసుకోవడం అలవాటు చేసుకుంటున్నాను. కంప్యూటర్ మీద నా చేతివేళ్ళు బెరుకుబెరుకుగానే కదుల్తున్నాయి. ఎప్పుడు ఏ కమాండ్ నొక్కాలో ఏది ఎంటర్ చెయ్యాలో గుర్తుండేది కాదు. ప్రతి స్టెప్పుని వరుసక్రమంలో నోటుబుక్కులో రాసుకున్నాను. ఆ స్టెప్పుల ఆధారంగా రెండు ఈ-మెయిల్ ఐ.డిలను ఓపెన్ చేసే ప్రయత్నం చేసేవాడిని.

అసలే బెరుకు. ఆ తరువాత రెండు ఈ-మెయిల్ ఐ.డీలు. ఒక పాసువార్డ్ మరో దానికి కొట్టేవాణ్ణి. ఏముంది కంప్యూటర్ నన్ను చూసి నవ్వేది. కరెక్ట్ పాస్‌వార్డ్ కొట్టమని

చెప్పేది. స్పెల్లింగులు సరిచూడమని ఆదేశించేది. ఎంతో కష్టపడి సరిచేసేవాడ్ని. రాజేందర్ జింబో స్వాగతం అన్న పదాలు కన్పించేవరకు ఏదో భయం. వేరే ఎవరిదో నేను ఓపెన్ చేస్తానేమోనన్న ఫీలింగ్. ఈ నడివయస్సులో ఈ కంప్యూటర్ నన్నిట్లా ఏడ్పిస్తే ఎ.టి.ఎమ్. మిషన్ మరోలా ఏడ్పిస్తుంది. ఎప్పుడన్నా పిన్ నెంబర్ తప్పు కొడితే చాలు - సరైంది కొట్టమని నావైపు చూసేది. ఎప్పుడో నన్ను పోలీసులకి పట్టిస్తుందేమోనని భయం వేసేది.

ఈ మధ్యవయస్సులో వచ్చిన వస్తువులతో ఇంతే! అవి మనల్ని భయ పెడతాయి. యూజర్ ఫ్రెండ్లీ అంటారు కానీ అవి మనల్ని భయభ్రాంతులని చేస్తాయి. తిట్టినట్టుగా నవ్వుతాయి. కోపంగా మనవైపు చూస్తాయి. మన పిల్లల ముందే మనల్ని పిల్లల్ని చేస్తాయి. విద్యార్థులను చేస్తాయి.

ఎప్పుడు తప్పుడు బటన్ ప్రెస్ చేసినా అది నన్ను బెదిరించేది. నా చిన్నప్పుడు మా వదిన టేప్‌రికార్డర్ ముందు తలవంచుకుంది. మా వదినలని చూసి అప్పుడు మేం నవ్వుకున్నాం. జాలిపడ్డాం. కాలం ఎన్ని మార్పులని తెస్తుంది. ఇప్పుడు మా వదిన పరిస్థితి నాకొచ్చింది. నేను ఈ కంప్యూటర్ ముందు, ఈ ఎ.టి.ఎమ్ మిషన్ ముందు, సెల్‌ఫోను ముందు, ఈ మ్యూజిక్ పరికరాల ముందు తలదించు కుంటున్నాను. అప్పుడు మేం నవ్వినట్టుగా, జాలిపడ్డట్టుగా ఇప్పుడు మా పిల్లలు.

కానీ ఒకటి మాత్రం నిజం. అది తప్పక జరుగుతుంది. మా వదినలు పడ్డ అవస్థ, ఈ మధ్యవయస్సులో నేను పడుతున్న ఈ అవస్థ మా పిల్లలు తమ మధ్యవయసులో తప్పక ఎదుర్కొంటారు.

అప్పుడొచ్చే వస్తువులు వాళ్ళని ఏడిపిస్తాయి. తిడతాయి. నవ్వుతాయి. భయపెడతాయి. వాళ్ళ పిల్లలు తప్పక వాళ్ళను చూసి నవ్వుకుంటారు. జాలిపడతారు. ఆ దృశ్యం చూస్తానన్న నమ్మకం నాకుంది. అంతవరకు బతుకుతానన్న ఆశ నాకుంది.

★ ★ ★

చెరువు

నది పొంటి మనిషి వుండేవాడు

వాగువెంట అతని మనసుండేది

నీటిధార వెనక ఆ మనిషి రాజేసుకునే నిప్పుండేది

కానీ

ఇప్పుడు ఆ మనిషి నీటి వెనకా లేడు

కన్నీటి వెనకా లేడు

మనిషి రోడ్డు వెనక వున్నాడు

రోడ్డు పొంటి వున్నాడు

దేవాలయాలు కూడా నదుల పక్కన వుండేవి. కానీ ఇప్పుడు మనిషి తనలాగే రోడ్డుపక్కన గుళ్ళని నిర్మిస్తున్నాడు. చాలా దేవాలయాలు నదులపక్కనే వున్నాయి. కానీ మా రాజేశ్వరుడు తన ఆవాసాన్ని చెరువు పక్కన ఏర్పరచుకున్నాడు. ధర్మగుండం, గుడి రెండు మాత్రమే వుండేవని ఆ తరువాత చెరువుని నిర్మించారని చెబుతారు. కాదు చెరువు మొదటి నుంచి వుండేదని మరికొంతమంది చెబుతారు. రెండు కథనాలు వాడుకలో వున్నాయి. చెరువూ గుండం రెండు కలిసే వుంటాయి. దాని పక్కనే ఎత్తయిన స్థలంలో మా రాజేశ్వరుని గుడి.

చెరువూ ధర్మగుండం రెండూ కలిసిపోయినట్టుగా అన్పించినా రెండింటికీ మధ్య తెలియనట్టుగా ఓ విభజన రేఖ వుండేది. భక్తులు ధర్మగుండంలో స్నానం చేసేవారు. ఊరివాళ్ళు చెరువులో ఎక్కువగా స్నానం చేసేవారు. ధర్మగుండంలో స్నానంచేసి రాజేశ్వరున్ని దర్శించుకుంటే సకల రోగాలు సమసిపోతాయని భక్తుల విశ్వాసం. వెనుకటికి ఓ రాజు వేటకోసం వచ్చి, ఈ ప్రాంతంలో విశ్రాంతి తీసుకుని, గుడిని ధర్మగుండాన్ని చూశాడని, ఆ తరువాత గుండంలో స్నానంచేసి రాజేశ్వరుణ్ణి దర్శించుకున్న తరువాత ఆయనకున్న రోగం పోయిందని పెద్దలు చెబుతారు. ఆ రాజే దేవాలయం నిర్మించాడని కూడా అంటారు.

మా ఊరి ప్రజలకు మా చెరువుకీ అవినాభావ సంబంధం. అంతకుమించిన అనుబంధం. సెలవు రోజుల్లో మా చెరువు నిండా జనమే. కొంతమంది మామూలు రోజుల్లో

కూడా రోజూ చెరువు దగ్గరకు వచ్చేవాళ్ళు. ఇక్కడికి వస్తే వాళ్ళకి రెండు పనులు అయిపొయ్యేవి. స్నానం అయ్యేది. ఆ తరువాత రాజేశ్వరుని దర్శనం అయ్యేది. మూలవాగు నుంచి చుట్టుపక్కల వున్న వొర్రెల నుంచి వచ్చిన నీళ్ళతో, వర్షం నీళ్ళతో మా చెరువు నిండిపొయ్యేది. నిండిన చెరువులో పిల్లలూ పెద్దలూ అంతా ఓ సంతలా వుండేది. నిండిన చెరువులో ఆనపకాయలను పిల్లల నడుముకి కట్టి తండ్రులు తమ పిల్లలకి ఈతలు నేర్పేవాళ్ళు. ఈతకొట్టే ప్రదేశానికి దూరంగా కొంతమంది గాలాలకి ఎరలను కట్టి చేపలు పట్టేవాళ్ళు. చెరువు పూర్తిగా నిండిందంటే ఆ సంవత్సరం మా వూరి బావులకి నీటికొదువ వుండేది కాదు. రైతులకి ఆనందంగా వుండేది. వాళ్ళ పంటలకి నీటి బాధ వుండేది కాదు.

మావూరి చెరువు మధ్యన చిన్న ద్వీపం వుండేది. అందులో చిన్న గుడి వుండేది. దాన్ని మాలగడ్డ అనేవాళ్ళం. దానికి ఆ పేరు ఎందుకు వచ్చిందో తెలియదు కానీ నిండిన చెరువులో తేలుతున్న బతుకమ్మలా అన్పించేది. ఈత బాగా వచ్చిన పెద్దలు, యువకులు మాలగడ్డ దాకా ఈతకొట్టి తిరిగి వచ్చేవాళ్ళు. ఒక్కోసారి పోటీలు పెట్టుకునేవాళ్ళు. ఆ పోటీలని చూడడం గొప్ప సరదాగా వుండేది. అప్పుడప్పుడే ఈత నేర్చుకుంటున్న పిల్లలు ఆ పోటీలని కళ్ళార్పకుండా చూసేవాళ్ళు. చెరువు నిండుగా నిండు గర్భిణీలా వున్నప్పుడు మా అమ్మ మమ్మల్ని చెరువు వైపు పోనిచ్చేది కాదు. నిండిన చెరువు ఎవరినన్నా బలి తీసుకుంటుందని మా అమ్మ భయం. ఈ భయం మా వూర్లో చాలా మందికి వుండేది. కాని అలాంటి సంఘటనలు జరిగిన దాఖలాలు లేవు.

ఈత నేర్చుకోవడానికి జనాలు ఉదయాన్నే కాదు, సాయంత్రాలు కూడా వచ్చేవాళ్ళు. చెరువుగట్టు మీద కూర్చోని కబుర్లు చెప్పుకోవడానికి చాలామంది యువకులు వచ్చేవాళ్ళు. స్నేహితులని కలవడం, కబుర్లు చెప్పుకోవడం, గుడికి వచ్చే అమ్మాయిలను చూడ్డం వాళ్ళు చేసే పని అక్కడ. కాలక్రమంలో మా వూరిలో రెండు సినిమా థియేటర్లు వచ్చాయి. రెండు మూడు ఉడిపి హోటళ్లు వెలిశాయి. ఆ తరువాత చెరువు గట్టుమీదనే కాదు, హోటళ్ల దగ్గర, సినిమా హాళ్ళ దగ్గర యువకులు కన్పించడం మొదలైంది.

ఫిబ్రవరి నుంచి మే వరకు ఎక్కువ జనం మా రాజేశ్వరుని దర్శనానికి వచ్చేవాళ్ళు. శివరాత్రి జాతర రోజుల్లో విపరీతమైన జనం వచ్చేవాళ్ళు. ఊరివాళ్ళకే దర్శనం కష్టం అయ్యేది. రెండు మూడు జిల్లాలకే ఎక్కువ ప్రసిద్ధమైన మా వూరు చాలా దూరప్రాంతానికి తెలిసిపోయింది. దానివల్ల భక్తుల సంఖ్య మరీ ఎక్కువగా పెరిగిపోయింది. గుడిని విశాలం చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే చాలా మార్పులు చేశారు. దానివల్ల గుడి అంతర్భాగంలో కొంత స్థలం పెరిగింది.

మా చెరువు నీళ్ళు ధర్మగుండంలో కలుస్తున్నాయని, ధర్మగుండం గట్టు భక్తులకి సరిపోవడంలేదని ధర్మగుండం చుట్టూ నిర్మాణం చేశారు. ఇప్పుడు ధర్మగుండంలోకి దిగడానికి

నాలుగువైపులా మెట్లు వున్నాయి. ఇదివరలో ఒకేవైపు వుండేవి. అందమైన నిర్మాణం. ధర్మగుండం పవిత్రత కాపాడడంకోసం నిర్మాణం చేశారు. ఎండాకాలం నీళ్ళు ఎండిపోయినప్పుడు చెరువుకి ధర్మగుండానికి గల భేదం స్పష్టంగా ఇంతకుముందు తెలిసేది. ఇప్పుడు రెండు వేరుగా మారిపోయినాయి. ఈ నిర్మాణం తరువాత ధర్మగుండంలోని నీళ్ళు నిలువ నీరులా అయిపోయినాయి. చెరువుతో కల్సి వున్నప్పుడు ధర్మగుండం నీళ్ళు పరిశుభ్రంగా వుండేవి. కాని ధర్మగుండం చుట్టూ కట్టిన నిర్మాణం వల్ల పరిశుభ్రత తగ్గిపోయింది. అయినా ధర్మగుండంలో స్నానంచేసే భక్తుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతూనే వుంది. అందుకని ధర్మగుండం నీళ్ళు తోడి చెరువులో పొయ్యడానికి ఓ రెండు మోటారు పంపులని ఏర్పాటుచేశారు. మా మూలవాగులో రెండు బావులని నిర్మించారు. అక్కడినుంచి పైపుల ద్వారా ధర్మగుండంలోకి నీళ్ళు వచ్చే ఏర్పాటు చేశారు. ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ చెరువుతో ధర్మగుండం కలిసివున్నప్పుడు వున్న స్వచ్ఛత ఇప్పుడు ధర్మగుండం నీటిలో లేదు. మా ఊరి ప్రజలు ధర్మగుండంలో మునగడం తగ్గించారు కానీ బయటినుంచి వచ్చిన భక్తులు మునగడం రోజురోజుకీ పెరుగుతూనే వుంది.

ప్రచార సాధనాలు పెరిగిన తరువాత, ప్రసార సాధనాలు పెరిగిన తరువాత మా రాజేశ్వరుని పేరు దేశమంతటా పరివ్యాపితమైంది. దూరప్రాంతాలనుంచి కూడా ప్రజలు రాజేశ్వరుణ్ణి దర్శించుకోవడానికి వస్తూనే వున్నారు. పూర్వం శివరాత్రి ముందూ ఆ తరువాతే భక్తుల సంఖ్య ఎక్కువగా వుండేది. కానీ ఇప్పుడు ప్రతి సోమవారం, శుక్రవారం జాతరలాగా అయిపోయింది. రోడ్డుమీద లెక్కలేనన్ని వాహనాలు. నడవడం కష్టమైపోయింది. రాజేశ్వరుని దర్శనానికి మామూలుగా వెళ్ళే పరిస్థితి లేకుండా పోయింది. పెద్ద క్యూ, దర్శనానికి క్యూ, దేవునికి కోడెలు కట్టెయ్యడానికి అంతకంటే పెద్ద క్యూ. ఈ క్యూలకోసం దేవస్థానం లోపల ఇనుప రాడ్లతో ఓ క్రమాన్ని ఏర్పాటు చేశారు. అది సరిపోక క్యూ మా చెరువు గట్టుని ఆనుకుని మాలగడ్డ వైపు గట్టు వరకు వెళ్ళేది. అదీ సరిపోవడం లేదని చెరువుని ఆక్రమించి క్యూ కాంప్లెక్స్ కట్టాలని ధర్మకర్తల మండలికి ఎవరో సూచించారు. ఆ దిశగా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. చెరువు గట్టున వున్న దేవాలయం ఆఫీసులని అక్కడినుంచి వేరే దగ్గర కట్టి క్యూ కాంప్లెక్స్ కట్టవచ్చు. కానీ చెరువుని ఆక్రమించడమే సులువని ధర్మకర్తల మండలికి



అన్పించింది. చెరువు మీద దేవస్థానం వారికి అధికారం లెదని, చెరువుమిద క్యూ కాంప్లెక్స్ కడితే చెరువులో నీటి నిలువ తగ్గిపోతుందని కొంతమంది అభ్యంతరాలు లేవనెత్తారు.

అందరి అభ్యంతరాలు బుట్టదాఖలయ్యాయి. చెరువులో పిల్లర్లు వేసి క్యూ కాంప్లెక్స్ కడతారు కాబట్టి నీటి నిలువకి ఎలాంటి ఆటంకం వుండదని కొంతమంది సూచనలు చేశారు. చివరికి చెరువు మీద క్యూ కాంప్లెక్స్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్ అనుమతిని ఇచ్చారు. ఓ ఎండాకాలం పిల్లర్ల నిర్మాణం మొదలైంది. ఓ వంద ఫీట్ల మేరకు చెరువు గట్టునుంచి పిల్లర్లు వేశారు. దానిమీద శ్లాబ్ వేసి ఇంకా పైదాకా పిల్లర్లు వేసి దానిపైనా స్లాబు వేసి క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు.

నీటి నిలువకి ఆటంకం వుండదన్నారు గానీ ఆ తరువాత నుంచి మా చెరువులో నీటి నిలువ తగ్గిపోయింది. నీళ్ళు అడుగంటినాయి. చెరువులో పూడిక తీయడం తగ్గిపోయింది. మాలగడ్డలో వున్న ద్వీపంలో తోట పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. మెల్లిగా దాన్ని ద్వీపకల్పం చేశారు. క్రమంగా చెరువు గ్రామస్తుల ఆధీనం నుంచి వెళ్ళిపోయింది. చెరువు లోతు తగ్గిపోయింది. దాని పరిధి కూడా తగ్గిపోవడం మొదలైంది. ఈ కారణాల వల్ల మా వూరి గ్రౌండ్ వాటర్ లెవల్ పడిపోయింది. బావులన్నీ బోర్లాపడ్డాయి. బోరింగులు వేసుకున్నారు. అయినా అనుకున్న నీటిధార లేదు. చివరికి నీళ్ళని పక్క గ్రామాల్లోంచి తెచ్చుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

గ్రామ పంచాయతీ నల్లాలు భూమి లోతుల్లోకి వెళ్ళిపోయాయి. గుక్కెడు నీళ్ళకోసం గొంతు పట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ట్రాక్టర్లు భూములని దున్నడం లేదు. అవి నీళ్ళనీ ఇసుకనీ మోస్తున్నాయి. ట్రాక్టర్ల వెంట మోటారు పంపు కూడా వచ్చేసింది. మోటారు పంపుతో ఏకంగా ఇండ్లపైన ట్యాంకుల్లోకి నీళ్ళు ఎక్కించడం అలవాటుగా మారిపోయింది.

ఇప్పుడు మా చిన్నప్పుడు కన్పించే చెరువులేదు. ఈతలు కొట్టే దృశ్యాలు లేవు. ఈతలు నేర్పే దృశ్యాలు అంతకంటే లేవు. వానాకాలం రోజుల్లో కూడా పిల్లలకి ఈతలు నేర్పే తండ్రులు అక్కడ కన్పించడం లేదు. ఇప్పుడు చెరువుని క్యూ కాంప్లెక్స్ ఆక్రమించింది. మాలగడ్డని పూలతోట ఆక్రమించింది. మిగతా ప్రదేశమంతా బురద. దానిపైన నీరు. సాయంత్రాలు గాలికోసం మా చెరువు గట్టుకి వచ్చే కుర్రవాళ్ళు లేరు.

ఇప్పుడు మా చెరువు నిండటం లేదు. అది ఒక బ్రహ్మాయజ్ఞం. ఒకవేళ నిండినా అప్పటి లోతు లేదు. పరిధి అంతకంటే లేదు. ఇప్పుడక్కడ ఈతలు లేవు. ఈదురుగాలులు లేవు. అంతా కాంక్రీటుమయం.

మా చిన్నప్పుడు ఈత నేర్చుకునే పిల్లలు నీళ్ళు మ్రింగి తల్లడిల్లే వాళ్ళు. ఇప్పుడు నీళ్ళు లేక మా చెరువు తల్లడిల్లుతుంది. మా చెరువు ఊపిరిని ఎవరో నొక్కేశారు. మా

చెరువుని చూస్తే ఊపిరాడక తల్లడిల్లుతున్న దృశ్యమే నాకు కన్పిస్తుంది. నాకే కాదు ఎవరికైనా అట్లాగే కన్పిస్తుంది.

ఇప్పుడు మా వూరి చెరువు ఊపిరి ఆడకుండా చేపపిల్లలా కొట్టుకుంటోంది. పంటపొలాలన్నీ ప్లాట్లుగా మారిపోయాయి. బావులు ఎండిపోయినవి. బోర్లు కూడా నీళ్ళు లేక అల్లల్లాడుతున్నాయి. ఇదీ మారిన మా వూరు పరిస్థితి.

మా వూరి చివర్లో ఓ స్మిమ్మింగ్‌పూల్ కట్టారు. అక్కడ డబ్బులు కట్టి ఈత నేర్చుకోవాలి. ఈత నేర్పడానికి తండ్రుల అవసరం లేదు. ఆనపకాయల అవసరమూ లేదు. గాలితో నిండిన ట్రైర్లు, ఈత నేర్పే మనుషులు.

ఊటలాగా పైకి వచ్చే నీరు అదృశ్యమైంది. భూమి అట్టడుగు నుంచి పాతాళగంగను తెచ్చి స్మిమ్మింగ్ పూల్‌ని నీటితో నింపే పరిస్థితి.

కాలక్రమంలో మార్పులు సహజమే. కానీ సహజమైన వాటిని తొలగించి అసహజమైన వాటిని సృష్టించుకోవడం ఇప్పుడున్న పరిస్థితి. బహుశా ఇదే నేటి సృష్టిక్రమమేమో!

★ ★ ★

గడ్డాలూ - మీసాలూ

కథలు గుర్తుకొచ్చినప్పుడల్లా మా తాత గుర్తుకొస్తాడు. ఆయన వంగిపోయిన నడుము గుర్తుకొస్తుంది. ఆయన ధోతీ గుర్తుకొస్తుంది. ఆయన నులక మంచం గుర్తుకొస్తుంది. ఆయన గడ్డం మీసాలూ గుర్తుకొస్తాయి. చివరికి ఆయన మరణం గుర్తుకొస్తుంది.

మా తాతకి ముగ్గురూ కూతుర్లే. మగసంతానం లేదు. మా బాపు డాక్టర్ కావడంవల్ల మా ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు తక్కువ. అందుకని మా అమ్మ మా తాతని తన దగ్గరే వుండమని చెప్పేది. వైద్యం కూడా వుంటుందని చెప్పేది. ఈ రెండు కారణాల వల్ల మా తాత మా దగ్గరే ఎక్కువగా వుండేవాడు. కానీ నెలకు రెండురోజులు మిగతా బిడ్డల దగ్గరికి పొయ్యేవాడు. మిగతా ఇద్దరు బిడ్డలు వ్యవసాయదారులు.

మా అరుగు పక్కన ఓ చిన్న రూం వుంది. అందులో మా తాత వుండేవాడు. ఆ రూంకి తాతర్రని పేరు. మా తాత చనిపోయి నలభై సంవత్సరాలు అవుతున్నా ఆ అర్రకి ఇప్పటికీ అదే పేరు. అందులో ఆయనకో నులక మంచం. దానిమీద ఓ గొంగడి. ఓ చద్దరూ వుండేవి. ఆయన మంచం పక్కన ఓ చిన్న చెక్క అలమార వుండేది.

మా తాత పుట్టినప్పటినుంచి వ్యవసాయ పనులు చేశాడు. పని ఆయనతోనే పుట్టింది. అందుకని ఈ ముసలితనంలో కూడా పని గురించి ఆరాటపడేవాడు. సాయంత్రం కాగానే కోళ్ళను గంపకింద కమ్మినారా లేదా చూసేవాడు. బర్రెలకు మేత వేశారా లేదా అన్న విషయం పట్టించుకునేవాడు. ఉదయాన్నే లేచి మా మల్లయ్యతో పాటు మా దొడ్లోకి పోయి దగ్గరుండి పాలు పిండించేవాడు. బాదం చెట్టు కిందికి పోయి పక్షులు కొట్టిన బాదంకాయల్ని, జామకాయల్ని, రాలి కిందపడ్డ కాయల్ని తెచ్చి మాకోసం తన అర్రలో పెట్టేవాడు. మేం బడికి పొయ్యేటప్పుడు మాకు రెండు బాదం కాయల్నో, జామకాయల్నో ఇచ్చేవాడు.

మా తాత చదువుకోలేదు. అందుకని మమ్మల్ని ఎక్కువగా చదవమని చెప్పేవాడు. చదువుకుని వస్తేనే కథ చెబుతానని చెప్పేవాడు. కథలకి అతను ఊసిల్లపుట్ట. చెప్పిన కథ చెప్పకుండా రోజుకో కొత్తకథ చెప్పేవాడు. ఓరోజు పీఠలమ్మ వారి కథ చెప్పేవాడు. మరోరోజు పేదరాసి పెద్దమ్మ కథ చెప్పేవాడు. రాములవారి కథ చెప్పేవాడు. మా రాజన్న జాతరా కథ చెప్పేవాడు. తన చిన్నతనం ముచ్చట్లు కథలు కథలుగా చెప్పేవాడు. చదువురాని మా తాతకి ఇన్ని కథలు ఎట్లా వచ్చేవో నాకర్థం కాకపొయ్యేది.

కథలే కాదు. నిమ్మకాయ డిప్పలతోని తరాజు చేసిచ్చేవాడు. చొప్ప బెండుతోని కచ్చురం చేసేవాడు. మక్క కంకిపీచుతో మీసాలు చేసిచ్చేవాడు. మా తాత మాకొక వింత ప్రపంచంలా అన్పించేవాడు. ప్రతిరోజూ ఓ వింతని చేసేవాడు. ఒకరోజు బాణం చేసిచ్చేవాడు. ఒకరోజు గులేరు చేసిచ్చేవాడు. మరోరోజు మట్టితో కుండలు చేసిచ్చేవాడు. ఇట్లా ఎన్నో చేసేవాడు.

ఆయన చెప్పే కథల్లో మంత్రాలుండేవి. మాయల మరాటీలు వుండేవాళ్ళు. ఇవన్నిటితోబాటూ చుట్టకంపూ వుండేది. కథలు చెప్పి చెప్పీ నన్ను గట్టిగా ముద్దు పెట్టుకునేవాడు. అప్పుడు మాత్రం ఆయన మీద నాకు విపరీతమైన కోపం వచ్చేది. ఎందుకంటే ఆయన మీసాలు గుచ్చుకునేవి. గడ్డం గుచ్చుకొని మంటవేసేది. చుట్టకంపుతో కక్కొచ్చినంత పనయ్యేది. కాళ్ళూ చేతులూ కొట్టుకునేవాడిని. విసుక్కునేవాడిని. చేతుల్తో కొట్టేవాడిని. తప్పించుకొని పారిపొయ్యేవాడిని.

మా బాపులాగా రోజూ గడ్డం తియ్యకపొయ్యేవాడు. వారం రోజులకొకసారి గడ్డం తీసేవాడు. అది కూడా ఆయన కాదు. మంగలి తీసేవాడు. ఎన్నో పనులు చేసే మా తాత తన గడ్డం తాను ఎందుకు తీసుకునేవాడు కాదో నాకర్థం కాకపొయ్యేది. అప్పటికింకా మా వూర్లో సెలూన్లు రాలేదు. ఇంటికి వచ్చి తీసేవాళ్ళు. మా తాత నన్ను గట్టిగా ముద్దు పెట్టుకున్నప్పుడల్లా నేను ఆయన అర్రలోకి పోవడానికి ఇష్టపడేవాడిని కాదు. పోకపొయ్యేవాడిని. కానీ ఒకటి రెండు రోజుల తరువాత మళ్ళీ మామూలే. ఒక్కరోజు నేను మా తాత దగ్గరికి పోకపోతే మా అక్క నాకొక కొత్తకథ చెప్పేది. మా అక్క నాకు



కొత్తకథ చెప్పడం నాకు ఇష్టం వుండేది కాదు. అందుకని మా తాత చుట్టకంపునీ, గడ్డంమీసాలని భరించేవాడిని. ఎందుకంటే నాకు కథ కావాలి. ఓ కల కావాలి. నేను మాయల మరాటిని ఓడించే యువరాజునైపోవాలి. వద్దన్న దిక్కుకే వెళ్ళే వీరుణ్ణయిపోవాలి. అందుకని మా తాత గడ్డం మీసాలని భరించేవాడిని.

మాతాత గడ్డం తీయించుకుంటున్నప్పుడు మా తాత ముందు అద్దం పట్టుకుని నిల్చుండేవాడిని. ఆయన ముఖం ఆయనకే కన్పించకుండా అటూ ఇటూ తిప్పేవాడిని. అద్దంలో నా ముఖం చూసుకునేవాడిని. మా తాతకి విసుగు తెప్పించేవాడిని. మా తాత మీసాలు గొరిగెయ్యమని ఎన్నిసార్లు చెప్పినా మా మంగలి తీసేసేవాడు కాదు. మా తాతకి కోపం వచ్చేది. 'నా మీసాల సంగతి నీకెందుకు' అనేవాడు. అంతేకానీ తిట్టేవాడు కాదు. కూతురు పిల్లలం కాబట్టి మమ్మల్ని రారా పోరా అనేవాడు కాదు.

మేమెవ్వరమూ లేనప్పుడు ఆయనకి మీసాలతోనే కాలక్షేపం అయ్యేది. మీసాలమీద నిమ్మకాయలు పెట్టాలనేవాడు. మీసాలతోనే అందం అనేవాడు. నన్ను ఇబ్బంది పెట్టేవాడు. మీసాలని కత్తెరతో కట్ చేద్దామని చాలాసార్లు అనుకున్నాను. కానీ చెయ్యలేకపోయాను. ఆయన అర్రలోకి అడుగుపెట్టగానే ఆయనకు మెలకువ వచ్చేది.

'ఆ తెల్ల మీసాలెందుకు' అని మా తాతని అడిగేవాడిని. అవి తీసెయ్యమని, మా బాపులాగా రోజూ గడ్డం తీసుకొమ్మని చెప్పేవాడిని. అప్పుడు మా తాత గడ్డాలు మీసాల మీద ఓ కథ చెప్పేవాడు.

'మీ బాపులాగా నేను దవాఖానాకి పొయ్యేపనుందా? లేదు. మరి ఎందుకు తియ్యడం. రక్తం కారేటట్టు రోజూ తీసుకోవడం నాకు చేతగాదు' అనేవాడు. మీసాలు ఒకసారి తీసేశాడట. ఆరోజు అమ్మమ్మతో పెద్ద గొడవ జరిగిందట. రెండు రోజులు మాట్లాడలేదట. అప్పటినుంచి మీసాలు చూస్తూ అమ్మమ్మని యాది చేసుకుంటున్నానని చెప్పేవాడు.

ఈ రెండు విషయాలు చెప్పిన తరువాత అయనని విసిగించడం మానేశాను. ఆ మీసాలు ఎంత ఇబ్బంది పెట్టినా ఆయన చెప్పే కథలకోసం భరించేవాడిని.

కొంతకాలానికి మా తాతని కాలం కాటేసింది. అతని మీసాలు గడ్డం కాలగర్భంలో కలిసిపోయాయి. ఆ తరువాత కొత్త కథలు చెప్పేవాళ్ళు లేరు. మా అమ్మకి తీరిక వున్నప్పుడు ఓపిక వున్నప్పుడు ఏదో ఒక కథ చెప్పేది. ఆకాశంలో చందమామని చూపించి ఎన్నో కథలు చెప్పే మా తాత చంద్రునిలో కలిసిపొయ్యాడు. ఇక మాకు చందమామ, బాలమిత్రలే నేస్తాలయినాయి. తెలుగు చందమామల నుంచి ఇంగ్లీషు చందమామల్లోకి వచ్చేశాను. గడ్డాలు మీసాల సంగతే మర్చిపొయ్యాను.

కాలగర్భంలో కలిసిపోయిన మా తాత గడ్డం మీసాలు మళ్ళీ కన్పించడం మొదలైంది. అద్దంలో నా ముఖం నాకే వింతగా కన్పించడం మొదలైంది. కొత్తలో బెరుకు బెరుకుగా

వుండేది. అందరి ముందుకు పోవాలంటే సిగ్గుగా వుండేది. 'అబ్బో! విడికి మీసాలు గడ్డాలూ వస్తున్నాయని' ఎవరో ఒకరు అనేవాళ్ళు. ఆ మాటలతో నాలోకి నేనే కుంచించుకు పొయ్యేవాడిని. చాలారోజులకి కన్పించిన పెద్దవాళ్ళ ముందుకు పోవడానికి సంకోచించేవాడ్ని. ఎవరూ లేనప్పుడు అద్దంలో తరచూ నా ముఖం నేనే చూసుకునేవాడిని. నా ముఖం విస్తృతమయ్యేది. కొత్తలో గొప్ప సరదాగా వుండేది. తెల్లటి ముఖం మీద నల్లటి మీసాలూ గొప్ప అందంగా కన్పించేది. మీసాలని గడ్డాన్ని నిమురుకుంటూ మురిసిపొయ్యేవాణ్ణి.

కొద్దిరోజులకి ముఖం నిండా వెంట్రుకలు వచ్చేశాయి. మా వూరి నిండా సెలూన్లు వచ్చాయి. అక్కడికెళ్ళి గడ్డం తీయించుకోవడం ఇష్టంలేదు. గడ్డం తీసెయ్యాలని మాత్రం అన్పించేది. ఒకరోజు నేనూ నా ముగ్గురు మిత్రులం కలిసి మూడు బ్లేడ్లు కొనుక్కుని మా బాపు క్షవరం పెట్టెను తీసుకొని మా బంగ్లా మీదికి పోయినాం. అప్పుడప్పుడే హిందీ సినిమాలను చూస్తున్న దశ. హిందీ సినిమాల్లో ఏ హీరోకి మీసాలుండవు. గడ్డం వుండదు. తెలుగు సినిమాల్లో కూడా దేవతలకీ గడ్డాలుండవు. మీసాలుండవు. ఆ ప్రభావం మా నలుగురి మీద వుంది. గడ్డంతో బాటు మీసాలు తీసివెయ్యాలన్న నిర్ణయానికి వచ్చాం. ముందుగా బాపురెడ్డి గడ్డం మీసాలు తీసేశాడు. ఆ తరువాత నా వంతు వచ్చింది. నేనూ తీసేశాను. ఏదో కలవరం. గగుర్పాటు. అందరి ముఖాల్లో ఏదో తెలియని బెరుకు. సిగ్గు. ఒకరినొకరం చూసుకుని నవ్వుకున్నాం.

ఆరోజు ఆటలకోసం బయటకు వెళ్ళలేదు. మీసాలు తీసేస్తున్నప్పుడు మా తాత గుర్తుకొచ్చాడు. మీసాల గురించి ఆయన మాటలూ గుర్తుకొచ్చాయి. చీకటి పడిన తరువాత కిందికి వెళ్ళకతప్పలేదు. మా అన్నయ్య, బావలు కూడా ఆరోజు ఇంట్లో వున్నారు. మమ్మల్ని చూడగానే వాళ్ల ముఖాల్లో ఆనందం తొణికిసలాడింది. వాకిట్లో నుంచి మెల్లగా జారుకుంటున్న మా మిత్రులనీ నన్నూ కచేరీలోకి పిలిచారు. రాజేష్‌ఖన్నాలా మేం వున్నామని మమ్మల్ని బనాయించారు. వెక్కిరించారు. మేం ఏమీ మాట్లాడలేదు. కాసేపటికి అక్కడినుంచి మెల్లగా జారుకున్నాం. ఆరోజు నుంచి మీసాలు ఎప్పుడూ తియ్యలేదు. మా మిత్రులూ అంతే!

నాకు పరమ విసుగు కలిగించిన మా తాత గడ్డాలు మీసాలు నాలో ప్రవేశించి నన్నో యువకుణ్ణి చేశాయి. కొత్తలో ఈ గడ్డం తీయడం ఏదో ఘనకార్యం చేసినట్టుగా అన్పించేది. ఆ తరువాత కష్టాలు మొదలైనాయి. మొదట్లో రెండు రోజులకొకసారి గడ్డం పెరిగినట్టుగా అన్పించేది. కానీ ఆ తరువాత తెల్లవారేసరికే గడ్డం పెరిగినట్టుగా వుండేది. తరువాత్తర్వాత సాయంత్రానికే పెరిగినట్టుగా అన్పించడం మొదలైంది. ఒక్కరోజు గడ్డం తియ్యకపోతే ఏదో పోగొట్టుకున్నట్టు, ముఖమంతా విచారం గూడుకట్టుకుని వున్నట్టు అన్పించేది. ఒక్కరోజు గడ్డం తీసుకోకపోతే ఎంతోమందికి జవాబు చెప్పాల్సి వచ్చేది. రోజూ చేసే దైనందిన కార్యక్రమాలు ఏవీ విసుగ్గా అన్పించేవి కాదు కానీ గడ్డం తీసుకోవడం మాత్రం చాలా విసుగ్గా అన్పించేది. మా తాత వారం రోజులకొకసారి గడ్డం ఎందుకు తీసుకునేవాడో, అదీ మంగలితో ఎందుకు తీయించుకునేవాడో నాకర్థమయ్యింది.

డిగ్రీకొచ్చిన తరువాత గడ్డం తీయడం మానేశాను. వారం కొకసారి సెలూన్‌కి వెళ్ళి ట్రిమ్ చేయించేవాడిని. ఈ పద్ధతే హాయిగా అన్పించింది. గడ్డం పెంచి ట్రిమ్ చేయించుకోవడంవల్ల చాలా లాభాలుండేవి. మిగతావాళ్ళకన్నా డిఫరెంట్‌గా కన్పించవచ్చు. ఓ కళాకారునిగా కన్పించవచ్చు. యూనివర్సిటీకి వచ్చిన తరువాత మేధావిలా ఫోజు పెట్టడానికి గడ్డం చాలా ఉపయోగపడింది.

న్యాయవాదిగా ప్రాక్టీసులోకి వచ్చిన తరువాత గడ్డం తీసెయ్యమని చాలామంది సీనియర్లు ఉచిత సలహాలు ఇచ్చారు. ఉత్తర తెలంగాణాలో వుంటున్నావు కదా నక్సలైట్ న్యాయవాదివని అనుకుంటారని కూడా చెప్పారు. జడ్జీలు తమ విచక్షణాధికారాలని నాకు వ్యతిరేకంగా ఉపయోగిస్తారని కూడా బెదిరించారు. అయినా నేను గడ్డాన్ని తియ్యలేదు. అదే పద్ధతిని కొనసాగించాను. రోజూ ఓ అరగంట సమయం కలసి వస్తుందని వాదనలు చేశాను. కొంతకాలం తరువాత సలహాలు ఇవ్వడం మానేశారు.

వారం పది రోజులకొకసారి సెలూన్‌కి వెళ్ళి ట్రిమ్ చేయించుకోవడం హాయిగా వుండేది. కొంతకాలం తరువాత ట్రిమ్ చేసుకునే మిషన్ కొన్నాను. సెలూన్‌కి వెళ్లే బాధ కూడా తప్పింది.

మరికొంతకాలానికి నాకు పెళ్ళయింది. నా గడ్డం మా ఆవిడకి అడ్డం వచ్చింది. నా వాదనలేవీ ఆవిడ ముందు నిలువలేదు. న్యాయవాదులని ఒప్పించ గలిగాను. న్యాయమూర్తులను ధిక్కరించాను. కానీ, మా ఆవిడ కోర్టులో నా కేసు ఓడిపోయింది. నా వాదనల్లో బలం లేదని తేల్చింది. నా కష్టాలు మళ్ళీ మొదలైనాయి. ఒక్కరోజు గడ్డం తియ్యకపోయినా ఆవిడతో గొడవే. అందుకని రోజూ గడ్డం తీయడం మొదలుపెట్టాను. పెళ్ళి తరువాత వచ్చిన మార్పుని చూసి చాలామంది నవ్వుకున్నారు. స్నేహితులు కొంతమంది లెక్కలేనన్ని జోకులు వేశారు. అన్నీ భరించాను.

ఓ మాంచి షేవింగు బ్రష్షూ, మంచి క్రీం, మంచి బ్లేడ్లు కొనుక్కుని గడ్డం రోజూ తీయడం మొదలుపెట్టాను. గడ్డం తీసిన తరువాత పెట్టుకోవడానికి ఆఫ్టర్ షేవ్ లోషన్. ఎన్నో సువాసనలు. రేజరు బ్లేడునుంచి, యూజ్ అండ్ త్రోకి మారాను. రెండు బ్లేడ్లనుంచి మూడు రేజర్లు వున్న మాచ్-3కి మారాను. ఎన్ని బ్లేడ్లు మార్చినా గాట్లు తప్పకపొయ్యేవి.

గాట్లు పడకుండా గడ్డం తీసుకోవడంకోసం చెయ్యని ప్రయోగాలు లేవు. రాత్రిపూట ముఖం కడిగి వాసిలేనో, బోరోలినో పూసి పడుకునేవాడ్ని. తరువాత ఉదయం ముఖం కడిగి ఆ తరువాత క్రీము పూసి షేవ్ చేసేవాడ్ని. ఎన్ని చేసినా గాట్లు తప్పకపొయ్యేవి. సబ్బు పెట్టి ముఖం కడుగకుండా గడ్డం తీసిన రోజూ, హడావిడిగా వున్న రోజు ఎక్కువ గాట్లు పడేవి. పాపం మా ఆవిడ నామీద జాలిపడి షేవింగ్‌కి సంబంధించి కొత్త వస్తువులు

ఏవైనా మార్కెట్‌లోకి వస్తే చాలు అవి నాకోసం తెచ్చేది. ఎన్నిక్రీములో, ఎన్నిలోషన్లో, ఎన్ని కత్తెర్లో, ఎన్ని వెరైటీ బ్లేడ్లో. ఎంత ప్రపంచం గడ్డం వెనుక.

ఎన్ని పనులున్నా, ఎంత హడావిడి వున్నా ఈ గడ్డం తీసుకోవడం మాత్రం తప్పేది కాదు. మీసాలు తియ్యడానికి వీల్లేదు. అది ఆవిడ కోరిక. బహుశా ఆజ్ఞేనేమో. రోజూ గడ్డం తియ్యడం ముఖాన్ని గాట్లు పెట్టి అయినా నాగరీకం చేసుకోవడం రోజూ ఉదయం అత్యంత ప్రముఖమైన ఘట్టం.

సాధ్యమైనన్ని తక్కువ గాట్లతో గడ్డం తీసుకోవాలనుకున్న ప్రయత్నంలో ప్రతిరోజూ గడ్డం తీసేవాణ్ణి. ఎంత జాగ్రత్తగా వున్నా మరిన్ని జాగ్రత్తలు తీసుకున్నా గాట్లు తప్పకపొయ్యేవి. రక్తం చూసి జాలిపడేది. ఆఫ్టర్ షేవ్ లోషన్ పెట్టేది. కానీ గడ్డం తీసుకోకుండా వుండటానికి మినహాయింపు ఇచ్చేది కాదు మా ఆవిడ. గాట్లతో నడుస్తున్న రోజులని కాలం అలాగే నడువనివ్వదు కదా! అంతలోనే మధ్య వయస్సుని తెచ్చింది. తెలియకుండానే మీసాల్లో ఒకటి రెండు తెల్లమీసాలు కన్పించడం మొదలైంది.

కొత్త సమస్యలు ముందుకొచ్చాయి. ప్రతి రెండు మూడు రోజులకొకసారి తెల్లమీసాల ఏరివేత కార్యక్రమం. కత్తెరకు పని కల్పించడం, తెల్లగడ్డమూ కన్పించడం మొదలైంది. దానితో బాధలేదు. ఎందుకంటే దాన్ని ఉదయాన్నే తీసేస్తాను. ఈ మీసాలతోనే చచ్చేంత బాధ. ఒకటి రెండు తెల్లమీసాల సంఖ్య నుంచి తెలియనంతగా పెరిగిపోయాయి. కత్తెరకు పని కల్పిస్తే మీసాలు క్రమపద్ధతిలో కన్పించేవి కావు.

చాలామంది మీసాలకి రంగులు వేస్తున్నారు. అలర్జీలతో బాధపడుతున్నారు. ఒక్కొక్కరిది ఒక్కోరకమైన అనుభవం. అందుకని మీసాలు తీసేస్తానన్న ప్రతిపాదన చేశాను. సమర్థిస్తూ వాదన చేశాను. మళ్ళీ కేసు వీగిపోయింది. ముఖం చూడలేమన్న పరిశీలనతో. అదీ ఆవిడ తీర్పు.

ఏం చేస్తాను? అలాగే కత్తెరకి పని కల్పిస్తూ రోజూ గడ్డంతో కుస్తీపడుతూ. ఈ గడ్డం మీసాలకి నాకు ఏదో అవినాభావ సంబంధం వుంది. నా చిన్నప్పుడు కథలకోసం మా తాత మీసాలని గడ్డాలని భరించాను. ఇప్పుడు మా ఆవిడ కౌగిలింత కోసం ఈ మీసాలని భరిస్తున్నాను. గడ్డాన్ని తీసేస్తున్నాను.

ఈ కౌగిలింతలో కూడా ఎన్నో కథలు. మరెన్నో వెతలు.

ఇప్పుడు అద్దంలో నా ముఖం విస్త్ర్తతం కావడం లేదు. నల్లమీసాల్లో తెల్లవాటిని చూస్తూ బాధపడుతూ వుంటుంది. కానీ కాలం వూరుకోదు కదా! ఇప్పుడు అద్దం మా అబ్బాయి ముఖాన్ని తనలో విస్తృతం చేస్తోంది.

★ ★ ★

కోడి పిల్లలు

మా ఇంటికీ వంటింటికీ మధ్య చిన్నసందు వుంది. ఆ సందు అంతా గచ్చుచేసి వుంటుంది. సందుకి రెండువైపులా తలుపులు వున్నాయి. ఒకవైపు నుంచి వెళ్తే మా దొడ్డిలోకి పొయ్యే దారి వస్తుంది. మరోవైపు నుంచి వెళ్తే మా బాదంచెట్టూ, అశోక చెట్టూ వాటి క్రింద వుండే స్థలం వస్తుంది. ఈ రెండు చెట్లే కాదు. రెండు మల్లెచెట్లు వుండేవి. మా బావి వుండేది. రేకులతో చేసిన అరుగూ వుండేది. దాన్నిండా మా వడ్ల గుమ్ములు వుండేవి. బావికి ఆనుకొని ఓ చిన్న అరుగు వుండేది. అక్కడ స్నానం చేస్తే మల్లెచెట్లకి నీళ్ళు వెళ్ళేవి. ఈ సందులోనే మేం ఎక్కువకాలం గడిపేవాళ్ళం. మా పాలబ్రేకులూ, ఆ తరువాత టీబ్రేకులూ ఇక్కడే గడిచేవి.

ఎండాకాలం ఆకాశాన్ని చూస్తూ నులక మంచంలోనో, నవారు మంచంలోనో పడుకునేవాళ్ళం. ఇక్కడ ఎండ చాలా తక్కువగా వస్తుంది. మధ్యాహ్నం మాత్రమే కాస్త ఎండ వస్తుంది. అందుకని ఎండాకాలంలో ఈ సందులో పడుకోవడం చాలా హాయిగా వుండేది. ఆలస్యంగా నిద్ర లేచే అవకాశం వుండేది.

మా దొడ్డిలో మా పాలకోసం బర్రెలు వుండేవి. చాలా కోళ్ళు వుండేవి. మా కోళ్ళు బాదంచెట్టు కింద రోజంతా తిరిగేవి. వాటిని రోజూ రాత్రి ఈ సందులోనే కమ్మేవాడు మా మల్లయ్య. చలికాలంపూట ఫర్వాలేదు కానీ ఎండాకాలం వాటిని ఈ సందులో కమ్మడం మాకు ఇష్టం వుండేది కాదు. ఎందుకంటే అవి ఉదయాన్నే కొంప మునిగినట్టు 'కొక్కరకో' అని అరిచేవి. అందుకని బాదంచెట్టు పక్కన వున్న రేకుల షెడ్డు కింద కమ్మమని మా మల్లయ్యతో అనే వాళ్ళం. ఒక్కోసారి వినేవాడు. చాలాసార్లు వినకపొయ్యేవాడు. లేచి చదువుకొమ్మని ఉచిత సలహా ఇచ్చేవాడు.

రోజూ సంధ్యవేళ కోళ్ళని పిలవడమూ, వాటిని గంపకింద కమ్మడమూ మా మల్లయ్య పని. అతను రావడం ఎప్పుడన్నా ఆలస్యం అయితే నన్ను కమ్మమని మా అమ్మ చెప్పేది. నేను వినేవాడిని కాదు. కానీ సెలవుల్లో మధ్యాహ్నంపూటో, సాయంత్రమో వాటికి జొన్నలు వేస్తూ ఆడేవాడిని. జొన్నలు వేయగానే అవి పరుగు పరుగున వచ్చేవి. తరువాత తరువాత నన్ను చూడగానే పరుగు పరుగున రావడం మొదలు పెట్టాయి.

మా రేకుల షెడ్డు దగ్గర వున్న గుమ్ముల దగ్గర, మా తాతర్ర మంచం కింద మా కోళ్ళు గుడ్లను పెట్టేవి. ఆ రెండు స్థలాలు వాటికి అనువైన స్థలాలు. కోడిగుడ్లని మా అమ్మ



ఆమ్లెట్లు వేసేది. కొన్నిసార్లు పిల్లలు చేయడంకోసం వుంచేది. మా కోడి పొదుగు పట్టినప్పుడు అది పొదగడానికి ఆ కోడి దగ్గర గుడ్లను పెట్టేది. పొదుగు పెట్టినప్పుడు మా కోడి చేసే ధ్వని అదోరకంగా వుండేది. ఓ ఇరవై రోజుల తరువాత కోడిగుడ్ల నుంచి పిల్లలు వచ్చేవి. అవి ఎంతో అందంగా వుండి, ఎంతో ముచ్చటేసేవి. వాటిని పట్టుకోవడానికి ప్రయత్నం చేసేవాడిని. తల్లికోడి కోపంగా నావైపు పరుగెత్తుకొచ్చేది. అది ఎక్కడ పొడుస్తుందోసని పరుగెత్తేవాడిని. తల్లికోడి పిల్లల్ని వేసుకొని బాదంచెట్టు కింద షికారుకి వెళ్ళేది. చెట్టుకింద వున్న ఆహారం దినుసులని, పురుగులని ఇంకా వేటినో అవి తినేవి. ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎంతో పని వున్నట్టు మా బాదంచెట్టూ, అశోకచెట్టూ వున్న ప్రాంతాలన్నీ తిరిగేవి. వాటి రాజ్యంగా భావించేవి. చెట్లకింద తన కాళ్ళతో తన్ని పొక్కిలి పొక్కిలి చేసేవి. ఇంటి నిండా దొడ్డికి (పియ్యి) వెళ్ళేవి. మంచినీళ్ళకోసం కట్టిన హవుజు మీద వున్న రేకుని కూడా ఖరాబు చేసేవి. ఇవి చూసినపుడు మాత్రం కోళ్ళమీద కోపం వచ్చేది. చిరాకేసేది. ఇంకా ఇల్లంతా నానా గందరగోళం చేసేవి.

పిల్లి కన్పించినా, ఆకాశంలో గద్ద తిరుగుతున్నా మా కోడి తన పిల్లల్ని తన రెక్కలకింద కాపాడేది. పిల్లిని పొడుస్తుందేమోనన్నట్టుగా చూసేది. గద్ద ఆకాశంలో వుండేది కనుక దాన్ని అలా చూసే అవకాశం మా కోడికి లేకపొయ్యేది. మా కోడి అప్రమత్తంగా వున్నప్పుడు పాడు గద్ద మా కోడిపిల్లలని ఎత్తుకొని పోయ్యేది. అది గమనించిన తల్లికోడి కోపంతో ఊగిపొయ్యేది. పైకి ఎగిరెగిరి గద్దను అందుకోవడానికి ప్రయత్నం చేసి విఫలం అయ్యేది. తల్లికోడి సంరక్షణ మనుషుల సంరక్షణకన్నా ఎక్కువ అన్పించేది.

చీకటిపడక ముందే గంపకింద కోళ్ళని కమ్మి గంపమీద బరువుగా ఓ పెద్ద బండని పెట్టేవాడు మల్లయ్య. తల్లికోడిని పిల్లల్ని వేరే గంపకింద కమ్మేవాడు. ఆ బండ ఎలా కిందపడేదో లేక మా మల్లయ్య బండ పెట్టడం మరిచిపొయ్యేవాడో తెలియదుగానీ ఓ అర్ధరాత్రిపూట కోళ్ళు విపరీతంగా గోలచేసేవి. మా అమ్మ వెంటనే లేచి చూసేది. ఏముంది? మా పిల్లి మహాశయుడు ఓ కోడిని కరుచుకొని వెళ్ళిపోయిన సందర్భం. మిగతా కోళ్ళని గంపకింద కమ్మి దానిమీద బండని పెట్టేది మా అమ్మ.

ఉదయాన పాలు పిండటానికి వచ్చిన మా మల్లయ్యని మా అమ్మ మందలించేది. 'బండ నేను పెట్టిన, పిల్లలేమన్నా తీసినారేమో'నని గొణిగేవాడు. నెపం మా మీదకు తోసేవాడు.

'ఏం మల్లయ్య తాతా! నీ తప్పు పెట్టుకొని మా మీదకు తోసేస్తున్నావని' అడిగేవాళ్ళం. మమ్మల్ని ఏవో చెప్పి బుదరకిచ్చేవాడు. 'ఈ పిల్లి పని పట్టాలి' అనేవాడు. ఇంట్లో వంట దినుసులు వున్నాయి కాబట్టి ఎలుకలు వుంటాయి. వాటిని నియంత్రించడానికి పిల్లి అవసరమే. అందుకని పిల్లిని దొరకబట్టి బయటకు పంపే అవకాశం లేదు. ఆ సంగతి మా మల్లయ్యకీ తెలుసు.

నాకు ఐదుగురు బావలు. మా బావలు ఇంటికి వచ్చినారంటే ఓ కోడి ప్రాణాలు పొయ్యేవి. మొదటిరోజు కోడిగ్రుడ్డుతో భోజనం. తెల్లవారి కోడి కూరతో భోజనం వుండాల్సిందే. మరోరోజు వుంటే కటిక దుకాణం నుంచి మాంసం తెప్పించేవాళ్ళు. కోడిని కోయడం ఓ పెద్ద ప్రహసనం లాగుండేది. అన్ని కోళ్ళని గంపకింద కమ్మి, గుడ్లు పెట్టడం ఆపిన కోడినో, కోడి పుంజునో మా మల్లయ్య ఎంచుకునేవాడు. అంతకుముందే ఆ కోడిని కోయడానికి రేకుల షెడ్డు నుంచి కత్తిని బయటకు తెచ్చేవాడు. దాన్ని బండమీద నూరేవాడు. ఎంచుకున్న కోడిని మా బాదంచెట్టు కిందికి తీసుకొచ్చేవాడు. ఓ చెంబులో మంచినీళ్ళు తెచ్చి చేతిలో వున్న కోడి నోట్లో పోసేవాడు. చంపేముందు దాని దాహాన్ని తీర్చేవాడు. ఆ తరువాత కత్తితో కోడి తలని కోసేవాడు. తలలేని కోడిమొండెం మా బాదంచెట్టు కింద ఎగిరెగిరి కొట్టుకునేది. అలా కాసేపు కొట్టుకొని నేలమీద పడిపొయ్యేది. ఆ దృశ్యం హృదయవిదారకంగా వుండేది. పిల్లల్ని ఆ దృశ్యం చూడనిచ్చేది కాదు మా అమ్మ. ఎందుకంటే అలాంటి దృశ్యాలు చూసే మా అయిదుగురు అక్కలు కోడిమాంసం తినడం మానేశారు. ఆ తరువాత పూర్తిగా శాకాహారులుగా మారిపోయినారు. అయినా మేం ఏ కిటికీ సందుల్లోనుంచో చూసేవాళ్ళం. ఆ దృశ్యం చూసినపుడు హృదయం బాధతో మూల్గేది. ఒళ్ళు గగుర్పొడిచేది. ఆ కోడి మొండాన్ని వేడివేడి నీళ్ళలో పెట్టి దాని ఈకెలు పీకేసేవాడు. కొద్దిసేపటి తరువాత దాన్ని శుభ్రంచేసి నిప్పుల మీద కమిరించేవాడు. తరువాత దాన్ని ముక్కలు చేసి మా అమ్మకి ఇచ్చేవాడు. మసాలాలు వేసి ఆ కోడితో బ్రహ్మాండమైన కూరవండేది మా అమ్మ.

ఒక్కో బావ వచ్చినప్పుడల్లా ఒక్కోకోడి ఎగిరిపొయ్యేది. కోడిపిల్లలు పెద్దవయ్యేవి. గుడ్లు పెట్టేవి. ఆ తరువాత ఆహారం అయ్యేవి. అయినా పాపం మిగతా కోళ్ళు ఉదయాన్నే మా రాజన్న సుప్రభాతం కన్నా ముందే సుప్రభాతం పాడేవి. మా బావలు వూరికి వెళ్ళడానికి వీలుగా వాళ్ళని నిద్రలేపేవి.

మా కళ్ళముందే కోడిగ్రుడ్లు కోళ్ళయ్యేవి. ఇల్లంతా ఎగిరేవి. ఎక్కడపడితే అక్కడ దొడ్డికి పొయ్యేవి. ఇల్లంతా పొక్కిలి పొక్కిలి చేసేవి. మాతో ఆడేవి. మమ్మల్ని నిద్ర లేపేవి. విసిగించేవి. చివరికి మాకు ఆహారం అయ్యేవి. ఇవి ఇంత చేసినా అవి వద్దని ఎప్పుడూ ఎవ్వరం అనుకోలేదు.

నేను యూనివర్శిటీకి వచ్చేసరికి మా ఇంట్లో వున్న కోళ్ళసంఖ్య తగ్గిపోయింది. అప్పుడు ఒకటో రెండో వుండేవి. పరిశుభ్రత సోయి ఎక్కువైపోయింది. మల్లయ్య కూడా ముందున్నంత ఉత్సాహంగా లేడు. కోడిగుడ్లు బజార్లో విపరీతంగా దొరుకుతున్నాయి. మా వూరి చుట్టూ కోళ్ళఫారాలు వచ్చేశాయి. మా ఇంటిచుట్టూ చికెన్‌షాపులు అయిపోయినాయి. మా ఇంట్లో వున్న ఒకటి రెండు కోళ్ళు కూడా లేకుండా పోయినాయి. కొక్కొరకోలు లేవు. ఇల్లంతా కోడి పియ్యిలేదు. వాటి ఈకలూ లేవు. కోడిగంపా లేదు. ఇల్లంతా పొక్కిలి పొక్కిలి కావడంలేదు. అదృశ్యమైనాయి.

ఓసారి మా వూరి బయట వున్న కోళ్ళఫారాన్ని చూడ్డానికి పోయినాను. అక్కడంతా అదోరకం వాసన. ప్రతి కోడికి ఓ నిర్ణీత స్థలం. దానిముందే దానికి కావల్సిన దాణా. అందులో ఒక లైటు. మిగతా కోళ్ళతో పొట్లాటలు లేవు. పొడుచుకోవడం అంతకంటే లేదు. వీటి బాగోగులు చూడ్డానికి ఓ మనిషి. వాటిముందు ఓ చిన్న చిప్పలో కొన్ని నీళ్ళు. దానికోసం వెతుక్కోవనక్కర్లేదు. పిల్లి భయం లేదు. గద్దల భయం అంతకన్నా లేదు. వైద్యం కూడా వుంది.

ఎంత విచిత్రం వీటి జీవితం. ఇవి మా కోళ్ళలా కాదు. ఎక్కడికో పోయి గుడ్డు పెట్టాల్సిన పనిలేదు. పొదుగుడు పట్టడం లేదు. గుడ్లని పొదగాల్సిన పనిలేదు. వీటికి తమ రెక్కలను విదిలించే అవకాశమే లేదు. ఇక ఎగరడం అన్న విషయం ఎప్పుడో అవి మరిచిపోయాయి. కోడిపిల్లలకి గద్దల భయం లేదు. బర్డ్‌ఫ్లూ భయం మాత్రమే వుంది. వీటి పుట్టుక వీటికోసం కాదు. ఎలక్ట్రిక్ దీపం కింద పెరగడం, పెట్టిన ఆహారాన్ని తినడం, తరువాత గుడ్లు పెట్టడం, తరువాత తలకిందులుగా వేలాడి చికెన్ సెంటర్లోకి వెళ్ళడం. ఆ తరువాత ప్రాణాలు కోల్పోవడం, ముక్కలు ముక్కలు కావడం. నూనెలో గోలి, చికెన్ 65లు కావడం. చికెన్ బిర్యానీలు కావడం. వీటి జీవిత నిర్దేశ్యం ఇదే. వీటి పరమార్థం ఇదే. వీటి జననం ఇందుకే.

కాలం ఎన్ని మార్పులని తెస్తుంది. సహజ సిద్ధంగా ఎగిరే లక్షణం, రెక్కల్ని విదిలించే లక్షణం, ఆహారాన్ని వెతుక్కుని తినే లక్షణం, తమకు తాము పిల్లల్ని పుట్టించే లక్షణం, జాతి లక్షణమైన కొక్కొరకోని అనలేకపోవడం. ఇవేవీ లేకుండా కాలం వీటిని ఎట్లా తయారుచేసింది? దీన్ని కాదనే ధైర్యం ఎవరికైనా వుందా? కల్తీలేని ఆహారం గుడ్డు వద్దనే సాహసం మరెవరికైనా వుందా?

కొంతకాలానికి ఈ హైదరాబాద్‌లో సెటిల్ అయిన తరువాత ఇక్కడ ప్లాట్లలో పెరుగుతున్న మా పిల్లల్నీ, ఇతర పిల్లల్నీ చూస్తే నాకు మా వూరి చివర్లో వచ్చిన కోళ్ళఫారాలే గుర్తుకొచ్చేవి. స్కూలుకి వెళ్ళడం రోజుకి నలభైఎనిమిది గంటలు చదవడం, ర్యాంకుల పంట పండించడం, నూటికి తొంభైకన్నా తక్కువ మార్కులు రాకుండా ప్రయత్నాలు చెయ్యడం, హైటెక్ యుగంలో అవసరం లేని హృదయాన్ని తీసి మెదడును సీడీలా మార్చే ప్రయత్నం చెయ్యడం. డాక్టర్లు, ఇంజనీర్లు, ఐఐటీలు, హెచ్‌వన్ వీసాలు, డాలర్ సంస్కృతి ఇదే వీళ్ళ ప్రయత్నం. ఆ దిశగా వాళ్ళని తయారుచేసే మన యత్నం.

ఇక్కడి పిల్లలకి బళ్ళల్లో కోతికొమ్మచ్చి ఆటలు లేవు. మట్టితో బొమ్మలు చేయడం తెలియదు. ఒళ్ళంతా మట్టి చేసుకోవడం తెలియదు. మట్టి వాసనా తెలియదు. చూరునుంచి కారుతున్న వర్షం నీళ్ళల్లో ఎగరడం తెలియదు. ఆ నీళ్ళ ప్రవాహంలో కాగితం పడవలు వదలడం అంతకంటే తెలియదు.

పెద్ద బొంగుతో బాదంకాయలు కొట్టుకోవడం తెలియదు. జామచెట్టు ఎక్కి జామకాయలు తెంపుకోవడం తెలియదు. కాలికి గాయం చేసుకోవడమూ తెలియదు. పెరడుకు పోయి మక్కకంకులని కాల్చుకొని తినడం తెలియదు. కోతి కొమ్మచ్చి ఆటా తెలియదు, పాటా తెలియదు, నాటకాలు తెలియవు.

వీళ్ళకు తెల్సింది కంప్యూటర్ ఆటలు. ఇంట్లో వుండే ప్లాస్టిక్ చెట్లు. నీడలో పెరిగే మరగుజ్జు మొక్కలు. చదువు. చదువు. మట్టివాసన తెలియని చదువు. మనిషి సహవాసం లేని చదువు.

ఇక్కడ పిల్లల్ని కోళ్ళఫారమ్‌లోని పిల్లల్లాగే పెంచుతున్నాం. వాటిలాగా పిల్లల సహజసిద్ధమైన లక్షణాలు కోల్పోతున్న పిల్లలు. మేము మా అమ్మచేతిలో పెరిగిన కోడిపిల్లలం వీళ్ళు మా చేతుల్లో పెరుగుతున్న కోళ్ళఫారమ్‌లోని కోడిపిల్లలు.

★ ★ ★

భీమేశ్వర సభామండపం

భీమేశ్వరాలయం మా వూరికి ఓ మూలకి వుంటుంది. ఈ గుడితో మా వూరి వాళ్ళకి విడదీయరాని అనుబంధం. దానికి కారణాలు అనేకం. ఈ గుడి విశాలమైన ప్రదేశంలో వుంటుంది. గుడి చుట్టూ పెద్ద తోట వుంటుంది. ఆ తోటలో రకరకాలైన పూలచెట్లు వున్నాయి. రాజేశ్వరునికి, రాజేశ్వరీదేవికి ఇక్కడినుంచే పూలు వెళ్తుంటాయి. పూలచెట్లే కాదు జామ చెట్లూ ఈ తోటలో వున్నాయి. చాలా తక్కువగా కన్పించే రామసీతాఫలచెట్టు కూడా వుండేది. పూలచెట్లు, పండ్లచెట్లేకాదు ఈ తోటలో రెండు నాగుంపాము పుట్టలు కూడా వున్నాయి. నాగుల చవితిరోజు మా వూరి వాళ్ళంతా వచ్చి ఇక్కడవున్న పుట్టల్లో పాలు పోస్తారు. పూజలు చేస్తారు. శ్రావణ మాసంలో వనభోజనానికి వస్తారు. రాజన్న గుడికి భిన్నంగా ఈ గుడి ప్రశాంతంగా వుంటుంది.

ఈ గుడి ప్రాంగణంలో ఆంజనేయస్వామి గుడి వుంది. దానిముందు పెద్ద రావిచెట్టు. ఆ చెట్టుమీద తలకిందులు చేసి తపస్సు చేస్తున్న మునుల్లా గబ్బిలాలు, దాన్ని ఆనుకొని ఒక పెద్ద స్టేజి. దాని ముందు వెయ్యిమందిదాకా కూర్చోవడానికి స్థలం.

భీమేశ్వరాలయం చాలా ప్రశాంతంగా వుంటుంది. లింగం చాలా పెద్దగా వుంటుంది. పది అడుగుల ఎత్తు వుంటుంది. జనం చాలా పలుచగా ఇక్కడికి వస్తారు. రాజన్న గుడితో పోలిస్తే ఇక్కడ జనం కన్పించరు. సందడి వుండదు. అధికారులూ తక్కువే. ఒకే ఒక్క పూజారి వుంటాడు. అందుకని మా చిన్నప్పుడు గుడిలోనికి వెళ్ళాలంటే చాలా భయంగా వుండేది. గుడిచుట్టూ తిరిగేవాళ్ళం కానీ గుడిలోకి వెళ్ళేవాళ్ళం కాదు.

మా గుడి తోటమాలి పోచెట్టి లేనప్పుడు, నిద్రపోతున్నప్పుడు తోటలోకి వెళ్ళి జామకాయలు తెంపుకునేవాళ్ళం. ఆ శబ్దాన్ని పాములా పసిగట్టేవాడు పోచెట్టి. కట్టె పట్టుకొని పరుగెత్తుకొచ్చేవాడు. అతనికి దొరకకుండా మేం పారిపొయ్యేవాళ్ళం. ఇది అతనికి మాకూ మధ్య నడచిన ఆట.

భీమేశ్వరుని వరప్రసాదం భీమకవి అని కథలు చెప్పేవాళ్ళు. భీమకవి మా వూరి వాడేనని భీమేశ్వరస్వామి వరపుత్రుడని ఇక్కడి శాసనాలు చెబుతున్నాయి. రెండవ అరికేసరి మహారాజు ఆస్థానకవి పంపడు. అతని సోదరుడు చిన్నవల్లభుడు. అతను కురిక్యాల గండ శిలాశాసనం వేయించాడు. అది కన్నడ సంస్కృతాంధ్ర భాషలలో వుంది. చిన్నవల్లభుని

ప్రోత్సాహంతో కవిజనాశ్రయ గ్రంథాన్ని రేచన రచించాడు. తరువాతి కాలంలో మల్లయ రేచన రాసిన కవి జనాశ్రయం వేములవాడ భీమకవి పేరుతో ప్రసిద్ధి పొందింది. ఇంతేకాదు భవిష్యపురాణం, కవిజనాశ్రయ గ్రంథాల ప్రకారం భీమకవి జన్మస్థలం మా వేములవాడే. అతని సృష్టికర్త భీమేశ్వరుడే. ఇన్ని ఆధారాలు వున్నా భీమకవి ద్రాక్షారామం వాడని ఆ ప్రాంతం వాళ్ళు అంటూ వుంటారు. భీమకవి నివసించిన ప్రాంతం భీమేశ్వరాలయం, ఆ పరిసర ప్రాంతాలు. ఓ కవి నివసించిన ప్రాంతం కాబట్టి ఈ ప్రాంతమంతా ఆ తరువాతికాలంలో కూడా కవిత్వంతో ప్రతిధ్వనించింది.

భీమకవి ప్రస్తావన వచ్చినప్పుడు అప్పాలన్నీ కప్పలు కావాలే, అన్నమంతా సున్నం గావాలేనన్న అతని మాటలు గుర్తొస్తాయి. ఓసారి అతను భోజనం చేద్దామని ప్రయత్నం చేస్తే మిగతా వ్యక్తులు అతను భోజనం చెయ్యడాన్ని నిరాకరించారు. అప్పుడు భీమకవి అప్పాలన్నీ కప్పలు గావాలే, అన్నమంతా సున్నం కావలె అన్నాడని, అవి అట్లాగే అయినాయని చెబుతారు. వశ్యవాక్కు వున్న కవిగా భీమకవి ప్రసిద్ధుడు. అప్పాల ఇంటిపేరుతో మా వూర్లో చాలామంది బ్రాహ్మలు వున్నారు. శాసనాలు చూసినా వాడుకలో వున్న కథలు విన్నా భీమకవి ఇక్కడి వాడేనని, భీమేశ్వరుడంటే వేములవాడ భీమేశ్వరుడేనని స్పష్టమవుతుంది. ఈ విషయం చెప్పడంకోసం కాదు ఈ కథ.

భీమన్న గుడి ముందు దేవస్థానం వాళ్ళది ఓ పాత బిల్డింగు వుంది. అందులో మా బడి వుండేది. మా వూరిలో బడి నిర్మాణం కాకముందు మా బడి ఈ పాత బిల్డింగులో



వుండేది. నేను ఏడవ తరగతిలో వుండగా మా బడిని కొత్త బిల్డింగులోకి మార్చినారు. మా బడి ఇక్కడ వున్నప్పుడు రోజూ భీమన్న గుడిలో వున్న ఏనుగు విగ్రహాల మీద కూర్చునేవాళ్ళం. గుడిలో ఆటలు ఆడేవాళ్ళం.

మా వూరి బ్రాహ్మలు తమ పిల్లలకి మంత్రాలూ వేదాలూ ఇక్కడి భీమన్న గుడిలోనే నేర్పేవాళ్ళు. రోజూ ఉదయం ఆ దృశ్యం గుడిలో కన్పించేది. ఆ మంత్రోచ్చారణలో ఏదో ప్రకంపన కన్పించేది. అది ప్రకంపనే అయినా హృదయాన్ని కదిలించేది. మనస్సుని ఎక్కడికో తీసుకెళ్ళేది. మా బడి గంట కొట్టిన శబ్దం విన్పించకపొయ్యేది. మా బ్రాహ్మలే బడి గంట కొట్టిన సంగతి గుర్తు చేసేవాళ్ళు.

ప్రతి జనవరిలో సంక్రాంతి ముందు త్యాగరాయ ఉత్సవాలు మా వూరిలో జరుగుతాయి. అవి ఎక్కువగా మా భీమన్న గుడి ఆవరణలో జరిగేవి. భీమన్న గుడి ప్రాంగణంలోనే పుస్తకావిష్కరణ సభలు జరిగేవి. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు ఒకేరోజు మూడు పుస్తకావిష్కరణ సభలు జరిగాయి. ఆ పుస్తకాల గురించి మాట్లాడిన మాటలు వినడం గొప్ప అనుభూతి. కవితా గానాలు కవిత్వ పఠనాలు జరిగేవి. ఏ సభ జరిగినా వంద రెండు వందలమంది దాకా హాజరయ్యే వాళ్ళు. సాయంత్రాలు జరిగిన సభలకి మఫ్లర్లు, స్వెట్టర్లు వేసుకుని వచ్చేవాళ్ళు. హరికథలు బుర్రకథలకే కాదు, సంగీత కార్యక్రమాలకి, కవి సమ్మేళనాలకు జనాలు వచ్చేవాళ్ళు. ఉత్సాహంగా పాల్గొనే వాళ్ళు. జనవరి నెలకోసం ఎదురుచూసేవాళ్ళు.

కొంతకాలానికి మా వూరికి చివర్లో బడి కట్టారు. మేమందరం అక్కడికి వెళ్ళిపోయాం. భీమన్న గుడితో కొంత దూరం పెరిగిపోయింది. జనవరిలో మాత్రం తప్పక వచ్చేవాళ్ళం. ఏదైనా కవి సమ్మేళనం జరిగినా వచ్చేవాళ్ళం. మా బడి వున్న బిల్డింగులో ఒక పెద్ద హాలుని కట్టారు. దానిమీద కూడా మరో పెద్దహాలు కట్టారు. ఆ రెండు హాళ్ళు, మా బడి వున్న బిల్డింగు పెళ్ళిళ్ళకి కిరాయికు ఇచ్చేవాళ్ళు. ఎవరైనా కవి సమ్మేళనాలు ఏర్పాటుచేస్తే ఆ హాలుని ఉచితంగా ఇచ్చేవాళ్ళు. భీమేశ్వరాలయం గుడి సందులో సాహితీ మిత్రుల సమావేశాలు చొప్పకట్ల చంద్రమౌళి ఇంట్లో జరిగేవి.

మేం గ్రాడ్యుయేషన్‌కి వచ్చేసరికి మా వూర్లో కళాభారతి అన్న సంస్థని ఏర్పాటుచేశారు. అప్పుడప్పుడు కవితా గోష్ఠులు కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసేవాళ్ళు. భీమకవి సంచరించిన ప్రదేశంలో కవితా గోష్ఠులు జరగడం యాదృచ్ఛికమే అయినా ఆయన ప్రభావం తెలియకుండానే ఆ ప్రాంతం మీద వుందేమోనన్నట్టుగా కొంతకాలానికి మేమూ కళానికేతన్ అన్న సంస్థని ఏర్పాటు చేశాం. మా మొదటి కవి సమ్మేళనం మూడు గంటలు జరిగింది. ఓ నలభైమంది కవులు కవిత్వం చదివారు. ఒక్క మా వేములవాడలోని కవులే కాదు చుట్టుపక్కల వున్న కవులు ఎంతోమంది వచ్చారు. తమ కవిత్వాలు విన్పించారు. ఆ తరువాత

మూడు నాలుగు సంవత్సరాలపాటు ఈ రెండు సంస్థలు నిర్విరామంగా పనిచేశాయి. మా సంస్థ ఏర్పాటుచేసిన కార్యక్రమాలు మరీ ఎక్కువ. ప్రతి నెలకి ఒకసారి కవి సమ్మేళనం జరిగేది. మూడు నెలలకొకసారి పెద్ద కార్యక్రమాలు జరిగేవి. జనంకోసం సభ ఎన్నడూ ఆలస్యంగా జరగలేదు. అనుకున్న సమయానికే సభ జరిగేది. జనాలు పెద్దసంఖ్యలో వచ్చేవాళ్ళు. ఈ హాలుకి మేం పెట్టిన పేరు భీమేశ్వర సభామంటపం. ఆ హాలుకి ఆ పేరు చాలాకాలం వాడుకలో వుంది.

మా వూరిలో సాంబశివశర్మ అని ఓ కవి వుండేవాడు. మా రాజేశ్వరుని సుప్రభాతం అతనే రాశాడు. కవిత్వం తప్ప అతనికి మరేమీ రాదు. అందుకని దేవస్థానం వాళ్ళు అతనికి రోజుకి ఒక పూట ఉచిత భోజనం ఏర్పాటుచేశారు. అతను మా కవి సమ్మేళనానికి స్టార్ అట్రాక్షన్. ప్రధాన ఆకర్షణ. అతను దరిద్రంతో ఎక్కువ బాధపడ్డాడు కాబట్టి లోభసంహారం అన్న కావ్యం రాశాడు. ఇంకా చాలా రాసినప్పటికీ లోభసంహారం పద్యాలు వినడం ఓ గొప్ప అనుభూతిగా వుండేది. ఆయన గొంతూ శ్రావ్యంగా వుండేది. ప్రతి కవి సమ్మేళనంలో అతను వేరే పద్యాలు చదివినా లోభసంహారం పద్యాలు చదవాల్సిందే. మా వూరికి వచ్చిన కవులూ, సాహితీవేత్తలు ఆయన పద్యాలు విని చప్పట్లు కొట్టాల్సిందే. అతని భుక్తికి లోటు రావద్దని ఆయన ఇంటిని తీసివేసి రెండు షాపులు, రెండు రూములు మా సంస్థ ద్వారా మా వూరి వాళ్లందరి దగ్గర చందాలు వసూలుచేసి కట్టించాం. దాని తర్వాత అతని జీవితకాలమంతా భుక్తికి లోటు రాలేదు. సాహిత్యం నేర్పిన సంస్కారం అది.

కవిత్వం గురించిన సమావేశాలు, కథల గురించి సమావేశాలు ఒక్కటేమిటీ ఎన్నో జరిగాయి ఆ భీమేశ్వర సభామంటపంలో. కవిత్వ చర్చలు, మినీ కవితా ప్రదర్శనలు, వాదోపవాదాలు, చిత్రకళా ప్రదర్శనలు, లిఖిత మాసపత్రిక ఆవిష్కరణ, సావెనీర్‌ల ఆవిష్కరణలు ఇట్లా ఎన్నో.

ఆ తరువాత మా యూనివర్సిటీ ప్రయాణం. ఆరు నెలలకి ఒకమారు కార్యక్రమాలు వుండేవి. అప్పుడప్పుడే టీవీలు రంగప్రవేశం చేస్తున్న సమయం అది. మా హాస్టల్లోని కామన్ రూంలో టీవీ వుండేది. దాని చుట్టూ మా ఫ్రెండ్స్ వుండేవాళ్ళు. మా వూరిలో కూడా అప్పుడప్పుడే టీవీలు వచ్చాయి. చాలా ఇండ్లమీద ఓ స్తంభం లాంటి ఇనుప పైపు. దానిమీద 12 చిన్న పైపులతో ఆంటెన్నా వచ్చేశాయి. బ్లాక్ అండ్ వైట్‌ల నుంచి రంగుల టీవీలు వచ్చాయి. పందుల పెంపకాల కార్యక్రమాల నుంచి మహాభారతాలు వచ్చేశాయి. అక్కడక్కడా కన్పించే ఆంటెన్నాలు చాల ఇండ్లపైన కన్పించడం మొదలైనాయి. ఆ తరువాత ఆంటెన్నాలు కాలక్రమంలో కన్పించకుండా పోయినాయి. డిష్‌లు వచ్చేశాయి. రెండు ఛానళ్ళు మాత్రమే వచ్చే మా వూరి టీవీ ఇప్పుడు వంద ఛానళ్ళ టీవీలుగా మారిపోయాయి.

మా భీమేశ్వర సభామంటపమూ మారిపోయింది. దాని రూపురేఖలు మార్చివేసినారు. కొద్ది రోజులు యాత్రికులకోసం గెస్ట్‌హవుస్‌గా మార్చినారు. ఆ తరువాత కొంతకాలానికి దాన్ని హాస్పిటల్‌గా మార్చినారు. సరైన వైద్యం చేసే నాధుడు లేడు. పేషంట్లు లేరు. కాని హాస్పిటల్ మాత్రం వుంది. ఇప్పుడక్కడ భీమేశ్వర సభామంటపం లేదు.

భీమకవి సంచరించిన మా వూర్లో ఇప్పుడు కవి సమ్మేళనాలు లేవు. సాహిత్య కార్యక్రమాలు లేవు. త్యాగరాజు ఉత్సవాలు కూడా మొక్కుబడిగా సాగుతున్నాయి. భీమన్న గుడి ఉంది, భీమేశ్వర సభామంటపం లేదు. ఏదైనా సాహిత్య కార్యక్రమం పెడదామంటే భీమన్న గుడి ముందు భీమేశ్వర సభామంటపం లేదు.

కవిత్వం వున్నా, కథలు వున్నా వినే నాధుడు లేడు. స్థలం సంగతి దేవుడెరుగు. ఇప్పుడంతా టీవీల్లో పరకాయ ప్రవేశం. ఏదో ఆడవిలన్ చుట్టో, ఏ సీరియల్లోనో జనాల పరకాయప్రవేశం. భీమేశ్వర సభామంటపం, కవి సమ్మేళనాలు, మామిడిపల్లి సాంబశివవర్మ, మేం చేసిన కార్యక్రమాలు, నవత లిఖిత పత్రిక ఇవన్నీ జ్ఞాపకాలు.

అయినా మా వూరికి వెళ్ళినప్పుడల్లా భీమన్న గుడికి వెళ్తాను. ఆ ప్రాంతంలో సంచరిస్తాను. ఓ భావ సంచలనానికి లోనవుతాను. నా జ్ఞాపకాలని వెతుక్కుంటాను. నా కవిత్వమూ విన్పిస్తాను. నా కథనూ చదువుతాను - కన్పించే భీమేశ్వరుని లింగానికి, కన్పించని భీమకవికి.

భీమకవి తిరిగిన ప్రాంతం కదా! కాలం మారకపోతుందా? మళ్ళీ భీమేశ్వర సభామంటపంలో కవిత్వం చదవకపోతానా? మీరందరూ వినకుండా పోతారా?

★ ★ ★

అగ్రహారం - ఆంజనేయస్వామి

ఆంజనేయస్వామికి నాకు చిన్నప్పటినుంచి దోస్తీ. నా మెడలో హనుమంత రక్ష వుండేది. ఏ సమస్య వచ్చినా, ఎప్పుడు భయంవేసినా ఆంజనేయస్వామికి మొక్కుకునేవాణ్ణి. ఆంజనేయస్వామి దండకాన్ని చదువుకునేవాడిని.

ఎలాంటి సమస్యలు వచ్చినా ఆంజనేయస్వామికి మొక్కుకుంటే ఆ సమస్యలను అతను తీరుస్తాడని మా ఇంట్లోవాళ్ళ నమ్మకం. నా చిన్నప్పుడు నా ప్రాణం పొయ్యే పరిస్థితి వున్నప్పుడు ఆంజనేయస్వామే కాపాడినాడని మా అమ్మ నమ్మకం. ఐదారేళ్ళ వయసులో వున్నప్పుడు 'ఏకాణ' (ఆరుపైసల బిళ్ళ)తో ఆడుతూ ఆ బిళ్ళను మింగానట. మా వినోదక్క పరుగున వెళ్ళి మా అమ్మకు ఆ విషయం చెప్పింది. ఇది మధ్యాహ్నంపూట జరిగింది. ఏకాణ బిళ్ల నా గొంతులో ఇరుక్కుపోయింది. మా అమ్మకు ఏమీ తోచలేదు. మా బాపు కూడా ఊర్లోలేడు. కరీంనగర్ పోయాడు. ఎవరో చెబితే అరటిపండును తినిపించింది మా అమ్మ. ఏకాణ గొంతు నుంచి జారలేదు సరికదా మొత్తం అరటిపండుని వాంతి చేసుకున్నాను.

అది సమాచార యుగం కాదు. మా బాపుకి ఆ విషయం తెలియజేసే అవకాశం లేదు. మా వూర్లో మా బాపు తప్ప వేరే డాక్టర్ లేడు. మధ్యాహ్నం నుంచి మా అమ్మకు ఒక్కటే వత్తిడి. చెంచాతో పాలు తాగించడం, నా దగ్గర కూర్చోవడం తప్ప మరేం పనిలేదు మా అమ్మకు. ఇంట్లో వాతావరణం సీరియస్‌గా మారిపోయింది.


మా అమ్మ దేవుళ్లకి మొక్కడం ప్రారంభించింది. నా నిలువెత్తు బెల్లం పంచిపెడతానని మా రాజేశ్వరుడికి మొక్కుకుంది. కుండెడు కల్లు పోయిస్తానని మా బద్దిపోచమ్మకి మొక్కుకుంది. దిష్టికుంభం పోయిస్తానని మా మహిషాసురమర్దనికి మొక్కుకుంది. గండాదీపంలో నూనె పోయిస్తానని కూడా మొక్కుకుంది. అయినా ఏకాణ బిళ్ల నా గొంతు నుంచి జారలేదు.

సాయంత్రం అయినకొద్దీ మా అమ్మ ఎక్కువ ఒత్తిడికి లోనైంది. మా బాపు ఆరోజు రాలేదు. మా అమ్మకి కంటిమీద కునుకు లేదు. మా చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ఏమీ కాదని మా అమ్మను ఓదార్చినారు. మా మల్లయ్య పోచమ్మ తల్లికి కల్లుపోయించి వచ్చాడు. మా వినోదక్క వెళ్ళి గండా దీపంలో నూనె పోసి వచ్చింది. రాజేశ్వరునికి కొబ్బరికాయ కూడా కొట్టి వచ్చింది. అయినా ఏకాణ నా గొంతు నుంచి జారలేదు.

తెల్లవారి మధ్యాహ్నంపూట మా బావు వచ్చాడు. ఆయనకు ఏమీ తోచలేదు. ఎంతోమందికి వైద్యం చేసిన మా బాపుకి ఏం చెయ్యాలో అర్థంకాలేదు. కొన్నైనా పాలు లోపలికి పోతున్నాయని ఆయన కుదుటపడ్డాడు. అంతగా భయపడలేదు. కానీ మా అమ్మకు ఒక్కటే భయం. అప్పుడు బస్సు సౌకర్యాలు కూడా అంతగా లేవు. అందుకని ఉదయం పట్నం తీసుకెళ్దామని బాపు అమ్మకి చెప్పిండు. చేసేది ఏమీలేక మళ్ళీ దేవునికి మొక్కి నన్ను పట్టుకునే కూర్చుంది. చెంచాతో పాలు తాగిస్తూ అలాగే వుండిపోయింది.

ఆ తెల్లవారి మబ్బుల మా అమ్మా, బాపు, నేనూ, మా మల్లయ్య మొదటి బస్సులో పట్నం (హైదరాబాద్) బయల్దేరినాం. బస్సు అగ్రహారం దాటి సిరిసిల్ల నుంచి కామారెడ్డి వచ్చి పట్నం వెళ్లాలి. మా వేములవాడ, సిరిసిల్లకి మధ్యన అగ్రహారం. ఆంజనేయస్వామి గుడి. మా బస్సు క్రాసింగ్ దాటి అగ్రహారంవైపు వెళ్తుండగా మా అమ్మకి ఆంజనేయస్వామి గుర్తుకొచ్చిండు. అగ్రహారంలోని సంకట విమోచన ఆంజనేయ స్వామికి మొక్కుకోనందుకు తనని తానే తిట్టుకుంది. వెంటనే రెండు చేతులెత్తి ఆంజనేయస్వామికి మొక్కుకుంది. నాతోబాటు తనూ 21 ప్రదక్షిణలు చేసి ఐదు కొబ్బరికాయలు కొడతానని మొక్కుకుంది. వాముని సమస్యనే తీర్చినవాడు తన సమస్యను తీర్చడా అని మా అమ్మ నమ్మకం. ఆ నమ్మకం ఆవిడకి కొండంత బలాన్నిచ్చింది.

హైదరాబాద్ బస్సాండులో దిగి నేరుగా టాంగాలో ఉస్మానియా దవాఖానాకి తీసుకొని పోయినారు. డాక్టర్లు పరీక్షలు జరిపి ఓ రెండు గంటల తరువాత 'ఏకాణ' బిళ్లని నా గొంతు నుంచి బయటకు తీశారు. ఆ బిళ్లని మా అమ్మకు ఇచ్చారు. ఆ బిళ్ల ఇంకా మా ఇంట్లో వుంది. ఆంజనేయస్వామి ఇచ్చిన నమ్మకం వృధా కాలేదు. ఆరోజు దవాఖానాలోనే వుండి తెల్లవారి మా వేములవాడకి వచ్చేశాం.



మా వూర్లో నేను ఏకాణ మింగిన పిల్లవాడిగానే ప్రసిద్ధి. నన్ను అట్లాగే పిలిచేవాళ్లు. ఆ తరువాత నేనూ మా అమ్మ అగ్రహరం వెళ్లి 21 ప్రదక్షిణలు చేశాం. ఈ కథని మా అమ్మ సందర్భం వచ్చినప్పుడల్లా చెప్పింది. బహుశా లక్షా తొంభైసార్లు చెప్పివుంటుందేమో. మా అమ్మ సమస్యను ఆంజనేయస్వామి ఆవిధంగా పరిష్కరించాడు.

మా వేములవాడలో రెండు మూడు ఆంజనేయస్వామి గుళ్లు వున్నప్పటికీ ఆంజనేయస్వామి అంటే అందరికీ గుర్తొచ్చేది అగ్రహారమే. ఆ తరువాత గుర్తొచ్చేది భీమన్న గుడిలోని ఆంజనేయస్వామి గుడి. పెద్ద రావిచెట్టు. దాని పక్కనే గుడి. రావిచెట్టు మీద తలకిందులుగా వేలాడుతున్న గబ్బిలాలు. ఆ గంభీరమైన వాతావరణంలో ఆంజనేయస్వామి.

మా భీమన్న గుళ్లో ఓ పెద్దతోట వుండేది. అక్కడినుంచి రాజేశ్వరునికి పూలు వెళ్లేవి. రెండుమూడు జామచెట్లు వుండేవి. ఆ జామకాయలు తెంపుకోవాలని ఎంతో కోరిక వున్నా తోటమాలి పోచెట్టి భయానికి తెంపుకోలేకపొయ్యేవాడ్ని. మా ఇంట్లో ఓ మార్వాడీ కుటుంబం కిరాయికి వుండేది. అతను ఆంజనేయస్వామి భక్తుడు. ప్రతి శనివారం ఆంజనేయస్వామికి పూజలు చేసేవాడు. ఆంజనేయస్వామి సింధూరం పూసేవాడు. అప్పుడప్పుడూ నన్ను తనతోబాటు తీసుకొనిపొయ్యేవాడు. ఆయనతో పోవడంవల్ల జామకాయలు తెంపుకోవడానికి నాకు భయం వుండేదికాదు. ఆంజనేయస్వామి ఆ విధంగా నాకు తోటమాలి పోచెట్టి భయం లేకుండా చేశాడు.

పరీక్షలైపోయిన తరువాత పిల్లలందరం ఒకే రూంలో పడుకునేవాళ్ళం. పరీక్షలున్న రోజుల్లో ఎనిమిదింటికే నిద్ర ముంచుకొచ్చేది. కానీ ఆ తరువాత నిద్రనేదే లేదు. నిద్ర వచ్చేది కాదు. రాణీ, భాగ్యం, చిట్టి రాజేందర్, గుణక్క, ప్రసాద్, నేనూ అందరం కథలు చెప్పుకుంటూ పడుకునేవాళ్ళం. ఎవరో ఒకరు దొంగల కథో, దయ్యాలకథలో చెప్పేవాళ్లు. అప్పటినుంచి మొదలయ్యేది భయం. అప్పటిదాకా చల్లగా వున్న వాతావరణం వేడెక్కిపొయ్యేది. పక్కగదిలో పెద్దవాళ్ళు వున్నప్పటికీ వాళ్లని పిలువలేం. ఇంకా పడుకోలేదని తిడతారని భయం. అందుకని మేమందరం ఆంజనేయస్వామి దండకం చదువుకునేవాళ్ళం. చదువుకునే క్రమంలో ఎప్పుడు నిద్రపట్టేదో తెలిసేది కాదు. మా భయాలూ, సమస్యలు ఆంజనేయస్వామికి ఓ లెక్కా పత్రమా? దండకం చదువుతుండగానే నిద్రాదేవిని మా దగ్గరికి పంపించేవాడు. మేం నిద్రలోకి జారుకునేవాళ్ళం.

ట్యూషన్ నుంచి ఇంటికి వచ్చేటప్పుడు ఎవరో ఒకరు పెద్దవాళ్ళు వుండేవాళ్ళు. వాళ్ళు లేనప్పుడు చీకట్లో నడిచి వస్తున్నప్పుడు విపరీతంగా భయం వేసేది. ఆ భయానికి నా దగ్గరున్న ఏకైక విరుగుడు ఆంజనేయస్వామి. ఆయన దండకం. ఇదీ ఆంజనేయస్వామితో నాకున్న దోస్తీ.

పరీక్షలైపోయిన తరువాత అగ్రహారం వెళ్ళడం మా వూరి విద్యార్థులకి తప్పనిసరి. నిజానికి మా వూరి వాళ్ళందరికీ అగ్రహారంతో అవినాభావ సంబంధం. మా వూరి వాళ్ళు ప్రతి సంవత్సరంలో ఒక్కసారైనా నడుచుకుంటూ అగ్రహారం పోవాల్సిందే. అక్కడున్న చెట్లకింద వనభోజనాలు చేయాల్సిందే. ఆంజనేయస్వామిని దర్శించాల్సిందే. చెట్లకింద జంపఖానాలు వేసుకొని ఆ చింతచెట్ల నుంచి ఆకాశాన్ని చూస్తూ పడుకోవడం ఓ గొప్ప అనుభూతి. పిల్లలు మాత్రం సంవత్సరానికి రెండుసార్లు అగ్రహారానికి పొయ్యేవాళ్ళు. పరీక్షలైపోయిన తరువాత ఒకసారి, శ్రావణమాసంలో మరోసారి.

మా వూరికి సిరిసిల్లకి మధ్య దూరం 12 కిలోమీటర్లు. రెండు గ్రామాలకు మధ్యలో అగ్రహారం. పేరుకి అగ్రహారమే కాని అక్కడ ఆంజనేయస్వామి గుడి, పది రూంలు తప్ప మరేమీ వుండేది కాదు. పూజారి ఇల్లు కూడా వుండేది. ఆంజనేయస్వామివి రెండు విగ్రహాలు వుండేవి. ఒకదానిపక్కన మరొకటి. రెండు విగ్రహాలు ఎందుకు వున్నాయో తెలియదు. రాములవారి గుడి, శివుని లింగం, తులసి విగ్రహం కూడా అక్కడ వున్నాయి.

గుడికి కుడిపక్కన బావి. నీళ్ళు చేదుకోవడానికి బొక్కెన. మా వేములవాడ సిరిసిల్ల రెండు గ్రామాలకి మధ్యన అగ్రహారం వుండడం వల్ల రెండు గ్రామాల ప్రజలు ఇక్కడికి దర్శనానికి వచ్చేవాళ్ళు. కొత్తగా ఎవరైనా వాహనం కొంటే ఆ వాహనాన్ని అగ్రహారం తీసుకొని వచ్చి పూజలు చేయించాల్సిందే. దసరారోజు కూడా తమ వాహనాలని ఇక్కడికి తీసుకొని వచ్చి పూజలు చేయిస్తారు.

ఇప్పుడు గుడి రూపురేఖలు మారిపోయాయి. గుడి చుట్టూ పెద్దప్రహారీ గోడ కట్టారు. రోడ్డుమీదికి కన్పించేవిధంగా నిలువెత్తు ఆంజనేయస్వామి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. వాహనాలు పెరిగి సౌకర్యాలు పెరిగి చాలా ప్రదేశాలు చూసే అవకాశాలు ఏర్పడిన తరువాత మా చిన్నతనంలో మాదిరిగా ఇప్పుడు వనభోజనానికి అగ్రహారం రావడం తగ్గిపోయింది.

సిరిసిల్ల పాత తాలూకా. వేములవాడ కొత్త తాలూకా. ఆ తరువాత రెండూ మండలాలుగా మారిపోయాయి. సిరిసిల్ల రాజకీయ ప్రాబల్యం ఎక్కువగా వున్న వూరు. మా వేములవాడ రాజేశ్వరుని దగ్గర అంతులేని ధనం. ప్రతి సంవత్సరం ఆయన ఆదాయం పెరిగిపోతూనే వుంది. ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టాలన్నా దేవస్థానం డబ్బులమీదే అందరి కండ్లు పడేవి. దేవస్థానం డబ్బులు ఎక్కువగా సిరిసిల్ల అభివృద్ధికే వినియోగిస్తున్నారని మా వేములవాడ ప్రజల నమ్మకం. అందుకని రెండు గ్రామాల మధ్య పాలిపోరు వుండేది.

ఓసారి పాలిటెక్నిక్ కాలేజీ పెట్టాలన్న ప్రసక్తి వచ్చింది. ఆ కాలేజీకి దేవాలయం నిధులని ఇచ్చింది. కాలేజీని సిరిసిల్లలో పెట్టారు. వేములవాడ వాళ్ళు నానా గొడవ చేశారు. మా దేవస్థానం నిధులు - కాలేజీ మీ వూర్లోనా? అని హుంకరించేవారు.

మరి కొంతకాలానికి వేములవాడలో డిగ్రీ కాలేజీ పెట్టాలని వేములవాడ ప్రజలు ప్రయత్నాలు మొదలుపెట్టారు. కరీంనగర్‌లో రాజరాజేశ్వరస్వామి పేరుతో కాలేజీ వుంది. అందుకని వేములవాడలో భీమేశ్వరస్వామి డిగ్రీ కాలేజీ పెట్టాలన్న ప్రతిపాదన చేశారు. ఆ రకంగా ప్రభుత్వానికి రిప్రజెంటేషన్లు ఇచ్చారు. ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించింది.

ఈ విషయం తెలిసిన సిరిసిల్ల ప్రజల్లో కదలిక మొదలైంది. పాలివాండ్ల మధ్య యుద్ధం మొదలైంది. సిరిసిల్లలో పెట్టాలని సిరిసిల్ల వాళ్లు ప్రభుత్వానికి రిప్రజెంటేషన్లు ఇచ్చారు.

దాంతో రెండు వూర్లు వేడెక్కిపొయ్యాయి. ప్రతిరోజూ ధర్నాలు, స్టేట్‌మెంట్లు, నిరాహార దీక్షల దాకా వెళ్లింది. దేవస్థానం మీ వూర్లో వుంది కాని దేవుని సొమ్ము మీది కాదు. నియోజకవర్గం పాత తాలూకా అయిన సిరిసిల్లలో కాలేజీ పెట్టాలన్న ప్రకటనలు ప్రతిరోజూ పత్రికల్లో కన్పించడం మొదలైంది.

రెండు వూర్ల మధ్య సమస్య. రాజకీయ నాయకులకు సమస్యే. ఏ వూరి వాళ్ళని సమర్థించనూ లేరు. వ్యతిరేకించనూలేరు. పట్టింపులు పెరిగాయి. పంతాలు పెరిగాయి. చిన్న సమస్య రావణుడి ముందు పెరిగిన ఆంజనేయునిలా పెరిగిపోయింది. ఈ సమస్యకి పరిష్కారం లభిస్తుందా? కాలేజీయే ఎవరికి కాకుండా పోతుందా అన్న సందేహం నాకు మాత్రం ఎందరిలోనో.

ఎన్నో సూచనలు వచ్చాయి. ఎవరూ ఒప్పుకోలేదు. చివరికి మధ్యేమార్గంగా అగ్రహారంలో కాలేజీ పెట్టాలన్న ప్రతిపాదన వచ్చింది. అయితే తాత్కాలికంగా కూడా సిరిసిల్లలో కాలేజీ పెట్టడానికి వీల్లేదన్నది వేములవాడ ప్రజల వాదన. చివరికి అంగీకారం కుదిరింది.

ఐదెకరాల స్థలం సిరిసిల్లలో లేనందున పాలిటెక్నిక్ కాలేజీ సిరిసిల్ల నుంచి అగ్రహారం వచ్చింది. అదే బిల్డింగులో డిగ్రీ కాలేజీ మొదలై బిల్డింగ్ రూపం దాల్చింది.

రెండు గ్రామాల సమస్యని మా అగ్రహారం ఆంజనేయస్వామే తీర్చినాడని చాలామంది నమ్మకం. ఇప్పుడు అగ్రహారం ఆంజనేయస్వామి గుడి ఎదురుగా రెండు కాలేజీలు.

★ ★ ★

ఇ మెయిలూ - ఉత్తరం

మావూర్లో పోస్టాఫీసు మా బాపు దవాఖానాకి ఎదురుగా వుండేది. మా బాపు దగ్గరికి వెళ్ళినప్పుడల్లా ఆ పోస్టాఫీసుని చూసేవాడిని. ముందు పెద్దగేటు. దాని తరువాత ఖాళీస్థలం. ఆ తరువాత వరండా. వరండాలో రెండు టేబుల్స్. వాటిమీద గమ్‌బాటిల్స్. రెండు కిటికీలతో లోపల పెద్దహాలు.

ఆ రెండు కిటికీల నుండే ఉత్తరాలూ స్టాంపులూ కొనుక్కోవాలి. మనియార్డర్లు అక్కడినుంచే చెయ్యాలి. లోపలికి వెళ్ళడానికి వీల్లేదు. మా ట్యూషన్ సార్ మాత్రం లోపలికి వెళ్ళేవాడు. వాళ్ళతో మాట్లాడేవాడు. మావూరివాళ్ళు చాలామంది అక్కడికి వస్తూ వుండేవాళ్ళు. పోస్టాఫీసుని నా చిన్నప్పుడు చాలా కుతూహలంగా చూస్తుండేవాడిని.

మా పెద్దక్కకి (సుమిత్రక్క) నాకు చాలా వయస్సు భేదం. నే పుట్టకముందే ఆమెకు పెళ్ళైపోయింది. గంగవతల కిష్టాపూర్‌కి ఆమెను ఇచ్చారు. అప్పట్లో అది చాలా దూరప్రాంతం. అడవి ప్రాంతం. ఆమె సమాచారం అంత సులువుగా తెలిసేది కాదు.

మా పెద్దక్క మా వూరికి వచ్చి వెళ్ళినప్పుడల్లా మా అమ్మను కౌగిలించుకుని చాలా ఏడ్చేది. మా అమ్మా ఏడ్చేది. వాళ్ళు ఎందుకు ఏడుస్తున్నారో నాకు తెలిసేది కాదు. వాళ్ళని చూసి నేనూ ఏడ్చేసేవాడిని. కిష్టాపురం నుంచి ఎవరైనా వస్తే వాళ్ళని మా ఇంట్లో వాళ్ళు అపురూపంగా చూసుకునేవాళ్ళు. ఆమె సమాచారంకోసం ఎదురుచూసేవాళ్ళు.

మా పెద్దక్క దగ్గరనుంచి ఉత్తరాలు వస్తాయేమోనని మా బాపు రోజూ ఎదురుచూసేవాడు. నేనెప్పుడైనా ఉదయం పూట దవాఖానాకి వెళ్తే నన్ను పోస్టాఫీసుకి పంపించేవాడు. మా అక్క దగ్గర నుంచి ఏవైనా ఉత్తరాలు వచ్చాయేమో చూడ్డానికి. అట్లా పరిచయం నాకు పోస్టాఫీసు.

నా చిన్నతనంలో ఉత్తరాలు అందరికీ ఇష్టం వుండేది కానీ టెలిగ్రామ్‌లు ఇష్టం వుండేది కాదు. టెలిగ్రాం అంటే ఒకరకమైన భయం. పెళ్ళిళ్ళప్పుడు మాత్రమే టెలిగ్రామ్‌ల కోసం ఎదురుచూసేవాళ్ళు. పోస్టాఫీసుకు వెళ్ళినప్పుడల్లా టెలిగ్రామ్ మెషిన్ వైపు వింతగా చూసేవాణ్ణి. చూడ్డానికి చాలా గమ్మత్తుగా అన్పించేది. అది ఏ శబ్దాలని అందజేస్తుందో అర్థం అయ్యేది కాదు. మా పోస్టాఫీసులో ఓ అధికారి ఆ మెషిన్ని పట్టుకొని ఏదో శబ్దాలు చేస్తూ వుండేవాడు. ఇక ఫోను విషయానికి వస్తే అది మాకు ప్రపంచంలోని వింత. ఆ సన్నని వైరులో నుంచి మాటలు ఎలా అవతలి వాళ్ళకి వెళ్తాయో అర్థం కాకపొయ్యేది. నా

చిన్నప్పుడు ఫోన్ చెయ్యాలంటే చాలా కష్టంగా వుండేది. ఫోన్ బుక్‌చేసిన తరువాత రెండు మూడు గంటలకి కానీ కలిసేది కాదు. కలిసినా ఇప్పుడున్నంత స్పష్టంగా అప్పుడు వుండేది కాదు. ఫోన్ వచ్చిందంటే కూడా భయంగా వుండేది. ఏదో ఆపద వస్తేనే ఈ టెలిగ్రామ్‌లు, టెలిఫోన్లు వచ్చేవి.

నేను మా బాపు దవాఖానాకి పోయినా, మా గుణక్క దవాఖానాకి పోయినా మా బాపు ఉత్తరాల కోసం పోస్టాఫీసుకు పంపించేవాడు. ఉత్తరాలు వస్తే పోస్ట్‌మాన్ తెచ్చివ్వకుండాపోతాడా? అయినా మా బాపు మేం ఉదయంపూట ఎవరం వెళ్ళినా పోస్టాఫీసుకి పంపించేవాడు. ఉత్తరాలకోసం ఆయన ఆదుర్దా మాకు ఆశ్చర్యాన్ని కలిగించేది.

కొంతకాలానికి పోస్టాఫీసుని అక్కడినుంచి తీసి ఎక్కడో మారుమూలకి మార్చినారు. అది తిరిగి తిరిగి మా భీమన్న గుడి సందులో సెటిల్ అయ్యింది. పోస్టాఫీసుని మా బాపు దవాఖానా ముందునుంచి మార్చిన తరువాత మా బాపు పోస్టాఫీసుకి పంపించడం తగ్గిపోయింది. అప్పటినుంచి పోస్ట్‌మన్‌కోసం ఎదురు చూసేవాడు.

ఆ తరువాత పోస్టాఫీసుతో అనుబంధం తగ్గిపోయింది. డిగ్రీ చదువుకోసం కరీంనగర్ వచ్చాను. ఇష్టంలేని సైన్సు చదువు. ఇంటర్ నుంచి మెడిసిన్ రాలేదు. డిగ్రీ నుంచైనా సరే మెడిసిన్ చదివించాలని మా అన్నయ్య కోరిక.

కెమిస్ట్రీ క్లాసంటే అస్సలు ఇష్టం వుండేదికాదు. ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలతో నా తలప్రాణం తోకకి వచ్చేది. కెమిస్ట్రీ క్లాసు వున్నప్పుడల్లా ఆ క్లాసు ఎగ్గొట్టి లైబ్రరీకి వెళ్ళేవాడిని. మా ఇంట్లో దొరకని ముని మాణిక్యం నాకు కాలేజీలో దొరికాడు. కెమిస్ట్రీ క్లాసు వున్నప్పుడల్లా నాకు అతనితోనే సాన్నిహిత్యం. శ్రీశ్రీని, చలంని, దాశరథిని, బుచ్చిబాబుని ఇంట్లోనే అవపోశన పట్టాను. కెమిస్ట్రీ క్లాసు పుణ్యమా అని మా కాలేజీలో వున్న సాహిత్యాన్నంతా చదివేశాను.

అనుకోకుండా బి.యస్సీ ఫైనలియర్లో వుండగా ఓ కథ రాశాను. ఓ పత్రికకి పంపించాను. అట్లా మళ్ళీ పోస్టాఫీసుకి వెళ్ళాను. రెండు వారాల్లోనే కథ ప్రచురించబడి నన్ను ఆశ్చర్యానికి, ఆనందానికి గురిచేసింది. డిగ్రీ పరీక్షలు అయిపోయిన తరువాత సెలవులకి మా వేములవాడకి వచ్చేశాను.

నా కథను చూసిన మిత్రుడు శివకుమార్, రవీంద్రతోబాటు ఒకరోజు నా దగ్గరికి వచ్చాడు. మా వేములవాడలో ఓ సంస్థ పెడదామన్న ఆలోచన చెప్పాడు. అంతే! ముగ్గురం కలిసి చంద్రమౌళిని కలిశాం. నటరాజ కళానికేతన్ పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థని పెట్టాం. ఆ తరువాత 'నవత' అన్న లిఖిత మాసపత్రికను ప్రారంభించాం. ఆ 'నవత' పత్రికని పత్రికలకి సమీక్షలకి పంపించడం, మిత్రులకి, రచయితలకి పంపించడం. ఆ విధంగా పోస్టాఫీసుతో అనుబంధం పెరిగింది. ఆ నవత మీద వచ్చే ఉత్తరాలకోసం



ఎదురుచూడడం మొదలైంది. ఇక మేము పోస్టాఫీసుకు వెళ్ళడం మొదలుపెట్టాం. ఓ గంట అటూఇటూ పోస్ట్‌మన్ రాములు తెచ్చిస్తాడని తెలుసు. అయినా పోస్టాఫీసుకి వెళ్ళకుండా వుండలేకపొయ్యేవాళ్ళం.

ఉత్తరాలని సార్టింగ్ చేసుకుంటున్న మా రాములుని 'మాకేమైనా ఉత్తరాలు వచ్చినాయా' అని అడిగి విసిగించేవాళ్ళం. కానీ ఆయన విసుక్కునేవాడు కాదు. మాలాంటి వాళ్ళని ఎంతమందిని చూశాడో! నేను రాసిన ఓ కవిత పబ్లిష్ అయి పోస్ట్‌లో కాంప్లిమెంటరీ కాపీ వచ్చింది. ఆరోజు ఆనందానికి హద్దులు లేవు. తరువాత ఓ పది రూపాయలు ఆ పత్రిక వాళ్ళు పంపించారు. ఆ రకంగా నాకూ పోస్టుమాన్‌కి అనుబంధం పెరిగిపోయింది. తిలక్ రాసిన పోస్టుమన్ కవిత చదువుకుంటూ రోజూ పోస్టాఫీసుకు వెళ్ళేవాడ్ని.

ఆ తరువాత లా చదువుకోసం హైదరాబాద్ వచ్చేశాను. పోస్టుమన్‌తో అనుబంధం ఇంకా పెరిగింది. కథలు, కవిత్వాలూ, ఉత్తరాలు. ఇంటినుంచి వచ్చే మనియార్డర్లు ఇదంతా పోస్టుమాన్‌తోనే. మధ్యాహ్నం లంచ్‌లో ఉత్తరాలని చూసుకోవడం, ఆ తరువాత కాలేజీకి వెళ్ళడం. లా చదువు అయిపోయిన తరువాత న్యాయవాదిగా అవతారం.

న్యాయవాదిగా మారిన తరువాత పోస్టుమన్‌తో అనుబంధం తగ్గలేదు. పెరిగింది. మిత్రుల ఉత్తరాలు, కవుల దగ్గర నుంచి పుస్తకాలు, సాహిత్య పత్రికలు, బులెటిన్లు మాత్రమే కాదు, లీగల్ నోటీసులు, జవాబులు, లా జర్నల్స్ అదనంగా చేరాయి.

పెళ్ళికి కొంత ముందు మా ఆవిడతో పరిచయం ఏర్పడింది. అప్పుడు ఆమె ఉత్తరాలతో అనుబంధం. పెళ్ళి తరువాత ఎప్పుడూ నా వెంటే వుంది కాబట్టి ఉత్తరాలు రాసుకునే అవకాశం లేకుండాపోయింది.

రాజేందర్ 'జింబో'

రెండుమూడు ఉత్తరాలు వచ్చిన రోజు ఏదో సంపాదించినట్టు ఆనందం. రానిరోజు ఏదో పోగొట్టుకున్నట్టు. ఉత్తరం ఓ స్నేహితునిలా సన్నిహితునిలా హత్తుకునేది. కొన్ని ఉత్తరాల్లో భావోద్వేగం వుండేది. ఆ భాషలో పదును వుండేది. చాలా విషయాల మీద చర్చలు వుండేవి. గొప్ప కవిత్వం వుండేది. కొంతకాలం తరువాత మళ్ళీ చదువుకుంటే ఎన్నో జ్ఞాపకాలు.

కొంతకాలం తరువాత కొరియర్లు వచ్చాయి. పోస్టుమెన్‌లా వాళ్ళూ పనిచేసేవాళ్ళు. కానీ వాళ్ళకి ఓ నిర్ణీత సమయం లేదు. ఎప్పుడు వస్తారో తెలియదు. ఎన్నో కొరియర్ సంస్థలు. ఎంతోమంది ఉద్యోగులు. అందుకని వాళ్ళతో అనుబంధం వుండే అవకాశం లేదు. వాళ్ళకోసం ఎదురుచూడ్డం అంతకన్నా లేదు.

మరికొంత కాలానికి సూపర్‌ఫాస్ట్ టెక్నాలజీ ఇంటర్నెట్ వచ్చింది. మనస్సులో అనుకున్నంతలోనే అవతల వాళ్ళకి సమాచారం పంపించే అవకాశం వచ్చింది. ప్రపంచంలోని ఏ మూల నుంచైనా ఎప్పుడైనా సమాచారం అందుకోవచ్చు. ప్రతిరోజూ చాట్ చెయ్యవచ్చు. దాని ప్రభావంలో నేనూ పడిపొయ్యాను. మొదట్లో ఇంటర్నెట్ అంటే ఎంతో పిచ్చిగా వుండేది. ఈరోజు చదివిన మంచి కవిత గురించి మిత్రులకు అప్పుడే మెయిల్ చెయ్యడం అలవాటుగా మారిపోయింది. కోర్టునుంచి ఇంటికి రాగానే ఉత్తరాలతో పాటూ ఈ-మెయిల్ చూసుకోవడం నిత్యకృత్యమై పోయింది.

కాలక్రమంలో మెయిల్స్ చిన్నగా అయిపోయినాయి. సమాచారాలు చిన్నగా అయిపోయినాయి. యాంత్రికంగా కూడా మారిపోయినాయి. కొత్త షార్ట్‌హ్యాండ్ లిపి వచ్చేసింది. ఉత్తరాల్లో వుండే తాజాదనం పోయింది. ఉత్తరాలని ఓపెన్ చేసుకొని ఆ రాతని, రాత వెనుక వున్న ఆత్మీయతని స్పర్శించే అవకాశం లేకుండా పోయింది. భావాల ప్రవాహం లేదు. వాటికీ అంతరాయమే. ఉత్తరాల్లో వుండే మజా లేకుండా పోయింది.

ఫోన్లొచ్చి ఉత్తరాలకి అంతరాయం కలిగింది. ఫోన్లు ఖర్చుతో కూడుకున్నవి కాబట్టి ఒకటి రెండు మాటలతో ముగించేవాళ్ళు. కానీ ఈ-మెయిల్స్‌కి ఖర్చులేదు.

ఎలాంటి ఉత్తరం ఎలా అయిపోయింది. రచయితలు కవులూ రాసుకున్న ఉత్తరాలు. తలపులని, వలపులని, బాధలని, వేదనలని, కన్నీరుని కడగండ్లని ఆనందాన్ని ఆవేదనను పంచే ఉతరం లేదా?

ఉత్తరాల్లో ఎంత సాహిత్యం వచ్చింది. చలం ప్రేమలేఖలు, లారెన్స్ ఉత్తరాలు ఇలా ఎన్నో. ఉత్తరాల్లో ఉభయకుశలోపరి మాత్రమే కాదు. జీవితం వుండేది, ఎడబాటు వుండేది. లాలన వుండేది. అన్నిటికన్నా మించి ఎదురుచూపు వుండేది. ఓ ఆశ వుండేది. గొప్ప సాహిత్యానికి అవకాశం వుండేది.

ఈ-మెయిల్లో గొప్ప సాహిత్యం వస్తుందన్న నమ్మకం నాకు లేదు. ఈ-మెయిల్స్ సూటిగా గుచ్చుకున్నట్టుగా ఉంటున్నాయి. చదవడానికి ఎలాంటి ఉత్సాహం వుండడం లేదు.

ఈ మధ్య మా అబ్బాయి మెయిల్ చూసే అవకాశం కలిగింది. *"Yaar... kokil n carmel ... how z life ... result out... how z kavitha. 4 get her... ragged ur juniors... wishing u d v best in life..."*

అది చూసి ఆశ్చర్య చకితుణ్ణయ్యాను. ఏం మాట్లాడాలో తోచలేదు. భాషలోని సౌలభ్యమా? భాషని అవహేళన చెయ్యడమా? మా అబ్బాయి మెయిల్లోనే కాదు. చాలా మెయిళ్ళలో ఇదే భాష. కొత్త లిపి. ప్రవాహం లేదు. అన్నీ అంతరాయాలే.

కాలప్రవాహంలో ఎన్ని మార్పులు. ఎంత వేగం. కాలంకన్నా వేగం. మనస్సుకన్నా వేగం. మనస్సు లేని వేగం.

మెసేజీలు, ఈ-మెయిల్స్ ఎన్ని వచ్చినా ఉత్తరం తన స్థానాన్ని కోల్పోతుందా? పోస్ట్‌మన్ కనుమరుగైపోతాడా? మనియార్డర్లనే కాదు, మరపురాని జ్ఞాపకాన్ని ఇచ్చి వెళ్ళడా? రాఖీలనే కాదు రంజాన్ శుభాకాంక్షలని అందజెయ్యడా?

ఈ-మెయిల్స్‌లో కలకాలం దాచుకునే అక్షరం లేదు. రాతలేదు. సంతకం లేదు. సత్వర సమాచారంలో ఎంత ఆనందం వుందో అంతకన్నా ఎక్కువ అసంతృప్తి వుంది.

అందుకే నేను మళ్ళీ నా ఉత్తరానికి మారిపొయ్యాను.

ఈ ఆధునిక యుగంలో అనాగరికం అనుకున్నా పర్వాలేదు. నేను మళ్ళీ నా ఉత్తరంలోకి మారిపొయ్యాను. గొప్ప గర్వంలోకి వెళ్ళిపొయ్యాను.

కాగితం లేని ప్రపంచం

మనస్సు లేని ప్రపంచం

కన్నీరు లేని ప్రపంచం

ఎక్కడైనా వుంటుందా?

ఎప్పుడైనా వస్తుందా?

అలాంటి ప్రపంచాన్ని ఊహించగలమా?

నాకు తెలిసి మనస్సున్నంత కాలం కాగితం వుంటుంది. కాగితం వున్నంతకాలం ఉత్తరం వుంటుంది. కన్నీరున్నంత కాలం ప్రపంచం వుంటుంది. కలతలున్నంత కాలం కవిత్వమూ కథలూ వుంటాయి.

★ ★ ★

సర్కస్ మోహన్

మా వేములవాడలో మహాశివరాత్రి బ్రహ్మాండంగా జరుగుతుంది. ఆ జాతర చూసి తీరాల్సిందే కానీ చెప్పడానికి మాటలు చాలవు. జనవరి నెల నుంచే మా వూర్లో సందడి పెరిగిపోతుంది. ఫిబ్రవరిలో షాపులన్నీ కొత్త రంగులతో కొత్త హంగులతో ముస్తాబవుతాయి. ఒక్కమాటలో చెప్పాలంటే శివరాత్రికోసం వూరు వూరంతా ఎదురుచూస్తుంది. ఫిబ్రవరి చివరి వారంలోనో, మార్చి మొదటి వారంలోనో మహాశివరాత్రి వస్తుంది. జనవరి నుంచి మే నెల దాకా అంటే వానలు పడేదాకా ప్రతి సోమవారం, శుక్రవారం మా వూర్లో శివరాత్రి లాగే వుంటుంది.

శివరాత్రి రోజుల్లో తమ వ్యాపారం బాగా అభివృద్ధి చెందుతుందని వ్యాపారస్తులు శివరాత్రి కోసం ఎదురుచూస్తే, భక్తులు ఎక్కువగా వస్తారని మావూరి బ్రాహ్మలు ఎదురు చూస్తారు. ఒక్కొక్కరికి ఒక్కో కారణం. మావూరి పిల్లలకి మాత్రం శివరాత్రికి వచ్చే ఆటపాటల మీద, సర్కస్ మీదే దృష్టి.

శివరాత్రి మూడు రోజులు మావూర్లో విపరీతమైన రష్. ఊరికి చాలాదూరంలో వున్న మా ఇంటి పరిసర ప్రాంతాలు కూడా జనాలతో నిండిపోతాయి. బజార్లో నడవడం చాలా కష్టంగా వుంటుంది. శివరాత్రికి ముందురోజు మా చెరువు కట్ట మీద మాలజంగాల పూజలు. శివరాత్రి రోజు గుడిలో పూజలు. శివరాత్రి తెల్లవారి బద్దిపోచమ్మ గుళ్లో పూజలు. సికింద్రాబాద్ నుంచి వచ్చే భక్తులు ఈ మూడు రోజులు వుండి పూజలు చేస్తారు. బద్దిపోచమ్మకి పూజలు చేసే రోజు కల్లు పొంగిపొర్లుతుంది.

మా రాజేశ్వరుని గుడి ముందు ప్రాంతంలో చాలా విశాలమైన స్థలం. దాన్ని జాతర గ్రౌండ్ అంటారు. శివరాత్రికి వచ్చే భక్తులకోసం ఆ గ్రౌండ్. భక్తులకోసం చాలా రూంలు కట్టించారు. అయినా రూంలు చాలక రోడ్లమీద లెక్కలేనంత మంది జనం. అక్కడే వంటలు భోజనాలు, పడకలు.

శివరాత్రి జాతరకోసం మా జాతర గ్రౌండ్‌లో ఎన్నో షాపులు వెలిసేవి. పూలు, అత్తర్లు, షికాకాయ, కుంకుమ, గులాలు, బత్తీసల దుకాణాలు, గాజుల దుకాణాలు, ఆటవస్తువుల దుకాణాలు. రోడ్లమీద ఎంతోమంది వ్యాపారస్తులు. పుట్నాలు, పేలాలు అమ్మేవాళ్ళు కొందరైతే పెద్ద పెద్ద బుగ్గల్ని, గవ్వలని, పచ్చీసులని, పిల్లనగ్రోవులని అమ్మేవాళ్ళు

మరికొందరు. శివరాత్రి రోజులు పిల్లలకి ఓ వింత ప్రపంచం. జాతర గ్రౌండ్ ఓ పెద్ద ఆకర్షణ.


జాతరలో ఎన్ని వస్తువులు కొనుక్కున్నా వాళ్ళకి తనివితీరదు. పెద్దవాళ్ళతో కలిసి ఈ వస్తువులు కొన్నప్పటికీ పిల్లలు జాతరలో కాటగలిసిపొయ్యేవాళ్ళు. కాటగలిసిపోయిన పిల్లలకోసం మైకుల్లో ప్రకటనలు. మా చిన్నప్పుడు మా శివరాత్రి జాతర ఓ రంగుల కల. ఓ అద్భుత ప్రపంచం.

శివరాత్రి రోజుల్లో మా జాతర గ్రౌండ్‌లో ఎన్నో వింతలు వుండేవి. ఎన్నో ప్రదర్శనలు జరిగేవి. ట్యూబ్‌లైట్లని ముట్టుకుంటే చాలు అవి వెలిగేవి. వాటిని వెలిగించడానికి ఎలక్ట్రిక్ అమ్మాయిలు. అట్లాగే చెక్కలతో వృత్తంలాగా ఓ ఎత్తయిన నిర్మాణం చేసేవాళ్ళు. ఆ నిర్మాణం మధ్యలో ఖాళీ స్థలం. పైన జనం నిల్చొని చూడ్డానికి స్థలం మధ్యలో వున్న ఖాళీ స్థలంలో ఓ యువకుడు వచ్చి పైకీ కిందికి సైకిల్ మోటారుని నడిపేవాడు. ఒళ్ళు గగుర్పాటు కల్గించే ఫీట్లు చేసేవాడు. ఇవేకాదు. గ్లోబులో కూడా సైకిల్ మోటారు ప్రదర్శన ఫీట్లు వుండేవి. ఇద్దరు వ్యక్తులు సైకిల్ మోటారుని నడిపి ఫీట్లు చేసేవాళ్ళు. రంగుల రాట్నాలు, జెయింట్ వీల్, మనల్ని వింత వింత రూపాల్లో చూపించే అద్దాల ప్రదర్శనలు, టూరింగ్ టాకీసులు ఇలా ఎన్నో.

ఇవన్నీ ఒక ఎత్తు. జాతరకి మా వూరికి వచ్చే సర్కస్ మరో ఎత్తు. మా ప్రాంతానికంతా ఓ పెద్ద ఆకర్షణ సర్కస్. సర్కస్‌కోసం ఎదురుచూడని పిల్లలు మా వూర్లో ఎవరూ వుండేవాళ్ళు కాదు. సర్కస్‌కోసం టెంట్లు వేస్తున్న దశ నుంచి టెంట్లు తీసేదశ వరకూ పిల్లలు రోజూ అక్కడికి వెళ్ళేవాళ్ళు.

మా చిన్నప్పుడు సర్కస్ వచ్చిందన్న ప్రచారం కూడా చాలా గమ్మత్తుగా జరిగేది. ఒకరోజు ఒంటెలతో ప్రచారం చేసేవాళ్ళు. మరోరోజు ఏనుగుల మీద పహిల్వాన్లని కూర్చుండబెట్టి ప్రచారం చేసేవాళ్ళు. ఆ ఒంటెలను, ఏనుగులను చూడ్డానికి పిల్లలతో బాటు పెద్దలు కూడా ఇంటి ముందుకి వచ్చి నిల్చొని చూసేవాళ్ళు. ఏనుగు ముందుకు భయపడుతూనే వెళ్ళేవాళ్ళు. అరటి పండ్లని కొబ్బరి కాయలను వాటికి ఇచ్చేవాళ్ళు.

మా వేములవాడ జాతరలో ఏది చూసినా చూడకపోయినా సర్కస్ మాత్రం మిస్ అయ్యేవాళ్ళు కాదు. సర్కస్‌కి డబ్బులు ఇచ్చేంతవరకు పెద్దవాళ్ళ ప్రాణాలని తీసేవాళ్ళు పిల్లలు. సర్కస్‌లో సింహాలు, పులులు, కోతులు, ఎలుగుబంట్లు రంగురంగుల వేషాల్లో అమ్మాయిలు, ఒకరినొకరు కొట్టుకుంటూ అందరినీ నవ్వించే జోకర్లు. అందరూ శివుని కోసం చూస్తే పిల్లలు మాత్రం సర్కస్ కోసం ఎదురుచూసే వాళ్ళు.



సర్కస్‌కి వెళ్ళాలంటే చాలా కష్టంగా వుండేది. జాతర గ్రౌండ్‌కి వెళ్ళడం ఓ యుద్ధంలా వుండేది. స్వీట్ షాపులనీ, బత్తీసల షాపులనీ, బొమ్మల షాపులనీ దాటుకుంటూ వెళ్ళాల్సి వచ్చేది.

చేటలో చిన్నపిల్లల్ని పెట్టుకుని ఒళ్ళంతా గాయాలు చేసుకుని హంటర్‌తో కొట్టుకుంటున్న బయిండ్ల వాళ్ళని దాటుకుంటూ వెళ్ళాల్సి వచ్చేది. కుష్టురోగులు, ముళ్ళకంపల మీద పడుకుని బిచ్చం అడుక్కుంటున్న బిచ్చగాళ్ళని, గుడ్డివాళ్ళని దాటుకుంటూ వెళ్ళాల్సి వచ్చేది.

మాకు శ్రీను అనే దోస్తు వుండేవాడు. జాతర రోజుల్లో మేం సర్కస్ గురించి, జంతువుల గురించి మాట్లాడుకుంటే, వాడు వాళ్ళ అన్న గురించి చెప్పేవాడు. వాళ్ళ అన్న ప్రభాత్ సర్కస్‌లో పనిచేస్తాడని, జూలాతోని ఫీట్లు చెయ్యడంలో అతను పెద్ద ఎక్స్‌పర్టని చెప్పేవాడు. వాళ్ళ అన్న గురించి, అతని ఫీట్ల గురించి రకరకాలుగా వర్ణించి చెప్పేవాడు. మా వూరికి సర్కస్ వచ్చిన ప్రతి సంవత్సరం ఈ కథలు చెప్పేవాడు.

వాడు వాళ్ళ అన్న గురించి చెప్పిన కథలు వినీ వినీ మా స్నేహితులందరికీ విసుగెత్తి పోయింది.

"నువ్వు కథలు చెప్పడం మానెయ్యి, మీ అన్న సర్కస్‌లో పనిచేస్తున్నాడో లేదో మేం నమ్మం" అని రఫీక్ అంటే – మీ అన్న సర్కస్ మన వూరు రావడం లేదెందుకని శివప్రసాద్ అడిగేవాడు. ఈ ప్రశ్నలకు వాడి దగ్గర ఎలాంటి సమాధానం వుండేది కాదు. వాడు

చిన్నబుచ్చుకునేవాడు. అది చూసి 'అది చాలా పెద్ద సర్కస్‌లే. అందుకే మన వూరికి రావడం లేదు కదా' అని రవీందర్ అనేవాడు.

'అవును. అది చాలా పెద్ద సర్కస్. ప్రభాత్ సర్కస్'. అందుకే మన వూరికి రావడం లేదు" అని శ్రీను అనేవాడు.

ఎన్నడో ఒకరోజు ఆ సర్కస్ వేములవాడకి రాకపోతుందా మా అన్న ఫీట్లు వీళ్ళకి చూపించకపోతానా అన్నట్లు మొహం పెట్టేవాడు.

నిజంగానే ఓ శివరాత్రి జాతరలో ప్రభాత్ సర్కస్ మా వూరికి వస్తున్నట్టు రిక్షాలో ప్రచారం చేశారు. ఈ విషయం శ్రీనుకు ముందే తెలుసట. వాళ్ళ అన్న ఉత్తరం రాశాడు. కానీ వాడు మాతో చెప్పలేదు. ఒక వేళ సర్కస్ మా వూరికి రాకపోతే మేం దెప్పుతామని చెప్పలేదట.

మైకులో సర్కస్ వస్తున్న ప్రచారం జరిగిన రోజు చూడాలి వాడి మొహం. ఓ విజయగర్వం. సంతోషం. మళ్ళీ అన్న గురించిన కథలు చెప్పాడు. అతను సర్కస్‌లో చేసే ఫీట్ల గురించి చెప్పాడు. వాడు చెప్పిన మాటలని ఈసారి మా మిత్రులందరూ శ్రద్ధగా విన్నారు. సర్కస్‌లో వాళ్ళ అన్న జూలా ఎట్లా వూగుతాడో, ఒక జూలా వదిలిపెట్టి మరో జూలా ఎలా పట్టుకుంటాడో పులి మీద కూర్చుని ఎట్లా స్వారీ చేస్తాడో చెప్పాడు. వాడి మాటలు మా మిత్రబృందం పట్టించుకున్నారు. వాళ్ళ అన్న గురించి ఎన్నో ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

"అది సరే! మీ అన్న సర్కస్‌లోకి ఎట్లా పోయిండ్రా" అడిగాడు రఫీక్.

ఆ ప్రశ్నతో శ్రీను మొహం వివర్ణమైపోయింది. అయినా జవాబు చెప్పాడు. పేదరికం వల్ల వాళ్ళ అన్నని తల్లిదండ్రులు సర్కస్ కంపెనీకి అమ్మినారని చెప్పినాడు. సర్కస్ కంపెనీ నుంచి నెలకి కొంత డబ్బులు కూడా వస్తున్నాయని చెప్పాడు. ఇవన్నీ చెబుత్నుప్పుడు వాడి గొంతు వణికింది. అప్పటిదాకా అన్న గురించి చెప్పిన ఊపు తగ్గింది. కళ్ళకి నీళ్ళొచ్చాయి.

ఆ ప్రశ్న అడిగినందుకు రఫీక్‌ని అందరమూ తిట్టాం. ఓ అరగంట తరువాత అందరమూ మామూలుగా అయ్యాము. కానీ సర్కస్ కంపెనీకి శ్రీను వాళ్ళ అన్నని అమ్మినారన్న విషయం అందరిని కలచివేసింది. ఏదో తెలియని బాధ అందరి గుండెల్లో చోటుచేసుకుంది.

ఎదురుచూస్తున్న సర్కస్ మా వూరికి రానే వచ్చింది. శ్రీను అందరినీ సర్కస్ దగ్గరికి తీసుకొని పోయిండు. శ్రీను వాళ్ళ అన్న శ్రీనులాగే వున్నాడు. అతని పేరు మోహన్. శ్రీను కన్నా నాలుగేళ్ళు పెద్ద. పన్నెండు పదమూడు సంవత్సరాలుంటాయి. కానీ చాలా పెద్ద

వాడిలా అన్పించాడు. అందరం అతన్ని పరిచయం చేసుకున్నాం. మా అందరి వివరాలు ఆసక్తిగా అడిగి తెలుసుకున్నాడు.

శ్రీనుతోబాటు మా స్నేహితులందరికీ ఫ్రీగా సర్కస్ చూపేందుకు అనుమతి తీసుకున్నాడు. ముందు సీట్లలో కూర్చున్నాం. ఎప్పుడూ దూరం నుంచి సర్కస్ చూసే మాకు ఆరోజు మొదటిసారిగా దగ్గరనుంచి సర్కస్ చూసే అవకాశం దొరికింది. శ్రీను చెప్పినట్లు వాళ్ల అన్న జూలా వూగడంలో ఎక్స్‌పర్ట్. అంత ఎత్తులో వూగుతూ, చేతులు విడిచిపెడుతూ ఎన్నో ఫీట్లని చేశాడు. మేం చాలా ఉషారుగా చప్పట్లుకొట్టాం. శ్రీను మాత్రం ఉషారుగా లేడు. చేతులు జోడించి మా రాజేశ్వరుణ్ణి మొక్కడం కన్పించింది. మోహన్‌కి ఏమీ కావద్దని మొక్కినాడేమో.

సర్కస్‌లో ఫీట్లు చేసిన మోహన్ మా అందరి దృష్టిలో సినిమా హీరోలా కన్పించాడు. సర్కస్ అయిపోయిన తరువాత అందరం మోహన్ దగ్గరికి పోయినాం. అందరం అతని చుట్టూ చేరి అభినందించాం. అతనికి షేక్‌హ్యాండ్ ఇచ్చి గొప్పగా ఫీలయ్యాం. సర్కస్‌లో పనిచేస్తున్న ఇద్దరు ముగ్గురు వ్యక్తులని పరిచయం చేశాడు. అతనికి రెండో షో వుంది. అందుకని అందరమూ వెళ్ళిపోయాం.

తెల్లవారి ఉదయం మోహన్‌ని మళ్ళీ కలిశాం. సింహాలని, పెద్దపులులని బంధించిన పెట్టెల దగ్గరకు తీసుకొని పోయిండు. ఆ తరువాత కోతులని చూపించాడు. సర్కస్‌లో పనిచేసే జోకర్లని పరిచయం చేశాడు. అమ్మాయిలని పరిచయం చేశాడు. ఇంతలా దగ్గరగా వాళ్ళని చూసే అవకాశం ఇదివరలో మాకు దొరకలేదు.

మా చదువుల గురించి అడిగాడు. మా బడి గురించి అడిగాడు. మా ఆటల గురించి అడిగాడు. బాగా చదువుకొమ్మని చెప్పాడు. మా మార్కులు తెలుసుకున్నాడు. సంతోషించాడు. ఆ సంతోషంలో ఏదో విషాదం ధ్వనించింది.

కొద్ది సేపటికి శ్రీను వాళ్ళ అమ్మాబాపు అక్కడికి వచ్చారు. వాళ్ళు మోహన్‌ని కౌగిలించుకుని ఏడ్చారు. వాళ్ళను చూసి శ్రీను ఏడ్చాడు. మేమూ ఏడ్చాము. కాసేపటికి మాటల్లో పడ్డారు. ఎన్నో ప్రశ్నలు వేసి చాలా విషయాలు తెలుసుకున్నారు.

మ్యాట్నీ షోకి టైం అవుతుందని ఓ జోకర్ వచ్చి మోహన్‌ని హెచ్చరించాడు. సర్కస్ చూడమని తల్లిదండ్రులని అడిగాడు. వాళ్ళు చూడలేమని చెప్పారు. 'మళ్ళీ చూస్తారా' అని మమ్మల్ని అడిగాడు. ఆ గంభీరమైన వాతావరణంలో మళ్ళీ సర్కస్ చూడాలన్న కోరిక మాలో ఎవరికీ కలుగలేదు. శ్రీనూని, తల్లిదండ్రులని, మమ్మల్ని వదలలేక వదలలేక మోహన్ అక్కడి నుంచి కదిలాడు.

అందరమూ కలిసి ఇంటికి బయల్దేరాం.

నెలరోజులు తెలియకుండానే గడిచిపోయాయి. సర్కస్ వేరే వూరికి బయల్దేరే సమయం వచ్చేసింది. చాలా జంతువులని అప్పటికే తరలించారు. మోహన్ కూడా వెళ్ళిపొయ్యే సమయం వచ్చేసింది. ఆరోజు శ్రీను వాళ్ళ అమ్మబాపులతో పాటు మేమూ సర్కస్ దగ్గరకు వెళ్ళాం. శ్రీను వాళ్ళ అమ్మ మోహన్‌ని అలుముకుని కన్నీళ్ళు పెట్టుకుంది. మోహన్ కన్నీళ్ళు పెట్టుకున్నాడు. ఎప్పుడూ సర్కస్ టెంట్ల చుట్టూ తిరిగే మేం ఆరోజు మోహన్ దగ్గరే వుండి పొయ్యాం.

సర్కస్ వాహనాలు రెడీ అయినాయి. మోహన్ దగ్గరికి అప్పటికే ఇద్దరు ముగ్గురు హెచ్చరికగా వచ్చి వెళ్ళారు. వాళ్ళ రాకను గమనించి మోహన్ అక్కడి నుంచి కదలలేక కదలలేక కన్నీళ్ళతో కదిలాడు. సర్కస్ వెనక వున్న విషాదంతో మా కళ్ళలోకి నీళ్ళొచ్చాయి.

"పైలంగ వుండు బిడ్డా!" అన్నారు మోహన్ తల్లి దండ్రులు. వాళ్ళ మాటల్లో ఏదో తెలియని విషాదం, వణుకు, జ్వరం గొంతు. మోహన్ కనుమరుగైన తరువాత శ్రీను వాళ్ళ బాపు దుఃఖానికి అంతులేదు.

"వాడిని మన బతుక్కోసం మనమే అమ్మేసుకున్నాం గదనే. మన నలుగురు పిల్లలతోబాటు వాడికి ఇంత తిండి దొరుకకపోవునా?" అంటూ ఏడ్చాడు. అతన్ని ఓదార్చడం ఎవరి తరం? బహుశా మా వేములవాడ రాజేశ్వరుని తరం కూడా కాదేమో.

మా అందరి దృష్టిలో, మా వూరి వాళ్ళందరి దృష్టిలో హీరోగా వెలిగిన మోహన్ సర్కస్ కంపెనీతోబాటూ మరో వూరు వెళ్ళిపోయాడు.

ఆరునెలలు గడిచిపోయినాయి. మా రాజేశ్వరుని గుడి ముందు నుంచి గోకుల్ టాకీసు వైపు సినిమాకి పోదామని నేనూ, రవీందర్, శివప్రసాద్ వెళ్తున్నాం. ఉడిపి హోటల్ వైపు ఎందుకో చూశాం. అందులో ఓ టేబిల్ దగ్గర మోహన్ నిల్చుని కన్పించాడు. అతనేనా కాదా అన్న అనుమానంతో లోపలికి వెళ్ళడానికి ఉద్యుక్తులమయ్యాం. మమ్మల్ని గమనించి మోహన్ బయటికి వచ్చాడు.

"ఎప్పుడొచ్చినావని" అడిగాం అందరమూ ఒకేసారి.

"నిన్ననే వచ్చిన - మా అమ్మ బాపులని కలిసిన" అన్నాడు.

"హోటల్లో ఏం చేస్తున్నావు" అడిగాను.

"హోటల్లో పనికి కుదిరిన"

"సర్కస్‌కి వెళ్ళవా" అడిగాడు శివప్రసాద్.

"పోను. ఇక సర్కస్‌లో పని చెయ్యను. మొన్న జాతరకి ఇక్కడికి వచ్చిపోయిన తర్వాత నుంచి నా మనస్సు మనస్సులో లేదు. ఎప్పుడూ మీరే యాదికొచ్చిండ్రు. అమ్మా బాపే గుర్తుకొచ్చిండ్రు. అందుకే సర్కస్ కంపెనీ నుంచి వచ్చేసిన. అమ్మా బాపులని కలిసిన. ఈ హోటల్లో నౌకరీగా చేరిన" ఉద్వేగంగా చెప్పాడు. ఆయన మాటల్లో ఆనందమే తప్ప మరేమీ కన్పించలేదు. ఏదో కోల్పోయిన వాడిలా లేడు. ఏదో దొరికిన వాడిలా వున్నాడు.

"నీకోసం సర్కసోల్లు రారా" అడిగాను భయంగా.

"రాకపోవచ్చు. ఎందుకంటే ముందటిలాగా నేను సర్కస్ ఫీట్లుచెయ్యలేకపోతున్నాను. అవి కుదురత లేవు. రెండుసార్లు జారి ఉయ్యాలమీద పడిన. ఎంత జాగ్రత్తగా వున్నా తప్పులు జరుగుతున్నాయి. నా పనితనం తగ్గిందని వాళ్ళు రాకపోవచ్చు. వచ్చినా నేను పోను. ఈ ఊరిని, మిమ్మల్ని, శ్రీనుగాడిని, అమ్మనీ బాపునీ చెల్లెండ్లని వదిలి పోను. ఇక్కడే వుండి అంతో ఇంతో సంపాదిస్తాను" అన్నాడు మోహన్.

మేమందరం ఊపిరి పీల్చుకున్నాం.

ఒకప్పటి మా సర్కస్‌హీరో - ఇప్పుడు హోటల్లో సర్వర్. ఒకప్పటి సర్కస్ బందీ, ఇప్పుడు స్వేచ్ఛగా బంధనాల్లో బందీ.

మా జాతరలో పిల్లలు కాటగలిసి పోవడమే కాదు. పిల్లలు తల్లిదండ్రులని కలుస్తారని తెలిసి మా రాజేశ్వరునికి మనస్సులోనే దండం పెట్టుకున్నాను. ప్రభాత్ సర్కస్ మా వూరికి వచ్చి గొప్ప పని చేసిందనిపించింది.

★ ★ ★

నాంపల్లి గుట్ట

మా వేములవాడకి కొండగుర్తు నాంపల్లి గుట్ట. కరీంనగర్ నుంచి వేములవాడకి వస్తున్న పెద్దవాళ్ళు పిల్లల్ని నిద్రలేపి అప్రమత్తం చేసే స్థలం మా నాంపల్లి గుట్ట.

మా చిన్నప్పుడు సెలవులు వచ్చినాయంటే కరీంనగర్ వెళ్ళే వాళ్ళం. అక్కడ మారాధక్క వుండేది. క్లాక్‌టవర్. కరీంనగర్ రోడ్లు, భవనాలు గొప్ప వింతని కలుగచేసేవి. సెలవుల తరువాత తిరిగి మా వూరికి బయల్దేరేవాళ్ళం. కరీంనగర్ నుంచి మా వూరు ముప్పై అయిదు కిలోమీటర్ల దూరంలో వుంటుంది. కరీంనగర్ నుంచి బస్సులో ప్రయాణం చెయ్యడం కూడా ఓ వింతైన అనుభవంలాగుండేది. బస్సు ప్రతి స్టేషన్లో ఆగేది. మంకమ్మతోటలో ఆగేది. ఆ తరువాత చింతకుంట, ఆ తరువాత ఎలగందుల. ఎలగందులలో పెద్దగుట్ట. దానిచుట్టూ పెద్దకోట. కరీంనగర్ ఏర్పడకముందు ఎలగందుల రాజధానిగా వుండేదంటారు. ఎలగందుల తరువాత బావుసాయిపేట, వెంకట్రావుపల్లె, ఒద్యారం దాటితే గానీ కొదురుపాక వచ్చేదికాదు. ఆ రోడ్డువెంట అన్నీ గుట్టలే వుండేవి. కొదురుపాక దగ్గర గుట్టలు లేవు. కాని వాగుండేది. మా మూలవాగు కొదురుపాక పక్కనే వున్న శాబాష్ పల్లె మీదుగా వెళ్ళి మానేరులో కలిసేది. ఆ వాగుమీద రెండు గజాల ఎత్తులో ఓ చిన్న రోడ్డులాంటి బ్రిడ్జి వుంది. ఆ తరువాత మరికొంతదూరం ప్రయాణం చేసిన తరువాత రోడ్డుకి కుడివైపు మా నాంపల్లి గుట్ట. ఎలగందుల గుట్ట చారిత్రాత్మకంగా ప్రసిద్ధి. మా నాంపల్లి గుట్ట నర్సింహస్వామికి ప్రతీతి.

నాంపల్లి గుట్టని ఆనుకొని బండ్లబాట వుండేది. ఆ దారిలో వెళితే మా వూరు మూడు కిలోమీటర్లే. కానీ కొంతదూరమైనా అగ్రహారం రోడ్డు దాకా వెళ్ళి కుడివైపు మలిగేది బస్సు. వాహనాలది అదే రూటు.


మా చిన్నతనంలో మా నాంపల్లి గుట్టతో మాకు విడదీయరాని అనుబంధం వుండేది. మా వేములవాడేమో శైవక్షేత్రం. కానీ మావూరి చుట్టు ప్రక్కల అన్నీ విష్ణు క్షేత్రాలే. మా నాంపల్లి గుట్టమీద లక్ష్మీనర్సింహస్వామివారు. ఇంతెందుకు. మా రాజేశ్వరుని గుడిలోనే అనంత పద్మనాభస్వామి, రాములవారు కొలువుదీరి వున్నారు. మా శివుని సేవతోబాటు హరిసేవ కూడా వుంటుంది. మా గుడిలో శివకళ్యాణం ఎంత గొప్పగా జరుగుతుందో శ్రీరాముని పెళ్ళి అంతకన్నా అద్భుతంగా జరుగుతుంది. శివరాత్రికి వూరు వూరంతా ఎట్లా కదిలి వస్తుందో శ్రీరాముని పెళ్ళికి కూడా అట్లాగే కదిలివస్తుంది.

ప్రతిసంవత్సరం శ్రావణమాసంలో నాంపల్లి గుట్టకి వెళ్ళడం, అగ్రహారంకి వెళ్ళడం మా వూరి వాళ్ళకి తప్పనిసరి. మా చిన్నప్పుడు ఒకటి రెండు బస్సులు వున్నా నాంపల్లి గుట్టకి నడిచే పోయేవాళ్ళం. ఓ గుంపుగా వెళ్లేవాళ్ళం. మా వూరినుంచి బండ్లబాటలో నాంపల్లి గుట్టకి నడిచి వెళ్ళడం ఓ గొప్ప అనుభవంలా వుండేది. కథలు చెప్పుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ వెళ్ళేవాళ్ళం. మా దారివెంట నీటికుంటలు. కప్పల బెకబెకలు. వాటిల్లో కట్లహూల చెట్లు. సర్కార్ తుమ్మలు. మా పిల్లల్ని పర్యవేక్షించడానికి పెద్దలు. పులిహోరా పెరుగన్నం మోసుకురావడానికి మా మల్లయ్య.

మూడు కిలోమీటర్లు నడిచి వెళ్ళడం ఒక ఎత్తు. ఆ తరువాత గుట్ట ఎక్కడం మరోఎత్తు. మొదటి పది నిముషాలు పరుగు పరుగున గుట్ట ఎక్కేవాళ్ళు. ఆ తరువాత అలసిపొయ్యేవాళ్ళు. నీడచాటు బండ కన్పించగానే కూర్చుండిపొయ్యే వాళ్ళు. సుకుమారంగా కన్పించే సూర్యుడు ప్రచండంగా మారిపొయ్యేవాడు. చిన్న నీళ్ళచెంబు ఓ గుదిబండలా మారిపొయ్యేది. అయినా ఎవరిలో ఉత్సాహం తగ్గేదికాదు. "నడుస్తారా! లేదా" అన్న మా మల్లయ్య మాటకి మళ్ళీ గుట్ట ఎక్కడం మొదలుపెట్టేవాళ్ళం, మళ్ళీ కాసేపటికి ఆగిపొయ్యేవాళ్ళం. మా కోసమే అన్నట్టుకొన్ని బండలు గూడులా వుండేవి. వాటి కింద కాస్సేపు విశ్రమించేవాళ్ళం. ఆ తరువాత మళ్ళీ నడక.

దారి వెంట బండల మీద చాలామంది పేర్లు కన్పించేవి. మా పేర్లు కూడా అలా చెక్కుదామంటే మా మల్లయ్య పడనిచ్చేవాడు కాదు. తొందరపెట్టేవాడు. ఎండ బాగా ముదరకముందు గుట్ట పూర్తిగా ఎక్కాలని అనేవాడు. దాంతో మా ప్రయాణం మళ్ళీ మొదలయ్యేది.

మరికాస్సేపు ప్రయాణం చేసిన తరువాత మెట్లు కన్పించేవి. మెట్లు కన్పించినాయంటే గుడి దగ్గరిదాకా వచ్చినట్టు లెక్క. మెట్లెక్కి గుడి ప్రాంగణంలోకి వెళ్ళే వాళ్ళం.



కాళ్ళుకడుక్కొని నర్సింహస్వామిని దర్శించుకునేవాళ్ళం. నర్సింహస్వామిని చూస్తే భయంగా అన్పించేది. రాములవారేమో ప్రశాంతంగా కన్పిస్తారు. ఈ నర్సింహస్వామి ఎందుకు ఇట్లా భయపెడతాడనిపించేది. ఆ తరువాత గుడి పక్కనే వున్న గుహలోకి వెళ్ళేవాళ్ళం. అక్కడ నవనాటి సిద్ధుల ప్రతిమలు వుండేవి. ఆ సిద్ధులే వేములవాడ గుడిని కట్టించారన్న ఓ కథ కూడా ప్రచారంలో వుంది. ఆ సిద్ధుల గుహనుంచి వేములవాడ గుడి వరకు సొరంగం వుందన్న కథనం కూడా చెప్పేవాళ్ళు.

ఈ రెండు దర్శనాలు అయిపోయిన తరువాత ఓ గుహలాంటి ప్రదేశంలోకి వెళ్ళేవాళ్ళం. రెండు పెద్ద బండలు. ఆ రెండింటి మీద మరో పెద్దబండ. ఓ పదిమంది కూర్చునే స్థలం. ఆ స్థలం నుంచి కిందికి చూస్తే కరీంనగర్ నుంచి మా వేములవాడకి వెళ్ళే రోడ్డు కన్పించేది. దూరంగా మా అనుపురం కన్పించేది. చుట్టూ చెట్లు, వృక్షాలు, వాటినుంచి వస్తున్న గాలి. మమ్మల్ని కాపలా కాసే మల్లయ్య. ఆ సన్నివేశం గుర్తుకు వచ్చినప్పుడల్లా పులకించిపోతాను. డార్జిలింగ్ కొండమీద నుంచి కిందికి చూసిన దృశ్యంకన్నా ఆ సన్నివేశమే అపురూపంగా అన్పించేది. ఎన్ని గుట్టలని చూసినా, ఎన్ని పర్వతాలను ఎక్కినా ఏదీ నా చిన్ననాటి అనుభూతి కన్నా అద్భుతంగా అన్పించేది కాదు.

మేం నాంపల్లికి వచ్చినప్పుడల్లా ఆ బండల గుహ కిందే భోజనాలు చెయ్యడానికి ఇష్టపడేవాళ్ళం. ఆ ప్రదేశం ఖాళీగా లేకుంటే ఓ అరగంట వేచి చూసైనా ఆ ప్రదేశంలోనే భోజనాలు చేసే వాళ్ళం. ఆ జాగాకోసం మా మల్లయ్యని కాపలాకి పెట్టేవాళ్ళం. మేం అక్కడ భోజనాలు చేస్తున్నంతసేపు మా వెంట వచ్చిన పెద్దవాళ్ళు మమ్మల్ని కాపలా కాసేవాళ్ళు.

ఓసారి పులిహోర తింటున్నప్పుడు మా గుణక్క చేతినుంచి టిఫిన్ డబ్బా మూత జారి కొంతదూరంలో పడిపోయింది. మా వెంట వచ్చిన సత్యనారాయణ కిందికి దిగి ఆ మూతని తీసుకొచ్చాడు. అతను పైకి వచ్చేదాకా మా అందరి గుండెలు గబగబా కొట్టుకున్నాయి. అతను పైకి వచ్చిన తరువాత అందరమూ ఊపిరి పీల్చుకొని చప్పట్లు కొట్టాం. ఇంటికి వెళ్ళిన తరువాత అతని వీరోచిత చర్యని అందరికీ పేరుపేరునా చెప్పాం. నాంపల్లి గుట్టకి వెళ్ళడం ఎంత సరదాగా వుండేదో ఇంటికి వచ్చిన తరువాత అంత కష్టంగా వుండేది. కాళ్ళు నొప్పులు పెట్టేవి. విపరీతంగా గుంజేవి. మా అక్క రిబ్బన్ తీసి కాళ్ళకి గట్టిగా కట్టుకుని పడుకునే వాణ్ణి. గుంజుతున్నాయని అంటే మరోసారి గుట్టకి పంపించరని అనేవాళ్ళం కాదు. నాంపల్లికి వెళ్ళడం ఓ విహార యాత్రలా వుండేది.

కాలేజీ చదువులకి వచ్చిన తరువాత నాంపల్లి గుట్టకి వెళ్ళడం తగ్గిపోయింది. ఉద్యోగంలో చేరిన తరువాత నాంపల్లి గుట్టకి వెళ్ళడం మర్చిపొయ్యాం. కొంతకాలం తరువాత పిల్లలు కొంత పెద్దవాళ్ళు అయిన తరువాత నడిచి నాంపల్లి గుట్టకి వెళ్దామని ప్రతిపాదిస్తే

పిల్లలెవరూ ఓటు వెయ్యలేదు. బస్సులో వెళ్దామంటే కూడా ఇష్టపడలేదు. అందరం కలిసి కార్లో వెళ్దామంటే – 'ఈ పెద్దవాళ్ళతో మేం రాము. మాకు పెద్ద బోర్' అన్నారు. 'ఎటు వెళ్ళనివ్వరు అంతా కట్టడి చేస్తారు' అని కూడా అన్నారు. మేం అలా బజారుకి వెళ్ళగానే మా పెద్దన్నయ్య కొడుకుని తీసుకుని నాంపల్లి గుట్టకి వెళ్ళిపోయారు.

పిల్లలతో నాంపల్లిగుట్టకి వెళ్ళడం కుదరనేలేదు. మా చిన్ననాటి స్నేహితులం కలిసి వెళ్దామంటే అదీ కుదరలేదు. అందరం కలిసేది ఒక్క దసరా పండుగ రోజే. దానికి కూడా అందరం రావడం లేదు. వచ్చినా అందరికీ కుదరడం లేదు. ఇట్లా నాంపల్లి గుట్టకి చాలా కాలంగా వెళ్ళలేకపోయాను. నాంపల్లి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోనిదే మీ వేములవాడ యాత్ర పూర్తికాదు అన్న బోర్డులు కూడా మా వూర్లో వెలిశాయి. అయినా వేములవాడకి మా యాత్రలు కొనసాగుతూనే వున్నాయి.

నాంపల్లి గుట్ట ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఎన్నో కొత్త విషయాలు చెప్పేవాడు మా చంద్రమౌళి. నాంపల్లి గుట్టకి వాహనాల్లో వెళ్ళడానికి వీలుగా రోడ్డు వేస్తున్నారని, వేములవాడ దేవస్థానం వాళ్ళు దానికి అవసరమైన డబ్బులు మంజూరు చేశారని ఓసారి, అక్కడ పెద్ద ఆంజనేయస్వామి విగ్రహం, కాళీయమర్దన చేస్తున్న కృష్ణుని విగ్రహం ప్రతిష్టిస్తున్నారని మరోసారి చెప్పేవాడు. మరోసారి మా వూరు వెళ్ళినప్పుడు మరో కొత్త విషయం చెప్పాడు. మా నాంపల్లి గుట్టమీద బిర్లా ప్లానిటోరియమ్ కూడా కడతారని, దాన్నొక టూరిస్ట్ కేంద్రంగా తయారుచేస్తారని. మా నగుబోతు చంద్రమౌళికి మా వూరంటే వల్లమాలిన అభిమానం. అందువల్ల అత్యాశతో అట్లా చెబుతున్నాడని అనుకునేవాణ్ణి. కానీ ఆయన బాధపడతాడని ఆ మాట ఆయనతో అనకపొయ్యేవాణ్ణి.

కొంతకాలానికి ఆయన మాటలు నిజాలయ్యాయి. వాహనాల్లో వెళ్ళడానికి వీలుగా నాంపల్లి గుట్టకి రోడ్డు వేశారు. కాళీయ మర్దనం చేస్తున్న విగ్రహం కూడా ప్రతిష్ఠించారు. కానీ ఆంజనేయ విగ్రహం రాలేదు. బిర్లా ప్లానిటోరియమూ రాలేదు. మా చంద్రమౌళి చెప్పిన అన్ని మాటలూ నిజం కాకపోయినా కొన్ని అయినా నిజం అయినందుకు సంతోషపడ్డాను.

హైదరాబాద్‌లో బిర్లామందిర్‌కి వెళ్ళినట్టు, సహజసిద్ధమైన గాలిని, బండలని, బండలలో దాక్కున్న విగ్రహాలని చూడ్డానికి మా వూరి ప్రజలు ఒక్క శ్రావణ మాసంలోనే కాదు అప్పుడప్పుడూ నాంపల్లిగుట్టకి వెళ్ళవచ్చని నాకన్పించింది. అదే విషయం మా చంద్రమౌళితో చెప్పాను. నర్సింహస్వామిని చూడ్డానికి వెళ్ళవచ్చని ఆయన అన్నాడు.

ఈమధ్య ఒకసారి కరీంనగర్ నుంచి వేములవాడకి వెళ్ళాను. లోయర్ మానేర్‌డ్యాం వల్ల ఎలగందుల వూరు పోయింది. కాని గుట్ట అలాగే వుంది. కొదురుపాకకి వచ్చే దారిలో

కన్పించే చాలా గుట్టలు కన్పించలేదు. అవి అదృశ్యం. ఆ కొండలకి గుట్టలకి బాంబులు పెట్టి ధ్వంసం చేశారు. బండలుగా మార్చారు. కంకరగా మార్చి గుట్టల రూపురేఖలు లేకుండా చేశారు. ఇప్పుడు అక్కడ గుట్టలు లేవు. వృక్షజాతి లేదు. సీతాఫలాలు లేవు. పక్షులు లేవు. జంతుజాలం లేదు. ప్రకృతి సౌందర్యమూ లేదు. క్వారీయంత్ర భూతాలు వున్నాయి. గుట్టల అవశేషాలున్నాయి.

మనస్సు మౌనంగా రోదించింది. ఏదో తెలియని బాధ, గుండెలో గుండుపిన్ను కదిలినట్టు. కన్నీటితో కన్ను మీద తెర. అంతా నగరీకరణ. నగరీకరణ పెద్ద కొండచిలువలా కొండల్ని, గుట్టల్ని నమిలి మింగుతున్న దృశ్యం. ఆ దృశ్యం నా చిన్నప్పుడు నర్సింహస్వామిని చూసినదానికన్నా ఎక్కువ భయం వేసింది. బాధతో మనస్సు బరువెక్కిపోయింది.

కాలం ఎన్ని మార్పులని తెస్తుంది. కాల మహిమలో ఎన్ని అదృశ్యమవుతాయి. ఎన్నింటిని కోల్పోతాం. ఈ గుట్టల్ని పిప్పి చెయ్యడానికి అనుమతులు వున్నాయా? అనుమతులు ఇవ్వకుండా నిరోధించగలమా? దేన్ని ఆపగలం? ఈ నగరీకరణ భూతాన్ని చంపగలమా? ఆలోచనల్లో వుండగానే శాబాష్‌పల్లె దాటేశాను.

నాంపల్లిగుట్ట వచ్చేసింది. అది చెక్కుచెదరలేదు. అట్లాగే వుంది. పైకి వెళ్ళడానికి అందమైన రోడ్డు. కాళీయుడి మీద నృత్యం చేస్తున్న కృష్ణుడు. మా నాంపల్లిగుట్ట కొత్త హంగులతో కొత్త సొగసులతో, చెట్లతో వృక్షాలతో మెరిసిపోతుంది.

మా కారు వేములవాడకి వెళ్ళలేదు. నాంపల్లి గుట్టకి దారితీసింది. గుట్టపైకి వెళ్ళిపొయ్యాం. కృష్ణుని దగ్గర కారు నిలిపి దర్శనం చేసుకున్నాం. అక్కడి నుంచి బయల్దేరి మెట్లెక్కి నర్సింహస్వామి గుడికి వెళ్ళాను. నర్సింహస్వామికి రెండు చేతులెత్తి దండం పెట్టాను. ఒకటి కాదు, నాలుగు కొబ్బరి కాయలని కొట్టాను. నర్సింహస్వామి రాములవారి కన్నా ప్రశాంతంగా కన్పించాడు.

నవనాటి సిద్ధుల గుహని చూశాను. మా చిన్న నాటి గుహను చూశాను. అది అలాగే వుంది. అక్కడ కాసేపు కూర్చుని మా వూరికి కొండగుర్తుగా నాంపల్లి గుట్టను అట్లాగే మిగిల్చినందుకు మరొక్కసారి నర్సింహస్వామికి మొక్కి వేములవాడకి బయల్దేరాను. ఇంకా దగ్గర్లో వున్న గుట్టలపైన నర్సింహస్వామి విగ్రహాలని ప్రతిష్టించేట్టు చూడమని మా చంద్రమౌళికి చెప్పాలనుకున్నాను. ఆ విధంగానైనా ఆ గుట్టలు మిగులుతాయన్న ఆశతో.

★ ★ ★

తమ్మల సొన్నాయి

శాంతక్క పెళ్ళి నాకు బాగా గుర్తు. అప్పుడు బాజాబజంత్రీలు లేవు. మాకున్నదల్లా తమ్మల సొన్నాయి. పండగైనా పబ్బమైనా తమ్మల సొన్నాయి వుండాల్సిందే. తమ్మల బాజా ఓ గమ్మత్తైన వాయిద్యం. అది తబలా కాదు. మృదంగం కాదు. ఈ రెండింటి కన్నా విభిన్నమైనది. తమ్మల బాజా మీద రెండు పుల్లలతో ధ్వనిని సృష్టిస్తారు. అదొక రకమైన ప్రత్యేకమైన ధ్వని. భక్తి గీతాలకే కాదు. లలిత గీతాలకి కూడా ఈ వాయిద్యాన్ని వాయించేవాళ్ళు.

సొన్నాయితో తమ్మల బాజా పోటీపడేది. ఈ బాజాని మెడకి తగిలించు కోవడానికి ఓ తాడు వుండేది. సొన్నాయికి రెండు రకాల పీకలు వుండేవి. ఒక పీకని ఒకసారి, మరో పీకని మరోసారి ఊదేవాళ్ళు. ఒక్కోసారి రెండు పీకలతో ఊదే వాళ్ళు. మా వూర్లో ఏ పెళ్ళికైనా సరే తమ్మల సొన్నాయి వుండాల్సిందే. మా రాజేశ్వరుని కళ్యాణానికి కూడా తమ్మలసొన్నాయి వుండాల్సిందే. మా రాజేశ్వరుని ప్రతి పూజకి తమ్మల సొన్నాయి వుండాల్సిందే. మా గుడిలో జరిగే రాములవారి కళ్యాణానికి కూడా తమ్మల సొన్నాయి వాయిద్యం తప్పనిసరిగా వుండాల్సిందే.

మా శాంతక్కని పెళ్లికూతురిని చేసే టైం అయింది. తమ్మల సొన్నాయి వాళ్ళు రాలేదు. వాళ్ళు ఇంకా రాలేదని తెలిసి మా రాములు సార్ మామ అటూ ఇటూ అసహనంగా తిరుగుతున్నాడు. మా నాంపల్లి చిన్నాయన వాళ్ళని పిలుచుకురావడానికి ఉద్యుక్తుడవుతున్నాడు. మా అమ్మ కూడా వాళ్ళకోసం ఎదురుచూస్తుంది. సరిగ్గా అదే సమయంలో తమ్మల లక్ష్మీరాజం, సొన్నాయి నారాయణ వచ్చారు. పరుగు పరుగున వచ్చినట్టు వాళ్ళ ముఖ కవళికలను బట్టి తెలుస్తుంది. తమ వాయిద్యాలని కచేరీలో పెట్టి కూర్చున్నారు. ఎప్పుడు చెబితే అప్పుడు వాయిద్యాలని వాయించడానికి వాళ్ళు సిద్ధంగా వున్నారు. వాళ్ళ రాకతో ఇంట్లో ఉద్విగ్న వాతావరణం పోయింది. మా అమ్మ మొఖం ప్రసన్నంగా మారింది. మా రాములు సార్ మామ మొఖం మాత్రం ఇంకా ప్రసన్నం కాలేదు. దానికి రెండు కారణాలు. వాళ్ళు ఆలస్యంగా రావడం. రెండవది రావాల్సిన వాళ్ళు రాకుండా వాళ్ళ కొడుకులు రావడం.

"మిమ్మల్ని పంపించారా? వాళ్ళు రాలేదేమిటి?" అడగనే అడిగాడు వుండబట్టలేక.

"వాళ్ళు గుడిలో వుండిపోయారు. మమ్మల్ని గుడిలో వుంచి వాళ్ళే వద్దామని అనుకున్నారు. కానీ వాళ్ళనే గుడిలో వుండాలని అన్నారట. అందుకని మమ్మల్ని పంపించారు" అన్నాడు లక్ష్మీరాజం. అవునన్నట్టుగా చూశాడు నారాయణ.

మా మామ వాళ్ళని ఏమైనా అంటాడేమోనని మా అమ్మ అక్కడికి వచ్చి "వీళ్ళు వాళ్ళ కన్నా బాగా వాయిస్తారని" వాళ్ళకి కితాబునిస్తూ మా మామతో అన్నది. దాంతో రాములు సార్ మామ మరి మాట్లాడలేదు.

శాంతక్కని పెళ్ళికూతురిని చేశారు. తమ్మల సొన్నాయి మోగింది. సందర్భోచితమైన పాటలని విన్పించారు. ఆ పాటలకి రాములు సార్ మామ మొఖం మీద ఆనందం వెల్లివిరిసింది. ఆయన అంచనాలని తారుమారు చేస్తూ వాళ్ళు పాటలు పాడారు. సంగీతాన్ని విన్పించారు.

కొద్దిసేపు తమ్మల సొన్నాయితో పనిలేదట. అందుకని వాళ్ళని ఫలహారం చెయ్యటానికి రమ్మన్నాడు మా మామ. ఫలహారం చెయ్యడానికి వాళ్ళు బాదం చెట్టుకిందికి పోయినారు.

ఆ సమయం కోసమే మేం చాలాసేపటినుంచి ఎదురు చూస్తున్నాం. లక్ష్మీరాజం, నారాయణ అటు వెళ్ళగానే మేం ఆ వాయిద్యం దగ్గరికి వెళ్ళాం. ఎవరి దృష్టిని ఆకర్షించకూడదు. ఆ వాయిద్యాలని ఉపయోగించాలి. అది సాధ్యమా? సన్నని పుల్లలు తీసుకొని తమ్మల బాజాని కొట్టాను. ఏవో ధ్వనులు వచ్చాయి. శివప్రసాద్ సొన్నాయి పీకని వూదినాడు. బాదం చెట్టు కింద నుంచి మా మామ కచేరీలోకి వచ్చినాడు. మేమంతా ఆయన దృష్టిలో పడ్డాం.



"అరేయి! ఏం చేస్తున్నరక్కడ" గట్టిగా అరిచాడు. ఆ అరుపునకు మేమంతా బాదంచెట్టు కిందికి పరుగెత్తినాం. మా మామకి బజారు పనులు చెప్పకుండా ఇంటి పనులే ఎందుకు చెబుతారో మాకర్థం కాలేదు. మా అమ్మకి చెప్పి మామని బజారుకి పంపించాలి. ఆయన బజారుకి వెళ్తే మాకు ఇష్టారాజ్యంగా వుంటుంది. గదమాయించే వాళ్ళు వుండరు.

బాదంచెట్టు కిందికి పోయి లక్ష్మీరాజం, నారాయణ చుట్టూ చేరినాం. వాళ్ళ ఫలహారాలు అయిపోయి చాయి తాగుతున్నారు.

"మేం కొట్టినా, ఊదినా మంచి శబ్దాలు రావడం లేదు. మీరు వాయిస్తే మంచి పాటలు వస్తున్నాయి ఎందుకని" అడిగాను నారాయణని.

"నువ్వు అఆలు దిద్దుకున్నావు కదా! మొదటిసారికే అవి వచ్చినాయా?"

"రాలేదు" అన్నాం అందరమూ.

"ఎన్నోసార్లు అఆలు దిద్దితే తప్ప అవి రాలేదు కదా"

అవునన్నట్లు అందరమూ తలలూపాం.

వాళ్ళు చాయిలు తాగి మళ్ళీ కచేరీలోకి వచ్చారు. తమ వాయిద్యాలని మోగించారు.

మా బావలు బంగ్ల మీదికి పోయి పత్తాలు ఆడేవాళ్లు. మా మామ చిన్నాయినలు పెండ్లి పనుల్లో నిమగ్నమయ్యేవాళ్ళు. మా బాపుకి పేషంట్లతోనే సరి. మాకు మాత్రం తమ్మల సొన్నాయి తోనే. వాళ్ళు తమ్మల బాజాని వాయిస్తుంటే అట్లాగే చూస్తూ కూర్చునేవాళ్ళం. మా ఆటల్ని మర్చిపోయి అక్కడే కూర్చునేవాళ్ళం.

మా శాంతక్కని పెళ్ళికూతురుని చేసినప్పటి నుంచి పెళ్ళి అయ్యేంతవరకు తమ్మల బాజా మా ఇంట్లో మారుమోగింది. మా బుచ్చి కిష్టయ్య ఆగమన్నప్పుడు ఆగేది. వాయించమన్నప్పుడు మోగేది. సందర్భానికి తగినట్టుగా నారాయణ పాటలని పాడేవాడు. ఆ పాటకి తగినట్టుగా తమ్మల బాజాని కొట్టేవాడు. లక్ష్మీరాజం శాంతక్కని పెళ్ళి పందిట్లోకి తెచ్చినప్పుడు ఒక పాట. మంగళసూత్రం కట్టేటప్పుడు ఒక రకమైన పాట, సాగనంపేటప్పుడు మరో పాట. ఇట్లా ఎన్నో పాటలు, అట్లా శాంతక్క పెళ్ళి అయిపోయింది.

రెండు మూడు రోజుల తరువాత శాంతక్క, బావ మళ్ళీ మా ఇంటికి వచ్చారు. ఆరోజు అందరమూ కలిసి గుడికి వెళ్ళాం. పెద్దసేవ తీశాం ముందు తమ్మల సొన్నాయి, ఆ తరువాత మేం. ఆ తరువాత రాజేశ్వరుని సేవ. ఆ తరువాత హరిసేవ.

తమ్మల సొన్నాయికి మా రాజేశ్వరునికి విడదీయలేని అనుబంధం. తమ్మల బాజా లేకుండా మా వేములవాడ రాజేశ్వరునికి ఏ పూజలు జరగవు. పెద్దసేవ ముందు చిన్నసేవ ముందు తమ్మల సొన్నాయి వుండాల్సిందే. అన్నపూజ నైవేద్యం ఇచ్చేటప్పుడు ఈ బాజా

మోగాల్సిందే. మా రాజేశ్వరునికి ఇష్టమైన కోడెలను సమర్పించేటప్పుడు మా తమ్మల సొన్నాయి మోగాల్సిందే. గుళ్ళో పుట్టివెంట్రుకలు తీసినా, దేవునికి నైవేద్యం పెట్టినా తమ్మల సొన్నాయి మోగాల్సిందే. మా ప్రాంత నాయిద్యాలు తమ్మల బాజా సొన్నాయి. ఏ గుడిలో కన్పించనిది మా తమ్మల బాజా. సొన్నాయి ఎక్కడన్నా కన్పించవచ్చేమో గానీ తమ్మల బాజా మాత్రం ఎక్కడా కన్పించదు.

మా ఇంటిలో ఎవరి పుట్టివెంట్రుకలు తియ్యాలన్నా రాజేశ్వరుని గుడిలో తియ్యాల్సిందే. మా చిన్నప్పుడు గుడిలో నాగిరెడ్డి మండపంలో పుట్టి వెంట్రుకలు తీసేవాళ్ళు. అప్పుడు తమ్మల బాజా మోగేది.

ఎప్పుడు గుడికి వచ్చినా తమ్మల సొన్నాయిని గమనించేవాణ్ణి. వాళ్ళు ఏమైనా కొత్తపాటలు పాడుతున్నరేమోనని చూసేవాణ్ణి. లక్ష్మీరాజం, నారాయణలు వాళ్ళ తండ్రుల స్థానాల్లో ఉద్యోగాల్లో చేరడం గమనించాను. వాళ్ళకి రికామి వున్నప్పుడల్లా వాళ్ళని పలకరించేవాడిని. వాళ్ళు నేర్చుకున్న కొత్తపాటల గురించి అడిగేవాడిని. భక్తి పారవశ్యంతో వాళ్ళు తమ వాయిద్యాలని వాయిస్తుంటే ఆశ్చర్యంతో వాళ్ళని చూసేవాడిని.

నా చిన్నప్పటికీ ఇప్పటికీ మా గుడి చాలా మారిపోయింది. కుంకుమ పూజ అమ్మవారి విగ్రహం ముందు గర్భగుడిలో చేసేవాళ్ళం. అది కాస్త స్థలమార్పిడి జరిగింది. ప్రధాన గుడి వెనక వున్న బాలత్రిపుర సుందరి దగ్గరికి మార్చినారు. నాగిరెడ్డి మండపంలో తీసే పుట్టి వెంట్రుకలు గుడి ముందుకు మారిపోయింది. పూజ చేసే విధానమూ మారిపోయింది.

మా రాజేశ్వరుని భక్తుల సంఖ్యాపెరిగింది. అంతకు మించి ఆదాయమూ పెరిగింది. మామూలు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయికీ, ఆ తరువాత జాయింట్ కమిషనర్ స్థాయికీ దేవస్థానం ఎదిగింది. వివిధ ప్రాంతాల నుంచి అధికారులు వస్తూ వెళ్తున్నారు. ఎప్పుడు గుడికి వెళ్ళినా ఏదో ఒక కొత్త కనిపిస్తూనే వుంది.

ఈమధ్య ఓసారి గుడికి వెళ్ళినప్పుడు లక్ష్మీరాజం నారాయణలు కన్పించలేదు. అన్నపూజ చేసినప్పుడు వాళ్ళ వాయిద్యాలు విన్పించలేదు. సాయంత్రం మళ్ళీ గుడికి వచ్చాం. మా నీహా, అనురాగ్‌ల తరుఫున వాళ్ళ చిన్న నాయనమ్మ కోడెలను కట్టిస్తానని మొక్కింది. ఆ మొక్కు తీర్చడం కోసం వచ్చాం. దేవుని కోడె ముందు ఎప్పటిలా వుండే తమ్మల సొన్నాయి లేదు. లక్ష్మీరాజం, నారాయణలకోసం అంతటా చూశాను. వాళ్ళూ కన్పించలేదు.

రాత్రి పెద్ద సేవకోసం టికెట్ తీసుకున్నాను. అందరమూ వచ్చాం. పెద్దసేవ మా వూరిలో కొంతమేరకు తిరుగుతుంది. కొంత సమయం పడ్తుంది. అది గుడి దగ్గర బయల్దేరి, మా బాపు దవాఖానా దగ్గర నుంచి భీమన్న గుడివైపు నుంచి రాజేశ్వరుని గుడి దగ్గరకు వస్తుంది. పెద్దసేవ తీయడం ఓ పెద్ద వేడుక. వీటన్నింటితోపాటూ మా నారాయణ పాటలు వినవచ్చు. మా వూరి స్వంతమైన తమ్మల బాజా ధ్వనులని వినవచ్చు. వాళ్ళు పాడే కొత్త

పాటల వివరాలు తెలుచుకోవచ్చు. ఆ వాయిద్యాలను మోగిస్తూ వాళ్ళు తన్మయత్వం చెందడాన్ని పరిశీలించవచ్చు. ఇట్లా ఎన్నో అనుకున్నాను. కానీ ఆశ్చర్యం. మా పెద్దసేవ ముందు తమ్మల సొన్నాయి లేదు. దాని స్థానంలో నాదస్వరం.

పెద్దసేవ కదిలింది. అసంకల్పితంగా నేనూ సేవతోబాటూ కదిలాను. నా మనస్సు దేవుని మీద లేదు. నాదస్వరం మీద లేదు. నా మనస్సంతా తమ్మల సొన్నాయి మీదే. మా ఆవిడ రెండుసార్లు పలకరించినా అదే ధ్యాస. అదే ఆలోచన. నడుస్తూనే ఎందుకలా వున్నావని ప్రశ్నించింది. జవాబు చెప్పలేదు. రేపు మళ్ళీ గుడికి వచ్చి విషయం తెలుసుకుందామని అనుకున్నాను. అట్లా అనుకున్న తరువాత మనస్సు కుదుటపడింది. నిరాసక్తంగా పెద్దసేవలో పాల్గొన్నాను. పూజ అయిపోయిన తరువాత ఇంటికి వచ్చాను. కానీ మనస్సు నిండా అవే ఆలోచనలు.

ఉదయాన్నే లేచి గుడికి వెళ్ళాను. లక్ష్మీరాజం, నారాయణలకోసం వెదికాను. వాళ్ళు వేరే ఏదో పనులు చేస్తూ కన్పించారు. వాళ్ళని తీసుకొని నాగిరెడ్డి మండపం దగ్గరికి వచ్చాను. ముగ్గురం అక్కడ కూర్చున్నాం.

"ఏం నారాయణా! కొత్త పాటలు ఏం నేర్చుకున్నావ్" అడిగాను.

"ఏం పాటలు!" నిర్వేదంగా అన్నాడు నారాయణ.

అతను ఎందుకట్లా అంటున్నాడో అర్థం కాలేదు.

"నిన్న పెద్దసేవ ముందు మీరు కన్పించలేదు" అడిగాను ఇద్దరివైపు చూస్తూ.

"నిన్నరాత్రి పెద్దసేవ టికెట్టు మీరు తీసుకున్నారని తెలుసు. అయినా మేం రాలేదు".

"ఎందుకని?"

"ఎందుకేమిటీ. మా స్థానం కోల్పోయాం. మా స్థానంలో నాదస్వరం వచ్చింది. ఇప్పుడు అన్ని పూజలకీ వాళ్ళే. వాళ్ళకి ఉద్యోగాలు కూడా ఇచ్చారు".

"మీ ఉద్యోగాలు ఏమైనాయి" ఆందోళనగా అడిగాను.

"ఏమీ కాలేదు. ఉన్నాయి" అన్నారు ఇద్దరూ.

"మరి....?"

"మాకు వేరే పనులు అప్పగించారు. ఇక మాకు తమ్మల సొన్నాయితో పనిలేదు."

"ఎందుకని?"

"ఏమో"

"మీరు అడగలేదా?"

"ఏం అడుగుతాం. మా ఉద్యోగాలు పోనందుకు సంతోషపడుతున్నాం" అన్నాడు నారాయణ.

"కొత్త కొత్త కమిషనర్లు వస్తున్నారు. కొత్తకొత్త రూల్స్ తెస్తున్నారు. ఎక్కడినుంచో ఈ నాదస్వరాన్ని తెచ్చారు. మా తమ్మల సొన్నాయి అనాగరికంగా వుందట" బాధగా అన్నాడు లక్ష్మీరాజం. అట్లా అంటున్నప్పుడు అతని గొంతు వణికింది.

"ఇన్ని రోజులు లేని అనాగరికం ఇప్పుడే వచ్చిందా?" అడిగాను. వాళ్ళు ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు వేయాల్సిన ప్రశ్నని వాళ్ళకు వేస్తే ఏం మాట్లాడతారు. కాస్సేపు నిశ్శబ్దం ఆవరించింది. ఎక్కడినుంచో నాదస్వరం విన్పిస్తుంది. అది ఒక గుండె కోతగా కన్పిస్తుంది.

"మీ పిల్లలకి నేర్పిస్తున్నారా" కాస్సేపటికి అడిగాను.

"ఇంకా మా పిల్లలకి ఏం నేర్పిస్తాం. మా తండ్రుల స్థానంలో మాకు ఉద్యోగాలు వచ్చాయి. మా తమ్మల సొన్నాయిలకే స్థానం లేనప్పుడు వాళ్ళకి ఏం ఉద్యోగాలు వస్తాయి" అన్నాడు లక్ష్మీరాజం.

"మా బాధంతా ఒక్కటే బాబూ. మా జీవితమంతా దేవునికే అంకితమైంది. ఈ చివరి దశలో మాకు స్థానభ్రంశం అయ్యింది. మా పాట మా బాజా, మా సంగీతం ఇప్పుడు దేవునికి పనికిరాకుండా పోయినాయి. కనీసం మా జీవితకాలం వరకైనా మా తమ్మల సొన్నాయి మోగుతుందని అనుకున్నాం. అట్లాంటిది లేదని తెలిసింది. ఇప్పుడు మా తమ్మల సొన్నాయి మా గుండెల్లో మోగుతుంది" అన్నాడు నారాయణ. ఆయన గొంతులో అంతులేని వేదన.

వాళ్ళ మాటలు విన్న తరువాత నాకు ఎక్కడ లేని నిస్సత్తువ వచ్చేసింది.

మా రాజేశ్వరుని ప్రతి పూజలో అల్లుకున్న తమ్మల సొన్నాయి మా అందరి ఆనందాలతో పెనవేసుకున్న తమ్మల సొన్నాయి, మా వూరి స్వంత వాయిద్యమైన తమ్మల సొన్నాయి ఈరోజు నుంచి పనికిరాకుండా పోయింది. ఎక్కడో పుట్టి పెరిగిన నాదస్వరం ఈరోజు మా రాజేశ్వరుని ముంగిట. ఇది ఆనందమా? విషాదమా? నాగరికమా అనాగరికమా? మా చొప్పకట్ల చంద్రమౌళి సార్‌ని నగుబోతు చంద్రమౌళిని అడగాలి. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ని నిలదియ్యాలి.

★ ★ ★

తెప్పోత్సవం

మా చిన్నప్పుడు మా వూర్లో చామకుంట వుండేది. మా ఊరి అవతల కట్టకాలువ వుండేది. బాగా వర్షాలు పడ్డప్పుడు వర్షం నీళ్ళు కట్ట కాలువ నుంచి మా చెరువులోకి వచ్చేవి. కుంట నిండినప్పుడు తూము వదిలేవాళ్ళు. అప్పుడు ఆ నీళ్ళు కూడా మా చెరువులోకి వచ్చేవి. రెండు మంచి వర్షాలు పడితే మా చెరువు నిండిపొయ్యేది. చెరువులో నీళ్ళు ఎక్కువగా వుంటే ఆ నీళ్ళని కాలువల్లోకి వదిలేవాళ్ళు. కాలువలు మా వూరి మధ్యనుంచి ప్రవహించేవి. చెరువు, చామకుంట కాలువల వల్ల మా వూరిలో నీటికి కొరత వుండేదికాదు. వీటివల్ల మా బావుల్లో నీరు పుష్కలంగా వుండేది. మా బావుల్లో చేతికి అందేట్టుగా నీళ్ళు వుండేవి.

కట్టకాలువ తన ఉనికిని పోగొట్టుకుంది. మా చామకుంటని ప్రభుత్వం ఆక్రమించి టెలిఫోన్ కార్యాలయం కట్టారు. మా చెరువూ ధర్మగుండం పక్కపక్కనే వుంటాయి. ధర్మగుండాన్ని వేరు చేస్తూ నిర్మాణం చేశారు. యాత్రికులకోసం చెరువులో క్యూ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. చెరువులో పూడిక తియ్యడం తగ్గించారు. చెరువు మీద ఆ శ్రద్ధ లేదు. ఈ కారణాల వల్ల మా చెరువు తన పూర్వ శోభని పోగొట్టుకుంది. బక్కచిక్కిపోయింది. చెరువు ఎండిపోయి తొమ్మిది సంవత్సరాలు అయింది. వర్షాలు కూడా తగ్గిపోయాయి.

మా ధర్మగుండంలో నీళ్ళు మా వాగు నుంచి తెప్పించి నింపేవాళ్ళు. మా వాగులో రెండు మూడు బావులని తోడి అక్కడి నుంచి పంపుసెట్టు ద్వారా, పైపుల ద్వారా ధర్మగుండానికి నీళ్ళు పంపించేవారు. ధర్మగుండంలో నిలువ వున్న నీరుని బయటకు చెరువులోకి తోడటానికి మరో రెండు పంపుసెట్లని పెట్టారు. ఏదో రకంగా మా ధర్మగుండంలో నీళ్ళని నింపేవారు.

దసరాకి ముందురోజు మహర్నవమి రోజున మా వూర్లో తెప్పోత్సవం జరుగుతుంది. రాజేశ్వరస్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులని హంసవాహనం మీద కూర్చుండబెట్టి మా ధర్మగుండంలో మూడుసార్లు తిప్పుతారు. ఈ తెప్పోత్సవం దసరా ముందు జరుగుతుంది. అందుకని యాత్రికులు ఈ ఉత్సవానికి చాలా తక్కువగా వస్తారు. ఈ తెప్పోత్సవ వేడుకలో పాల్గొనేది ఎక్కువగా మా వూరి ప్రజలే.


ధర్మగుండం మూడు వైపులా నిర్మించిన కట్టడాల్లో మా వూరి ప్రజలు నిల్చొని ఈ వేడుకని వీక్షిస్తారు. రోజురోజుకీ జనాభా పెరిగి ఆ స్థలం సరిపోక తొడతొక్కిడిగా వుండేది. ఊరి ప్రజలు చాలా ఇబ్బందులకు గురయ్యేవాళ్ళు. అయినా తెప్పోత్సవాన్ని, ఆ అలంకరించిన

హంస వాహనాన్ని అందులో పార్వతీ పరమేశ్వరులని చూడడానికి ఇబ్బందులు పడైనా మావూరి ప్రజలు వీక్షిస్తారు. హంస వాహనాన్ని రకరకాల పూలతో అలంకరిస్తారు. తెప్పోత్సవం మహాగొప్పగా వుంటుంది.

ఈ తెప్పోత్సవ వేడుకని చూడడానికి యువకులు మధ్యవయస్సు వాళ్ళు ఎక్కువగా వచ్చేవాళ్ళు. వృద్ధుల సంఖ్య తక్కువ. ఎందుకంటే ఆ జనసమ్మర్దాన్ని తట్టుకొని చూసే ఓపిక, శక్తి వాళ్ళకు వుండేది కాదు. అందుకని వాళ్ళు ఈ తెప్పోత్సవానికి రావాలని ఎంత కోరికగా వున్నా వచ్చేవాళ్ళు కాదు. ఈ తెప్పోత్సవం ఒకరకంగా వాళ్ళకి ఒక అసంతృప్తిని మిగిల్చేది. అయితే దసరా రోజున మా దేవుని సేవ వూరి చుట్టూ తిరుగుతుంది. కాబట్టి ఆ సేవలో కన్పించే ఉత్సవ మూర్తులని చూసే అవకాశం దొరికేది. అయినా తెప్పోత్సవం చూడలేదన్న అసంతృప్తి వాళ్ళకి అట్లాగే మిగిలివుండేది.

తొమ్మిది సంవత్సరాల తరువాత మా వూర్లో మంచి వర్షాలు పడ్డాయి. వట్టం నీళ్ళకే మా చెరువు నిండింది. చాలా సంవత్సరాల తరువాత చెరువు నిండడం వల్ల చెరువుని చూడడం అందరికీ వేడుకగా మారిపోయింది. దసరాకి వచ్చిన మిత్రులకి చెరువుని చూడడం ఆనందంగా మారిపోయింది. నేనూ, శివకుమార్ కూడా చెరువు గట్టు మీద నడుస్తూ ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం.

అనుకోకుండా మా దృష్టి చెరువు గట్టున వున్న బోటు మీద పడింది. ఎన్నడూ లేనిది బోటు మా చెరువులో కన్పించడం కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ బోటుని హంస వాహనంగా అలంకరించడమూ కన్పించింది. శివకుమార్ వెంటనే దగ్గర్లో వున్న దేవస్థానం కార్యాలయానికి వెళ్ళి వివరాలు అడిగి వచ్చాడు. ఈసారి తెప్పోత్సవాన్ని ధర్మగుండంలో కాకుండా చెరువులో చేస్తారని చెప్పాడు.



తెల్లవారే తెప్పోత్సవం. రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో తెప్పోత్సవం. ఆరోజు సాయంత్రం మా ఇంటికి వచ్చాడు శివకుమార్. ఈసారి తెప్పోత్సవానికి వాళ్ళ అమ్మా నాన్నని తీసుకొస్తున్నానని చెప్పాడు. మా అమ్మని తెప్పోత్సవం చూడడానికి తీసుకురమ్మని చెప్పాడు. ఆమెకంత ఓపిక లేదని చెప్పాను. అతనే వెళ్ళి మా అమ్మని ఓపిక తెప్పించేలా చేశాడు. శివకుమార్ వచ్చి వెళ్ళిన తరువాత మా అమ్మకి ఉత్సాహం వచ్చింది. తెప్పోత్సవం చూడాలన్న కాంక్ష కూడా మొదలైంది.

మహర్నవమి రోజున ఉదయం నుంచి దేవస్థానం మైకులో ప్రకటనలు మొదలైనవి. ఈసారి తెప్పోత్సవం ధర్మగుండంలో కాకుండా చెరువులో నిర్వహిస్తున్నారని ఆ ప్రకటన సారాంశం. ప్రజలు ఎక్కువమంది రావాలన్న ఉద్దేశ్యంతో ప్రకటనని చాలాసార్లు చెప్పారు.

అరగంట ముందే చెరువు దగ్గరికి వెళ్ళాం. మా అమ్మ తనకున్న చీరల్లో మంచి చీర కట్టుకుంది. అమ్మ మెల్లిగా తీసుకొని వెళ్ళి, చెరువు మీద నిర్మించిన క్యూ కాంప్లెక్స్‌లో కూర్చోబెట్టాను. అక్కడ కూర్చోవడానికి స్థలం వుంటుంది. మంచిగా కన్పిస్తుంది.

కాస్సేపటికి శివకుమార్ వాళ్ళ అమ్మానాన్నని తీసుకొని అక్కడికి వచ్చాడు. వాళ్ళ నాన్న వయస్సు మా అమ్మకన్నా ఎక్కువే. ఎనభై అయిదు సంవత్సరాలు దాటి వుంటాయి. టీచర్‌గా పనిచేసి రిటైర్ అయినారు. దేవస్థానం నుంచి ఏమీ ఆశించక ఇరవై అయిదు సంవత్సరాలు రోజూ ఉదయం నాలుగున్నర గంటలకి సుప్రభాతం చదివారు. మొన్నమొన్నటి వరకు ఆయన సుప్రభాతం చదివారు. ఆయన పేరు వఝుల సాంబశివశర్మ. వాళ్ళ అమ్మకి మా అమ్మకన్నా తక్కువ వయస్సు వుంటుంది. డెబ్భై అయిదు సంవత్సరాలు వుంటాయేమో. ఇద్దరూ పట్టువస్త్రాలు కట్టుకొని వచ్చారు.

వాళ్ళ ముగ్గురిని అక్కడ కూర్చుండబెట్టి నేనూ శివకుమార్ మాటల్లో పడ్డాం. చుట్టూ ఎలక్ట్రిక్ దీపాలు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. రంగు రంగుల సీరియల్ బల్బులతో దేవుని గుడి వెలిగిపోతుంది. చెరువు మధ్యలో హంసవాహనం. ఓ వారం పదిరోజులు శ్రమించి బోటు మీద ఆ వాహనాన్ని నిర్మించారు. ఓ సినిమా సెట్టింగులా వుంది.

జనం మెల్లిమెల్లిగా వస్తున్నారు. అరగంటలో క్యూకాంప్లెక్స్ మా వూరి ప్రజలతో నిండిపోయింది. ఎటు చూసినా జనం. అందరూ ఆసక్తిగా తెప్పోత్సవం కోసం ఎదురుచూస్తున్నారు. హంసవాహనాన్ని ఉత్సవ మూర్తులని హంస వాహనంలో కూర్చుండబెట్టే విధంగా ఒడ్డుకి తీసుకొని వచ్చారు. ఆ వాహనాన్ని దగ్గరనుంచి చూడటానికి పిల్లలు ఎగబడుతున్నారు. వాళ్ళని దేవస్థానం ఉద్యోగులు అదుపు చేస్తున్నారు. శివరాత్రిలాగా కాకుండా ఈ తెప్పోత్సవం మా వూరి జనంకోసం జరిగే ఉత్సవం. ఎక్కడ చూసినా పరిచయస్తులే. చాలా రోజులకి కలవడం వల్ల ఒకరినొకరు పలకరించుకుంటున్నారు. పిల్లల వివరాలు తెలుసుకుంటున్నారు.

సాంబశివశర్మసార్ నన్ను పిలిచి దగ్గర కూర్చోబెట్టుకొని పిల్లల వివరాలు ఉద్యోగ వివరాలు ఎన్నో అడిగాడు. ఆయన ఆరోగ్యం గురించి నేనూ పరామర్శించాను.

అరగంట గడిచింది. దేవుణ్ణి తీసుకొస్తున్న జాడకన్పించలేదు. పెద్దవాళ్ళకి అసహనం మొదలైంది. పిల్లవాళ్ళలో అల్లరి మొదలైంది. ఇంకా ఎందుకు రాలేదని మాకూ అన్పించింది. పెద్దవాళ్ళని అక్కడే కూర్చుండబెట్టి నేనూ శివకుమార్ గుడిలోకి వెళ్ళాం.

అక్కడ మండపంలో ఉత్సవమూర్తులు అందంగా అలంకరించి వున్నారు. ఏదో చర్చ జరుగుతుంది. దేవస్థానం అధికారులూ అక్కడ వున్నారు. పూజారులు వున్నారు. స్థానాచారి శంకరయ్య కూడా వున్నాడు. చాలామందిగుమికూడివున్నారు.

"జనం అందరూ వచ్చారు. టైం అయిపోయింది. ఇంకా ఆలశ్యం ఎందుకు?" ఎవరో ప్రశ్నిస్తున్నారు.

"ఏం చేద్దాం" అడిగాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థానాచార్యులని.

"ఆకాశం మొగులై వుంది. వర్షం పడే అవకాశం వుంది. దేవుడు వర్షంలో తడవకూడదు. ఒక్క వర్షం చినుకు కూడా దేవుని మీద పడటానికి వీల్లేదు" అన్నాడు స్థానాచార్యులు.

"వర్షం పడే అవకాశం కన్పిస్తలేదు. పొరపాటున చినుకులు పడవచ్చు" అన్నారెవరో.

"చినుకు పడితే ఏమవుతుంది. దేవునిపైన గొడుగు వుంటుంది కదా" అన్నాడు కొత్తగా వచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్.

"అరిష్టం సార్! అరిష్టం. దేవుని మీద ఒక్క చినుకు పడకూడదు. ఆ అరిష్టాన్ని అధిగమించడానికి ఎన్నో యాగాలు చేయాల్సి వస్తుంది. చాలా ఖర్చుతో కూడుకున్న వ్యవహారం" అన్నాడు స్థానాచార్యులు.

"మొగులైంది. కానీ చినుకు పడే అవకాశం లేదు. పడినా యాగాలు చేయండి. రాజేశ్వరుని దగ్గర చాలా డబ్బుంది" అన్నారు మరొకరు.

ఇట్లా రకరకాల చర్చలు జరుగుతున్నాయి. అక్కడున్న అందరిలో అసంతృప్తి, అసహనం పెరిగిపోతోంది. దేవుణ్ణి బయటకు తీసుకురావడానకి స్థానాచార్యులు సుముఖంగా లేరు. ఆ విషయం అక్కడున్న వాళ్ళందరికీ అర్థమైంది. దేవుడు సర్వాంతర్యామి అంటారు. వాన చినుకులో దేవుడున్నాడు. మరి శాస్త్రాన్ని ఎందుకు అట్లా ఏర్పరిచారో అని కొంతమంది అనుకుంటున్నారు.

దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఛైర్మన్ స్థానాచార్యులు ముగ్గురూ పక్కకు వెళ్ళి మాట్లాడుకున్నారు. చివరికి తెప్పోత్సవం రద్దు చేయడానికి నిర్ణయం తీసుకున్నారు.

"శాస్త్రప్రకారం వర్షం చినుకు కూడా దేవుని మీద పడడానికి వీల్లేదు. పడేఅవకాశాలు ఎక్కువగా వున్నాయి. అందుకని తెప్పోత్సవం రద్దు చేస్తున్నామ"ని ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ప్రకటించాడు.

ఆ ప్రకటన అక్కడున్న వాళ్ళకి ఎవరికీ నచ్చలేదు. కానీ ఏం చేస్తారు నిరుత్సాహంగా వెనక్కి తిరిగారు. నేనూ శివకుమార్ వెనక్కి తిరిగాం. మా వాళ్ళ దగ్గరికి వచ్చి అదే విషయం చెప్పాం. వాళ్ళు ముగ్గురూ తీవ్రమైన అసంతృప్తికి లోనయ్యారు. ఏమాత్రం ఓపిక లేకున్నా తెప్పోత్సవం చూడాలని వచ్చిన వాళ్ళకి ఆ వార్త ఎక్కడలేని నొప్పులని తెచ్చిపెట్టింది.

"సాంబయ్యా! ఇదేం మంచిగ లేదు. దేవుని మీద వానచుక్క పడితే ఏమైతది. శివునికి అందరం నీళ్ళతో అభిషేకం చేస్తాం కదా! అక్కడ లేని తప్పు ఇక్కడే వచ్చిందా? వానదేవుడు అభిషేకం చేస్తే తప్పా?" అడిగింది మా అమ్మ సాంబశివశర్మని.

ఏం జవాబు చెప్పాలో ఆయనకి తోచలేదు. ఆయన ఏదో జవాబు చెప్పే లోపు మా అమ్మ మళ్ళీ ఇలా అంది.

"తొమ్మిది సంవత్సరాల నుంచి ఊళ్ళో ఒక్క చినుకులేదు. ఇన్నేండ్ల తరువాత చెరువు నిండింది. ఇన్నేండ్లు నీళ్ళు లేకపోవడంకన్నా అరిష్టం ఇంకేం వుంటుంది. ఇదేం బాగాలేదు."

నిరుత్సాహంగా ముగ్గురూ అక్కడినుంచి కదిలారు. వీళ్ళేకాదు, అందరూ అసంతృప్తిగా అక్కడినుంచి కదిలారు. వృద్ధులు ఎవరూ ఏమీ మాట్లాడలేదు. వాళ్ళందరిలోనూ ఒకటే భావన. వచ్చే సంవత్సరం చెరువు నిండుతుందో లేదో. నిండినా అప్పుడు ఆకాశం మొగులు కాదని నమ్మకం ఏమిటి? ఇవి రెండూ సహకరించినప్పటికీ తమ వయస్సు తెప్పోత్సవం చూడటానికి సహకరిస్తుందో లేదో.

హంసవాహనం చుట్టూ దీపాలున్నా, దానిమీద వెలుగు లేదు. పువ్వుల దండలున్నా అందులో పరిమళం లేదు. దాన్ని తాకి దండం పెట్టుకునే వాళ్ళు లేరు. ఆ వాహనం దుఃఖానికి మా చెరువు పొంగి వూరు ఎక్కడ మునుగుతుందోనన్న భయం వేసింది.

★ ★ ★

ఆర్.ఎమ్.టి. సర్వీస్ స్టాండ్

నేను పుట్టకముందే మావూర్లోకి సర్వీస్ బస్ వచ్చింది. ఆ బస్సుని మా వూర్లోకి తెచ్చిన వ్యక్తి గంగాధరరావు, అతని మామ.

నా చిన్నప్పుడు రుద్రంగి, కోరుట్ల ఇంకా ఇతర గ్రామాలకు వెళ్ళాలంటే ఆర్టీసి బస్సులు వుండేవి కావు. ప్రైవేటు సర్వీసు బస్సుల్లోనే వెళ్ళాల్సి వచ్చేది. మా ఇంటి వెనకే సర్వీస్ స్టాండ్. రోజూ మూడు ట్రిప్పులు కొట్టేది బస్సు.

గంగాధరరావుది మా వేములవాడ కాదు. అతనిది కృష్ణా జిల్లా దగ్గరలోని వణుకూరు. ఒక్క సర్వీసు బస్సుతో మా వేములవాడకి వచ్చాడు. ఒక్క సర్వీసుతో మొదలైన అతని ప్రయాణం మూడు బస్సు సర్వీసులకి ఎదిగింది. మూడు సర్వీసులు వున్నా అతను ఎప్పుడూ గర్వపడలేదు. ఎప్పుడైనా డ్రైవర్ రాకపోతే అతనే సర్వీసుని నడిపేవాడు.

ఆ సర్వీసు బస్సులవల్ల మా ఇంటి వెనక ప్రాంతం చాలా సందడిగా వుండేది. ప్రయాణీకులతోని, వాళ్ళకి అవసరమైన వస్తువులని, పండ్లని అమ్మేవాళ్ళతోని ఆ ప్రాంతం ఎప్పుడూ రద్దీగా వుండేది. ప్రయాణీకులకోసం రెండు గుడిసె హోటల్లు కూడా అక్కడ వుండేవి. ఆ హోటళ్లలో పూరీలు, మిరపకాయ బజ్జీలు ఎక్కువగా అమ్మేవాళ్ళు. ఒక్క బస్సు వున్నప్పుడు ఆ ఒక్క బస్సు మూడు ట్రిప్పులు కొట్టేది. మూడు బస్సులు వచ్చిన తరువాత ఆరు ట్రిప్పులకి మారింది.

ఉదయం ఎనిమిదింటికి మొదటి ట్రిప్పు వుండేది. గంగాధరరావు ఏడున్నరకే బస్టాండ్‌కి వచ్చేవాడు. సర్వీసు నిండిన తరువాత బస్సు డ్రైవరుకి తగు జాగ్రత్తలు చెప్పేవాడు. అతను జాగ్రత్తలు చెప్పిన తరువాతనే ఆ సర్వీసు కదిలేది. మనిషి నల్లగా వుండేవాడు. ఎప్పుడూ తెల్లబట్టలు వేసుకునేవాడు. అందరితో నవ్వుతూ మాట్లాడేవాడు. తన ఉద్యోగులతో చాలా ప్రేమగా మాట్లాడేవాడు. వాళ్ళు ఏవైనా పొరపాట్లు చేస్తే ప్రేమతో మందలించేవాడు.

మా ఇంటి పక్కనే వున్న ఓ ఇంట్లో అతను కుటుంబ సభ్యులతో కిరాయికి వుండేవాడు. మా ఇంట్లో ఏ చిన్న కార్యక్రమం జరిగినా అతని కుటుంబ సభ్యులందరూ మా ఇంటికి వచ్చేవాళ్లు. వాళ్ళింట్లో ఎవరి ఆరోగ్యం బాగులేకున్నా మా బాపు వాళ్ళింటికి వెళ్ళి వైద్యం చేయాల్సిందే.

మా మేనమామ సనుగులలో టీచర్‌గా పని చేస్తుండేవాడు. ఎప్పుడైనా మా అమ్మతోపాటు నేనూ సనుగుల వెళ్లేవాడిని. మాకోసం డ్రైవర్ వెనక సీటు రిజర్వ్ అయ్యేది. మా తిరుగుప్రయాణం కోసం కూడా గంగాధరరావు తగు జాగ్రత్తలు తీసుకునే వాడు. సర్వీస్ డ్రైవర్‌కి తగు సూచనలు ఇచ్చేవాడు.

సర్వీస్ స్టాండ్ దగ్గరికి వచ్చినప్పుడల్లా ఒక రకమైన కొత్త భాష విన్పించేది. బస్సు కదలాలంటే 'రైట్ రైట్' అనేవాళ్ళు. ఆగాలంటే 'హోల్డాన్' అనేవాళ్ళు. బస్సు కదలడానికి, ఆగడానికి ఇంగ్లీషు పదాలని, వెనక్కి తీసేటప్పుడు ఉర్దూ పదాలని వాడేవాళ్ళు. బస్సు టైర్ పంక్చరైనప్పుడు రిపేర్ చేస్తున్నప్పుడు కూడా చాలా గమ్మత్తయిన పదాలని ఉపయోగించేవాళ్ళు.

రోజులు గడిచినకొద్దీ బస్సు సర్వీసుల సంఖ్య పెరిగింది. చాలామంది పార్ట్‌నర్‌లు వచ్చి చేరినారు. కోరుట్ల రూట్ బాగా అభివృద్ధి చెందింది. ప్రయాణీకుల సంఖ్య కూడా చాలా పెరిగిపోయింది. అందుకని పెద్ద బస్టాండ్ అవసరం ఏర్పడింది. గ్రామ పంచాయితీ పక్కన బస్టాండ్ కోసం పెద్ద స్థలాన్ని తీసుకున్నారు. బస్సుల సంఖ్య పన్నెండు దాకా పెరిగింది. ఆ సర్వీస్ స్టాండ్ ప్రాంతమంతా ఓ పెద్ద వ్యాపార కేంద్రంగా మారిపోయింది. అక్కడ హోటళ్లు, కిరాణా షాపులూ, ఫెర్టిలైజర్ షాపులూ మందుల షాపులూ ఇట్లా ఎన్నో షాపులు సర్వీస్ స్టాండ్ ప్రాంతమంతా. మా ఆర్టీసి బస్టాండ్ యాత్రికులతో కళకళలాడేది. ఈ సర్వీస్ స్టాండ్ మావూరి చుట్టుపక్కల వున్న ప్రజలతో కళకళలాడేది. తన మోటారు ట్రాన్స్‌పోర్ట్‌కి రాజేశ్వర మోటారు ట్రాన్స్‌పోర్ట్ అని పేరు పెట్టుకున్నాడు గంగాధరరావు. ఆ



సర్వీస్ స్టాండ్ ఆర్.ఎమ్.టి. బస్టాండ్‌గా వాడుకలోకి వచ్చింది. సర్వీస్ స్టాండ్ మారిన తరువాత గంగాధరరావు ఇల్లు కూడా మార్చాడు. సర్వీస్ స్టాండ్ పక్కనే వున్న వెంకటరెడ్డి అంకుల్ ఇంట్లోకి మారిపోయినాడు. వెంకటరెడ్డిగారి బావమరిదికి తన పెద్దకూతురిని ఇచ్చి పెళ్ళిచేశాడు. గంగాధరరావు ఇల్లు మారిన తరువాత వాళ్ళతో మాకు కొంత దూరం పెరిగింది. కానీ పెద్ద పెద్ద ఫంక్షన్లకి కలిసేవాళ్ళం.

గంగాధరరావు పెద్దకూతురు తప్ప మిగతా వాళ్ళందరూ వేములవాడలోనే పుట్టారు. మా బడిలోనే మాతోబాటు చదువుకున్నారు. ఒకరు నాకన్నా సీనియర్. మిగతా వాళ్ళు జూనియర్లు. బడికి వెళ్తున్నప్పుడల్లా వాళ్ళు మాకు కలిసేవాళ్ళు. ఆ తరువాత కొంతకాలానికి మా పంచాయితీ సమితి పక్కన ఓ పెద్ద ఇల్లు కట్టుకున్నాడు గంగాధరరావు. అప్పటికి మా ఇల్లు ఊరి మధ్యన అయిపోయి వాళ్ళ ఇల్లు ఊరి చివరన అయిపోయింది. దాంతో మాకున్న సంబంధాల దూరం ఇంకా పెరిగిపోయింది. కానీ కలిసినప్పుడు మాత్రం ప్రేమగా మాట్లాడుకునేవాళ్లం.

నా స్కూల్ చదువు అయిపోయి వేములవాడ వదిలి కరీంనగర్ చేరాను. ఆ తరువాత ఆయన గురించిన సమాచారం అంతగా తెలిసేది కాదు. ఆయన పిల్లల పెళ్ళిళ్ళు అందరివీ అయిపోయాయి. ఒక్క పెద్దకూతురిని తప్ప అందరినీ తన ప్రాంతం వాళ్ళకే ఇచ్చాడు. కొడుకులిద్దరికీ కూడా ఆ ప్రాంతం అమ్మాయినే చేసుకున్నాడు. పెద్దకూతురు మా వూరి మూలవాసుల్లో కలిసిపోయింది. మగపిల్లలిద్దరూ ఇక్కడి మూలవాసుల్లో కలిశారు. వాళ్ల భాష కూడా మా భాషే.

కోరుట్ల రూట్ ప్రభుత్వం తీసుకుంటుందని తెలిసినప్పటి నుంచి గంగాధరరావు ఆందోళనకి లోనయ్యాడు. ఆ ప్రయత్నాన్ని ఆలస్యం చెయ్యడానికి ప్రయత్నాలు కూడా చేశారు. కానీ ఆ రూట్‌ని ప్రభుత్వం తీసుకుంది. ఆర్టీసి బస్సులు మొదలైనాయి. సర్వీస్ స్టాండ్ తన ఉనికిని కోల్పోయింది. ఒక్క వెలుగు వెలిగిన సర్వీస్ స్టాండ్ ఎందరికో జీవనాధారమైన సర్వీస్ స్టాండ్ ఒక కలంపోటుతో నిరుపయోగంగా మారిపోయింది. కళావిహీనమైపోయింది.

సర్వీసులు కూడా పాతబడ్డాయి. వాటిని కొనేవాళ్ళు లేరు. గంగాధరరావు పిల్లలు కూడా ఉద్యోగాలు కోల్పోయారు. కొంతకాలం కరీంనగర్‌కి సర్వీసులని నడిపారు. కానీ అది కూడా అంత లాభదాయకంగా అన్పించలేదు. ఆయన పిల్లలు ఉద్యోగాలకోసం, వ్యాపారాలకోసం హైదరాబాద్ వెళ్ళాలనుకున్నారు. డబ్బులకోసం ఇంటిని అమ్మాలనుకున్నారు. ఆ విషయం తెలిసి ఒకసారి వాళ్ళింటికి వెళ్ళాను. గంగాధరరావు దిగులుపడిపోయి వున్నారు. ఆయన వేములవాడకి వచ్చి యాభై సంవత్సరాలు దాటి వుంటుంది. ఎంతో ఇష్టపడి కట్టుకున్న ఇల్లు. ముందు పెద్ద పూలతోట. కూరగాయల

చెట్లు. ఇంటి వెనక పశువుల దొడ్డి. అందులో రెండు బర్రెలు. ఆయన ముఖం చూస్తే చాలా బాధ కలిగింది. జీవితం చివరిదశలో చాలా ఇష్టంగా కట్టుకున్న ఇల్లు అమ్మడానికి ఆయనకు ఏమాత్రం ఇష్టం లేదు. ఆయన భార్యకి కూడా ఇల్లు అమ్మడం ఇష్టం లేదన్నట్టు ఆమె ముఖం చూస్తే నాకన్పించింది. వేములవాడలో ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చు గదా అన్న ప్రతిపాదన కూడా వచ్చింది. 'ఆయన వేములవాడలో పుట్టినాడా ఎక్కడో కృష్ణా జిల్లాలోని వణుకూరులో పుట్టి ఇక్కడ వ్యాపారం చేసుకో లేదా' అన్నారెవరో.

ఆ మాటతో గంగాధరరావు ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. ఇల్లు అమ్మేశారు. ఆ ఇంటిలోని ప్రతి ఇటుకలో ఆయన రక్తం వుంది. చెమట వుంది. ఆనందం వుంది. కన్నీరుంది. అన్నింటిని వదిలి యాభై ఏళ్ళ అనుబంధాన్ని వదిలి హైదరాబాద్ వెళ్ళిపోయాడు. వనస్థలిపురంలో ఎక్కడో కిరాయి ఇంట్లోకి. నేనూ హైదరాబాద్‌లోనే వున్నప్పటికీ ఆయన్ని చాలారోజులు కలవలేదు. కానీ మా వేములవాడకి వెళ్ళినప్పుడు వెంకటరెడ్డి అంకుల్ వాళ్ళింటికి వెళ్ళినప్పుడల్లా ఆయన జ్ఞాపకం లీలగా గుర్తుకొచ్చేది. బరువుగా వూపిరి పీల్చేవాడిని ఆయన గుర్తొచ్చి నప్పుడల్లా.

ఓ సంవత్సరం తరువాత గంగాధరరావు రెండవ కూతురు కనకం మా ఇల్లు వెతుక్కుంటూ వచ్చి తన కూతురు పెళ్ళిపత్రిక ఇచ్చింది. పెళ్ళికి తప్పక వెళ్ళాలనుకున్నాను. అలాగే వెళ్ళాను. గంగాధరరావు వచ్చి ఆదరంగా ఎదుర్కొన్నారు. మేం పెళ్ళిలో వున్నంతసేపూ మాతోనే వున్నాడు. అన్నీ వేములవాడ ముచ్చట్లే. ఆయనతో మాట్లాడుతుంటే మాబాపు విషయాలు, మా వూరి విషయాలు ఎన్నో తెలిశాయి. పెళ్లి తరువాత మేం ఇంటికి తిరిగి వెళ్తుంటే మమ్మల్ని బయటిదాకా వచ్చి సాగనంపాడు. 'అప్పుడప్పుడూ వస్తూ వుండండి' అన్నాడు మావైపు చూస్తూ. అలాగే అని చెప్పి సెలవు తీసుకున్నాను. మళ్ళీ చాలారోజుల దాకా ఆయన దగ్గరకు వెళ్ళలేకపోయాను.

ఓ సంవత్సరం తరువాత సికింద్రాబాద్‌లో మా అన్నయ్య కొడుకు పెళ్ళి వుండింది. అది రాత్రి తొమ్మిది గంటలకు. పెళ్ళిపత్రిక గంగాధరరావుకి పంపించాను. ఫోను చేసి చెప్పాను. చలిలో ఆ రాత్రి అతను పెళ్ళికి వచ్చాడు. మనుమడు పప్పూ సైకిల్ మోటార్ మీద వచ్చాడు.

"ఇంత చలిలో ఎందుకు వచ్చారు. మీ అబ్బాయిని పంపిస్తే సరిపోయేది" అన్నాను దగ్గరగా వెళ్ళి.

"ఏం చలిలే బాబూ! పెళ్ళి చూడాలి గదా! అమ్మని చూడాలి గదా! ఇంతమంది వేములవాడ వాళ్ళు ఒక్క దగ్గర నాకు ఎందుకు కన్పిస్తారు" అన్నాడు. మా అమ్మని, అన్నలని, మా వూరి వాళ్ళందరినీ కలిశాడు. ఎనభై దాటిన ఆ వయసులో ఆయన అంత

దూరం నుంచి రావడం కొంత కష్టమనిపించినా ఆయన ఉత్సాహాన్ని చూస్తే ఆనందం వేసింది.

రాత్రి అయినకొద్దీ చలి పెరుగుతుందని అన్పించి ఆయనకు త్వరగా భోజనం పెట్టించి పంపించాను.

ఆరు నెలల తర్వాత ఆయన ఆరోగ్యం బాగుండడం లేదని తెలిసింది. మంచం నుంచి లేవడం లేదని కూడా తెలిసి ఆయన దగ్గరకు వెళ్ళాను. నేను వచ్చిన సమాచారం తెలియగానే లోపలి నుంచి వచ్చి బయట హాల్లో కుర్చీలో కూర్చున్నాడు. అప్పటిదాకా చాతగాకున్న మనిషి అంత ఉత్సాహంగా బయటకు వచ్చి కూర్చోవడం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగింది.

"నేను లోపలికి వచ్చేవాణ్ణి కదా! మీరెందుకు వచ్చారు" అడిగాను.

"లోపల అంత బాగాలేదు. మీరు వస్తే మీ బాపు వచ్చినట్టుగా అన్పిస్తుంది. అందుకే వచ్చాను. ఉషారు కూడా వచ్చింది" అన్నాడు.

అరగంట సేపు కూర్చున్నాను. రెండు నిముషాలకొకసారి దగ్గూ తెమడ వస్తున్నాయి. అయినా వేములవాడ ముచ్చట్లు, మా బాపు వైద్యం ముచ్చట్లు చెబుతూనేవున్నాడు. పడుకోమని చెప్పినా పడుకోలేదు. నేనున్నంత సేపూ మాట్లాడుతూనే వున్నాడు. నేనింకా అక్కడే వుంటే బాగా అలసిపోతాడని నాకన్పించింది.

"డాక్టర్లు చెప్పిన ప్రకారం మందులు వేసుకోండి. ఇక నేను వెళ్తాను" అన్నాను.

"ఏం మందులు బాబూ! ఎనభై అయిదు దాటాను. వీలున్నప్పుడు రండి" అన్నాడు. బయటికి వస్తుంటే అతనూ బయటకు వచ్చి సాగనంపడానికి ప్రయత్నం చేశాడు. వారించాను.

పది రోజుల తరువాత గంగాధరరావు చనిపోయాడని ఫోన్ వచ్చింది. రాత్రి ఏడు గంటల ప్రాంతంలో చనిపోయాడట. దహన సంస్కారాలు ఉదయం చేస్తారని చెప్పారు. ఉదయం వెళ్ళాను. ఆయన మృతదేహాన్ని చూశాను. ఆయనకి ఎనభై అయిదుకన్నా ఎక్కువే వుంటాయేమో. పరిపూర్ణపు బతుకు.

పన్నెండు కావస్తున్నది. దహన సంస్కారాలకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. బంధువులు, స్నేహితులు వస్తూనే వున్నారు.

ఎక్కడి వణుకూరు, ఎక్కడి వేములవాడ, ఎక్కడి వనస్థలిపురం. ఎలా వెలిగిన మనిషి, ఎలాంటి జీవితాన్ని చవిచూసిన మనిషి, ఎంతో పెద్ద ఇల్లు కట్టుకున్న మనిషి, ఎలాంటి ఇంట్లో చనిపోయాడు.

నాతోనే కాదు. అందరితోనూ వేములవాడ ముచ్చట్లే. ఉన్నది వనస్థలిపురంలోనే కానీ అతని మనసున్నది మాత్రం ఎప్పుడూ వేములవాడలోనే. వేములవాడలో పుట్టలేదు గానీ, వేములవాడ అంటే ఎంత ప్రేమ - పుట్టి పెరిగిన నాకుమల్లే.

కాస్సేపటికి చూస్తే ఎంతోమంది వేములవాడ వాళ్ళు. ఆయన సర్వీసుల్లో పనిచేసిన డ్రైవర్లు, క్లీనర్లు, కండక్టర్లు, ఇంటి చుట్టు పక్కలవాళ్ళు, షాపులవాళ్ళు. వనస్థలీపురంలో నాకు మా వేములవాడ సర్వీస్ స్టాండ్ కన్పించింది. గంగాధరరావు చనిపోలేదన్పించింది. వాళ్ళలో ఇంకా బతికి వున్నాడనిపించింది.

పుట్టి పెరిగిన వూరే కాదు. బతికిన వూరు మీద కూడా భావోద్వేగం వుంటుంది. బహుశా ఎక్కువే వుంటుందని గంగాధరరావు గుర్తుకొచ్చినప్పుడల్లా అన్పిస్తుంది.

★ ★ ★

రెడ్డి హోటల్

నా చిన్నప్పుడు మా ఇంటి దగ్గర్లో ఓ హోటల్ ఉండేది. దానిపేరు రెడ్డి మిలిటరీ భోజన హోటల్. పేరుకి రెడ్డి హోటలన్న మాటేగానీ అది ఓ పూరి గుడిసె హోటల్. నాలుగు బెంచీలు రెండు టేబిళ్ళతో ఆ హోటల్. ఉదయం పూట వేడివేడి పూరీ, మధ్యాహ్నం పకోడీ, అన్నం, అందులోకి మాంసం అక్కడ దొరికేవి. సాయంత్రం వేడివేడి మిర్చిబజ్జీలు దొరికేవి. హోటల్ తెరిచినప్పటినుంచీ మూసేదాకా చాయి దొరికేది. మిర్చి బజ్జీలను గుండ్రంగా ఓ ప్లేట్‌లో అందంగా అలంకరించే వాళ్ళు. పకోడీలను కుప్పగా పోసేవాళ్ళు.

శనివారం నాడు ఒక్క పూట బడివున్నప్పుడు మధ్యాహ్నం ఇంటికి వచ్చే వాళ్లం. బడి నుంచి మా ఇంటికి రావాలంటే హోటల్ దాటి రావాలి. పకోడీల వాసన గమ్మున మా ముక్కులకి తాకేది. పకోడీలు తినాలని మా అందరికీ అన్పించేది. కానీ కుదిరేది కాదు. ఎందుకంటే అప్పుడు డబ్బులు వుండేవి కాదు. మా అక్కలు, మా మామ, పెద్దమ్మ వచ్చి వెళ్ళిపోయేటప్పుడు రూపాయో, రెండు రూపాయలో ఇచ్చేవాళ్లు. కానీ వాటిని గల్లాగురిగిలో వేయించేవాళ్ళు. అందుకని డబ్బులు వున్నా ఖర్చు పెట్టుకునే అవకాశం వుండేది కాదు. పకోడీలకోసం మా అమ్మ ప్రాణం తీస్తే మిర్చి బజ్జీలు చేసేది కానీ వాటికోసం డబ్బులు ఇచ్చేదికాదు. ఎక్కువగా మిర్జి బజ్జీలని చేసేది. పకోడీలని తక్కువగా చేసేది. పకోడీలు చెయ్యాలంటే కష్టం. దానికి ఎక్కువ ఉల్లిపాయలు కావాలి. సమయం ఎక్కువ పడుతుంది. శ్రమతో కూడుకున్నది. అందుకని పకోడీలు తక్కువ చేసేది. చేసినా రెడ్డి హోటల్లో వున్నంత రుచి వచ్చేవి కాదు.

రెడ్డి హోటల్లో పకోడీలు చేస్తున్నప్పుడు, వాటి వాసన గుప్పుమనేది, నోరూరించేది. కానీ ఇంట్లో చేసినప్పుడు అంత మంచి వాసన వచ్చేదికాదు. అందుకని పెన్సిల్ కోసమో, నోట్‌బుక్ కోసమో డబ్బులు అడిగి తీసుకుని ఆ డబ్బులతో పకోడీలు కొనుక్కుని చాటుగా తినేవాళ్లం.

రెడ్డి హోటల్ యజమాని పేరు నారాయణ. అతను రెడ్డికాదు. కానీ హోటల్‌కి మాత్రం రెడ్డి హోటల్ అని పేరు పెట్టుకున్నాడు. అతన్ని అందరూ రెడ్డి అనేవాళ్ళు. రెడ్డి అన్పించుకోవడంలో అతనికి గర్వంగా అన్పించేది. అతని కొడుకు పేరు శ్రీను. వాడు మాతోబాటు ఐదవ తరగతి వరకు చదువుకున్నాడు. హోటల్‌కి అవసరమై ఆరవ తరగతిలో శ్రీనుని రెడ్డి చేర్పించలేదు.

ప్లేట్లలో పకోడీలు పెట్టి కస్టమర్లకి ఇవ్వడం, టీ గ్లాసులు అందించడం వాళ్ళు తాగిన తరువాత వాటిని కడగటానికి వాళ్ళ అమ్మకి అందించడం వాడు చేసే పని. రెడ్డి హోటల్ సర్వీస్ స్టాండ్ దగ్గర వుండడం వల్ల ఆ హోటల్లో గిరాకీ ఎక్కువగా వుండేది. వీళ్ళ హోటల్ తరువాత ఇంకో రెండు గుడిసె హోటళ్లు అక్కడ వెలిసినప్పటికీ ఈ హోటల్‌కి వున్నంత గిరాకీ వుండేది కాదు.

శ్రీనుగాడు చదువు మానేసినా సాయంత్రంపూట వచ్చి మాతోబాటు ఆటలు ఆడేవాడు. గిరాకీ ఎక్కువగా వున్నప్పుడు వాళ్ళ అమ్మ వాడిని పిలుచుకుని వెళ్ళేది. వాడు అయిష్టంగా వెళ్ళేవాడు.

శ్రీనుకి సృజనాత్మకత ఎక్కువ. మంచి బొమ్మలు వేసేవాడు. కొత్తకొత్త ఆటలు సృష్టించేవాడు. కబడ్డీ, చిర్రగోనే ఆటలు బాగా ఆడేవాడు. పిల్లిగీతలు అనే ఆట గురించి ఒకరోజు చెప్పాడు. అందులో రెండు పార్టీలు వుంటాయి. ఇంటి చుట్టుపక్కల వున్న రహస్య స్థలాల్లో బలపంతో గీతలు ఒక పార్టీవాళ్ళు రాయాలి. రెండో పార్టీ వాళ్ళు వాటిని కనుక్కోవాలి. కనుక్కోలేని గీతలు మొదటిపార్టీ వాళ్లకి మార్కులుగా అవుతాయి. కొద్దిరోజులకి ఈ ఆట విసుగెత్తగానే మరో కొత్త ఆట సృష్టించేవాడు. సిగరెట్టు పెట్టెల ముందు భాగాలకి విలువని ఇవ్వడం చేసేవాడు. ఎక్కువగా దొరికే చార్మినార్ సిగరెట్ డబ్బాకి తక్కువ విలువ. చాలా తక్కువగా దొరికే 'ప్యాసింగ్ షో' సిగరెట్ డబ్బాలకి ఎక్కువ విలువ. ఆ కవర్లని వాటివాటి విలువల ప్రకారం ఓ గుడారం గీసి మట్టిలో నిల్చుండబెట్టి శాబాద్ బండతో కొట్టడం. ఎన్ని సిగరెట్టు అట్టముక్కలు ఆ గుడారం నుంచి బయటకు వస్తే అవి అలా కొట్టిన వాళ్ళకి చెందుతాయి.

సర్వీసు బస్సుల హారన్ రబ్బర్‌లతో 'మారంఫీట్' అనే ఆట సృష్టించాడు. ఆ రబ్బర్‌తో ఎదుటివాళ్ళని కొట్టడం. వాళ్ళు దాన్నుంచి తప్పించుకొని అదే రబ్బరుతో ఎదుటివాళ్ళని కొట్టడం. ఈ ఆట పెద్దవాళ్ళకి తెలిసి మాన్పించారు. ఇట్లా ఒకటేమిటి ఎన్నో ఆటలు శ్రీను సృష్టించేవాడు. ఈ ఆటలన్నీ ఒక ఎత్తు. ఆదివారం మధ్యాహ్నంపూట వాడు తీసుకొచ్చే పకోడీల పాకెట్టు మరొక ఎత్తు.

ప్రతి ఆదివారం మధ్యాహ్నం నేనూ నా మిత్రులందరం వాడు తెచ్చే పకోడీ పాకెట్టుకోసం ఎదురు చూసేవాళ్ళం. వాడు తప్పక ఆదివారం మధ్యాహ్నం పకోడీలు తెచ్చేవాడు. మా దొడ్డిలోని గడ్డివాము దగ్గర కూర్చుని పకోడీలు తింటూ కథలు చెప్పుకునేవాళ్ళం. శ్రీను మాతోపాటు చదువుకొనసాగించకపోయినా మా స్నేహం అట్లా మరో రెండు సంవత్సరాలు కొనసాగింది.



సర్వీసు స్టాండుని మా ఇంటి పరిసర ప్రాంతంనుంచి వేరే ప్రాంతానికి తరలించారు. దాంతో రెడ్డిహోటల్ కళ తగ్గిపోయింది. చేసిన మిరపకాయ బజ్జీలు చేసినట్టే వుండిపోవడం, పకోడీల చుట్టూ ఈగలు వాలే పరిస్థితి ఏర్పడింది. కొత్త సర్వీసు స్టాండు దగ్గర రెడ్డికి అడ్డా దొరకలేదు. అందుకని వున్న స్థలంలోనే కొద్దిరోజులు హోటల్ నడిపాడు. కానీ గిరాకీ లేకపోవడంతో జాతర గ్రౌండ్‌కి మారిపోయాడు. దాంతో మా స్నేహానికి ఆటంకం ఏర్పడింది.

రెడ్డి హోటల్ జాతర గ్రౌండ్‌కి తరలిపోవడంతో శ్రీను అక్కడికి వెళ్ళిపోయాడు. శ్రీను వెళ్ళిపోయిన తరువాత సాయంత్రాలు మాకు శూన్యంగా అన్పించాయి. ఏమీ తోచేది కాదు. ఇక ఆదివారాల సంగతి చెప్పడానికి వీల్లేదు. కొత్త ఆటల సృష్టిలేదు. పకోడీలు తినడం లేదు. కథలు చెప్పుకోవడంలేదు.

మేం జాతర గ్రౌండ్‌కి వెళ్ళడం తక్కువ. ఎప్పుడన్నా గోకుల్ టాకీసులో సినిమాకు వెళ్ళినప్పుడు శ్రీనుని కలిసేవాళ్ళం. వాడు కూడా ఎప్పుడన్నా ఆదివారం పూట మా దగ్గరకు వచ్చేవాడు. కొంతకాలం తరువాత శ్రీను మా దగ్గరకు రావడం తగ్గిపోయింది. శ్రీను మెల్లిమెల్లిగా మా స్మృతిపథం నుంచి దూరంగా వెళ్ళిపోవడం మొదలైంది.

జాతర గ్రౌండ్‌లో శ్రీను వాళ్ళ హోటల్ ఒక మోస్తరుగా నడిచింది. ఓ సంవత్సరం తరువాత రెడ్డి చనిపోయాడు. హోటల్ అడ్డాకోసం పోటీ పెరిగి శ్రీను వాళ్ళని ఖాళీ చేయించారు. వాళ్ళకి మంచి అడ్డా దొరకలేదు. అందుకని వాళ్ళు వూరు వదిలి కరీంనగర్ చేరుకున్నారు. దాంతో శ్రీనుతో మా అనుబంధం తెగిపోయింది. శ్రీను మాకు ఒక జ్ఞాపకంగా మిగిలిపోయాడు. వేములవాడలో చదువుకున్నంత కాలం శ్రీను గురించిన సంభాషణ మా మిత్రుల మధ్య దొర్లేది. కాలేజీ చదువులకోసం వేములవాడ వదిలిపెట్టిన తరువాత శ్రీను

ప్రస్తావన తగ్గిపోయింది. కానీ మా ఇంటి వెనకకి వచ్చినప్పుడల్లా, మా దొడ్డిలోకి వెళ్ళినప్పుడల్లా శ్రీను గుర్తుకొచ్చేవాడు.

మా ఊరికి వచ్చినప్పుడల్లా శ్రీను గురించి మిత్రులని అడిగేవాణ్ణి. తెలిసిన వాళ్ళతో వాడి గురించి తెలుసుకునే ప్రయత్నం చేసేవాడిని. వివరాలు అంతగా తెలిసేవి కావు.

కాలేజీ చదువులు, యూనివర్సిటీ చదువులు, కొత్త ప్రదేశాలూ, కొత్త స్నేహితులు, కొత్త పరిచయాలు, కొత్త ఆటలు, కొత్త వాతావరణం శ్రీనుకి చోటులేకుండా చేశాయి.

చదువు తర్వాత ఉద్యోగ అన్వేషణ, పెళ్ళి, పిల్లలు, ట్రాన్సుఫర్లు, రాజకీయాలూ, పరుగు, ఒకటే పరుగు. ఉదయం లేచిన దగ్గర్నుంచీ రాత్రి పడుకునేదాకా ఒకటే పరుగు. రేసు గుర్రం కావడం టూత్‌పేస్టుని ఒత్తిఒత్తి జీవం తియ్యడం, రేజర్లతో కత్తెర్లతో హింసించి నాగరికం చేసుకోవడం. ఈ పరుగులో నాకే చోటు లేకుండాపోతే శ్రీనుకి చోటెక్కడిది? శ్రీను జ్ఞాపకం స్మృతిపథం నుంచి తొలగిపోయింది.

ఇరవై అయిదు సంవత్సరాల తరువాత గుడిముందు నుంచి మా ఇంటికి వస్తున్నప్పుడు శ్రీను కన్పించాడు. రోడ్డుకి అవతలవైపు శ్రీను. ఇవతలివైపు నేను. అతను శ్రీనేనా అని అనుకునేంతలోనే నావైపు మూడుసార్లు చూశాడు. ఇస్త్రీలేని బట్టలు, మారని చూపులు. నాకు తెలియకుండానే వాడిని పలకరించలేకపోయాను. వాడూ పలకరించలేదు. నా దగ్గరనుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో శ్రీను అక్కడినుంచి పరుగుపరుగున వెళ్ళిపోయాడు. క్షణంలో మాయమైపోయాడు.

నేను పలకరించలేదు. వాడూ పలకరించలేదు. మా ఇద్దరి మధ్య స్కేలుకి అందని దూరం. మా చదువుల అంతరం బంధించిందో, ఉద్యోగం అంతరం ఆపిందో, వాడి ఇస్త్రీలేని బట్టలు ఆపేసినాయో తెలియదు. ఇద్దరి నోర్లకి ప్లాస్టర్లు అతుక్కున్నాయి. మా చిన్ననాటి స్నేహం మంచుముక్కల మధ్య శవపేటికలా మారిపోయింది. కాలం గుర్రం డెక్కల కింద బద్దలైన కనుగుడ్లై పోయింది. ఐరావతం అడుగుల కింద నలిగిపోయిన పసిగుడ్డుగా మారిపోయింది.

తల గిర్రున తిరిగిపోయింది. నన్ను నేను తమాయించుకున్నాను. చిన్ననాటి స్నేహితులు కన్పిస్తే పలకరించని నా ప్రవర్తన నాకే ఆశ్చర్యాన్ని కలిగించింది. నా మీద నాకే కోపం వచ్చింది. అసహ్యం వేసింది.

'శ్రీనూ' అని గట్టిగా అరవాలనిపించింది. నాగరికత అడ్డం వచ్చింది. అరవలేక పోయాను. కానీ వాడు వెళ్ళిపోయిన వైపే నడిచాను. కానీ శ్రీనుని కనుక్కోలేకపోయాను. వాడికోసం భీమన్నగుడి సందులో వెతికాను. జాతర గ్రౌండులో తిరిగాను. ఫలితం శూన్యం. వాడు కన్పించలేదు. ఎవరిని అడిగినా వాడిజాడ తెలియలేదు.

ఆరోజు నుంచి ఇప్పటిదాకా మా వూరు వెళ్ళినప్పుడల్లా నా కళ్ళు శ్రీనుకోసం వెతుకుతునే వుంటాయి. ఒక్కసారి శ్రీను కన్పిస్తే ఎంత బాగుండునని మనస్సు ఆక్రోశిస్తుంది. వాడు కన్పిస్తే వాడిని దగ్గరికి తీసుకుని చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకుని గతంలోకి ప్రయాణం చేస్తే మరెంత బాగుండునని మనస్సు ఎప్పుడూ అనుకుంటుంది.

చాలారోజులకి శ్రీను సమాచారం తెలిసింది. జాతర గ్రౌండులో మిర్చిబండీ నడిపిస్తున్నాడని తెలిసింది. ఆ సమాచారం తెలియగానే మా వూరు వెళ్ళి జాతర గ్రౌండులో శ్రీనుకోసం వెతికాను. శ్రీను కన్పించలేదు. నెలరోజుల క్రితం వేములవాడ వదిలి వెళ్ళిపోయాడని తెలిసింది. ఇక్కడ బిజినెస్ సరిగా లేకపోవడం వల్ల వెళ్ళిపోయాడని తెలిసి మనస్సు రోదించింది. శ్రీను కన్పిస్తే బ్యాంకు వాళ్ళతో మాట్లాడి రెడ్డి హోటల్ పెట్టించాలని వుంది. ఈ విషయమే మా వూర్లో చాలామందికి అతను వస్తే చెప్పమని చెప్పాను.

కానీ శ్రీను కన్పించలేదు. పలకరించని నా సంస్కారాన్ని ప్రక్షాళనం చేసుకునే అవకాశం నాకు కల్గించలేదు.

ఎక్కడ ఏ కొత్త ఆట కన్పించినా, ఎక్కడ పకోడీ వాసన వేసినా శ్రీనే గుర్తుకొస్తాడు. నా సంస్కారమే గుర్తుకొస్తుంది.

★ ★ ★

గొజుల ఎల్లయ్య

ఏడవ తరగతికి వచ్చేసరికి కథలకోసం పెద్దవాళ్ళ ప్రాణాలు తీయడం తగ్గిపోయింది. నాకు నేనుగా కథలు చదివి ఆనందపడే దశ వచ్చింది. చందమామ, బాలమిత్రలు విపరీతంగా చదివేవాణ్ణి. నా దగ్గర లెక్కలేనన్ని పుస్తకాలు వుండేవి. అవి చదివి మా మిత్రులకి ఎన్నో కథలు చెప్పేవాణ్ణి. ఆ కథలు చెప్పేక్రమంలో నాకు తెలియకుండానే కథ మారిపోయి కొత్తకథ వచ్చేది. అలా కథ మారి కొత్తకథ వచ్చినప్పుడు నాకు చాలా ఆనందం వేసేది.

ఇది నువ్వు చదివిన కథ కాదు. పుట్టిచ్చిన కథ అని మిత్రులు కొన్నిసార్లు గొడవచేసేవాళ్ళు. అప్పుడు ఇంకా ఆనందం వేసేది. చందమామ బాలమిత్ర కథలనే కాదు. విఠలాచార్య సినిమాలంటే చాలా ఇష్టంగా వుండేది. మా వూరికి రాజుల సినిమాలు ఏవి వచ్చినా చూడకుండా వదిలిపెట్టేవాణ్ణి కాదు.

మా ఇంటికి కొద్దిదూరంలో వాళ్ళ ఇల్లు ఉండేది. ఎల్లయ్య తొమ్మిదవ తరగతి చదువుతుండేవాడు. అతనికి కథలంటే బాగా ఇష్టం. నా దగ్గరకు వచ్చి చందమామ, బాలమిత్ర పుస్తకాలు తీసుకెళ్ళేవాడు. మళ్ళీ తెచ్చిచ్చేవాడు. మా బాపు కూడా రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో మా కచేరీలో కూర్చుని చందమామలోని రెండు మూడు కథలు చదివి పడుకునేవాడు.

ఎల్లయ్య ఓసారి చందమామ పత్రికలు తీసుకుని వెళ్తూ డిటెక్టివ్ కథల గురించీ నవలల గురించీ చెప్పాడు. అవి వీటికన్నా చాలా బాగుంటాయని చెప్పాడు. ఆయన చెప్పిన విధానాన్ని బట్టి చూస్తే నాకూ చాలా ఆసక్తి కలిగింది. డిటెక్టివ్ నవలలు చదవాలన్న కోరిక కలిగింది. మా వూర్లో డిటెక్టివ్ నవలల్ని కిరాయికి ఇచ్చే షాపుండేది. రోజుకి ఒక్క నవలకి పది పైసలు కిరాయి. ఆ మాత్రం పైసలున్నా కిరాయికి తెచ్చుకోవాలంటే భయం. పెద్దవాళ్ళకి తెలిస్తే తిడతారని భయం. అందుకని ఆ సాహసం చెయ్యలేదు.

ఒకరోజు ఉదయం పది గంటల ప్రాంతంలో ఎల్లయ్య మా ఇంటికి వచ్చాడు. చందమామ బాలమిత్రలు తీసుకెళ్దామని వచ్చాడు. అవి తీసుకెళ్తూ నా చేతిలో ఓ చిన్న పుస్తకం పెట్టాడు. దానికి గోధుమరంగు అట్టవేసి వుంది.

"ఏం పుస్తకం" అడిగాను.

"కొమ్మూరి సాంబశివరావు నవల" చెప్పాడు.

వెంటనే ఆ పుస్తకాన్ని నా నిక్కర్ జేబులో పెట్టేశాను. జేబులో ఒదిగే సైజు. ఎల్లయ్య వెళ్ళిపోయిన తరువాత వెంటనే మా ఇంటిముందు అర్రలోకి వచ్చి తలుపులు పెట్టుకున్నాను. మొట్టమొదటిసారిగా డిటెక్టివ్ నవలని చదివినా. ఓ ఉద్వేగం, భయం. నవలలో జరిగిన హత్య సన్నివేశాన్ని కళ్ళకు కట్టినట్టు నవలలో వర్ణన వుంది. ఆ హత్య కన్నా ఎక్కువ భయం. ఎవరైనా తలుపు తడతారేమోనని భయం. ఈ రెండు విషయాలవల్ల గుండె మామూలుకన్నా ఎక్కువగా కొట్టుకుంది. నా లబ్ డబ్‌ల శబ్దాలు నాకే స్పష్టంగా విన్పించాయి.

గుండెలు అదరగా డిటెక్టివ్ నవలని ఏకబిగిన రెండు గంటలకాలంలో చదివేశాను. నా అదృష్టవశాత్తు ఎవరూ తలుపు తట్టలేదు. అన్నం తినడానికి పిలువలేదు. ఆనందం, భయం, ఉద్వేగం అన్నీ కలగలసిన అనుభూతి. పెద్దవాళ్ళు ఎవరైనా చూస్తారన్న భయం వల్ల ఎల్లయ్య మీద కోపం, నవల చదవడం వల్ల కలిగిన థ్రిల్లు వల్ల ఎల్లయ్య మీద ఇష్టం రెండూ కలిగాయి.

నవల పూర్తిచేసిన తరువాత ఆ నవలని తిరిగి ఎల్లయ్యకి ఇచ్చివద్దామని అన్పించింది. కానీ నవలని తీసుకొని వెళ్తున్న క్రమంలో ఎవరైనా చూస్తే... అన్న ఆలోచన రాగానే ఆ ఆలోచన మానుకున్నాను. ధైర్యం చెయ్యలేకపోయాను. నవలని ఎక్కడ దాచివుంచాలో



అర్థంకాలేదు. అలమరాలో పెడితే ఎవరన్నా చూసే అవకాశం వుంది. టేబిల్ సొరుగులో పెడితే కూడా ఎవరైనా చూడవచ్చు. ఆ అర్రలోని గోడలకి వున్న ఫోటోల మీదికి నా దృష్టి పోయింది. వాటి వెనక నవలని దాచి వుంచవచ్చన్న ఆలోచన వచ్చింది. నా ఆలోచనకి నేనే మురిసిపోయాను. వెంటనే అక్కడ వున్న టేబిల్ పైకి ఎక్కి గోడకి ముందుకు వంగి వేలాడుతున్న ఓ ఫోటో ఫ్రేమ్ వెనక నవలని దాచేశాను.

టేబిల్ దిగానో లేదో తలుపుకొడుతూ నన్ను పిలుస్తున్న చప్పుడు. వెంటనే తలుపు తీశాను. ఎదురుగా మామ, ఆయన వెనకే మా అమ్మ.

"తలుపులు పెట్టుకుని ఏం చేస్తున్నావ్" అడిగాడు మా మామ.

"ఏం లేదు. వూరికినే తలుపులు పెట్టుకున్నా" అన్నాను. లోపల ఎక్కడో భయం. మా ఇంటికి ఎవరు వచ్చినా వాళ్ళు వుండడానికి అవసరమైన గది మా ఇంటి ముందు అర్ర.

వెంటనే అక్కడి నుంచి బయటపడ్డాను. కానీ లోపల ఎక్కడో బెదురు. పుస్తకాన్ని జాగ్రత్తగా దాచివుంచాను. కానీ పొరపాటున కన్పిస్తుందేమోనని భయం. ఆ రోజంతా భయమే. ఆ రాత్రి ఆంజనేయస్వామిని తలచుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

తెల్లవారి తొమ్మిది గంటల ప్రాంతంలో డిటెక్టివ్ నవల గుర్తుకొచ్చింది. మళ్ళీ అప్పటివరకు లేని భయం మళ్ళీ మొదలైంది. మా మామకోసం చూశాను. ఆయన ఎనిమిది గంటలకే వెళ్ళిపోయాడని తెలిసి గుండె కుదుటపడింది. మెల్లిగా ఇంటి ముందు అర్రలోకి వచ్చాను. ఫోటోఫ్రేమ్ వెనక్కి చూశాను. గోధుమరంగు అట్టతో పుస్తకం అట్లాగే నిద్రిస్తూ కన్పించింది.

పది గంటల ప్రాంతంలో ఎల్లయ్య వచ్చాడు. ఇద్దరమూ వెళ్ళి మా ఇంటి ముందున్న అర్రలోకి పోయి కూర్చున్నాం. వెంటనే తలుపులు పెట్టేశాడు. టేబిల్ ఎక్కి ఫోటోఫ్రేమ్ వెనకనుంచి నవల తీసి ఎల్లయ్య చేతిలో పెట్టాను. నా ప్రవర్తన ఎల్లయ్యకి వింతగా తోచింది.

"పుస్తకాన్ని షర్టు కింద దాచుకో" ఆదుర్దాగా అన్నాను. ఎల్లయ్యకు ఏమీ అర్థంకాలేదు. కానీ వెంటనే నవలని షర్ట్ లోపల నిక్కర్‌లోకి దోపుకున్నాడు.

"నవల చదివి భయపడ్డావా?" అడిగాడు.

"నవల చదివి భయపడింది తక్కువ. పెద్దవాళ్ళు ఎవరన్నా చూస్తారేమోనని ఎక్కువ భయపడ్డాను. నిన్నరాత్రి మా మామ ఈ రూంలోనే పడుకున్నాడు. ఈ పుస్తకం ఎక్కడ ఆయన కంట్లో పడుతుందోనని భయపడ్డాను" అన్నాను.

"ఆ ఫోటోఫ్రేమ్ వెనక పెట్టినంక ఎట్లా కన్పిస్తుంది" అన్నాడు ఎల్లయ్య.

"సరేగానీ, మళ్ళీ ఇట్లాంటి నవలలు ఇవ్వకు" అన్నాను. కానీ లోపల ఇంకా చదవాలని వుంది.

"సరే!" అన్నాడు. కాసేపటికి జేబులోనుంచి కాగితాల కట్ట బయటకు తీశాడు. అతను రాసిన కథ. తెల్లకాగితం మీద చాలా కుదురుగా రాసిన నల్లటి అక్షరాలు. రెండు మూడు బొమ్మల్ని కూడా వేశాడు.

"కథ రాశాను. వింటావా" అన్నాడు.

"నువ్వు రాశావా" అపనమ్మకంగా అడిగాను.

"అవును. నీకు విన్పిద్దామని తెచ్చాను. మొన్న రాశాను. నిన్న రాత్రంతా కూర్చుని ఫెయిర్ చేశాను" అన్నాడు.

'చదువూ' అన్నట్టు తలూపాను.

పన్నెండు పేజీల కథని గుక్క తిప్పుకోకుండా చదివాడు ఎల్లయ్య. కథలో లీనమైపోయాను. ఇది వరకు చదివిన కథలా అన్పించలేదు. కొత్తగా అన్పించింది. విఠలాచార్య సినిమా కథకన్నా ఎక్కువ మలుపులు మాయలు మంత్రాలు ఎల్లయ్య చదివిన కథలో వున్నాయి. చాలా ఆనందం వేసింది. భవిష్యత్తులో ఇంకా చాలా మంచి కథలు ఎల్లయ్య రాస్తాడని నాకు అన్పించింది. అదే మాట ఎల్లయ్యతో అన్నాను. ఎల్లయ్య చాలా సంతోషపడ్డాడు.

రెండు రోజుల తరువాత ఎల్లయ్య మళ్ళీ వచ్చాడు. ఇంకో కొత్త కథ విన్పించాడు. చందమామకి ఆ కథలని పంపించమని చెప్పాను. ఎట్లా పంపించాలో తెలియదని ఎల్లయ్య అన్నాడు. ఆ తరువాత ఎల్లయ్య వచ్చినప్పుడల్లా ఓ కథకుడిని కలిసినట్టు అన్పించేది.

వారం రోజుల తరువాత మా మిత్రుడు శివకుమార్ వచ్చాడు. నా డిటెక్టివ్ నవల సంగతి, నా భయం సంగతీ చెప్పాను. ఎల్లయ్య రాసిన కథల సంగతీ చెప్పాను.

"ఎల్లయ్య దగ్గరికి వెళ్దాం. అతను రాసిన కొత్త కథలు విందాం"అన్నాను శివకుమార్‌తో.

"నీకు ఇంకో వ్యక్తిని చూపిస్తాను. అతను అప్పటికప్పుడే పాటలు కడతాడు. ఎల్లయ్య తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. అతను నాలుగవ తరగతి వరకే చదివాడు" అన్నాడు శివకుమార్.

శివకుమార్ బలవంతం మీద ఆ కవిని చూడటానికి మా ఇంటిముందు నుంచి బయల్దేరాం.

మా ఇంటినుంచి నేరుగా వెళ్తే బద్దిపోచమ్మ గుడి వస్తుంది. ఆ గుడికి కుడివైపున నగరేశ్వర ఆలయం. ఎడమవైపున భీమేశ్వర ఆలయం. నగరేశ్వర ఆలయంలోకి భక్తులు తక్కువగా వస్తారు. ఊరివాళ్ళు కూడా తక్కువే. అది ఎక్కువగా పిల్లలు కూర్చుని ముచ్చట్లు చెప్పుకోవడానికి ఉపయోగపడుతుంది. నన్ను అక్కడికి తీసుకుని పోయినాడు.

గుడి వెనుక మంగలి శంకర్ పుస్తకంలో ఏదో రాస్తూ కన్పించాడు. శంకర్ దగ్గరికి ఎందుకు తీసుకుని వెళ్తున్నాడో అర్థం కాలేదు.

"శంకర్! నీ పాటలు పాడు. ఇద్దరమూ వింటాం" అన్నాడు.

శంకర్ గొంతెత్తి తన పాటలు పాడినాడు. శంకర్‌లో ఇంత భావనాశక్తి వుందా అని నాకు ఆశ్చర్యం వేసింది. కాసేపు అతని పాటలు విని, అతనితో మాట్లాడి గుడినుంచి బయటకు వచ్చాం.

శివకుమార్‌ని తీసుకుని ఎల్లయ్య ఇంటికి వెళ్ళాను. ఎల్లయ్య తన కథల్ని మాకు విన్పించాడు. శివకుమార్ ఆశ్చర్యపోయాడు. ఆవిధంగా ఓ కథకుడిని కవిని ఇద్దరమూ చూశాం.

తొమ్మిదవ తరగతి అయిపోగానే ఎల్లయ్యకి వివాహం చేశారు. అంతే! ఎల్లయ్య చదువు కొనసాగించలేదు. వివాహం ఝుంజాటంలో ఇరుక్కుపోయినాడు. వాళ్ళ అక్క చేస్తున్న గాజుల వ్యాపారంలో అతనూ చేరిపోయినాడు. ఆ తరువాత మా రాజేశ్వరుని గుడి ముందు అతనూ ఓ గాజుల దుకాణం తెరిచాడు. గాజుల ఎల్లయ్యగా మారిపోయినాడు.

శంకర్ తన వృత్తిలో కొనసాగినాడు.

నేనూ శివకుమార్ మా ప్రయాణాన్ని కొనసాగించాం. కాలేజీలు, యూనివర్సిటీలు. పుస్తకాలు, పత్రికలు, కథలూ, కవిత్వాలూ, విమర్శలూ, సమీక్షలు.

చాలారోజులకి మా ఆవిడతోబాటు గాజుల ఎల్లయ్య దుకాణంలోకి వెళ్ళాను. రంగురంగుల గాజులు. దీపం కాంతులకి గాజులు మెరుస్తున్నాయి. గుడినుంచి పాట విన్పిస్తుంది. నిలువుగా గాజులు. ముందు చాప. చాపముందు ఎల్లయ్య, అతని భార్య.

"ఎట్లా వున్నావు ఎల్లయ్యా" పలకరించాను.

"బాగున్నా. మీరెట్లా వున్నారు" అడిగాడు. ఏకవచనంతో మాట్లాడలేక పోయినాడు.

"కథలేమైనా రాస్తున్నావా?" అడిగాను.

"ఇంకా ఎక్కడి కథలు. అప్పుడే ఆగిపోయినాయి" అన్నాడు విచారంగా.

"అప్పుడప్పుడూ మీ కథలూ కవిత్వాలూ చూస్తూనే వున్నా" అన్నాడు మళ్ళీ.

"రాయొచ్చు గదా ఎల్లయ్యా" అన్నాను.

"రాయలేను. రచనా వ్యాసంగం ఓ చెలిమె లాంటిది. నీటిని తీసినకొద్దీ వూరుతాయి. నేను నీరుని తియ్యడం మానేశాను. ఊట ఆగిపోయింది. రాయలేను. చదివితే అంతే చాలు" అన్నాడు.

ఎల్లయ్య ఇచ్చిన జవాబులో ఓ పోలిక వుంది. అతనిలో రచయిత వున్నాడు. ప్రయాణం లేక రచయిత ఆగిపోయినాడు. కాదు చచ్చిపోయినాడు. రచయిత ఎల్లయ్య కావలసిన వ్యక్తి గాజుల ఎల్లయ్యగా మారిపోయినాడు.

మంగలి శంకర్ భక్తుల వెంట్రుకలు తీస్తూనే తాను రాసిన పాటల కూనిరాగాలు పాడుతూనే వున్నాడు. మేం చూసిన మొదటి రచయితా, కవి ఎల్లయ్య, శంకర్‌లు. పోషణ లేక ఎండిపోయిన మొక్కలు. రాజేశ్వరుని గుడి ముందు వాళ్ళిద్దరినీ చూసినప్పుడల్లా గుండె కలుక్కుమంటుంది.

★ ★ ★

స్వప్నం

మా చిన్నప్పుడు మా బడి మా వూరి చివర్లో వుండేది. ఇప్పుడు మా బడిదాటి చాలా ఇండ్లు వచ్చేశాయి. మా బడి కూడా జూనియర్ కాలేజీగా రూపాంతరం చెందింది. పోలీసు స్టేషన్ని, గ్రామ పంచాయతీ ఆఫీసులని దాటిన తరువాత మాబడి. రోడ్డుకి ఒకవైపున పోలీస్ స్టేషన్. కొంచెం ముందుకి మరోవైపు కొద్దిదూరంలో గ్రామపంచాయితీ ఆఫీసు.

పోలీస్ స్టేషన్ ముందు విశాలమైన స్థలం. దాని పక్కనే సబ్ ఇన్‌స్పెక్టర్ క్వార్టర్, కొంచెం దూరంగా కానిస్టేబుల్స్ క్వార్టర్స్. మేం బడికి ఎప్పుడు పోయినా పోలీసు స్టేషన్ ముందు అటెన్షన్‌లో సెంట్రీ కన్పించేవాడు. అతని చేతిలో పెద్ద తుపాకీ కూడా వుండేది. సబ్ ఇన్‌స్పెక్టర్ వచ్చినపుడు సెంట్రీ పూర్తి అటెన్షన్‌లో అతనికి సాల్యూట్ చేసేవాడు. సబ్ ఇన్‌స్పెక్టర్ గుడికి వస్తే అతనితో ప్రత్యేకమైన పూజలు చేయించేవాళ్ళు మా గుడిలోని పూజారులు. సబ్ ఇన్‌స్పెక్టర్ రోడ్డుమీదికి వస్తే జనం పక్కకి జరిగి నిల్చునేవాళ్ళు.

ఇక గ్రామ పంచాయితీ ముందు ఎప్పుడూ జనం కన్పించేవాళ్ళు. మా వూర్లోకి ఎవరు వచ్చినా, ఏ మీటింగు జరిగినా సర్పంచ్ అక్క హాజరు వుండాల్సిందే. సర్పంచ్ రోడ్డు మీదికి వస్తే జనాలు లేచి నిల్చునేవాళ్ళు. మా బడిలో హెడ్‌మాస్టర్ వస్తే అందరూ భయంతో వణికేవాళ్ళు. ప్రపంచంలో అత్యంత పలుకుబడి వున్న పదవులు ఈ మూడే అని మా స్నేహితులు అనేవాళ్లు. రోజూ బడికి వెళ్ళినప్పుడల్లా పోలీస్ స్టేషన్‌పై, గ్రామ పంచాయితీ ఆఫీసువైపు చూసేవాళ్ళం.

మా బడిలో ఉదయమే ప్రార్థన వుండేది. దాని తరువాత జనగణమన, ప్రతిజ్ఞ. ఆ తరువాత క్లాసులు జరిగేవి. నెలకి ఒక్కసారి అన్ని క్లాసులని కలిపి ఒక గంట కార్యక్రమం ఏర్పాటు చేసేవాళ్ళు. స్కూల్లో టీచర్లు ఎక్కువమంది సెలవు పెట్టినరోజు ఇలాంటి క్లాసుని ఏర్పాటుచేసేవాళ్ళు. అది అందరం కలిసిన క్లాసు కాబట్టి పాఠాలు వుండకపోయేవి. అందరికి ఆసక్తికరంగా వుండే విషయాలు ఆ ఉమ్మడి క్లాసులో వుండేవి. కొంతమందితో పాటలు పాడించేవాళ్లు. కథలు చెప్పించేవాళ్ళు. జనరల్ నాలెడ్జికి సంబంధించిన విషయాలు చెప్పేవాళ్లు. సీనియర్లు జూనియర్లతో కలిసి వుండే క్లాసు అది.

నాకు బాగా గుర్తు. ఒకసారి అలాంటి క్లాసు ఒకటి జరిగింది. మాకు తెలుగు క్లాసు చెప్పే చొప్పకట్ల చంద్రమౌళి సార్ ఆక్లాసు తీసుకున్నాడు. ఒకరిద్దరుపిల్లలు తమకు వచ్చిన పాటలని చదివి విన్పించారు. తమకు తెలిసిన కథలని మరో ఇద్దరు చెప్పారు. చంద్రమౌళి సార్ కవిత్వం రాస్తారు కాబట్టి ఆయన తన రెండు కవితలని చదివి వాటి అర్థాలని మాకు చెప్పారు. క్లాసంతా గోలగోలగా అయ్యింది. క్లాసుని అదుపులోకి తీసుకురావడానికి ఒక

విద్యార్థిని తన దగ్గరికి పిలిచాడు. సార్ కొడతాడేమోనని భయం భయంగా వాడు సార్ దగ్గరికి వచ్చి నిల్చున్నాడు.

"నువ్వు ఎప్పుడైనా కలగన్నావా?" అడిగాడు ఆ విద్యార్థిని.

"లేదు సార్" అన్నాడు వాడు బిత్తర పోయి.

క్లాసులో నిశ్శబ్దం ఆవరించింది. ఇలాంటి ప్రశ్నని విద్యార్థులెవరూ ఊహించలేదు.

"కలలు కనకపోవడం మంచిది కాదు. ప్రతి వ్యక్తీ కలలు కనాలి. మనం ఏమిటో తెలుసుకోవడానికి కలలు కనాలి. కలలు కనని వ్యక్తి ఈ ప్రపంచంలో ఒంటరివాడవుతాడు. ఈ ప్రపంచం భగవంతుడి కల. మీ భవిష్యత్తు మీ కల" అన్నాడు చంద్రమౌళి సార్.

సార్ ఏం చెబుతున్నాడో ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. కానీ అందరూ ఓ కథ వినే ముందు ఉండే శ్రద్ధని కనబరిచారు.

"ప్రతి ఒక్కరూ కలగనాలి. ఆ కలని సాకారం చేసుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. మనకున్న శక్తి మేరకు కలగనాలి. అప్పుడు ఆ కల నిజమవుతుంది. కలే లేకపోతే దాన్ని నిజం చేసుకోవడం వుండదు" అన్నాడు సార్.

"మీరు చెప్పింది కొంతమేరకే అర్థమైంది. కొంచెం వివరంగా చెప్పండి" అన్నాడు పదవ తరగతి చదువుతున్న పోశెట్టి.

"నువ్వు కూర్చోనేను చెబుతాను" అన్నాడు. ముందు బెంచిలో నా పక్కనే కూర్చున్న లక్ష్మీ రాజం వైపు చూశాడు చంద్రమౌళి సార్. లక్ష్మీరాజం ఏడవ తరగతి చదువుతున్నాడు.



బడి అయిపోయిన తరవాత రోజూ ఓ గంట వ్యాయామం చేసి కాని ఇంటికి పోడు. సాయంత్రం మాతోబాటు ఇంటికి రాడు. ఆలస్యంగా వస్తాడు. ఉదయం బడికి వచ్చేముందు దీక్షగా స్టేషన్ వైపు చూసేవాడు. లక్ష్మీరాజంని చంద్రమౌళి సార్ ఆ దిశగా పరిశీలించాడు. చదువు మీద శ్రద్ధకన్నా బాడీ బిల్డింగ్ పైన శ్రద్ధ ఎక్కువ లక్ష్మీరాజం కనబరుస్తున్నాడన్న విషయం కూడా సార్ దృష్టిలో వున్నట్టుంది.

లక్ష్మీరాజం బెంచి మీద నుంచి లేచి నిల్చున్నాడు.

"నీకు ఏమైనా కావాలని కోరిక వుందా? రోజూ స్కూల్‌కి వచ్చేటప్పుడు పోలీస్ స్టేషన్ వైపు చూస్తుంటావు కదా? నీకేమైన ఆ కోరిక వుందా?" అడిగాడు.

లక్ష్మీరాజంకి ఏం చెప్పాలో తెలియలేదు. కానీ ఆయనకున్న కోరిక మా అందరికీ తెలుసు. సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలని అతని కోరిక. అందుకే రోజూ ఓ గంటసేపు వ్యాయామం. సార్ ప్రశ్నలోనే భావం వుంది. అది గ్రహించాడు లక్ష్మీరాజం. ఆయన మనస్సులో వున్న కోరిక కూడా అదే.

"సబ్ ఇన్‌స్పెక్టర్ అవ్వాలని నేను కలగంటున్నాను" అన్నాడు లక్ష్మీరాజం.

లక్ష్మీరాజం జవాబుతో క్లాస్ అంతా ఆశ్చర్యపోయింది. సీనియర్లు ఆలోచనల్లో పడ్డారు. జూనియర్లకి ఏమీ పాలుపోలేదు.

లక్ష్మీరాజంని మెచ్చుకోలుగా సార్ దగ్గరకు తీసుకున్నాడు. దాంతో లక్ష్మీరాజంకి ఆనందం వేసింది.

"సబ్ ఇన్‌స్పెక్టర్ కావడం వీడికల. ఈ కల కొంతమందికి పెద్దగా కన్పించవచ్చు. మరికొంత మందికి చిన్న కలలా కనిపించవచ్చు. ఎవరికి ఎలా కన్పించినా, వీడికి ఓ కల వున్నందుకు నేను సంతోషపడుతున్నాను. ఈ కలని సాకారం చేసుకోవడానికి బాడీ బిల్డింగ్ ఒక్కటే సరిపోదు. బాగా చదవాలి" అన్నాడు సార్.

సార్ మాటలతో అనుకోకుండా అందరూ చప్పట్లు కొట్టారు.

"నువ్వేం కావాలని అనుకుంటున్నావు. నువ్వేం కలగంటున్నావు" పోశెట్టిని అడిగాడు సార్.

"నేను సర్పంచ్‌ని కావాలని కలగంటున్నాను" అన్నాడు పోశెట్టి.

"రాజకీయాలు ఎందుకురా! ఇంకా ఏమైనా కావాలని కలగను" అన్నాడు సార్.

"లేద్సార్. నేను సర్పంచ్ కావాలని కలగంటున్నాను. అంతే!"

సార్ ఇంకా కొంతమందిని అలాంటి ప్రశ్నలు వేశాడు. ఒక్కొక్కరు ఒక్కోరకంగా జవాబులు చెప్పారు.

"ప్రియమైన విద్యార్థులులారా! కలలు కనండి. మీ కలలు నిజమవుతాయి. మీరు కలలు కంటేనే మీ గురించి మీకు తెలుస్తుంది. మనల్ని మనం ఉన్నతంగా చేసుకోవడానికి కలలు కంటాం. అందుకే మీరు కలలు కనండి."

ఎప్పుడు జరిగే క్లాసులకన్నా భిన్నమైన క్లాస్. అందరినీ కార్యోన్ముఖులని చేసే క్లాస్. అందరినీ కలలకి దగ్గర చేసే క్లాస్.

మా బడికి వెళ్లే క్రమంలో కన్పించే పోలీస్ స్టేషన్ లక్ష్మీరాజంని సబ్ ఇన్‌స్పెక్టర్ కావాలన్న కలని కనేలా చేసింది. అతని అన్న పోశెట్టికి సర్పంచ్ కావాలన్న కోరికను కలగచేసింది. వాళ్ళది వ్యవసాయ కుటుంబం.

స్కూల్ చదువు అయిపోయింది. అందరమూ కాలేజీ. చదువులకోసం వివిధ ప్రాంతాలకి వెళ్ళి పోయాం. లక్ష్మీరాజం ధ్యాసంతా ఒక్కటే. సబ్ ఇన్‌స్పెక్టర్ కావడం. అదే అతని కల. నేను లా చదువుతున్నప్పుడు తెలిసింది. లక్ష్మీరాజం సబ్ ఇన్‌స్పెక్టర్‌గా సెలక్ట్ అయినాడని. చాలా ఆనందం వేసింది. చిన్నప్పుడు కన్న కల, సాకారం కావడం. కల చిన్నదే కావచ్చు. కానీ లక్ష్మీరాజం కుటుంబ నేపథ్యానికి, మా వూరి నేపథ్యానికి అప్పుడున్న వాతావరణానికి అది పెద్ద కలే.

మా వూరి వాళ్ళకి చెప్పే అవకాశం లేదు గానీ లక్ష్మీరాజం మా మిత్రబృందానికి ఒక ఆకర్షణ. ఓ కలగన్నాడు. దాన్ని నిజం చేసుకున్నాడు.

పోశెట్టి పై చదువులు చదవలేదు. ఊరికే పరిమితమైనాడు. చిన్నచిన్న కాంట్రాక్టుల నుంచి మొదలు పెట్టి పెద్ద కాంట్రాక్టరైనాడు. కానీ సర్పంచ్ కాలేదు. అతని కల సర్పంచ్ కావడం.

ఆ దిశగా అతను చాలా ప్రయత్నాలు చేశాడు. ప్రజలతో మమేకం అయినాడు. ఊరి సమస్యల్లో పాలుపంచుకున్నాడు. ఎవరింట్లో ఏ ఆపద వచ్చినా అక్కడ హాజరయ్యేవాడు. రెండుసార్లు సర్పంచ్‌గా నిలబడ్డాడు. కొద్ది ఓట్ల తేడాతో ఓడిపోయాడు.

పోశెట్టి కనిపించినప్పుడల్లా అతని స్వప్నం గుర్తుకొచ్చేది. అతని కల సాఫల్యం అవుతుందానని అన్పించేది.

మళ్ళీ పంచాయతి ఎన్నికలు వచ్చాయి. అయితే ఈసారి మా వేములవాడ సర్పంచ్ పదవిని స్త్రీలకి రిజర్వ్ చేశారు. అందులో అది వెనకబడిన తరగతుల మహిళలకి.

పోశెట్టి స్వప్నంకి ఆటంకం ఏర్పడిందని అనుకున్నారు. కానీ పోశెట్టి అనుకోలేదు. తన భార్యని ఎన్నికల్లో నిలబెట్టాడు. రాజకీయాలతో సంబంధం లేని పోశెట్టి భార్య సర్పంచ్‌గా ఎన్నికైంది. తాను గెలిచిన దానికన్నా ఎక్కువ సంతోషపడ్డాడు పోశెట్టి. పోశెట్టి స్వప్నాన్ని అతని భార్య సాఫల్యం చేసింది.

లక్ష్మీరాజం గుర్తుకొచ్చినా, పోశెట్టిని చూసినా నాకు స్వప్నం గుర్తుకొస్తుంది. స్వప్నం లేకపోతే సాఫల్యం వుండదన్న విషయమూ గుర్తుకొస్తుంది. అందుకే నేను కలలు కంటాను. నా కలలు నిజమవుతాయి. అందులో ఏమాత్రం సందేహం లేదు.

★ ★ ★

సమాధానం

మా వూరి నుంచి యం.బి.బి.యస్. కోర్సులో మొదటిసారి చేరింది మా రఘుపతన్న. ఆ తరవాత ఆ కోర్సులో చాలమంది చేరినారు. మా అన్న డాక్టరీ కోర్సు చదువుతున్నప్పుడు హైద్రాబాద్‌లోని విద్యానగర్‌లో వుండేవాళ్ళు. ఆయనతోబాటూ ఇంకో నలుగురు మిత్రులు. మా అక్కయ్య కొడుకులు కూడా వుండేవాళ్ళు. వాళ్ళందరికీ వంట చేసిపెట్టడానికి ఓ వంటమనిషి కూడా వుండేవాడు.

మా అన్న హైద్రాబాద్‌లో చదువుకుంటున్నప్పుడు ఓ నాలుగైదుసార్లు నేను హైద్రాబాద్ వెళ్ళాను. మా అన్న స్నేహితులని చాలా మందిని చూశాను. అందరినీ అన్నయ్య అని పిలిచేవాణ్ణి. మా అన్న స్నేహితుల బృందమే కాలేజీలో చాలా చురుకుగా వుండేదట. ఆటల్లోనూ, పాటల్లోనూ చదువుల్లోనూ వాళ్ళే మొదటిగా వుండేవాళ్ళట. మెడిసిన్ అయిపోగానే మా అన్నకి ఉద్యోగం వచ్చింది. పీ.జీ. చేసే అవకాశాన్ని వదులుకుని మా అన్న ఉద్యోగంలో చేరినాడు. ఇంకా ఒకరిద్దరు కూడ అలాగే వెళ్ళిపోయారు. ఒకరిద్దరు స్టేట్స్‌కి వెళ్ళిపోయారు. మిగిలినవాళ్ళు వేరువేరు బ్రాంచీల్లో చేరినారు.

మా అన్న స్నేహితులందరూ వేరువేరు ప్రాంతాల్లో సెటిల్ అయినారు. అయినా అప్పుడప్పుడూ కలుసుకునేవాళ్ళు. హైద్రాబాద్‌లో ఏ చిన్న కార్యక్రమం వున్నా వాళ్ళు కలిసేవాళ్ళు. ఏ మిత్రుడు స్టేట్స్ నుంచి వచ్చినా కలుసుకునేవాళ్ళు. వాళ్ళు కేలేజీ వదిలి ముప్పై అయిదు సంవత్సరాలు దాటినా వాళ్ళ స్నేహం చెరిగిపోలేదు. వాళ్ళని చూస్తే నాకు ఆశ్చర్యం వేసేది. అట్లా అని రెండు మూడు నెలలకు ఒకసారి కలిసేవాళ్ళు కూడా కాదు. నాకు తెలిసినంత వరకు వాళ్ళకి పూర్వ విద్యార్థుల సమావేశాలు అవసరం పడలేదు. పి.యు.సి. చదివి యుక్త వయసులో ఐదు సంవత్సరాలు కలిసి చదువుకోవడం వల్ల వాళ్ళ మధ్య స్నేహబంధం గాఢంగా వుండేది.

రఘుపతన్న సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా చేరి, సివిల్ సర్జన్ అయి జిల్లా వైద్యాధికారి అయినాడు. వైద్యవృత్తికి, పరిపాలనా వృత్తికి చాలా భేదం. వైద్యవృత్తి ఒత్తిడులు వేరు. పరిపాలనా ఒత్తిడులు వేరు. ఆ పరిపాలనా ఒత్తిడులు మా అన్నకి సరిపోలేదు.

ఒకరోజు కరీంనగర్ నుంచి ఫోన్ వచ్చింది. రఘుపతన్నకి పక్షవాతం వచ్చిందని, పరిస్థితి విషమంగా వుందని హైద్రాబాద్ తీసుకొస్తున్నారని ఆ టెలిఫోన్ సారాంశం.

రఘుపతన్న స్నేహితుడు సత్యం అన్నయ్య నర్సింగ్ హోమ్‌కి తీసుకొస్తున్నారని ఓ రెండు గంటల్లో అక్కడ వుంటామని కూడా చెప్పారు. సత్యం అన్నయ్య మంచి న్యూరో సర్జన్.

వెంటనే సికింద్రాబాద్‌లోని నర్సింగ్ హోమ్‌కి వెళ్ళాను. అందరికీ తెలియపరిచాను. నేను వెళ్ళిన గంట తరువాత కరీంనగర్ నుంచి అంబులెన్స్ వచ్చింది. అంబులెన్స్ నుంచి రఘుపతన్నను బయటికి తీసుకుని వచ్చారు. ఆయనవైపు చూశాను. దుఃఖం పొంగి పొర్లుకొచ్చింది. వారం రోజుల క్రితం చూసినప్పుడు ఎంత ఉషారుగా కన్పించిన రఘుపతన్న ఎట్లా అయిపోయినాడు.

సత్యం అన్నయ్య సలహా మేరకు వైద్యపరీక్షలు అన్నీ జరిగాయి. స్కానింగ్‌లు ఇంకా ఏవేవో టెస్టులు యుద్ధప్రాతిపదికన జరిగాయి. రఘుపతన్నను చూస్తే పరిస్థితి చాలా విషమంగా వున్నట్టు అనిపించింది. ఏమీ పాలుపోలేదు. రఘుపతన్నను వుంచిన రూంలోకి రెండుసార్లు వెళ్లి చూసి వచ్చాను. ఆయన నావైపు చూశాడు. ఏదో చెప్పాలని వున్నట్టుగా నాకు అన్పించింది. చెప్పలేదు. శరీరం సహకరించదు. రఘుపతన్న ఆరోగ్యం కుదుటపడుతుందా? పూర్వంలాగా కన్పిస్తాడా? ఏమవుతుంది. ఎన్నో ప్రశ్నలు. ఏం చెయ్యగలను. రఘుపతన్నని చూస్తున్నది ఎవరో కాదు. ఆయన స్నేహితుడు. సన్నిహితుడు.

కాసేపటికి అక్కలు, అన్న బావమరుదులు, చిన్నన్న అందరూ వచ్చారు. బలగాన్ని చూసిన తరువాత కొంత కుదుటపడ్డాను.


ఓ గంట తరువాత రఘుపతన్నకి తీవ్రమైన గుండెనొప్పి వచ్చింది. పది నిముషాల్లోనే సూపర్ స్పెషలిస్ట్‌లు ఇద్దరు వచ్చారు. రఘుపతన్న క్లాస్‌మేట్స్ మరో ఇద్దరు కూడా వచ్చారు. వాళ్ళందరూ రఘుపతన్నతోబాటు లోపల. ఆందోళనతో మేం బయట, పక్షవాతం, గుండెనొప్పి ఒకేసారి రావడం వల్ల పరిస్థితి విషమించింది. ఒకరిద్దరు డాక్టర్లు బయటికి వచ్చారు. వాళ్ళ మొఖాలు కూడా ఆందోళనగా కన్పించాయి. మళ్ళీ లోపలికి వెళ్ళారు.

అరగంట తరువాత అందరూ బయటకు వచ్చారు. గండం గట్టెక్కింది. సత్యం అన్నయ్య నన్ను వదినను పక్కగదిలోకి తీసుకెళ్ళాడు.

"రఘు పరిస్థితి బాగాలేదు. సీరియస్‌గా వుంది. పక్షవాతంకి తోడు గుండెనొప్పి కూడా వచ్చింది. నిమ్స్‌కి తరలిస్తే మంచిది. అక్కడ అందరూ స్పెషలిస్టులు వుంటారు. పరిస్థితి విషమిస్తే వెంటిలేటర్లు కూడా పెట్టే అవకాశం వుంది. వీటన్నింటితోబాటు స్నేహితులకి వైద్యం చెయ్యడం అంత సులువైన పనికాదు" మాకు క్లుప్తంగా వివరించాడు.

ఏం మాట్లాడాలో మాకు తోచలేదు. ఇద్దరం మౌనంగా వుండిపోయాం.

"అక్కడ నాకు తెలిసిన డాక్టర్లు వున్నారు. వాళ్లకు చెబుతాను. నేను కూడా రోజూ వచ్చి చూస్తాను" అన్నాడు మా మౌనాన్ని గమనించి.



ఆ రాత్రికి రాత్రే రఘుపతన్నని నిమ్స్‌కి తరలించాం. ఆ సమయంలో చెయ్య గలిగింది ఏమీ లేదు. మాతో పాటు అన్నయ్య స్నేహితుడు డాక్టర్ రామారావు కూడా నిమ్స్‌కి వచ్చాడు. ఆ రాత్రి భయంకరంగా గడిచింది. జనరల్ వార్డులో రఘుపతన్నని వుంచారు. ప్రతి నిముషం ఆందోళనగానే గడిచింది.

న్యూరో వార్డులో అడ్మిట్ చేశారు. పక్షవాతంకి సంబంధించిన మందులు ఇచ్చారు. గుండెని నిర్లక్ష్ యం చేశారు. డాక్టర్లకి ఆ విషయం చెప్పినా పట్టించుకోలేదు. వాళ్ళ ఉద్దేశ్యం ఏమిటో అర్థం కాలేదు. పరిస్థితి పూర్తిగా విషమించింది కాబట్టి గుండె డాక్టర్‌కి చూపించలేదో, నిర్లక్ష్యమో ఏమీ అర్థం కాలేదు.

రఘుపతన్న కూతురు అనుపమ అమెరికాలో వుంది. అనుపమకి సమాచారం ఇచ్చాం. అనుపమ రావడానికి నాలుగు రోజులు పడుతుంది. అప్పటి దాకా పరిస్థితి ఎట్లా వుంటుందో... ఇవే ఆలోచనలు.

రఘుపతన్న నోట్లోనుంచి వచ్చిన ఒకే ఒక్కమాట అ...న... బహుశా అనుపమ గురించేనని అన్పించేది. కాగితం మీద కూడా రాసే పరిస్థితి లేదు. ఆయన ఏం అనుకుంటున్నాడో, ఏం అడగాలని అనుకుంటున్నాడో మేము ఊహించి ఆయనకి సమాధానం చెప్పేవాళ్ళం. మేం చెబుతున్న విషయాలు అర్థమవుతున్నట్టుగా మాకు అన్పించేది.

ఐదు రోజులు కష్టంగా గడిచాయి. అనుపమ స్టేట్స్ నుంచి సరాసరి నిమ్స్‌కే వచ్చింది. వచ్చినప్పటినుంచి అనుపమ రఘుపతన్న పక్కనే కూర్చుంది. రఘుపతన్న మొహంలో

కూడా ఏదో తెలియని కాంతి. అనుపమ వచ్చిన తరువాత ఇరవై నాలుగు గంటలు రఘుపతన్న ప్రాణంతో ఉన్నాడు. అనుపమ కోసమే ఆ ఆరు రోజులు బతికాడేమో. ఆ తరువాత మళ్ళీ గుండెనొప్పి వచ్చింది. లైఫ్ సేవింగ్ డ్రగ్స్ కోసం డాక్టర్లు మమ్మల్ని పరుగులు తీయించారు. అవి తెచ్చేలోపు ఆయన మరణించాడు. సైన్స్ నమ్మినా నమ్మకపోయినా, మనం విశ్వసించినా విశ్వసించకపోయినా ఒకటి మాత్రం నిజమనిపించింది. అనుపమ కోసమే ఈ అయిదు రోజులు రఘుపతన్న బతికాడు. కూతురుతో ఒక రోజంతా గడిపిన తరువాత చనిపోయాడు. ఇంకా రెండు రోజులు ఎందుకు బతకలేదు? రెండు రోజుల ముందే ఎందుకు చనిపోలేదు? ఈ ప్రశ్నలకి సమాధానాలు తెలుసుకోవడానికి ఇంకా సైన్సుకి చాలాకాలం పడుతుంది.

రఘుపతన్న చనిపోయిన విషయం సత్యం అన్నయ్యకి ఫోన్ చేసి చెప్పాను. హైద్రాబాద్‌లో వున్న బంధువులకి చెప్పాను. అరగంటలో చాలామంది వచ్చారు. రఘుపతన్న స్నేహితులు చాలామంది వచ్చారు. అందరికీ సమాచారం ఇచ్చింది సత్యం అన్నయ్యే.

హాస్పిటల్ ఫార్మాలిటీస్ అయిన తరువాత రఘుపతన్న శవాన్ని అంబులెన్స్‌లోకి చేర్చాం. చాలామంది వచ్చారు. రానిది ఒక్క సత్యం అన్నయ్యే. రఘుపతన్న నిమ్స్‌లో వున్నప్పుడు రోజూ వచ్చిన సత్యం అన్నయ్య రఘుపతన్న చనిపోయిన తరువాత ఎందుకు రాలేదో అర్థం కాలేదు.

"ఇంకాస్సేపు వేచి చూద్దామా? సత్యం అన్నయ్య వస్తాడేమో" అన్నాను రామారావుతో.

"వద్దు. మీరు బయల్దేరండి. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది" అన్నాడు రామారావు.

ఆ రాత్రికి రాత్రే మా వూరు బయల్దేరాం. తెల్లవారి మధ్యాహ్నం మూడు గంటలకి దహన సంస్కారం వుంటుందని అందరికీ తెలిపాం. భద్రాచలంలో వున్న రఘుపతన్న స్నేహితుడు డా.కాంతారావు దహన సంస్కారాలకి వచ్చాడు. మిర్యాలగూడలో వున్న డా. వెంకటరెడ్డి వచ్చాడు. సత్యం అన్నయ్య మాత్రం రాలేదు. ఆ దుఃఖంలో ఆ విషయాన్ని పట్టించుకోలేదు. కానీ రెండు మూడు రోజుల తరువాత ఈ విషయమే తరచూ గుర్తుకొచ్చింది.

ఓ ఇరవై రోజుల తరువాత సత్యం అన్నయ్య వచ్చాడు. ఓ రెండు గంటలు మాతో గడిపాడు. అందరినీ పరామర్శించాడు. చనిపోయినాడని తెలిసిన తరువాత నిమ్స్‌కి రాలేదు. దహన సంస్కారాలకి రాలేదు. కానీ రఘుపతన్న హాస్పిటల్‌లో వున్నప్పుడు వచ్చాడు. చనిపోయిన ఇరవై రోజుల తరువాత వచ్చాడు. సత్యం అన్నయ్య ప్రవర్తన ఉద్దేశ్యం నాకర్థం కాలేదు.

కాలచక్రంలో నాలుగు సంవత్సరాలు గడిచాయి. చాలాసార్లు సత్యం అన్నయ్యని కలిశాను. ప్రతిసారీ ఈ ప్రశ్న నాలో ఉదయించేది. కానీ ఎప్పుడూ అడగలేదు. ఆయన

నాకూ చెప్పలేదు. నా కవిత్వం పుస్తకాలు ఇచ్చాను. అందులో రఘుపతన్న చనిపోయినప్పుడు రాసిన ఓ కవిత వుంది.

'మెదడు డాక్టర్‌కి మెదడే వుంటుందని
గుండె వుండదని నేనూహించలేదు.
లైఫ్ సేవింగ్ డ్రగ్స్ కూడా నీ దగ్గర వుండవని అనుకోలేదు.
'సారీ'కి రెండక్షరాలే!
బాధకి దుఃఖానికి కూడా రెండక్షరాలే!
బాధని కొలిచే కొలమానం నీ దగ్గర వుందా
దుఃఖంలో వున్నవాళ్ళకి దుఃఖం లోతు తెలియదు.
నీకేం తెలుస్తుంది?
పేషంట్ బతుకుతాడా లేదా అది వేరే సంగతి
గెలుపు ఓటమి కాదు ప్రశ్న
కనీసం ప్రయత్నం లేకుండానే ఓడిపోవడంలోనే
వుంది బాధ'?

కొంతకాలానికి సత్యం అన్నయ్యని కలిశాను. అరగంటసేపు కూర్చుని మాట్లాడుకున్నాం. మా సంభాషణల్లో ఆ కవిత ప్రస్తావన వచ్చింది. నిమ్స్ డాక్టర్లు గుండె గురించి ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. వాళ్ళు ఎంతసేపు పక్షవాతం గురించి మాత్రమే పట్టించుకున్నారు అని చెప్పాను. అన్నయ్య ఏమీ మాట్లాడలేదు.

రెండు రోజుల తరువాత సత్యం అన్నయ్య దగ్గర నుంచి ఫోన్ వచ్చింది. గొంతు చాలా కామ్‌గా వుంది.

"రాజేందర్! నువ్వు నన్ను ఎప్పుడూ అడుగలేదు. కానీ రఘు నన్ను నాలుగేళ్ళుగా ప్రశ్నిస్తూనే వున్నాడు. హైద్రాబాద్‌లో వుండి చనిపోయిన నన్ను చూడ్డానికి ఎందుకు రాలేదని. ఆఖరి చూపు చూడ్డానికి ఎందుకు రాలేదని తరచూ నన్ను ప్రశ్నిస్తున్నాడు. వాడికి సమాధానం చెప్పాను. నీక్కూడా చెప్పాలనిపించింది" అన్నాడు.

ఏం మాట్లాడాలో తోచలేదు.

"నేనొస్తాను" అన్నాను చివరికి ఆలోచించి.

"ఇప్పుడు అవసరం లేదు. నేను చెప్పేది విను" అన్నాడు అన్నయ్య.

"చెప్పండి" అన్నాను.

"కుటుంబ సభ్యుల మరణాలని తప్ప ఎవరి మరణాలని నేను చూడలేదు. వాళ్ళు శవంగా మారిన దృశ్యాన్ని నేను ఊహించుకోలేను. నా సన్నిహితులు స్నేహితుల ముద్ర నా స్మృతిపథంలో శవంగా వుండకూడదని నా ఆలోచన. ఈ కారణంగానే రఘు చనిపోయిన తరువాత చూడటానికి రాలేదు. దహనసంస్కారాలకి రాలేదు. పదిహేను రోజుల తరువాత వాళ్ళని కలిసి పరామర్శించడం ఇంతకాలం నుంచి చేస్తూ వస్తున్నాను. నా అభిప్రాయం సరైందేనా అని ఎవరూ ఎప్పుడూ ప్రశ్నించలేదు. కానీ ఈ నాలుగేళ్ళుగా రఘు ఈ ప్రశ్న వేస్తున్నట్టు ఫీలవుతున్నాను" కొంచెం సేపు నిశ్శబ్దం.

"చెప్పండి అన్నయ్యా" అన్నాను.

"ఇప్పుడు నా అభిప్రాయం మారిపోయింది. నేను ఇంతకాలం చేసింది సరైంది కాదని నాకన్పిస్తుంది. ఆఖరి చూపు విలువని నేను ఇంతకాలం తెలుసుకోలేకపోయాను. మన ప్రేమని, గౌరవాన్ని వ్యక్తపరిచే చివరి సంఘటన శవాన్ని దర్శించడం. అక్కడ ఓ దండం పెట్టడం. ఓ పుష్పగుచ్ఛాన్ని వుంచడం. వాళ్ళ కుటుంబ సభ్యులతో కలిసి దుఃఖాన్ని పంచుకోవడం. రఘుకి జవాబు చెప్పాను. రఘు నన్ను ప్రశ్నించడం మానేశాడు"

ఈ సమాధానం నాకు చెప్పాడా, రఘుపతన్నకి చెప్పాడా తెలియదు కానీ చాలాకాలం నుంచి నాలో నలుగుతున్న సందేహానికి సమాధానం దొరికింది.

★ ★ ★

దసరా

'కొత్తబట్టల మెరుపులు మెరుస్తాయి. జొన్నకంకులు వాహనాల కిరీటాలవుతాయి. ఆయుధాలు పసుపు కుంకుమల్తో కెలడోస్కోపైపోతాయి. ప్రతిఇల్లూ అల్లుళ్లతో ఉక్కిరిబిక్కిరవుతూ వుంటుంది. రోజూ గుర్తింపులేని జమ్మి బంగారమైపోతుంది' తెలంగాణలో దసరా చాలా పెద్దపండుగ. మా వేములవాడలో దసరాపండుగ చాలా గొప్పగా జరుగుతుంది. దసరాకి మైసూరు తీసుకెళ్తామని ఎవరన్నా చెప్పినా పోవాలనిపించదు. ఏ పండుగకూ మా వూర్లో లేకున్నా పర్వాలేదు కానీ దసరా పండుగకు మా వేములవాడలో లేకపోతే చిన్నబోయినట్టుగా వుంటుంది.

ఈ నలభై ఎనిమిది సంవత్సరాల్లో దసరాకి మా వూర్లో లేనిది మూడు నాలుగుసార్లే. మా బాపు చనిపోయినప్పుడు ఒకసారి, మా రఘుపతన్న చనిపోయినప్పుడు మరోసారి, జ్వరం వచ్చి ఒకసారి, ఉద్యోగరీత్యా తిరుమలలో వున్నప్పుడు మరోసారి దసరాకి మా వూర్లోలేను. అంతే!

మా బాపు చనిపోయిన సంవత్సరం మాకు పండుగ లేదు. మా ఊర్లో చిన్నపోయినట్టు ఉండకూడదని, మాసిరిసిల్ల అక్కయ్య మమ్మల్ని సిరిసిల్లకు తీసుకునిపోయింది. రకరకాల వంటలు చేసింది. చాలా ప్రేమగా చూసుకున్నది. అయినా నాలుగు గంటల నుంచి ఒక్కటే వేదన. అన్నీ మా వూరి జ్ఞాపకాలే. మా రాజేశ్వరుని గుడి, దేవుని సేవ, మహాలక్ష్మమ్మ గుడి, స్నేహితుల హడావిడి, మాటలు మానేసిన వ్యక్తులు మాట్లాడుకోవడం, ఒకరినొకరు ప్రేమతో అలుముకోవడం అన్నీ గుర్తుకొచ్చి మనస్సు విలవిలలాడింది. ఆరోజు పండుగ లేనిరోజు మా వూర్లో వుంటే మనస్సు ఇంకా ఎక్కువ బాధపడేదేమో. ఇంకా ఎక్కువ విలవిలలాడేదేమో.

మరోసారి తిరుమలలో క్యాంప్ కోర్టులో పనిచేస్తున్నప్పుడు దసరాకి మా ఊరికి పోలేదు. చక్రస్నానం జరుగుతున్నా, మలయప్ప స్వామిని దేవేరులతో ఊరేగింపుగా తిప్పుతున్నా, ఉన్నది తిరుమలలోనైనా, నా మనస్సంతా మా వేములవాడలోనే. మా మహాలక్ష్మమ్మ గుడి దగ్గరే. మా రాజేశ్వరుని సేవ దగ్గరే. మా రాజేశ్వరుని గుడి ముందరే.

దసరా పండుగ గుర్తుచేసినంతగా మా వూరుని ఏ పండుగ గుర్తు చెయ్యదు. దసరాకి ఎక్కడున్నా క్షణక్షణం మా వేములవాడ గుర్తుకొస్తుంది. అదొక పులకరింత. అదొక పలవరింత.

మా చిన్నప్పుడు దసరా పండుగరోజు ఎంత హడావిడో. మా అక్కల పెండ్లిండ్లు అయినప్పుడు బట్టలు కుట్టించడం ఎప్పుడైనా మర్చిపోయినారో ఏమో తెలియదు గానీ దసరాకు మాత్రం కొత్తబట్టలు కుట్టించడం ఎప్పుడూ మర్చిపోలేదు. దసరా రోజులలో మేరవాండ్ల ఇండ్లు ఎంత కళకళలాడేవో చెప్పనలవి కాదు.

మా చిన్నన్న ఫ్రెండు శివచరణ్. ఆయన హైదరాబాద్‌లో ఎమ్మే చదువుతుండే వాడు. కానీ బట్టలు మా వేములవాడలోనే కుట్టించేవాడు. ఆయన టైలర్ బాలరాజు. అతను హైదరాబాద్, బొంబాయిలలో పనిచేసిన వ్యక్తి. శివచరణ్ ప్రభావంతో నేను బాలరాజు దగ్గరే బట్టలు కుట్టించుకునేవాడిని. అతనికి ప్రత్యేకంగా షాపు లేదు. ఇంటిదగ్గరే కుట్టేవాడు. అందరమూ అతని ఇంటి దగ్గరికి వెళ్ళే కుట్టించుకునేవాళ్ళం. బట్టలు ఎంత ముందుగా ఇచ్చినా దసరా రోజే బట్టలు ఇచ్చేవాడు. ఒకటి రెండుసార్లు అతనితో గొడవ పడ్డాను కూడా. మందుమీద వుండేవాడు. కానీ మామూలుగానే మాట్లాడేవాడు. పన్నెండింటి వరకు బట్టలు ఇవ్వకపోతే కోపంగా తిట్టి ఇంటికి వచ్చేసేవాడిని. అలా తిట్టి ఇంటికి వెళ్ళిపోయిన వాళ్ళందరి ఇండ్లకి వచ్చి కుట్టిన బట్టలు తెచ్చిచ్చేవాడు బాలరాజు. అతను బట్టలు తెచ్చిచ్చే వరకు మనస్సు మనస్సులో వుండేది కాదు. బాలరాజు బట్టలు తెచ్చివ్వగానే నా మొహం వెలిగేది. చివరి క్షణంలో ఎక్కువ పనిచేసేవాడు బాలరాజు. బాలరాజుతో ప్రతి సంవత్సరమూ ఇంతే!

దసరాకి బావలు అక్కలు అందరూ వచ్చేవాళ్ళు. చాలామంది వున్నప్పుడు యాటని కోసేవాళ్ళు. మాంసం దుకాణాలు చాలా అయిన తరువాత యాటని ఇంట్లో కోయడం మానేశారు. బయట నుంచే మాంసం తెచ్చేవాళ్ళు. ఇంట్లో చేసిన పూరీలను మాంసంలో శోరువాతో తినడం, ఊరంతా బలాదూరుగా తిరిగి, మా టైలర్ బాలరాజు చుట్టూ తిరిగి మధ్యాహ్నం వరకు ఇంటికి రావడం. వచ్చిన తరువాత కూడా ఇంట్లో మా నుంచి ఎలాంటి సహకారం వుండేది కాదు. బావలతో పత్తాలు ఆడటం, భోజనాలకి లెవ్వమన్నమాటలతో అతికష్టంగా భోజనాలకి వెళ్ళడం మేము ఇంట్లో వాళ్ళకి చేసే సహకారం. రెండింటి వరకు మా భోజనాలు అయ్యేవి.

ఆ తరువాత ఆడవాళ్ల భోజనాలు అయ్యేవి. మా భోజనాలకన్నా ముందు వండిన అవన్నీ మూడు విస్తర్లలో పెట్టి వాటిని నట్టింట్లో పెట్టేది మాఅమ్మ. మా పూర్వీకుల ఫోటోలు లేవు. కానీ వాళ్ళముందు భోజనం పెట్టినట్టుగా మా అమ్మ భావించేది. అందరి కొత్తబట్టలని నట్టింట్లో పెట్టేది.

సాయంత్రం నాలుగ్గంటలకి ఎవరి బట్టలు వాళ్ళకి ఇచ్చేది మా అమ్మ. కొత్త బట్టలు వేసుకుని మహాలక్ష్మమ్మ గుడి దాకా వెళ్లేవాళ్లం. మహాలక్ష్మమ్మ గుడి మా వూరికి తూర్పువైపున

వుంటుంది. ఆ గుడికి రోజూ వెళ్ళేవాళ్ళ సంఖ్య తక్కువగా వుంటుంది. దసరా రోజు మాత్రం వూరు వూరంతా అక్కడికి వెళ్ళి దర్శనం చేసుకుంటుంది.

ఆ గుడికి రెండు వందల అడుగుల దూరంలో విశాలమైన స్థలం వుంది. ఆ స్థలంలో జమ్మికొమ్మని నాటుతారు. దసరా రోజు సాయంత్రం పిల్లలూ పెద్దలూ అందరూ అక్కడికి వస్తారు. ఆడవాళ్ళు తక్కువగా వస్తారు. రాజేశ్వరుని గుడి ముందు మాత్రం వాళ్ళే.

మహాలక్ష్మి గుడిలో అమ్మవారి దర్శనం చేసుకుని జమ్మికొమ్మ చుట్టూ తిరిగి పక్కన వున్న పొలాల్లోకి వెళ్ళి జమ్మి ఆకులూ కొమ్మలూ తెచ్చుకోవడం వూరి వాళ్లందరూ చేసే పని. పెద్దవాళ్ళు కన్పిస్తే జమ్మిఆకులు వాళ్ళకి పెట్టి నమస్కారం చెయ్యడం. స్నేహితులు కనిపిస్తే అలముకోవడం (ఆలింగనం) చాలామంది చేసే పని. ప్రేమని, గౌరవాన్ని తెలియజేసే పండుగ దసరా.

జమ్మి తెచ్చుకున్న తరువాత జమ్మికొమ్మ దగ్గర రాజేశ్వరుని పెద్దసేవ కోసం అందరమూ ఎదురుచూస్తాం. ఆరు గంటల సమయానికి రాజేశ్వరుని సేవ గుడి నుంచి బయల్దేరి మహాలక్ష్మమ్మ గుడి దాకా వచ్చి అక్కడినుంచి జెమ్మికొమ్మ చుట్టూ తిరుగుతుంది. సేవ వచ్చి వెళ్ళిన తర్వాత అందరూ వూరిలోకి బయల్దేరతారు. సేవ జమ్మి కొమ్మ దగ్గర ఆగినప్పుడు పిల్లలు సేవ కింది నుంచి అటూఇటూ వెళతారు.

రాజేశ్వరుని సేవ - దాని వెనకే హరి సేవ. ఇది ఎప్పుడూ ఎల్లప్పుడూ. దసరా. రోజు ఈ దేవుని సేవ మా వూరు చుట్టూ తిరుగుతుంది. ప్రతివాడా తిరుగుతుంది. ప్రతి ఇల్లూ దీపనేత్రమై సేవకు ఎదురుచూస్తూ వుంటుంది. అందరూ సేవకి హారతి ఇచ్చి దండం పెట్టుకుంటారు. ఇదొక అద్భుత సన్నివేశం. సేవ వచ్చి వెళ్ళిన తరువాత గుడికి పోయి



దేవుని దర్శనం చేసుకోవడం, ఇంట్లో పెద్దవాళ్ళందరికి జమ్మిపెట్టి కాళ్ళకు దండం పెట్టడం – ఇదొక అపురూపమైన విషయం. పుట్టిన రోజున కూడా పెద్దవాళ్ళకి దండం పెట్టడం మర్చిపోతారేమో గాని, దసరా రోజు పెద్దవాళ్ళకి దండం పెట్టకపోవడం అనేది జరగకుండా వుండదు.

పోయిన సంవత్సరం దసరాకి మా వూరికి వెళ్ళాను. హైదరాబాద్‌లోనే బట్టలు కుట్టించుకున్నాం. అందరు అక్కలు బావలు రాలేదు. వాళ్ళకి వాళ్ళకూతుర్లు అల్లుళ్లు. మా చిన్నక్క, చిన్నబావ మాత్రమే దసరాకి వచ్చారు.

బాపు చనిపోయాడు. రఘుపతన్న చనిపోయాడు. పెద్దన్న వీళ్ళకన్నా ముందే చనిపోయాడు. కానీ దసరా అలాగే వుంది. అందరం వేములవాడలోనే. అందరి పిల్లలు మా ఇంట్లోనే. ఏమీ మార్పులేదు. అదే పద్ధతి. ఉదయాన్నే పూరీలు తిని బజారు కెళ్ళాం. మధ్యాహ్నం ఆటలు పాటలు – సాయంత్రం కొత్తబట్టలు వేసుకుని జమ్మికోసం వెళ్ళాం.

అదే మహాలక్ష్మమ్మ గుడి. అది దాటిన తరువాత విశాలమైన స్థలంలో జమ్మి కొమ్మ. ఊరు ఊరంతా అక్కడికి రావడం, జమ్మి పంచుకోవడం, అలుముకోవడం, పాద నమస్కారాలు. కౌగిలింతల్లో కొత్తబట్టలు – పూజ్యభావంతో పాదాలు.

అక్కడ పొలాలు లేవు. అన్నీ ఇండ్లే కనిపించాయి. జమ్మికోసం పొలాల దగ్గరికి పోవాల్సిన పనిలేదు. అవి గుడిముందు, మహాలక్ష్మమ్మ గుడి దగ్గర అమ్ముతున్నారు. అందరూ కొనుక్కున్నారు. మా అబ్బాయి కొనుక్కొచ్చి నాకొక జమ్మి కొమ్మని ఇచ్చాడు. ఆకులని తెంపుతూ జేబులో వేసుకున్నాను. జమ్మి మీద కార్పొరేట్ కన్ను ఇంకా పడలేదు. పడితే ఆకులని అందమైన ప్యాకెట్లలో అమ్మేవాళ్ళు.

మా చిన్నప్పుడు శమీ వృక్ష ప్రాంతంలో మహాలక్ష్మమ్మ గుడి ప్రాంతంలో, మా రాజేశ్వరుని గుడి ప్రాంతంలో స్నేహితుల సమావేశం జరిగేది. ఇప్పుడు మా దసరా పాత స్నేహితుల్ని కలిసే పూర్వవిద్యార్థుల సమావేశం. మా బడిలో కాలేజీలో 'అల్యూమినీ' జరుపకున్నా మా దసరా మాకు ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థుల సమావేశాన్ని ఏర్పాటుచేస్తుంది.

సేవ వచ్చి వెళ్ళిన తరువాత పాత మిత్రులని వూరి వాళ్ళని కలిసి ఇంటికొచ్చాను. పెద్దవాళ్లందరికీ జమ్మిపెట్టి పాద నమస్కారం చేశాను. చిన్నవాళ్ళ దగ్గర నుంచి పాద నమస్కారాలు స్వీకరించాను.

ఎనిమిదిన్నర ప్రాంతంలో నేనూ మా ఆవిడా మా రాజేశ్వరుని గుడికి వెళ్ళాం. దీపాలతో, ఊరివాళ్ళతో, పచ్చటి తోరణాలతో, పూలతో గుడి కళకళలాడుతూ వుంది.

మా రాజేశ్వరుని దర్శనం చేసుకున్నాం. లింగానికి శివుని రూపాన్ని కూడా తొడిగారు. బనీనూ, షర్టూ విడిచి గర్భగుడిలోకి వెళ్ళి రాజేశ్వరుణ్ణి తాకి దర్శనం చేసుకున్నాం. మగవాళ్లు గర్భగుడిలోకి వెళ్ళాలంటే బనీనూ షర్టు విడిచి వెళ్ళక తప్పదు.

రాజేశ్వరుని దర్శనానికన్నా ముందు లక్ష్మి గణపతిని దర్శనం చేసుకున్నాం. మా నంది మీద చెయ్యి వేసి రాజేశ్వరుణ్ణి చూశాం. అమ్మవారిని దర్శనం చేసుకున్నాం. రాజేశ్వరుని ముందుభాగంలో ఎడమవైపు లక్ష్మిగణపతి కుడివైపు అమ్మవారు. ఎదురుగా నంది.

ఆ తరువాత అనంత పద్మనాభస్వామిని, రాములవారినీ దర్శించాం. హనుమంతుణ్ణి కూడా వేడుకున్నాం. మా గుడిలో రాయబోసు దర్గా వుంది. మా ముస్లిం మిత్రులు వుంటారు. అక్కడికి వెళ్ళి వాళ్ళని పలకరించి దర్గాకి నమస్కరించాం.

రాజేశ్వరుని గుడి పక్కన, రాములవారి గుడి ముందు ఓ మండపం వుంది. అక్కడ వున్న గదిలో ఉత్సవమూర్తులని పెడతారు. ముందు ఖాళీ స్థలంలో భజనలు జరుగుతాయి. దర్శనం తరువాత మేం కూర్చుండే స్థలం అదే.

దేవునికి కొట్టిన కొబ్బరికాయ కొట్టుకుని తింటూ వున్నాం. శేఖర్ వచ్చాడు.

"అంకుల్ శాశ్వత కల్యాణం కోసం డబ్బులు కట్టండి. మేమందరం కట్టినాం" అన్నాడు.

'ఏం అంటావ్' అన్నట్టుగా మా ఆవిడ వైపుచూశాను.

'కట్టేద్దాం' అంది ఆవిడ.

శేఖర్ వెళ్ళి సంబంధిత క్లర్క్‌ని అక్కడికి తీసుకొచ్చాడు. డబ్బులు తీసుకున్నాడు.

"ఏ తేదీన కళ్యాణం చేసుకుంటారు. మీ పుట్టినరోజునా, మేడమ్ పుట్టిన రోజునా, మీ పెళ్ళి రోజునా, మీ పిల్లల పుట్టిన రోజునా... చెప్పండి" అడిగాడు క్లర్క్. ఆ అడగడంలో ఓ సూచన కూడా వుంది.

"ఆరోజులేమీ వద్దు. దసరా రోజున దేవుని కళ్యాణం చేసుకుంటాం. ఆ తెలుగు తేదీనే వుంచండి" అన్నాను ఎలాంటి ఆలోచన లేకుండా. దసరాకి వస్తాం కాబట్టి కల్యాణం చేసుకోవచ్చు. కళ్యాణం వుంది కాబట్టి దసరాకి రాకుండా వుండమన్న కారణంతో.

"నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయి కాబట్టి ఈ తొమ్మిది రోజులు కళ్యాణం ఉండదు" చెప్పాడు క్లర్క్.

"కనీసం దసరా తెల్లవారి వుంటుందా?" అడిగింది మా ఆవిడ.

"వుంటుంది"

"అయితే అదేరోజు మేం దేవుని కళ్యాణం చేసుకుంటాం" అన్నాం ఇద్దరం ఒకేసారి. ఇక ఏ ఉద్యోగ ఒత్తిడులు దసరాకి రాకుండా మమ్మల్ని నిలువరించలేవు.

పాత స్నేహితుల్ని కలిసే
పూర్వ విద్యార్థుల సమావేశం
మా దసరా,
ఏ రోజూ వంచని తలని
ఆరోజు పెద్దవాళ్ళ ముందు వంచేదే
మా దసరా
అందరం కలిసేదే
మా దసరా
అందరి ఇండ్ల ముందుకు
రాజేశ్వరుడు పల్లకీలో వచ్చేదే
మా దసరా.

★ ★ ★

సుబ్రమణ్యం దవాఖానా

మావూరి ముందు కుక్కపిల్లలా వాగుంటుంది. అది దాటగానే వూరొస్తుంది. కాస్త ముందుకు వెళ్తే ఎడమవైపు వేణుగోపాలస్వామి గుడివస్తుంది. దాని ప్రక్కనే బొడ్ల గుట్టయ్య బంగారు దుకాణం, దాన్ని ఆనుకొని ఓ చిన్న సందు. సందులోకి కాస్త దూరం వెళ్లగానే ఎడమవైపు ఆంజనేయస్వామి గుడి, ఇంకా కాస్త ముందుకు వెళ్తే సుబ్రమణ్యం దవాఖానా కన్పించేది. ఆ దవాఖానా చిరునామా తెలియని వ్యక్తులు, సుబ్రమణ్యం వైద్యం గురించి తెలియని వ్యక్తులు మా వూర్లోనే కాదు, ఆ చుట్టుప్రక్కల వూర్లల్లో కూడా ఎవరూ లేరు.

నాచిన్నప్పుడు మావూర్లో వున్నది ఒకే ఒక్క దవాఖానా. మా వూర్లోనే కాదు, మావూరి చుట్టుప్రక్కల వున్న రెండువందల గ్రామాలకి అదే దవాఖాన. డాక్టర్ పేరు సుబ్రమణ్యం. అరవై సంవత్సరాల చరిత్ర వున్న దవాఖానా అది. పేరుకి శ్రీ రాజేశ్వర దవాఖానా. కానీ సుబ్రమణ్యం దవాఖానా గానే ప్రసిద్ధి.

ఆ దవాఖానా మొదట అక్కడలేదు. మా రాజేశ్వరుని గుడిని ఆనుకుని వుండేది. అంతకు ముందు గుడి ముందు వుండేది. ఇదంతా ఎనభై సంవత్సరాల క్రింది మాట. సుబ్రహ్మణ్యం వైద్యం ఎక్కడ నేర్చుకున్నాడో తెలియదు. అతను పుట్టింది వేములవాడలో కాదు, మహబూబ్‌నగర్ జిల్లాలో. కానీ అతని పూర్వీకులు వేములవాడవాళ్ళే. అందుకే వాళ్ళఇంటిపేరులో వేములవాడ కూడా వుంటుంది. మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజుల ముందు తలపాగా వేసి నడవడం ఇష్టం లేక ధిక్కార స్వరంతో వేములవాడకి వచ్చాడు. వేములవాడ ప్రక్కన వున్న సిరిసిల్లలో వాళ్ళ పెదనాయన కొడుకు రామచంద్రం. ఆ కాలంలో అతనొక ప్రసిద్ధి చెందిన న్యాయవాది. ఒంటరిగా వచ్చిన సుబ్రమణ్యం గుడి ముందు దవాఖానా పెట్టి వైద్యం ప్రారంభించాడు. చెట్లు, మూలికలతో అతను చేసే కషాయం చాలా రోగాలకి పనిచేసేది. రోగ నిరోధక శక్తినిచ్చేది.

ఇంట్లో వాళ్ళని ఎదిరించి వచ్చాడని రామచంద్రం అతనికి ఎలాంటి సహాయాన్ని మొదట అందించలేదు. అన్న నుంచి ఎలాంటి సహాయం అందలేదని సుబ్రమణ్యం నిరాశ చెందలేదు. తన వైద్యాన్ని కొనసాగించాడు. ఒకసారి వేములవాడ జాగిర్దారు రాజేశ్వరుని దర్శనానికి వేములవాడకి వచ్చాడు. అతను తీవ్ర అస్వస్థతకి లోనైనాడు. సుబ్రమణ్యం హస్తవాసి తెలిసిన మా వేములవాడ బ్రాహ్మలు జాగిర్దార్‌కి సుబ్రమణ్యం గురించి చెప్పారు. అతన్ని పిలిపించమని జాగిర్దార్ చెప్పాడు. సుబ్రమణ్యం అతనికి వైద్యం చేశాడు. రెండు

మందు పొట్లాలు ఇచ్చాడు. జాగిర్దార్ అస్వస్థత మాయమై పోయింది. అతని జ్వరం ఎగిరిపోయింది. అంతే? సుబ్రమణ్యాన్ని వేములవాడ దేవస్థానానికి వైద్యునిగా నియమిస్తూ ఫర్మానా జారీ చేశాడు. అట్ల సుబ్రమణ్యం దేవస్థానం తొలివైద్యునిగా చేరినాడు. అతని దవాఖానా గుడి ఆనుకుని వున్న మహిషాసుర మర్దని ఆలయం ప్రక్కకి మారిపోయింది.

సుబ్రమణ్యం కషాయం ప్రభావమో, గోళీల ప్రభావమో, అతని చేతి గుణమో తెలియదు కానీ ఎంత పెద్ద రోగాలైనా తగ్గిపోయేవి. పేరుకి దేవస్థానం డాక్టర్ గానీ, చుట్టుప్రక్కల ఎవరికి వైద్య సహాయం అవసరం ఏర్పడినా కచ్చురం తయారయ్యేది. ఆ కచ్చురంలో సుబ్రమణ్యం బయల్దేరేవాడు. వేములవాడలో ఏ ఇంట్లో ఎవరికి జ్వరం వచ్చినా సుబ్రమణ్యం కషాయం, గోలీ తీసుకోవాల్సిందే. ఎవరింట్లో ఏ శుభకార్యం జరిగినా డాక్టరుగారింటికి ఆ భోజనం రావాల్సిందే.



సుబ్రమణ్యం పేరు ప్రఖ్యాతులు గమనించిన వాళ్ళ అన్న న్యాయవాది రామచంద్ర, సుబ్రమణ్యాన్ని సిరిసిల్లకి పిలిచాడు. కొంతకాలానికి సత్తెమ్మ అన్న అమ్మాయిని చూసి పెళ్ళి చేశాడు. ఎవరికి ఏ వైద్యం చేసినా వాళ్ళు ఏమి ఇచ్చారన్నది ఎప్పుడూ సుబ్రమణ్యం పట్టించుకోలేదు. వాళ్ళకు తోచినవి వాళ్ళు ఇచ్చేవాళ్ళు. కొంతమంది బియ్యం పంపించే వాళ్ళు. కొంతమంది తేనెని ఇచ్చేవాళ్ళు. రాజాగౌడ్ లాంటివాళ్ళు ముంజలని పంపించేవాళ్ళు. అతను ఎన్నడూ ఎవరినీ ఏమీ అడుగలేదు. ఆయన ఇంట్లో వివాహం వుందంటే అన్ని సమకూరేవి. ఎవరికీ ఏమి చెప్పాల్సిన పని లేదు. ఎవరికి తోచిన పనిని వాళ్ళు చేసేవాళ్ళు. ఎవరి దగ్గర వున్నవి వాళ్ళు తెచ్చి ఇచ్చేవాళ్ళు. ప్లేగు వ్యాధి మా వేములవాడలో ప్రబలినప్పుడు ధైర్యంగా సుబ్రమణ్యం వైద్యం చేశాడు.

కషాయం బట్టీలు రోజూ మరిగేవి. ఇంట్లో పెద్దవాళ్ళందరూ గోలీలు చేసేవాళ్ళు. ఇంటి వెనక ఏవో చెట్లని, మొక్కలని పెంచేవాడు. ఆయుర్వేదంతో పాటు, అల్లోపతిని కూడా అతను ఉపయోగించేవాడు. మొట్టమొదటి సారిగా మా వూర్లో సూది మందును ఇచ్చిన డాక్టర్ సుబ్రమణ్యమే. దేవస్థానం పదవీ విరమణ చేసిన తరువాత గుడిదగ్గర్లోనే శ్రీరాజేశ్వర దవాఖానాను పెట్టాడు. ఒక చేతిలో మందుల సంచి మరో చేతిలో అసరాకి కట్టె, ఖద్దరు బట్టలు, అరవై దాటిన తరువాత కూడా ఎంతో ఉత్సాహంగా వుండేవాడు. ఊరు బయట అతని ఇల్లు అక్కడి నుంచి దవాఖానాకి వచ్చే దారిలో ఎందరి ఇండ్లల్లోనో వైద్యం చేసేవాడు. దార్లో మామా అని పలకరించే వాళ్ళు కొందరు తాతా అని పలకరించేవాళ్ళు మరికొందరు.

రోగులతోనే కాలం గడిచేది. సాయంత్రం కాస్త సమయం చిక్కితే ఆయన దవాఖానా ముందు చాలామంది పెద్దవాళ్ళు గుమికూడే వాళ్ళు. అక్కడ నేలమీద రెండు చాపలు వేసేవాళ్ళు. ఊరిలోని పెద్దవాళ్ళు సాయంత్రం అక్కడ కలిసి కూర్చుండి మాట్లాడుకునేవాళ్ళు. జగన్‌మోహన్‌సింగ్, ముకుంద నర్సయ్య, గౌర్నేని గోపాలరావు, శీనయ్యపంతులు, శేఖేదార్ నరహరి, నూగూరి సాంబయ్య లాంటి వాళ్ళు వచ్చి అక్కడ కూర్చునేవాళ్ళు. వివాదాలని పరిష్కరించేవాళ్ళు.

ఆకాలంలో మా వూరికి వస్తున్న ఒకే ఒక పత్రిక గోరాశాస్త్రి సంపాదకత్వంలో వస్తున్న ఆంధ్రభూమి. పదకొండు ప్రాంతంలో ఆ పత్రిక వచ్చేది. సుబ్రమణ్యం దవాఖానా రీడింగ్ రూమ్‌లాగా ఉపయోగపడేది. రాత్రిపూట వయోజనుల కోసం ఓ బడి నడిచేది. శ్రీహరి సార్ ఆ బడి నడిపేవాడు. చదువురాని పెద్దవాళ్ళకోసం ఆ బడి నడిచేది. ఆ బడి నడపడానికి కారణం సుబ్రమణ్యం. దవాఖానాలో వున్నరోగులు కూడా అక్షరాలు దిద్దుకునేవాళ్ళు. మా వూర్లో హైస్కూల్ రావడానికి దాని నిర్మాణానికి కారణం సుబ్రమణ్యమే.

ఆ దవాఖానలో దగ్గు తగ్గడానికి తియ్యని మందుపొట్లాలు వుండేవి. ఆ మందు పొట్లాల కోసం. ఆయన తియ్యటి మాటల కోసం స్కూళ్ళకి వెళ్తున్న పిల్లలు చాలామంది అక్కడికి వచ్చేవాళ్లు. ఆయనతో మాట్లాడి తాతా అని వెంటపడి దగ్గులేకున్నా ఆ పొట్లాలు తీసుకునేవాళ్లు. కషాయం పోస్తానని ఆయన అనగానే వాళ్ళు అక్కడినుంచి పారిపొయ్యేవాళ్ళు. అప్పుడు నా వయసులో వున్న పిల్లలందరూ ఆయన్ని తాతా అని అనేవాళ్ళు. అలాంటి అవకాశం లేని వ్యక్తిని నేనొక్కడినే. ఎందుకంటే నేను ఆయన తొమ్మిదవ సంతానాన్ని. ఆయన మా బాపు. తాత వయస్సులో వున్నప్పటికీ మా బాపుతో నాకు అంత సన్నిహితం వుండేది కాదు. దూరం వుండేది.

మా రాజేశ్వరుని సేవ గుడి ముందునుంచి ప్రారంభమై నాలుగు ప్రధాన స్థలాల్లో ఆగేది. అందులోని ఓ స్థలం మా బాపు దవాఖానా. అక్కడ సేవ ఓ ఐదు నిముషాలు ఆగేది. దవాఖానా ముందు కూర్చున్న పెద్ద వాళ్లందరూ దేవున్ని దర్శించుకునేవాళ్ళు. దవాఖానాలో వున్నరోగులు ఆ దేవున్ని దర్శించుకునే వాళ్ళు. మా బాపు రెండుచేతులెత్తి దేవుడికి దండం పెట్టేవాడు. మా ఇంట్లో అందరూ మా రాజేశ్వరుని గుడికి వెళ్ళడం కన్పించేది. కానీ మా బాపు గుడికి వెళ్ళిన సందర్భం నేను చూడలేదు. ఆయనకు అంత సమయం చిక్కేదికాదు. చిక్కిన దాన్ని మా వూరి ప్రజల కోసం రోగుల కోసమే వెచ్చించేవాడు. ఒక్క సేవ వచ్చినప్పుడు తప్ప ఆయన దేవుని కోసం తాపత్రయ పడ్డ సందర్భం నాకు కన్పించలేదు.

రాత్రి ఇంటికి వచ్చి భోజనం చేసిన తరువాత కూడా పేషెంట్లు వచ్చేవాళ్లు. చందమామ కథలు కూడా అతన్ని చదువుకోనిచ్చే వాళ్ళు కాదు. డబ్బులు అడగడు అన్నందుకు కాదు, అతను మందిస్తే రోగం తగ్గుతుందన్న నమ్మకంతో వాళ్ళు ఆయన దగ్గరకు వచ్చేవాళ్ళు. మేం భోజనం చేస్తున్నప్పుడు బాపు వస్తున్నాడంటే మా అందరికీ భయంగా వుండేది. కంచం దగ్గర క్రింద ఒక్క మెతుకు కన్పించినా ఆయన వూరుకునేవాడు కాదు. ఒక్క మెతుకు కూడా వృథాగా పోవద్దు అనేవాడు.

ఉదయం స్నానం చేసి రెండు బిస్కట్లు తిని టీ తాగి దవాఖానకీ బయల్దేరేవాడు. దేవునికి దండం పెట్టకుండానే బయల్దేరేవాడు. ఈ విషయం మా అమ్మ ప్రస్తావించిన సందర్భాలు వున్నాయి. నేను చేస్తున్న పనులు దేవుడికి ఇష్టమైన పనులు. రోగులకి వైద్యం చేయడం దేవున్ని మొక్కడంతో సమానం. బడి కట్టించడం చదువురాని పెద్దవాళ్ళకి చదువుచెప్పించడం దేవుడు ఇష్టపడే పనులు అనేవాడు. ఈ మాటలు మా అమ్మకి అర్థం కాకపొయ్యేవి. ఎందుకంటే ఆమె చదువుకోలేదు. అందుకని మా బాపు మాటల్లోని అంతరార్థం తెలియకపొయ్యేది.

మా బాపుకి ఎనభై ఆరేళ్ళ వయసులో గొంతునొప్పి వచ్చింది. ఏదైనా తింటే అది లోపలికి పొయ్యేది కాదు. మా రఘుపతన్న దేవస్థానంలో డిప్యుటేషన్‌పై డాక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతను అల్లోపతి డాక్టర్. మా బాపుని హైదరాబాద్ తీసుకుని వెళ్ళాడు. కాన్సర్ లక్షణాలు వున్నాయని తేలింది. రెండు నెలలపాటు హైదరాబాద్‌లో వైద్యం చేయించాడు. ఆ రెండు నెలలు మా బాపు దవాఖానా మూతపడింది. వేములవాడకి వచ్చిన నెల తరువాత మా మల్లయ్యతో దవాఖానాని శుభ్రం చేయించాడు. కషాయం బట్టీ పెట్టించాడు. మళ్ళీ దవాఖానాకి వెళ్ళడానికి మా అమ్మ వ్యతిరేకించింది. దవాఖానాకి వెళ్ళాల్సిన అవసరం లేదని మా రఘుపతన్న అన్నాడు. అయినా మా బాపు వినలేదు. గుడికి వెళ్ళిన తరువాత దవాఖానాకి వెళ్ళమని కోరింది.

"గుడికి నువ్వు పోతావు గదనే. అది చాలు నేను దవాఖానాకి వెళ్తాను" అన్నాడు మా బాపు.

నేనప్పుడు ఉస్మానియాలో లా చదువుతున్నాను. మూడు నెలలు మూతబడిన దవాఖానాకి ఎవరొస్తారని నేననుకున్నా. నా అంచనాలన్నీ తారుమారైనాయి. ఎప్పటిలాగా దవాఖానాకి రోగులు వచ్చారు. అదే వైద్యం, అదే నమ్మకం, అదే సేవ.

మూడు సంవత్సరాలు గడిచాయి. నా పెళ్ళింది. నాపెళ్ళప్పుడు కూడా దవాఖానానే ఆయన సర్వస్వం. నా పెళ్లైన రెండో రోజు గుడికి వెళ్ళడానికి నేనూ మా ఆవిడా సిద్ధమవుతున్నాం. అప్పుడు మా బాపు ఇంట్లోనే వున్నాడు. మా ఆవిడని పిలిచాడు. ఆమె దోసిట్లో రూపాయి బిళ్ళలు పోశాడు.

"శైలజా! గుడిముందు చాలామంది బిచ్చగాళ్ళు వుంటారు. వాళ్ళకి ఈ డబ్బులు పంచు" అన్నాడు.

నేనూ మా ఆవిడా ఆశ్చర్యపోయాం. దేవునికి ఈ పూజ చేయించు, ఆ పూజ చేయించు, ఆ సేవ చేయండి, అని చెబుతున్నాడనుకున్నాం. అతనేమీ చెప్పలేదు. మా ఆవిడ దోసిట నిండా నాణేలు. ఆయన కోరిక, దేవున్ని దర్శించి ఆయన చెప్పినట్టే చేశాం.

ఆరు నెలలు గడిచాయి. మళ్ళీ మా బాపు ఆరోగ్యం క్షీణించింది. హైదరాబాద్ తీసుకెళ్లాడు మా రఘుపతన్న. ఓ వారం రోజుల తరువాత గుండెనొప్పితో మా బాపు చనిపోయాడు. ఉదయాన్నే మా వేములవాడకి ఆయన్ని తీసుకొచ్చారు. ఆ సమాచారం ఊరు ఊరంతా క్షణంలో తెలిసిపోయింది. అర్ధరాత్రి అనకుండా అపరాత్రి అనకుండా ఎప్పుడూ తెరిచి వుండే మా ఇంటి ద్వారాలు ఇక తెరుచుకునే అవకాశం లేదు. ఏరాత్రి ఎవరు తలుపు తట్టినా మందుల పెట్టెని తీసుకుని కచేరీలోకి వచ్చే మా బాపు ఇకలేడు.

ప్లేగువ్యాధి ప్రబలినా, కలరా వూరు వూరంతా వ్యాపించినా ధైర్యంతో వైద్యం చేసిన మా బాపు లేడు. ఓ శోకమయ వాతావరణంలో మేమున్నాం.

ఊరు వూరంతా వచ్చి మా ఇంటి ముందుంది. అప్పుడు మా అన్నయ్య కొడుకు నా దగ్గరకు వచ్చి "బాబాయ్! తాతయ్య చనిపోలేదు" అన్నాడు వాళ్ళందరికీ చూపిస్తూ.

అంత శోకంలో వాడిని గుండెకు హత్తుకున్నాను. చివరిసారి చూడటానికి మా గుడిలోని పూజారు లంతా వచ్చారు. గ్రహణం వచ్చిన రోజు తప్ప మూసుకోని మా రాజేశ్వరుని గుడి తలుపులు ఆ రోజు మూసుకున్నాయి. గుడికి తరచుగా వెళ్ళని మా బాపు కోసం రాజేశ్వరుడు గుడి తలుపులు మూసి, పూజారుల రూపంలో మా బాపు పార్థివ శరీరం ముందుకొచ్చారు. ఆ విషయం తెలిసిన మా కన్నుల్లో ఆనందబాష్పాలు. శోకంలో కూడ ఆనందం.

అందుకే నా ప్రయత్నమంతా ఒక్కటే. ఆయనలా నేను పరివర్తనం చెందాలని, ఫలప్రదమైన జీవితం గడపాలని, ఎప్పటికీ ఆయన కేరాఫ్‌లో వుండాలని.

అలాంటి సుబ్రమణ్యం దవాఖానా మళ్ళీ మా వేములవాడలో రావాలని నా ఆశ.

★ ★ ★

వేములవాడ కథలతో మళ్ళీ బాల్యంలోకి

-రాజేందర్ జింబో

రాజేందర్ జింబో కవిగా, కథకుడుగా తెలుగు పాఠకులకు సుపరిచితులు. 'మా వేములవాడ కథలు' ద్వారా నవ్య పాఠకులతో ప్రస్తుతం తన బాల్య స్మృతులను పంచుకుంటున్నారు. ఆయన కవితా, కథ సంపుటులే కాకుండా కవిత్వంపై సమీక్షా వ్యాసాలు 'గుండెతడి' పేరిట అచ్చయ్యాయి. న్యాయమూర్తిగా ఉద్యోగం చేస్తున్న జింబో వివిధ పత్రికల్లో న్యాయశాస్త్రంపై వ్యాసాలు రాస్తున్నారు. ఆయనతో కాసేపు.

• **వేములవాడ కథలకి ప్రేరణ ఏమిటి?**

వేములవాడంటే నాకిష్టం. మా వూరిని పొయెట్రీ చేద్దామనుకున్నా. వేములవాడ అప్పుడు, ఇప్పుడు అని పోలుస్తూ 'మా వూరు తప్పిపోయింది' అని 50 కవితలు రాద్దామనుకున్నా ఒకటీ అరా తప్ప రాయలేకపోయాను. దసరాకి అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళు బంధువులంతా వూళ్ళో కలుసుకోవడం అలవాటు. మొన్న దసరాకి వెళ్ళినపుడు పెట్టెలర్ర నన్ను కలవరపెట్టింది. మారిన దాని రూపురేఖలు రాత్రి నన్ను నిద్రలేపాయి. 'పెట్టెలర్ర' కథ రాద్దామని అర్ధరాత్రి లేచి కూచున్నాను. అక్కడి ప్రతి వస్తువుని, వ్యక్తిని కథారూపంలో చూడాలనుకున్నా. అదే వేములవాడ కథలకి ప్రేరణ. గతాన్ని జ్ఞాపకం చేసుకోవడం ఒక అనుభూతి అంతే. మార్పుల్ని మనం ఆపలేం. స్వర్గాలంటూ వుండవు. మనం కోల్పోయినవే స్వర్గాలు. స్వర్గమంటే గతస్మృతులే.

• **రాయాలనే కోరిక ఎలా కలిగింది?**

ఇంట్లో మా రఘుపతన్నకి సాహిత్యమంటే ఆసక్తి. ఆధునిక సాహిత్యమంతా ఆయన దగ్గర వుండేది. శ్రీశ్రీ నుంచి అపూర్వ చింతామణి వరకూ చదివేశాను. ఇంటర్‌కొచ్చేసరికి 'చివరికి మిగిలేది' నవలను కనీసం 50 సార్లు చదివాను. అందులోని వర్ణనలు బాగా నచ్చాయి. నరేంద్ర అనే ఫ్రెండ్‌తో కాలేజీ గ్రౌండ్‌లో కూర్చుని చాలాసార్లు ఆ నవలను చదివాను. డిగ్రీ పూర్తయ్యేవరకూ రచయిత కావాలని కోరిక లేదు. 77లో మొదటిసారి రాశాను. స్కెచ్, కవిత, కథ ఇలా సాగింది ప్రస్థానం.

ఎమోషన్‌ని వెంటనే వ్యక్తంచేయగల ప్రక్రియ కవిత్వం. అందువల్ల కవిత రాసినంత వేగంగా కథ రాయలేం. కథకు ఒక వాతావరణముండాలి. కొన్ని గంటలు వర్క్ చేయాలి. ప్రతి వ్యక్తికి కవిత్వం కంటే కథతోనే ఎక్కువ సంబంధముంటుంది. బాల్యంలో మొదట వినేది పాటనే అయినా కొంత వయసొచ్చేసరికి కథతో అనుబంధం ఏర్పడుతుంది. కథతో జీవితం మొదలవుతుంది. కొంతమంది కథలు చెపుతున్నప్పుడు వినాలనిపిస్తుంది. దాన్నే ఆర్ట్ ఆఫ్ స్టోరీ టెల్లింగ్ అంటారు.

• మీలోని రచయితకి మీ వృత్తి ఎలా దోహదం చేసింది?

మొదట్లో నేను సైన్స్ గ్రూప్‌లో చేరాను. దీనికి కారణం మా బాపు ఆయుర్వేద డాక్టర్ కావడమే. మా వూరి పరిసరాల్లో ఆయనే మొదటి డాక్టర్. అయితే సైన్స్ నాకు ఎక్కలేదు. మా పెద్దనాన్న లాయర్. ఆయన ఇంట్లో లా పుస్తకాలు చూసి ప్రేరణ పొందాను. 'లా' చదవడం నాలోని రచయితకి ఉపయోగపడింది. మా వృత్తిలో రకరకాల వ్యక్తులు ఎదురవుతారు. వాళ్ళందరినీ నా కథల్లో చొప్పించాను. న్యాయవ్యవస్థకి వ్యతిరేకంగా కూడా కొన్ని కథలు రాశాను. అయినా పై అధికారుల నుంచి నాకెలాంటి ఇబ్బందులూ ఎదురుకాలేదు. వృత్తిపట్ల నిజాయితీ వుంటే ఎవరూ మనల్ని ఆక్షేపించరు. రచయితగా నేను చూసే కోణం వృత్తిలో కూడా నాకు ఉపయోగపడింది. ఎన్నో ఆత్మహత్యల కేసుల్లో వృత్తిరీత్యా నేను మరణ వాంఙ్మూలాన్ని రికార్డు చేయాల్సి వచ్చింది. నిస్సహాయుల కన్నీళ్ళని అతి సమీపం నుంచి చూశాను. అవన్నీ కథా వస్తువులుగా ఉపయోగపడ్డాయి. అనుభవాల్నుంచి కథలు రాయడంలో శ్రమ తక్కువగా వుంటుంది. కల్పనలో రచయితకి శ్రమ ఎక్కువ. వృత్తిపరంగా నేను నిస్సహాయతలో పడిన సంఘటనలు కూడా వున్నాయి. 'పోలీసులు కొట్టారా?' అని నిందితుల్ని అడుగుతాం. కొట్టారని మాకు తెలుసు. భయంతో నిందితులు కొట్టలేదని అబద్ధం చెబుతారు. ఎవరి రోల్ వాళ్ళు ప్లే చేస్తున్నప్పుడు నిస్సహాయత ఆవరిస్తుంది. శిక్ష వేయాల్సినవాడికి వేయలేకపోవడం, వేయకూడని వాడికి వేయాల్సి రావడంలో నిస్సహాయత వుంది. ఇదంతా నా కథల్లో రాశాను.

• వేములవాడ కథలు రాస్తున్నప్పుడు ఏమనిపించింది?

ఈ కథలు రాస్తున్నప్పుడు చాలా భావోద్వేగానికి లోనయ్యాను. బాల్యంలోకి మళ్ళీ వెళ్ళిపోయాను. చెరువు, గుడి, వ్యక్తులు, వూరు అన్నీ నాలోకి పరకాయ ప్రవేశం చేశాయి. ఆ ప్రాంత జీవితాన్ని, ఆ వూరంటే నాకున్న ప్రేమని చూపించాలనే కాంక్ష ఆ కథల్లో వ్యక్తం చేశాను. మా ఇల్లంటే నాకు మమకారం. ఆస్తిలో నా వాటాకింద ఆ ఇంటిని తీసుకున్నాను. దసరా రోజు అందరూ కలుసుకోవడానికైనా

ఆ ఇల్లు ఇంకా కొంతకాలముండాలి. కూలిపోయే రోజు వస్తే కూలిపోనీ. మా ఇంట్లో బాదం, అశోకచెట్లు వున్నాయి. అక్కడ కూర్చొని భోంచేయడం అదో జ్ఞాపకం.

• ప్రస్తుత కవిత్వమెలా వుంది?

కవిత్వానికి వ్యక్తీకరణ బలంగా వుండాలి. ఒక గంట ఉపన్యాసం చేసే పని ఐదు లైన్ల కవిత చేయగలదు. పర్సనాలిటీ డెవలప్‌మెంట్ గురించి ఎంత చెప్పినా 'ఏదీ నీ దరికి రాదు, శోధించి సాధించి తెలుసుకో' అనే శ్రీశ్రీ పాట ఒక్కలైనుతో సమానం కాదు. నాకు తెలిసి తెలుగులో మంచి కవిత్వమే వస్తోంది. చాలామంది బాగా రాస్తున్నారు.

• జింబో అనే కలంపేరు ఎందుకు పెట్టుకున్నారు?

1960లో జింబో నగరప్రవేశం అనే డబ్బింగ్ సినిమా వచ్చింది. మా అన్నయ్య సరదాకి నన్ను జింబో అని పిలిచేవాడు. 9వ తరగతి వరకూ అదే పేరు ఖాయమైంది. చివరికి గొడవచేసి రాజేందర్ అని పిలిపించుకున్నాను. సరదాకి ఒక స్కెచ్ రాసి జింబో పేరుతో పంపితే అది కాస్తా అచ్చయ్యింది. రచయితగా అదే పేరు నడిచింది. ఇప్పుడు వేములవాడ కథలకి మాత్రం రాజేందర్ జింబో అని పెట్టుకున్నాను.

ఇంటర్వ్యూ : జి.ఆర్. మహర్షి

★ ★ ★

Blank Page

మా వేములవాడ కథలు

రాజేందర్ 'జింబో'

ఈ కథలు రాస్తున్నప్పుడు చాలా భావోద్వేగానికి లోనయ్యాను. బాల్యంలోకి మళ్ళీ వెళ్ళిపోయాను. చెరువు, గుడి, వ్యక్తులు, వూరు అన్నీ నాలోకి పరకాయ ప్రవేశం చేశాయి. ఆ ప్రాంత జీవితాన్ని, ఆ వూరంటే నాకున్న ప్రేమని చూపించాలనే కాంక్ష ఆ కథల్లో వ్యక్తం చేశాను...

- రాజేందర్ 'జింబో'

రాజేందర్ జింబో కవిగా, కథకుడుగా తెలుగు పాఠకులకు సుపరిచితులు. ఆయన కవితా, కథ సంపుటులే కాకుండా కవిత్వంపై సమీక్షా వ్యాసాలు 'గుండెతడి' పేరిట అచ్చయ్యాయి. న్యాయమూర్తిగా ఉద్యోగం చేస్తున్న జింబో వివిధ పత్రికల్లో న్యాయశాస్త్రంపై వ్యాసాలు రాస్తున్నారు.

ఎమెస్కో

